

'ప్రజల రుణం తీర్చుకునేందుకు ఎంత కృషి చేయడానికైనా నేను సిద్ధం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 266

మంగళవారం 17-12-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఆదుకునేందుకు వాన వచ్చింది!

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 51/4. ఆస్ట్రేలియా 445 ఆలౌట్.


-14లో



మెటల్, ఐటీ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్ 385 పాయింట్ల పతనం. నిఫ్టీకి 100 పాయింట్ల నష్టం

-15లో



బంగ్లాలో ఏడాదిలో ఎన్నికలు

వచ్చే ఏడాది చివర్లో లేదా 2026 ప్రారంభంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని బంగ్లాదేశ్ ఆపద్ధర్మ ప్రభుత్వ నేత యూనస్ తెలిపారు.

వివరాలు 6లో ▸



మోదీ క్షమాపణ చెప్పాలి: ఖర్గే

తొలి ప్రధాని నెహ్రూను కించపరిచేందుకు ప్రయత్నించిన ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు.

వివరాలు 6లో ▸



రాజ్యాంగాన్నే మార్చారు!

నెహ్రూ కుటుంబం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజ్యాంగ సవరణలు చేశాయని నిర్మలా సీతారామన్ ఆరోపించారు.

వివరాలు 6లో ▸



త్వరలో లంకతో రక్షణ ఒప్పందం

ఇంధన, రక్షణ, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవాలని భారత్–శ్రీలంక నిర్ణయించాయి.

వివరాలు 6లో ▸

కేటీఆర్‌పై 'ఫార్ములా' అస్త్రం!

ఏసీబీ విచారణ ప్రారంభించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం

- 'ఫార్ములా–ఈ' కార్ రేసులో భారీగా డబ్బు చేతులు మారినట్టు అభిప్రాయపడ్డ కేబినెట్
- అర్వింద్‌కుమార్, ఇతర అధికారులపైనా ఏసీబీ విచారణకు నిర్ణయం
- ఈ అంశంలో తక్షణమే ఏసీబీకి లేఖ రాయాలని సీఎస్‌కు ఆదేశం
- దీంతో కేటీఆర్‌ను అరెస్టు చేయవచ్చంటూ తీవ్రస్థాయిలో ఊహాగానాలు
- చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రివర్గ భేటీ తర్వాత మంత్రుల వ్యాఖ్యలు
- 'విద్యుత్' కమిషన్ నివేదికకూ ఆమోదం.. నేడో రేపో అసెంబ్లీ ముందుకు..
- భూమిలేని రైతు కూలీలకు ఈ నెల 28 నుంచి రూ. 12 వేల సాయానికి ఓకే



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావుపై 'ఫార్ములా–ఈ' అస్త్రం ప్రయోగించేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమైంది. ఈ వ్యవహారంపై ఏసీబీ విచారణ ప్రారంభించాలని సోమవారం సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ భేటీలో నిర్ణయం తీసుకుంది. దీనిపై తక్షణమే ఏసీబీకి లేఖరాయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించినట్టు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో కేటీఆర్‌ను తక్షణమే అరెస్టు చేస్తారా? అన్న అంశంపై తీవ్ర స్థాయిలో ఊహాగానాలు జరుగుతున్నాయి. చట్టం తన పని తాను చేసుకుపోతుందంటూ మంత్రివర్గ భేటీ తర్వాత కొందరు మంత్రులు వ్యాఖ్యలు చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది. నిజానికి రాష్ట్రంలో రాజకీయ బాంబులు పేలుతాయని గతంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించిన సమయంలోనే.. 'ఫార్ములా–ఈ' రేసు వ్యవహారంలో కేటీఆర్‌ను అరెస్టు చేయవచ్చంటూ ప్రచారం జరిగింది.

గవర్నర్ అనుమతితో ముందుకు..

సోమవారం సాయంత్రం అసెంబ్లీ కమిటీ హాల్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది. 'ఫార్ములా–ఈ' కార్ రేసింగ్ వ్యవహారంలో కేటీఆర్‌పై విచారణ చేపట్టేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై రాష్ట్ర మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే ఏసీబీ

మిగతా 3వ పేజీలో ▶

వివాదం ఏమిటి?

ప్రభుత్వం ఏమంటోంది

కేటీఆర్ వాదన ఏంటి?

- వివరాలు 3లో ▶

లగచర్ల రచ్చ!

శాసనసభలో చర్చకు బీఆర్‌ఎస్ పట్టు..

టూరిజం పాలసీపై లఘు చర్చను అడ్డుకున్న ప్రధాన ప్రతిపక్షం



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సబిత, కోవాలక్ష్మి, పద్మారావు, జగదీశ్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, హరీశ్, కాలేరు, కేపీ వివేకానంద్ తదితరులు

- ప్లకార్డులు పట్టుకుని నినాదాలు.. అట్టుడికిన సభ
- గందరగోళం మధ్యే లఘుచర్చను కొనసాగించేందుకు మంత్రి జూపల్లి ప్రయత్నం.. బీఆర్‌ఎస్ సభ్యుల తీరును తప్పుబట్టిన స్పీకర్, సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు
- సభ్యుల నుంచి ప్లకార్డులు తీసుకోవాలని మార్షల్స్‌కు స్పీకర్ ఆదేశం
- వెల్‌లోకి దూసుకొచ్చిన బీఆర్‌ఎస్ సభ్యులు
- గందరగోళంతో సభను మంగళవారానికి వాయిదా వేసిన స్పీకర్

సాక్షి, హైదరాబాద్: 'లగచర్ల' ఘటనపై సోమవారం శాసనసభ అట్టుడికింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్‌ఎస్ సభ్యుల నిరసనలు, నినాదాలతో హోరెత్తింది. 'రాష్ట్రంలో పర్యాటక విధానం' అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు లఘుచర్చను ప్రారంభించగానే బీఆర్‌ఎస్ సభ్యులంతా లేచి.. 'లగచర్ల' రైతుల నిర్బంధం, అరెస్టులపై చర్చించాలని పట్టుబట్టారు. స్పీకర్ అంగీకరించకపోవడంతో ప్లకార్డులను ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన తెలిపారు. అధికార పక్షం నుంచి డిప్యూటీ సీఎం భట్టి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు లేచి బీఆర్‌ఎస్ సభ్యుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. అయినా బీఆర్‌ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. ఈ గందరగోళంలో

మిగతా 2వ పేజీలో ▶

మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

టైంటేబుల్ విడుదల చేసిన బోర్డు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మార్చి 5 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 25న ముగియనున్నాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సైన్స్ విద్యార్థులకు ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. జనవరి 29న ఎథిక్స్, హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష జరగనుండగా ఇంగ్లిష్ ప్రాక్టికల్స్ జనవరి 31న జరగనుంది. ఈ మేరకు పరీక్షల టైంటేబుల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం విడుదల చేశారు.

పరీక్షల టైంటేబుల్ 5లో



ఆంధ్రా రియల్ ఎస్టేట్.. టీడీపీ విజన్ డాక్యుమెంట్

గ్రూప్–2లో తెలంగాణ ఉద్యమానికి సంబంధంలేని ప్రశ్నలు

- పేపర్–3లో సమాధానాల ఎంపికకు ఎక్కువ సమయం పట్టిందన్న అభ్యర్థులు
- ప్రశ్నల్లో నాణ్యత పెరిగిందన్న సబ్జెక్ట్ నిపుణులు..
- ముగిసిన పరీక్షలు.. 45 శాతం మంది అభ్యర్థుల హాజరు

5లో

ప్రజా ప్రభుత్వమా.. నియంత సర్కారా?

సాక్షి, హైదరాబాద్: ఏ తప్పూ చేయని లగచర్ల రైతులను 40 రోజులుగా జైల్లో పెట్టింది ప్రజా ప్రభుత్వమా లేదా నియంత ప్రభుత్వమా అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ప్రశ్నించారు. రైతన్నకు బేడీలు వేసిన ఈ ప్రభుత్వాన్ని ఎండగడతామని, శాసనసభ కొనసాగినన్ని రోజులు ప్రభుత్వాన్ని వెంటాడతామని చెప్పారు. రైతులకు జరిగిన అన్యాయాలను సరిదిద్దే దాకా, వారిపై పెట్టిన అక్రమ కేసులను వెనక్కి తీసుకునే వరకు, సీఎం రైతన్నలకు క్షమాపణ చెప్పేదాకా పోరాటం కొనసాగుతుందన్నారు. సోమవారం అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కేటీఆర్ పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి విలేకరులతో మాట్లాడారు.

థర్డ్ డిగ్రీతో వేధిస్తున్నారు

తమ భూములు ఇవ్వబోమన్న రైతులను జైల్లో పెట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీతో వేధిస్తున్నారని, ఆ థర్డ్ డిగ్రీ వీడియో కాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు చూసి ఆనందిస్తున్నారని విమర్శించారు. ఫార్మా విలేజ్‌ను వెనక్కి తీసుకున్న ప్రభుత్వం... పారిశ్రామిక కారిడార్ పేరిట భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తోందని

మిగతా 2వ పేజీలో ▶

రైతన్న చేతులకు బేడీలు వేసిన ఈ ప్రభుత్వాన్ని ఎండగడతాం

- తెలంగాణ కానీ, కొడంగల్ గానీ రేవంత్ రెడ్డి అయ్య జాగీరా?
- ఈరోజు సభ నుంచి పారిపోయినా వదిలిపెట్టం... రేపు మరొక రూపంలో వస్తాం
- మీడియా పాయింట్ వద్ద కేటీఆర్

భట్టిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

- స్పీకర్‌ను కలసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు
- అప్పులపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపాటు
- అసెంబ్లీలో పరిమితుల విధింపుపై కేటీఆర్ ఆగ్రహం

2లో

స్మార్ట్ చిప్‌తో తెల్లరేషన్ కార్డులు

సంక్రాంతి తర్వాత **10** లక్షల కొత్త రేషన్‌కార్డులిస్తాం	• కొత్తకార్డులకు కులగణన సర్వేను కూడా పరిగణనలోకి తీసుకుంటాం
వీటితో ప్రభుత్వంపై రూ.**956** కోట్ల అదనపు భారం	• దొడ్డు బియ్యం దారి తప్పుతున్న మాట వాస్తవమే • ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీకి చర్యలు

శాసనమండలిలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి తరువాత కొత్త తెల్లరేషన్ కార్డులు మంజూరు చేస్తామని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. దాదాపు 10 లక్షల కొత్త రేషన్‌కార్డులను జారీ చేస్తామని, తద్వారా 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. దీంతో ఏటా రూ.956 కోట్ల మేరకు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని చెప్పారు. రేషన్‌కార్డులు ఎప్పటి నుంచి ఇస్తారని సోమవారం శాసనమండలిలో సభ్యులు కోదండరాం, మీర్జా రియాజుల్ హసన్ అడిగిన ప్రశ్నకు మంత్రి పైవిధంగా బదులిచ్చారు. కొత్త కార్డులకు ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను కూడా ఆధారంగా చేసుకుంటామని చెప్పారు. తెల్ల రేషన్‌కార్డులకు చిప్‌ను జోడిస్తామని తద్వారా స్మార్ట్‌కార్డులను జారీచేయబోతున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో అదనపు పేర్ల నమోదుకు మీ సేవ కేంద్రం ద్వారా గత పదేళ్లుగా వచ్చిన 18 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. మంత్రివర్గ ఉపసంఘాన్ని

మిగతా 2వ పేజీలో ▶



జాకిర్ హుస్సేన్ అస్తమయం

- ఊపిరితిత్తుల వ్యాధితో అమెరికాలో కన్నుమూసిన తబలా మ్యాస్ట్రో
- తీవ్ర అనారోగ్యం కారణంగా రెండు వారాల క్రితం శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఓ ఆస్పత్రికి తరలింపు
- పరిస్థితి విషమించడంతో తుది శ్వాస.. రాష్ట్రపతి, ప్రధాని సహా ప్రముఖుల సంతాపం

6లో

టీషర్ట్, జీన్స్ వేసుకుని ఆధునికంగా ఉంటూనే సంప్రదాయ శాస్త్రీయ సంగీతాన్ని కుర్రకారుకు చేరువ చేసిన జాకిర్ హుస్సేన్‌పై ప్రత్యేక కథనం

వాహ్ ఉస్తాద్ వాహ్

-వివరాలు 13లో



నేడు లోక్‌సభలో జమిలి బిల్లు

ఒకే దేశం–ఒకే ఎన్నికకు సంబంధించి 129వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశ పెట్టనున్న కేంద్రం

- ఆపై విస్తృత సంప్రదింపులకు వీలుగా జేపీసీ పరిశీలనకు పంపాలని స్పీకర్‌ను కోరే అవకాశం
- ఏదైనా రాష్ట్ర అసెంబ్లీకి లోక్‌సభతోపాటే ఎన్నికల నిర్వహణ సాధ్యం కాకుంటే విడిగా జరిపేలా బిల్లులో నిబంధనలు

6లో

ఆ లేఖల్లో ఏముంది?



- నెహ్రూ లేఖలపై రాజకీయ రగడ
- పీఎం మ్యూజియం నుంచి సోనియా చెంతకు..
- 2008లో యూపీఏ హయాంలో ఉదంతం.. తిరిగివ్వాలని కోరిన మ్యూజియం వర్గాలు
- వాటిలో ఎడ్వినా–నెహ్రూ రాసుకున్న లేఖలు.. మరోసారి తెరపైకి వారిద్దరి సాన్నిహిత్యం
- వ్యక్తిగత ఆస్తి కాదు, తిరిగివ్వాల్సిందే: బీజేపీ

6లో

అమరావతి అంటే పెట్టుబడిదారులకు భయమవుతోంది

- వాళ్లు ఎంత బూస్టప్ ఇవ్వాలని అనుకున్నా సాధ్యం కాదు
- వరదల నుంచి రక్షణ ఉండదని పెట్టుబడిదారులు భావిస్తున్నారు
- మళ్లీ హైదరాబాద్ బాట పడుతున్నారు

చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్

అమరావతి అంటేనే పెట్టుబడిదారులు భయపడే పరిస్థితి వచ్చిందని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో తెలంగాణ పెట్టుబడులు ఆంధ్రకు వెళ్తాయేమోననే అభిప్రాయం ఉండేదని, ఇటీవల అమరావతిలో సంభవించిన వరదలతో ఆ భావన పోయిందన్నారు. పొంగులేటి సోమవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడుతూ.. తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా పుంజుకుంటోందన్నారు. సెప్టెంబర్‌తో పోలిస్తే నవంబర్‌లో, నవంబర్‌తో పోలిస్తే డిసెంబర్‌లో కొంత పురోగతి కనిపిస్తోందని, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం కూడా పెరుగుతోందని చెప్పారు. పెట్టుబడులు ఆంధ్రకు వెళ్లే అవకాశముందా అని విలేకరులు ప్రశ్నించగా... పెట్టుబడిదారులంతా తిరిగి హైదరాబాద్ బాట పడుతున్నారని, కొందరు బెంగళూరు వైపు చూస్తున్నారని చెప్పారు. 'అమరావతిలో ఇటీవల వచ్చిన వరదలతో సీన్ మారిపోయింది. వాళ్లు ఎంత బూస్టప్ ఇవ్వాలనుకున్నా సాధ్యం కావడం లేదు. ఎలాంటి చర్యలు తీసుకున్నా వరదల నుంచి రక్షణ ఉండదని పెట్టుబడిదారులు భావిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల్లో హైడ్రా పట్ల భయం పోయిందని, మొదట్లో తప్పుడు ప్రచారం వల్ల

మిగతా 2వ పేజీలో ▶

స్కూల్లో కాల్పులు.. ముగ్గురు మృతి

అమెరికాలో ఉన్మాది ఘాతుకం మృతుల్లో ఉన్మాది?

మాడిసన్: అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలోని సోమవారం ఒక స్కూలులో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. మరికొందరు గాయపడ్డారు. మృతుల్లో కాల్పులకు తెగబడ్డ ఉన్మాది కూడా ఉన్నట్లు సమాచారం. మాడిసన్‌లోని అబుండంట్ లైఫ్ క్రిస్టియన్ స్కూల్‌లో ఈ దుర్ఘటన జరిగింది. కాల్పులకు తెగబడిన వారు ఇంకా ఎవరైనా ఉన్నారా? వారు క్రియాశీలకంగా ఉన్నారా? ఆయుధాలతో ఉన్నారా? అనేది పోలీసులు ధ్రువీకరించునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ స్కూలులో కిండర్ గార్టెన్ నుంచి పదో తరగతి దాకా మొత్తం 390 మంది చదువుతున్నట్లు పాఠశాల వెబ్‌సైట్లో ఉంది. ఇతర అత్యవసర విభాగాలకు చెందిన అధికారులు కూడా రంగంలోకి దిగి స్థానిక యంత్రాంగానికి అండగా నిలిచారు.

ఇవాల్టి జోక్



ఇలా అన్నీ మార్చుకుంటూ పోకుండా ఇంకా ఏదైనా పని చేస్తే బావుంటుందేమో సార్!

రూ.12 వేల కోట్లతో రోడ్ల నిర్మాణం: సీతక్క



సాక్షి, హైదరాబాద్: నాలుగేళ్లలో పంచాయతీల పరిధిలో రూ.12 వేల కోట్లతో 17 వేల కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించనున్నట్టు మంత్రి సీతక్క శాసనసభకు తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక గ్రామీణ రహదారుల నిర్మాణం (సీఆర్ఆర్) నిధుల కింద రూ.2,341 కోట్లు మంజూరు చేశామని, 2,400 కిలోమీటర్ల నిడివిలో రోడ్ల నిర్మాణానికి టెండర్లు కూడా పిలిచామని వివరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా ఆమె మాట్లాడుతూ.. 1,200 కిలోమీటర్ల మేర కొత్త రోడ్ల నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశామని తెలిపారు. గత మార్చిలో సీసీ రోడ్ల కోసం రూ.600 కోట్లు విడుదల చేశామని, రూరల్ రోడ్ల నిర్మాణం, రూరల్ రోడ్ల నిర్వహణ కింద రూ.1,150 కోట్లు మంజూరు చేయనున్నట్టు స్పష్టం చేశారు. కొన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో వన్యప్రాణుల వల్ల రోడ్ల నిర్మాణంలో ఏర్పడుతున్న సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు.

వాకౌట్.. వాయిదాలు..

రెండో రోజు అసెంబ్లీ ప్రశ్నోత్తరాలకే పరిమితం
- సభలో రెండు ప్రభుత్వ బిల్లులు ప్రవేశపెట్టిన ప్రభుత్వం
- పలు అంశాలపై బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ వాయిదా తీర్మానాలు
- నేడు ఉదయం 10 గంటలకు తిరిగి సమావేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాల రెండో రోజు సోమవారం బీఆర్ఎస్ నిరసనలు, వాకౌట్, అధికారపక్ష సభ్యుల విమర్శల మధ్య శాసనసభ అర్ధంతరంగా ముగిసింది. ఈ నెల 9న అసెంబ్లీ సమావేశాలు లాంఛనంగా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆ ఒక్క రోజే భేటీ నిర్వహించి, 16వ తేదీకి (సోమవారానికి) వాయిదావేశారు. ఈమేరకు సోమవారం ఉదయం 10 గంటలకు శాసనసభ సమావేశం ప్రారంభమైనా.. ప్రశ్నోత్తరాలు, సంతాప తీర్మానాలు, ప్రభుత్వ బిల్లుల ప్రతిపాదనకే పరిమితమైంది. మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లుల చెల్లింపుపై ప్రభుత్వం నిర్దిష్ట హామీ ఇవ్వలేదని నిరసన తెలుపుతూ బీఆర్ఎస్ ప్రశ్నోత్తరాల సమయంలో సభ నుంచి వాకౌట్ చేసింది. ప్రశ్నోత్తరాలు, టీ విరామం తర్వాత సభ తిరిగి సమావేశంకాగానే.. 'లగచర్ల' అంశంపై చర్చకోసం బీఆర్ఎస్ పట్టుబట్టింది. ఈ గందరగోళంతో స్పీకర్ సభను మంగళవారం ఉదయానికి వాయిదా వేశారు.

నిర్దేశిత సమయంలోనే ప్రశ్నోత్తరాలు

సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే ప్రశ్నోత్తరాలకు సంబంధించి స్పీకర్ ప్రకటన చేశారు. రోజూ గంటపాటు జరిగే ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో.. పది ప్రశ్నలకు ఒక్కో ప్రశ్నకు ఆరు నిమిషాల సమయం లభిస్తోందని తెలిపారు. కానీ నిర్దేశిత సమయంలో పూర్తి చేయకపోవడం, కొన్ని ప్రశ్నలు మిగిలిపోవడంతో సభ్యులు అసంతృప్తి చెందుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో సభ్యులు, మంత్రులు ప్రశ్నలు, సమాధానాలు సూటిగా, క్లుప్తంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు.

సంతాప తీర్మానాలు.. బిల్లులు..

- ఉమ్మడి ఏపీ శాసనసభలో తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించిన ముగ్గురు దివంగత సభ్యులకు శాసనసభ రెండు నిమిషాల పాటు సంతాపం ప్రకటించింది. మాజీ ఎమ్మెల్యేలు కొమిరెడ్డి జ్యోతిదేవి (మెట్‌పల్లి), ఊకె అబ్బయ్య (బూర్గంపాడు, ఇల్లందు), డి.రామచంద్రారెడ్డి (దొమ్మాట) మరణం పట్ల స్పీకర్ ప్రసాద్‌కుమార్ సంతాప తీర్మానం ప్రతిపాదించారు.
- 'యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ బిల్లు 2024'ను సీఎం రేవంత్ పక్షాన మంత్రి శ్రీధర్‌బాబు సభకు సమర్పించారు. 'తెలంగాణ యూనివర్సిటీస్ (సవరణ) బిల్లు–2024'ను సీఎం తరపున మంత్రి దామోదర రాజనర్సింహ సభలో ప్రవేశపెట్టారు.



వాయిదా తీర్మానాలన్నీ తిరస్కరించిన స్పీకర్

- అసెంబ్లీ సమావేశాల రెండో రోజున బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ సభ్యులు ఇచ్చిన పలు వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించారు.
- 'లగచర్ల' అంశంపై చర్చించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, విజయుడు, మర్రి రాజశేఖర్‌రెడ్డి వాయిదా తీర్మానం ప్రతిపాదించారు. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పెద్దపులి దాడులను అరికట్టడం, బాధితులకు పరిహారం అందించే అంశంపై బీజేపీ ఎమ్మెల్యేలు పాల్వాయి హరీశ్, పాయల్ శంకర్ వాయిదా తీర్మానం ఇచ్చారు.
- మూసీ ప్రక్షాళన, హైడ్రాపై చర్చించాలంటూ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వాయిదా తీర్మానం ఇచ్చారు.

లగచర్ల రచ్చ!

▶ మొదటి పేజీ తరువాయి

సభను కొనసాగించలేక మంగళవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు.

వాయిదా తీర్మానాలను తిరస్కరించడంతో..

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో ఫార్మా విలేజీ భూసేకరణను ప్రతిఘటించిన రైతులను నిర్బంధించిన ఘటనపై చర్చించాలంటూ టి.హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్టు ప్రశ్నోత్తరాలు ముగిసిన తర్వాత స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. దీనితో పార్టీ సభ్యులంతా నిలబడి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. 'ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం..దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం.. నహీ చలేగా.. తానా షాహీ నహీ చలేగా..' అని నినాదాలు చేశారు. దీనితో సభను కొద్దిసేపు వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

వెనక్కి తగ్గని బీఆర్ఎస్ సభ్యులు

సభ తిరిగి ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు తమ నిరసన కొనసాగించారు. ఈ గందరగోళం మధ్యే పర్యాటక విధానంపై లఘు చర్చను ప్రారంభించాలని మంత్రి జూపల్లి కృష్ణారావుకు స్పీకర్ సూచించారు. కానీ బీఆర్ఎస్ సభ్యులు నినాదాలతో గందరగోళ వాతావరణం నెలకొంది. దీనిపై స్పీకర్ కల్పించుకుని... బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులను అప్పగించి ఎవరి స్థానాల్లో వారు కూర్చుంటే హరీశ్‌రావుకు మాట్లాడే అవకాశం ఇస్తామని చెప్పారు. అయితే ముందు మాట్లాడేందుకు అవకాశమిస్తే ప్లకార్డులను అప్పగిస్తామని హరీశ్‌రావు బదులిచ్చారు. స్పీకర్ అవకాశం ఇవ్వకపోవడంతో నిరసనను కొనసాగించారు.

శ్రీధర్‌బాబు, భట్టి కల్పించుకున్నా..

బీఆర్ఎస్ సభ్యుల ఆందోళనను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తోపాటు శాసనసభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర స్థాయిలో తప్పుబట్టారు. అందరం కలసి రూల్స్ బుక్ తయారు చేసుకున్నామని, సభలో ప్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయడం దానికి విరుద్ధమని స్పీకర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యులు ప్రశాంతంగా కూర్చోవాలని పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఇక సభలో ప్లకార్డులు, కరపత్రాలు ప్రదర్శించరాదని నిబంధనలు ఉన్నాయని, శాసనసభా వ్యవహారాల మంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన హరీశ్‌రావుకు అది బాగా తెలుసని మంత్రి డి.శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ కార్యకలాపాలపై ప్రతిరోజూ బులెటిన్ ఇస్తారని, వాటి ప్రకారమే సభ నడుస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సభ్యులు లేవనెత్తిన ప్రతి అంశంపై ప్రభుత్వం సమాధానమిస్తుందని హామీ ఇచ్చారు. ఇక సభ గౌరవాన్ని పరిరక్షించాలని...

15 నిమిషాలే కొనసాగిన సభ

బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూనే ఉండటంతో గందరగోళం నెలకొంది. దీనితో బీఆర్ఎస్ సభ్యుల నుంచి ప్లకార్డులు తీసుకోవాలని మార్షల్స్‌ను స్పీకర్ ఆదేశించారు. మార్షల్స్ వచ్చేలోపే హరీశ్‌రావు, ఇతర బీఆర్ఎస్ సభ్యులు స్పీకర్ ముందు వెల్‌లోకి దూసుకొచ్చారు. ఇంకా ముందుకు వెళ్లకుండా మార్షల్స్ వారిని అడ్డుకున్నారు. ఈ గందరగోళం నడుమ సభను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. బీఆర్ఎస్ సభ్యులంతా వెల్‌లోకి దూసుకురాగా.. కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి సభ్యుల కుర్చీల వద్దే నిలబడి నిరసన తెలిపారు. మధ్యాహ్నం 2.25 గంటలకు లఘు చర్చ ప్రారంభంకాగా 2.40 గంటలకు వాయిదా పడింది. అంటే 15 నిమిషాలు మాత్రమే సభ నడిచింది.

మండలిలోనూ 'లగచర్ల' నిరసన

'లగచర్ల' గిరిజన రైతుల అరెస్టులు, బేడీలు వేయడంపై సోమవారం శాసన మండలిలోనూ బీఆర్ఎస్ తీవ్రంగా నిరసన తెలిపింది. వాయిదా తీర్మానం ఇచ్చింది. దానికి మండలి చైర్మన్ అనుమతించకపోవడంతో శాసన మండలి ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, కల్వకుంట్ల కవిత, ఎల్.రమణ, శంభీపూర్ రాజు, వాణీదేవి, రవీందర్‌రావు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. 'ఇదేమి రాజ్యం... దోపిడీ రాజ్యం.. దొంగల రాజ్యం.. రైతులకు బేడీలు సిగ్గు సిగ్గు' అంటూ నినాదాలు చేశారు.

పర్యాటక విధానంపై మంత్రి మాట్లాడుతుంటే బీఆర్ఎస్ సభ్యులు బాధ్యతారాహితంగా వ్యవహరించడం సరికాదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ బీఆర్ఎస్ సభ్యులు నిరసన కొనసాగించారు. 'రైతులకు కరెంట్ షాకులా?.. రైతులకు బేడీలా..? సిగ్గు సిగ్గు' అంటూ నినాదాలు చేశారు.

నిరసనల మధ్య జూపల్లి ప్రసంగం

బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన కొనసాగుతుండగానే మంత్రి జూపల్లి కృష్ణారావు కాసేపు ప్రసంగించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆదాయాన్ని పెంచలేకపోయిందని, తాము పర్యాటక అభివృద్ధి ద్వారా ఆ పనిచేస్తున్నామని చెప్పారు. బంగారు పళ్లెంలో రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి అప్పగించామని హరీశ్‌రావు అంటుంటారని, తెరిచి చూస్తే అప్పులకుప్పగా ఉందని విమర్శించారు.



నేడు అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు

లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, చిత్రహింసలకు గురిచేశారని.. దీనిపై మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలపాలని బీఆర్ఎస్ పిలుపు ఇచ్చింది. జైళ్లలో నిర్బంధించి, రైతన్న చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ అమానవీయ, అణచివేత విధానాలను నిలదీయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో మంగళవారం ఉదయం 11 గంటలకు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. లగచర్ల రైతులపై కేసులను ఎత్తివేసి వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రజా ప్రభుత్వమా.. నియంత సర్కారా?



▶ మొదటి పేజీ తరువాయి

నిప్పులు చెరిగారు. బయట ఉన్న గిరిజనులను, వారి కుటుంబాలను పోలీసులు ఇంకా వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత నియోజకవర్గ ప్రజలను జైల్లో పెట్టిన రేవంత్‌రెడ్డి.. దీనిపై మాట్లాడకుండా పర్యాటక శాఖపై చర్చ పెట్టడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిని జైల్లో వేస్తున్నారని, తెలంగాణ, కొడంగల్ రేవంత్ అయ్య జాగీరా అని నిలదీశారు. ఇప్పటివరకు సీఎం 30సార్లు, మంత్రులు 70సార్లు ఢిల్లీకి వెళ్లినా రూ.100 కూడా తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. లగచర్ల ఘటనపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సభ నుంచి పారిపోయినా.. రేపు మరొక రూపంలో వస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఈ అంశంపై చర్చ పెట్టడానికి దమ్ములేక పారిపోయిన దద్దమ్మ రేవంత్ అని దుయ్యబట్టారు. అదానీతో జరుగుతున్న అవినీతిపై సభలోకి వచ్చి చర్చిద్దామంటే అడ్డుకున్నారని, లగచర్ల అంశంపై చర్చ పెడదామంటే సమాధానం చెప్పడం చేతగాక అసెంబ్లీని వాయిదా వేసుకొని పారిపోయారని విమర్శించారు.

...భయమవుతోంది

▶ మొదటి పేజీ తరువాయి

కొంత వేరే అభిప్రాయం ఉన్నా.. ఇప్పుడు ప్రజలకు నిజం తెలిసిపోయిందన్నారు.

కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..

సంక్రాంతికి రైతు భరోసా తప్పకుండా ఇస్తామని చెప్పిన పొంగులేటి.. రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు రూ.12 వేలను రెండు దఫాల్లో ఇస్తామని చెప్పారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 15 లక్షల కుటుంబాలకు లబ్ధి కలుగుతుందని, ఇందుకోసం విడతకు రూ.1,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.7 లక్షల కోట్ల అప్పు వాస్తవమని, ఈ విషయంలో చర్చ నుంచి తప్పించుకునేందుకు బీఆర్ఎస్ గొడవ చేయాలని చూస్తోందన్నారు. కార్పొరేషన్ల ద్వారా తీసుకునే అప్పులు లెక్కలోకి రావా అని ప్రశ్నించారు. అసలు కార్పొరేషన్ల నుంచి ఒక్క రూపాయి అయినా ఆదాయం వచ్చే పరిస్థితి ఉందా అని వ్యాఖ్యానించారు. సినీ పరిశ్రమను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, సినిమావాళ్లు, జర్నలిస్టులు, ప్రజలందరూ తమకు సమానమేనని అన్నారు. శాసనసభలో ఎవరి పాత్ర వారు పోషించాల్సిందేనని, భట్టిపై ప్రివిలేజ్ తీర్మానం ఇవ్వడం బీఆర్ఎస్ హక్కు అని చెప్పారు. కేసీఆర్ అసెంబ్లీకి రావాలని తాను వ్యక్తిగతంగా కోరుకుంటున్నానని, ఆయన అసెంబ్లీలో ఉన్నప్పుడు మంత్రి హోదాలో చర్చలో మాట్లాడాలని తనకు కూడా కోరికగా ఉందని పొంగులేటి చెప్పారు. ఏడాది పాలనపై ప్రజల్లో వ్యతిరేకత లేదని స్పష్టం చేశారు.

మరిన్ని అసెంబ్లీ వార్తలు
'సాక్షి ప్లస్' (ఈ-పేపర్‌లో)

భట్టిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

- స్పీకర్‌ను కలసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- అప్పులపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపాటు
- అసెంబ్లీలో పరిమితుల విధింపుపై కేటీఆర్ ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్‌లో రాష్ట్ర అప్పులపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించారని బీఆర్ఎస్ పార్టీ విమర్శించింది. సోమవారం ఈ అంశంపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఆయన చాంబర్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర అప్పులపై శాసనసభ, తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

'2023 డిసెంబర్ 20న అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విడుదల చేసిన శ్వేతపత్రంలో తెలంగాణ అప్పులను రూ.6.71 లక్షల కోట్లుగా చూపించారు. ఈ ఏడాది జూలై 25 నాటి బడ్జెట్ ప్రసంగంలోనూ ఇవే అంకెలను వల్లెవేశారు. కానీ ఇటీవల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన 'హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్' నివేదికలో 2014–15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ.72, 658 కోట్లు కాగా 2024 మార్చి నాటికి రూ.3.89 లక్షల కోట్లకు చేరినట్లు వెల్లడించింది. కానీ ఆర్థిక మంత్రి అప్పులపై ఉద్దేశ పూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించారు. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తున్నాం' అని బీఆర్ఎస్ ప్రకటించింది.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులకు భంగం: కేటీఆర్

'బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగేలా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. అప్పులపై తప్పుదోవ పట్టిస్తున్నందునే సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చాం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అసెంబ్లీ లాబీలో తనను కలసిన మీడియా ప్రతినిధులతో వ్యాఖ్యానించారు. 'గతంలో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిపై ఇచ్చిన హక్కుల ఉల్లంఘన నోటీసును నాటి స్పీకర్ మనోహర్ అంగీకరించి సభలో చర్చకు వీలు కల్పించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలు అప్పులపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉండగా కేవలం టూరిజంపైన రాష్ట్ర ప్రభుత్వం చర్చ పెట్టడం బాధాకరం. రాష్ట్రంలో ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం బాగా నడుస్తున్నాయి. శాసనసభలో లగచర్ల అంశానికి సంబంధించిన అంశాన్ని చర్చకు తీసుకురావాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశాం' అని కేటీఆర్ పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యేలను కూడా అడ్డుకుంటున్నారు

'గతంలో ఎన్నడూ లేని రీతిలో మాజీ ఎమ్మెల్యేలను అసెంబ్లీ వైపు రాకుండా అడ్డుకుంటున్నారు. గతంలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సీఎంను కలిసే అవకాశం ఉండేది. ప్రస్తుతం కనీసం ప్లకార్డులను కూడా తీసుకురాకుండా అడ్డుకుంటున్నారు. మమ్మల్ని కట్టడి చేసి, ప్రభుత్వం తన వైఫల్యాలను దాచుకోవాలని అనుకుంటున్నది. రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం చేస్తామని ఆర్థిక మంత్రి భట్టి చేసిన ప్రకటన అసెంబ్లీ వ్యవహారాలకు విరుద్ధం. అసెంబ్లీ సమావేశాలు నడుస్తున్నప్పుడు విధానపరమైన నిర్ణయాలను సభలోనే ప్రకటించాలన్న అంశాన్ని భట్టి విక్రమార్క విస్మరించారు' అని కేటీఆర్ ధ్వజమెత్తారు.

స్మార్ట్ చిప్‌తో తెల్లరేషన్ కార్డులు

▶ మొదటి పేజీ తరువాయి

తన నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియమించిన విషయాన్ని మంత్రి వివరించారు. ఉపసంఘం పలుమార్లు సమావేశమై చర్చించిందన్నారు. కార్డుల మంజూరు ప్రక్రియలో సుప్రీంకోర్టుకు సక్సేనా కమిటీ సమర్పించిన సిఫారసులను పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పారు. అలాగే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల నుంచి సేకరించిన సూచనలను కూడా ఉప సంఘం పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తమ్ తెలిపారు. వీటన్నింటినీ అధ్యయనం చేసిన ఉపసంఘం కొత్త రేషన్ కార్డుల మంజూరీకి అర్హతా ప్రమాణాలు నిర్ణయిస్తూ కేబినెట్‌కు నివేదిక సమర్పిస్తుందని చెప్పారు.

దొడ్డుబియ్యం పక్కదారి నిజమే..

రేషన్‌షాపుల్లో ఇస్తున్న దొడ్డుబియ్యం పక్కదారి పడుతున్న మాట వాస్తవమేనని మంత్రి ఉత్తమ్‌కుమార్ అంగీకరించారు. ప్రజలెవ్వరూ దొడ్డుబియ్యం వినియోగించడం లేదని, దాంతో పక్కదారి పడుతోందన్నారు. అందుకే ఇకపై సన్నబియ్యం మాత్రమే సరఫరా చేస్తామని ప్రకటించారు. నిత్యావసర వస్తువుల పంపిణీ ఆలోచన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాల డీలర్ల భర్తీ ప్రక్రియను త్వరలోనే చేపడతామన్నారు.

2.46 లక్షల కార్డులు రద్దు...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో 91,68,231 రేషన్ కార్డులు ఉండేవని, మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.38 కోట్లని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సభకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తరువాత ఇక్కడి నుంచి ఏపీకి చెందిన వారు తమ ప్రాంతాలకు వెళ్లడంతో 2,46,324 కార్డులు రద్దయ్యాయని చెప్పారు. తెలంగాణ ఏర్పడ్డాక మొత్తం 89,21,907 తెల్ల కార్డులు ఉన్నాయని, 2.7 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2023 వరకు కొత్తగా 20.69 లక్షల మంది లబ్ధిదారులకు 6,47,479 ఆహార భద్రతా కార్డులు మంజూరు చేశారని, అదే సమయంలో 5,98,000 ఆహార భద్రతా కార్డులు తొలగించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గత పదేళ్లలో మంజూరు చేసిన తెల్లరేషన్ కార్డులు 49 వేలు మాత్రమేనని, వీటి లబ్ధిదారులు 86 వేల మంది ఉన్నారని ఉత్తమ్‌కుమార్ రెడ్డి చెప్పారు.

హుజూర్‌నగర్‌లో వ్యవసాయ కళాశాల!

హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేసే అంశాన్ని సీరియస్‌గా పరిశీలిస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం 100 ఎకరాల స్థలం కావాలని, ఆ భూమి కోసం అన్వేషణ జరుగుతోందని సోమవారం అసెంబ్లీ లాబీల్లో విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడుతూ చెప్పారు. ఒకవేళ హుజూర్‌నగర్‌లో భూమి లభ్యం కాకపోతే కోదాడ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు రెండు విధాలుగా నీటి సౌకర్యం కల్పించాలన్నదే తన తపన అని, నియోజకవర్గంలో విద్య, వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించానని చెప్పారు. హుజూర్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి లభించిందన్నారు. నల్లగొండతోపాటు ఖమ్మం జిల్లాలోని ఎన్ఎస్‌పీ క్వార్టర్ల ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామని, వాటిని వేలం వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఉత్తమ్ వెల్లడించారు.

ఈ నెల 20 వరకే అసెంబ్లీ సమావేశాలు!

స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బీఏసీ భేటీ.. సమావేశాల తేదీలపై రాని స్పష్టత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈ నెల 20వ తేదీ వరకే కొనసాగే అవకాశాలు ఉన్నాయి. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో శుక్రవారంతో సమావేశాలు ముగించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. కానీ ఎక్కువ రోజులు సమావేశాలు నిర్వహించాలని బీఆర్ఎస్ పట్టుబట్టినట్టు సమాచారం. అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో స్పష్టత రాలేదు. సోమవారం మధ్యాహ్నం స్పీకర్ ప్రసాద్‌కుమార్ చాంబర్‌లో బీఏసీ భేటీ జరిగింది. ఇందులో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్.. బీఆర్ఎస్ నుంచి హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ నుంచి పాయల్ శంకర్, ఎంఐఎం నుంచి అక్బరుద్దీన్ ఒవైసీ, సీపీఐ నుంచి కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ నిర్వహణ తేదీలు, ఎజెండాపై ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. కనీసం 15 రోజుల పాటు సభ నిర్వహించాలని కోరింది. దీనికి ప్రభుత్వం అంగీకరించకపోవడంతో భేటీ నుంచి వాకౌట్ చేసింది. మరోవైపు సభ నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ కూడా బీఏసీ భేటీ బయటికి వచ్చారు. బీఏసీ భేటీకి సంబంధించిన వివరాలను మంగళవారం ఉదయం అధికారికంగా వెల్లడించే అవకాశముంది.



స్పీకర్ ప్రసాద్‌కుమార్ చాంబర్‌లో జరిగిన బీఏసీ భేటీలో సీఎం రేవంత్, భట్టి, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, కూనంనేని తదితరులు

బీఏసీ అంటే బిస్కట్ అండ్ చాయ్ సమావేశం కాదు: హరీశ్‌రావు

కనీసం 15 రోజులపాటు అసెంబ్లీ నడపాలని కోరామని బీఏసీ భేటీ అనంతరం హరీశ్‌రావు చెప్పారు. ''బీఏసీ అంటే బిస్కట్ అండ్ చాయ్ సమావేశం కాదు. బీఏసీలో ఏమీ తేల్చకపోవడంతో, సభ ఎన్ని రోజులు నడుపుతారో చెప్పకపోవడంతో వాకౌట్ చేశాం. లగచర్ల అంశంపై చర్చకు మంగళవారం కూడా పట్టుబడతాం. ఒకరోజు ప్రభుత్వం, మరోరోజు విపక్షం ప్రతిపాదించే ఎజెండాకు అవకాశం ఇవ్వడం సాంప్రదాయం. బీఏసీకి కేవలం సూచనలు చేసే అధికారం మాత్రమే ఉందని సీఎం చేసిన వ్యాఖ్యలపై అభ్యంతరం తెలిపాం. హౌజ్ కమిటీలు ఏర్పాటు చేయాలి. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)పై బీఆర్ఎస్ అభిప్రాయం తెలుసుకోకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారని అడిగాం. బీఏసీలో చర్చించకుండానే సభలో బిల్లులు ప్రవేశపెట్టడం, పుట్టినరోజులు, పెళ్లిళ్లు ఉన్నందుకు సభ వాయిదా వేయడంపై అభ్యంతరం చెప్పాం. ప్రతీరోజూ జీరో అవర్‌లో బీఆర్ఎస్ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా మాట్లాడే సమయం ఇవ్వాలని కోరాం'' అని హరీశ్‌రావు వెల్లడించారు.

గత పదేళ్లలో చాయ్ తాగి, బిస్కెట్లు తినే వచ్చారా?: మంత్రి శ్రీధర్‌బాబు

ఉమ్మడి ఏపీతోపాటు తెలంగాణ ఏర్పాటైన పదేళ్ల నుంచీ కూడా బీఏసీ సమావేశంలో చర్చించి సభ నిర్వహణపై నిర్ణయాలు తీసుకుంటున్నారని... సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ నిర్ణయమని శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టి మాట్లాడారు. ''బీఏసీ సమావేశం నుంచి వాకౌట్ చేయడం ద్వారా బీఆర్ఎస్, ఎంఐఎం స్పీకర్‌ను అవమానించాయి. బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు చెప్పినట్టు గత పదేళ్లలో కూడా బీఏసీ సమావేశంలో చాయ్ తాగి, బిస్కెట్లు తినే వచ్చారా? బీఆర్ఎస్ తీరు సరికాదు..'' అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.



బడా కాంట్రాక్టర్లకు బిల్లులు..

మాజీ సర్పంచులకు తిప్పలు

- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు ఫైర్
- మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, చిన్న కాంట్రాక్టర్లను ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపణ
- ఆ బకాయిల పాపం గత సర్కారుదేనన్న మంత్రి సీతక్క
- అప్పులు, పెండింగ్ బిల్లుల సర్దుబాటుతో జాప్యం జరుగుతోందని వెల్లడి
- ఈ అంశంపై బీఆర్ఎస్, అధికారపక్షం మధ్య మాటల యుద్ధం.. వాకౌట్ చేసిన బీఆర్ఎస్

సాక్షి, హైదరాబాద్: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లుల అంశం సోమవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో మంటలు రేపింది. కాంగ్రెస్ సర్కారు చిన్న కాంట్రాక్టర్లను వేధిస్తోందని బీఆర్ఎస్ సభ్యుడు హరీశ్‌రావు మండిపడగా.. అసలు ఆ బకాయిల పాపం గత బీఆర్ఎస్ సర్కారుదేనంటూ మంత్రి సీతక్క విమర్శించారు. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు జరిగి, బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. అంతకుముందు ప్రశ్నోత్తరాల్లో భాగంగా.. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్తుల్లో పేరుకుపోయిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం ఏడాది కాలంగా చెల్లించటం లేదని.. ఎప్పుడు చెల్లిస్తారని బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వరరెడ్డి, కొత్త ప్రభాకరరెడ్డి, కోవ లక్ష్మి, బీజేపీ సభ్యుడు వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు.

మాజీ సర్పంచులను పగబట్టి వేధిస్తున్నారు: హరీశ్‌రావు

ఈ అంశంపై హరీశ్‌రావు మాట్లాడుతూ.. బడా కాంట్రాక్టర్ల పెండింగు బిల్లులు చెల్లిస్తూ, చిన్న కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం గోస పెట్టిస్తోందని విమర్శించారు. ''గ్రామ పంచాయతీల్లో పనులు చేసిన చిన్న చిన్న కాంట్రాక్టర్లకు సంవత్సర కాలం నుంచి రూ.691 కోట్ల పెండింగు బిల్లులు చెల్లించటం లేదు. ప్రభుత్వం ఒక్క నవంబర్ నెలలోనే బడా కాంట్రాక్టర్లకు రూ.1,200 కోట్ల బిల్లులు చెల్లించింది. చిన్న కాంట్రాక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలకు చెల్లించకుండా వారిని పగబట్టి వేధిస్తోంది. వారు చలో అసెంబ్లీ చేపడితే అరెస్టు చేశారు. బీఆర్ఎస్ పాలనలో పల్లె ప్రగతి కింద గ్రామాలకు నెలకు రూ.275 కోట్లు, పట్టణ ప్రగతి కింద రూ.150 కోట్లు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. దేశంలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు 20 అవార్డులు ప్రకటిస్తే.. అందులో 19 తెలంగాణకే వచ్చాయి'' అని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఇప్పుడు తెలంగాణకు వెళ్తే చికున్‌గున్యా వ్యాధి సోకే ప్రమాదం ఉందని అమెరికా తమ దేశ పౌరులను హెచ్చరించాల్సిన దుస్థితికి మన గ్రామాలు చేరుకున్నాయని.. ఇది మన రాష్ట్రానికే కాకుండా దేశానికి కూడా అవమానకరమని వ్యాఖ్యానించారు. కాగా.. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న జనగామ నియోజకవర్గంలోని గ్రామాల్లోనే రూ.45 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందని బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెప్పారు. కామారెడ్డి నియోజకవర్గంలో దాదాపు రూ.7 కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని, రెండు ప్రభుత్వాల హయాంలోనూ పరిస్థితి ఒకేరకంగా ఉందని బీజేపీ సభ్యుడు వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

బిల్లుల బకాయిలకు గత ప్రభుత్వమే కారణం: సీతక్క

గ్రామ పంచాయతీల్లో బిల్లుల పెండింగ్ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి తమకు వారసత్వంగా వచ్చిందే తప్ప.. తమ హయాంలోనివి కాదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ''2014 నుంచీ బిల్లులు పేరుకుపోయే పరిస్థితి కొనసాగుతూ వస్తోంది. గత ప్రభుత్వ ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఒక సంతకం పెట్టి ఉంటే పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ అయి ఉండేవి. ఆయన వల్లే బిల్లులు పేరుకుపోయాయి. బీఆర్ఎస్ అంటే బకాయిల రాష్ట్ర సమితిలా మార్చారు'' అని మండిపడ్డారు. తమ ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత గ్రామ పంచాయతీలకు రూ.740 కోట్లు విడుదల చేశామని, ఉపాధి హామీ కింద గతంలో జరిగిన పనులకు సంబంధించి రూ.450 కోట్లు విడుదల చేశామని చెప్పారు. పంచాయతీ ఎన్నికలు జరగకపోవటం, పలు ఇతర కారణాల వల్ల 15వ ఆర్థిక సంఘం నిధులు రాలేదన్నారు. తాము కొంత సమయం కోరుతున్నామే తప్ప.. బిల్లులు చెల్లించబోమని చెప్పడం లేదన్నారు. గత ప్రభుత్వం పేరుకుపోయేలా చేసిన అప్పులు, పెండింగ్ బిల్లుల సర్దుబాటు వల్ల కొంత జాప్యం జరుగుతోందని చెప్పారు.

స్పష్టత ఇవ్వలేదంటూ వాకౌట్

ఈ సమయంలో తాను మాట్లాడతానని హరీశ్‌రావు కోరగా స్పీకర్ మైక్ ఇవ్వలేదు. దీనితో సభ నడుపుతున్న తీరు ఆవేదన కలిగిస్తోందని హరీశ్‌రావు పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు ఎప్పటిలోగా ఇస్తారని అడిగితే స్పష్టత ఇవ్వకుండా.. బాధ్యతారహిత సమాధానం ఇవ్వడాన్ని నిరసిస్తూ వాకౌట్ చేస్తున్నామని ప్రకటించారు. అయితే హరీశ్‌రావు మాటలు సరికాదని, ప్రతినెలా పంచాయతీలకు రూ.275 కోట్లు విడుదల చేసి ఉంటే అసలు బకాయిలే పేరుకుపోయేవి కాదని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఆ పార్టీ సభ్యులు ఒక్కొక్కరు వెయ్యి కోట్ల వరకు సంపాదించుకుని, ఇప్పుడు సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా...

చెక్కుల ఫ్రీజింగ్ ఎత్తేయండి

సెక్రటరీ లోకేశ్‌కుమార్‌కు మంత్రి సీతక్క ఆదేశం



సాక్షి, హైదరాబాద్‌: తమ శాఖ జనరల్‌ ఫండ్‌ చెక్కుల చెల్లింపుపై ఉన్న ఫ్రీజింగ్‌ ఎత్తివేసి వాటికి సంబంధించిన మొత్తాన్ని విడుదల చేయాల్సిందిగా సెక్రటరీ లోకేశ్‌కుమార్‌ను పీఆర్‌ఆర్‌డీ మంత్రి సీతక్క ఆదేశించారు. సోమవారం ఈ మేరకు మంత్రి ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో మంత్రి సీతక్కను రాష్ట్ర సర్పంచుల సంఘం జేఏసీ నేతలు సుర్వి యాదయ్యగౌడ్, రాంపాక నాగయ్య, గుంటి మధుసూదన్‌రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. తమ పెండింగ్‌ బిల్లులను వీలైనంత త్వరగా మంజూరు చేయాలని కోరారు. వీటితో పాటు ఎస్‌ఎఫ్‌సీ, ఎస్‌డీఎఫ్‌, 15వ ఆర్థికసంఘం, జనరల్‌ ఫండ్‌ చెక్కులను విడుదల చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఇదిలా ఉంటే... సోమవారం అసెంబ్లీలో సర్పంచ్‌ల పెండింగ్‌ బిల్లుల సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, పల్లా రాజేశ్వరరెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కోవా లక్ష్మి, వెంకటరమణారెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌ 'చలో రాజ్‌భవన్‌' రేపు



సాక్షి, హైదరాబాద్‌: అఖిల భారత కాంగ్రెస్‌ కమిటీ (ఏఐసీసీ) పిలుపు మేరకు ఈనెల 18న తెలంగాణ కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో 'చలో రాజ్‌భవన్‌' కార్యక్రమం జరగనుంది. అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణలపై చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వెనకాడుతున్న తీరు, మణిపూర్‌ అల్లర్లు, హింసపై ప్రధాని మోదీ మౌనాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బుధవారం ఉదయం 11 గంటలకు నెక్లెస్‌రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద భారీ జనసమీకరణతో రాజ్‌భవన్‌ వరకు ప్రదర్శన నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలతో పాటు రాష్ట్ర కాంగ్రెస్‌ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్‌ నేతలు పాల్గొంటారని మహేశ్‌గౌడ్‌ వెల్లడించారు.

మోహన్‌బాబు అరెస్టులో ఆలస్యం లేదు

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నాగోలు: సినీ నటుడు మోహన్‌బాబు కుటుంబ కేసులో తాము లీగల్‌గా ముందుకు వెళ్తున్నామని, ఈ సంఘటనలో మొత్తం మూడు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయని రాచకొండ కమిషనర్‌ సుధీర్‌బాబు తెలిపారు. సోమవారం ఎల్‌బీనగర్‌ సీపీ క్యాంప్‌ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంచు కుటుంబ వివాదానికి సంబంధించి లీగల్‌ యాక్షన్‌ తీసుకుంటున్నట్లు తెలిపారు. కేసులపై దర్యాప్తు చేస్తున్నామని, మోహన్‌బాబు అరెస్ట్‌ విషయంలో ఆలస్యమేమీ లేదని, ఈ నెల 24వ తేదీ వరకు కోర్టు ఆయనకు టైం ఇవ్వడంతో అరెస్ట్‌ చేయలేదని చెప్పారు. మోహన్‌బాబును విచారించేందుకు కోర్టును అనుమతి అడుగుతామని పేర్కొన్నారు. మోహన్‌బాబు వద్ద ఉన్న తుపాకులు చంద్రగిరిలో ఉన్నప్పుడు తీసుకున్నవని, రాచకొండ పోలీసులు ఇచ్చిన గన్‌ పర్మిషన్స్‌ లేవని తెలిపారు. కోర్టు మినహాయింపు అయిపోయాక ఆయనకు మరోసారి నోటీసులు ఇస్తామని.. అప్పుడు విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు.

హామీలు నెరవేర్చకుంటే వేలాది మందితో ధర్నా

తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ

పంజగుట్ట(హైదరాబాద్‌): కాంగ్రెస్‌ ప్రభుత్వం గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను 48 గంటల్లో నెరవేర్చాలని.. లేనిపక్షంలో వారం రోజుల్లో ఇందిరాపార్క్‌ వద్ద వేలాదిమందితో మహాధర్నా నిర్వహిస్తామని తెలంగాణ గౌడ, కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ పేర్కొంది. కల్తీకల్లు పేరుతో పోలీసు, ఎక్సైజ్‌ శాఖల అధికారులు గీత కార్మికులపై అక్రమకేసులు బనాయించి జైలుకు పంపుతున్నారని, దీనిని వెంటనే అరికట్టాలని కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏడాది కాంగ్రెస్‌ పాలన - కల్లుగీత వృత్తి అనే అంశంపై రౌండ్‌టేబుల్‌ సమావేశం నిర్వహించారు. కమిటీ రాష్ట్ర కన్వీనర్‌ అయిలి వెంకన్న గౌడ్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌ గౌడ్, కమిటీ చైర్మన్‌ బాలగోని బాల్‌రాజ్‌ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.వి.రమణ మాట్లాడుతూ.. జనగామ జిల్లాకు సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌ పేరు పెడతామని, ట్యాంక్‌బండ్‌పై పాపన్న విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, వీటిని నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గౌడ సంఘాల ప్రతినిధులు యెలికట్టి విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణ గౌడ్, బండి సాయన్నగౌడ్, కుందారం గణేశ్‌చారి, చింతల మల్లేశంగౌడ్‌ పాల్గొన్నారు.



మూన్‌ లైట్‌ ఇవి రాష్ట్ర సచివాలయంలో వెలుగులు ప్రసరిస్తున్న లైట్లు. ఇక్కడున్నవన్నీ లైట్లే.. ఆ ఒక్కటి తప్ప.. అది మామూలు లైట్‌ కాదు.. మూన్‌ లైట్‌. సోమవారం రాత్రి చంద్రుడు ఇలా విద్యుత్‌ దీపంలా కనువిందు చేశాడు.

కేటీఆర్‌పై 'ఫార్ములా' అస్త్రం!

▶ మొదటి పేజీ తరువాయి

విచారణ ప్రారంభించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ అంశంపై సూటిగా స్పందించేందుకు ప్రభుత్వ వర్గాలు నిరాకరించాయి.

విదేశీ సంస్థలకు నేరుగా నిధులు ఎలా చెల్లిస్తారు?

'విదేశీ కంపెనీలైన ఫార్ములా–ఈ ఆపరేషన్స్‌ (ఎఫ్‌ఈఓ), ఏస్‌ నెక్ట్స్‌ జెన్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థలకు నేరుగా ప్రభుత్వ నిధులను చెల్లించే విషయంలో నిర్ణయాధికారం నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌ కుమార్‌కు ఉందా? రిజర్వు బ్యాంకు అనుమతి లేకుండా విదేశీ కంపెనీలకు నేరుగా ప్రభుత్వ నిధులను చెల్లించవచ్చా? ఈ విషయంలో నిబంధనల ఉల్లంఘన ఏమైనా జరిగిందా? అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ ప్రకటించిన తర్వాత ఈ ఒప్పందం ఎలా చేసుకుంటారు?' అనే అంశాలపై ఏసీబీ విచారణ జరపాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

భారీగా డబ్బులు చేతులు మారాయని..

ఫార్ములా–ఈ కార్ల రేసులో అవకతవకలు జరిగాయని.. భారీగా డబ్బులు చేతులు మారాయని మంత్రివర్గం అనుమానాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆ క్రీడల నిర్వహణతో రాష్ట్రానికి రూ.7 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ఇటీవల కేటీఆర్‌ పేర్కొన్న నేపథ్యంలో... ఈ విషయాలను ఆయన ఏసీబీకి చెప్పుకోవాలని కీలక మంత్రి ఒకరు పేర్కొన్నారు. కేటీఆర్‌ అరెస్టు భయంతోనే ఇంటి దగ్గర కాపలా పెట్టుకున్నారని, కేంద్రంలోని పెద్దలను కలిసేందుకు ఢిల్లీకి వెళ్లారని ఆరోపించారు. ఎవరినో అరెస్టు చేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందా?, బీఆర్‌ఎస్‌ నేతలు అహంకారంతో మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు.

అధికారులు కూడా విచారణ ఎదుర్కోవాల్సిందే!

'ఫార్ములా–ఈ' కారు రేసింగ్‌ వ్యవహారంలో కేటీఆర్‌తోపాటు ఐఏఎస్‌ అధికారి అర్వింద్‌కుమార్, ఇతర అధికారులు విచారణ ఎదుర్కోవాల్సిందేనని కీలక మంత్రి ఒకరు పేర్కొన్నారు. అరవింద్‌కుమార్‌ విచారణకు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ (డీఓపీటీ) అనుమతి అవసరం లేదని.. సీఎస్‌ అనుమతిస్తే సరిపోతుందని తెలిపారు. అధికారిపై నేరారోపణలు నమోదు చేసే సమయంలోనే డీఓపీటీ అనుమతి అవసరమని వెల్లడించారు. ఫార్ములా–ఈ ఆపరేషన్స్‌ (ఎఫ్‌ఈఓ), ఏస్‌ నెక్ట్స్‌ జెన్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ కంపెనీలపై సైతం ఏసీబీ విచారణ చేపడుతుందని, వాటికి కూడా నోటీసులు ఇస్తుందని పేర్కొన్నారు. కేటీఆర్‌ మౌఖిక ఆదేశాలతోనే ఆ రెండు కంపెనీలకు నిధులు చెల్లించినట్టు అర్వింద్‌కుమార్‌ ఇప్పటికే తెలిపారని గుర్తు చేశారు.

కీలక నిర్ణయాలు.. అసెంబ్లీలోనే ప్రకటన

సీఎం రేవంత్‌ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నా అధికారికంగా వెల్లడించలేదు. వీటిపై అసెంబ్లీలోనే ప్రకటన చేయనున్నట్టు తెలిసింది. ఛత్తీస్‌గఢ్‌ విద్యుత్‌ కొనుగోలు ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్‌ విద్యుత్‌ కేంద్రాల నిర్మాణంలో అవకతవకలపై వేసిన జస్టిస్‌ మదన్‌ బి.లోకూర్‌ కమిషన్‌ సమర్పించిన నివేదికపై మంత్రివర్గం చర్చించి ఆమోదించినట్టు సమాచారం. ఈ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి విస్తృతంగా చర్చించాలని నిర్ణయించినట్టు తెలిసింది. రెవెన్యూ శాఖ ప్రక్షాళన కోసం కొత్తగా తెచ్చిన రికార్డ్‌ ఆఫ్‌ రైట్స్‌(ఆర్‌ఓఆర్‌) బిల్లుతోపాటు పంచాయతీరాజ్‌ చట్ట సవరణ బిల్లు, విశ్వవిద్యాలయాల బిల్లులు, జీఎస్టీ చట్ట సవరణ బిల్లులను కూడా కేబినెట్‌ ఆమోదించినట్టు సమాచారం. ఇక ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీల మేరకు రైతు భరోసా కింద భూమి లేని రైతుకూలీలకు డిసెంబర్‌ 28 నుంచి రూ.12 వేల ఆర్థిక సాయం చెల్లింపు, కొత్త రేషన్‌ కార్డుల జారీపైనా చర్చించి నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిసింది. నేడో, రేపో వీటిపై అసెంబ్లీ ప్రకటన చేయనుంది.

ఈ–ఫార్ములా రేస్‌లో ఏం జరిగిందంటే..

ఇదీ వివాదం....

హైదరాబాద్‌లో ఈ–కార్ల రేస్‌ నిర్వహణ కోసం ఫార్ములా ఈ–ఆపరేషన్‌ (ఎఫ్‌ఈవో) సంస్థ ఏస్‌ నెక్ట్స్‌జెన్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ నిర్వహణలో గ్రీన్‌కో స్పాన్సర్‌షిప్‌తో కలిసి పురపాలక శాఖ 2022 అక్టోబర్‌ 25న త్రైపాక్షిక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు 2023 ఫిబ్రవరి 10, 11 తేదీల్లో నిర్వహించిన మొదటి ఫార్ములా ఈ–కార్ల రేస్‌ (సెషన్‌–9)కు దేశవ్యాప్తంగా అభిమానులు వచ్చినా.. ప్రమోటర్‌ అయిన 'ఏస్‌ నెక్ట్స్‌ జెన్‌', స్పాన్సర్‌ గ్రీన్‌కోకు ఆశించిన మేర ఆదాయం సమకూరలేదు. దీంతో రెండు సంస్థలు ఒప్పందం నుంచి తప్పుకొన్నాయి. ఈ నేపథ్యంలో 2024 ఫిబ్రవరి 10న నిర్వహించాల్సిన రెండో దఫా (సెషన్‌–10) ఈ–కార్‌ రేసు నుంచి హైదరాబాద్‌ పేరును ఎఫ్‌ఈవో తొలగించింది. కానీ, అప్పటి మంత్రి కేటీఆర్‌ ఫార్ములా–ఈ రేస్‌ నిర్వహణ హైదరాబాద్‌కు అంతర్జాతీయ ఖ్యాతి తెస్తుందని, 2024 ఫిబ్రవరిలో కూడా హైదరాబాద్‌లోనే కార్‌ రేస్‌ను నిర్వహించాలని నిర్ణయించారు. స్పాన్సర్‌గా నోడల్‌ ఏజెన్సీ హెచ్‌ఎండీఏ వ్యవహరిస్తుందని, స్పాన్సర్‌ దొరికే వరకు ప్రాథమిక చెల్లింపులను హెచ్‌ఎండీఏకు అప్పగించారు. ఈ మేరకు రెండో దఫా ఈ–కార్‌ రేస్‌ కోసం 2023 అక్టోబర్‌లో ఎఫ్‌ఈవోతో పురపాలక సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ–రేస్‌ నిర్వహణకు రూ.100 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందుకోసం హైదరాబాద్‌ మెట్రోపాలిటన్‌ డెవలప్‌మెంట్‌ అథారిటీ (హెచ్‌ఎండీఏ) రూ.55 కోట్లు ఎఫ్‌ఈవోకు చెల్లించింది.

ప్రభుత్వ వాదన...

ఈ–కార్ల రేసింగ్‌ నగరంలో నిర్వహించడం వల్ల ప్రజలకు ఇబ్బందే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. ఫిబ్రవరి 2024లో జరగాల్సిన ఈ రేసును రద్దు చేసుకున్నాం. ఈ రేసు కోసం హెచ్‌ఎండీఏ విదేశీ సంస్థకు కేబినెట్‌ అనుమతి కాని, హెచ్‌ఎండీఏ అనుమతి గానీ లేకుండానే జరిపిన రూ.55 కోట్ల చెల్లింపుల్లో అక్రమాలు జరిగాయి. ఒప్పందంలో అవకతవకలు జరిగాయి. విదేశీ సంస్థకు అంత భారీ మొత్తంలో విదేశీ కరెన్సీ చెల్లింపుల్లో ఆర్‌బీఐ అనుమతి తీసుకోలేదు. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ వచ్చి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పుడు ఎలా చెల్లిస్తారు. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌కు నోటీసులు జారీ చేశాం. ఆయన ఇచ్చిన సమాధానం మేరకు ఇందులో కేటీఆర్‌ పాత్ర ఉన్నందునే..ఆయనపై విచారణ జరిపించడానికి గవర్నర్‌ ఆమోదం కోరాం. గవర్నర్‌ అనుమతి వచ్చినందున దర్యాప్తు చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయం.

ఇదీ కేటీఆర్‌ వాదన...

'ఈ–రేస్‌ నిర్వహణకు ఎఫ్‌ఏఏ, హెచ్‌ఎండీఏ, గ్రీన్‌ కో నడుమ త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. తమకు లాభం రాలేదనే కారణంతో రెండో విడత రేస్‌ నుంచి గ్రీన్‌ కో తప్పుకోవడంతో రేస్‌ నిర్వహణ ద్వారా హైదరాబాద్‌ బ్రాండ్‌ ఇమేజీ పెంచేందుకు ప్రభుత్వం తరఫున రూ.55 కోట్లు ఖర్చు చేశాం. ఇందులో అప్పటి హెచ్‌ఎండీఏ కార్యదర్శి అర్వింద్‌ కుమార్‌ తప్పేమీ లేదు. ఫైల్స్‌పై నేనే సంతకం చేశా. రూ.55 కోట్లు చెల్లించమని నేనే చెప్పినందున నాదే బాధ్యత. పురపాలక శాఖలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ నడుమ అంతర్గతంగా డబ్బు సర్దుబాటు చేసుకోవచ్చు. స్వతంత్ర సంస్థ హెచ్‌ఎండీఏకు సీఎం చైర్మన్‌ గా, పురపాలక శాఖ మంత్రి వైస్‌ చైర్మన్‌ గా, కమిషనర్‌ సభ్య కార్యదర్శిగా ఉంటారు. హెచ్‌ఎండీఏ నిర్ణయాలు దేనికీ కేబినెట్‌ అనుమతులు అవసరం లేదు. రేవంత్‌ సీఎం పదవి చేపట్టిన వెంటనే నా మీద ఉన్న కోపంతో ఒప్పందాన్ని రద్దు చేశారు. దీంతో ప్రపంచం ముందు హైదరాబాద్‌ పరువు పోయింది.

–సాక్షి, హైదరాబాద్‌

తొలి విడతలో ముగ్గురు లేదా నలుగురిపై చర్యలు

ఐఏఎస్‌ అర్వింద్‌కుమార్‌ విచారణకు ప్రభుత్వం అనుమతి

ఈ–కార్‌ రేస్‌ కేసుపై మంత్రి పొంగులేటి

సాక్షి, హైదరాబాద్‌: ఈ–కార్‌ రేసు పేరుతో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయని, ఈ కేసు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తొలి విడతలో ఈ కేసులో ముగ్గురు లేదా నలుగురిపై చర్యలుండే అవకాశముందని చెప్పారు. విచారణ అనంతరం జైలు తర్వాత పాదయాత్ర చేస్తారా లేదా మోకాళ్ల యాత్ర చేస్తారా అనేది వాళ్ల ఇష్టమని ఎద్దేవా చేశారు. సోమవారం కేబినెట్‌ భేటీ అనంతరం ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠి మాట్లాడారు. కేబినెట్‌ సమావేశంలో బిల్లులపై చర్చించామని చెప్పారు. ఈ–కార్‌ రేస్‌ పేరుతో జరిగిన దోపిడీ, స్వలాభం కోసం చేసిన పనులపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగిందన్నారు. ఈ కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్‌ అనుమతిచ్చారని, ఐఏఎస్‌ అధికారి అర్వింద్‌కుమార్‌ను విచారించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని చెప్పారు. అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్న నేతలు ఏసీబీ దగ్గర సమాధానం చెప్పాలన్నారు. తుస్సు బాంబులైతే ఎందుకు భయపడుతున్నారని దుయ్యబట్టారు. విద్యుత్‌ కొనుగోళ్లపై కమిషన్‌ ఇచ్చిన నివేదికలోని అంశాలు సమయం వచ్చినప్పుడు బయటకు వస్తాయన్నారు. సభలో చర్చించే ధైర్యం లేకనే బీఆర్‌ఎస్‌ నేతలు ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి వస్తున్నారని, గూండాల్లాగా ప్రవర్తిస్తున్నారన్నారు.

నమ్మకం లేదు కాబట్టే కేసీఆర్‌ అసెంబ్లీకి రావడం లేదు

- పరపతిలేని కేటీఆర్, హరీశ్‌ల గురించి మాట్లాడొద్దని సీఎంకు నేనే చెప్పా
- పాలమూరు నుంచి శ్రీహరికి మంత్రి పదవి రావచ్చు
- మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి కోమటిరెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: మళ్లీ అధికారంలోకి వస్తామన్న నమ్మకం ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్‌కు లేదని, అందుకే ఆయన అసెంబ్లీకి రావడం లేదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నప్పుడే భట్టి అసెంబ్లీకి వెళ్లారని, మరి 30 మంది ఎమ్మెల్యేలున్నా కేసీఆర్‌ ఎందుకు అసెంబ్లీకి రావడం లేదో అర్థం చేసుకోవాలని వ్యాఖ్యానించారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠి మాట్లాడుతూ, కేసీఆర్‌ కుమారుడు, అల్లుడు, బిడ్డను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు ప్రజల దృష్టిలో జోకర్లుగా మారారని, ప్రజల్లో పరపతి లేని కేటీఆర్, హరీశ్‌ల గురించి మాట్లాడవద్దని సీఎంకు తానే చెప్పానన్నారు. అందుకే నల్లగొండ, పాలమూరు సభల్లో వారి గురించి మాట్లాడలేదన్నారు. కేసీఆర్‌ అసెంబ్లీకి వచ్చి ప్రతిపక్ష పాత్ర పోషించాలని, ఆయన అడిగే ఏ ప్రశ్నకైనా మంత్రి హోదాలో సమాధానం చెప్పేందుకు తాను సిద్ధమని పేర్కొన్నారు. తాను కేసీఆర్‌ లాగా దొంగ దీక్ష చేయలేదని, తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఆమరణదీక్ష చేసి 17 కిలోలు బరువు తగ్గానని, చావు నోట్లో తలపెట్టి వచ్చానన్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా తెలంగాణలో 34 అసెంబ్లీ, 7 ఎంపీ సీట్లు పెరుగుతాయని చెప్పారు. జమిలి ఎన్నికల కోసం కేంద్రం ముసాయిదా బిల్లును సిద్ధం చేసిందని తనకు తెలిసిందన్నారు. మంత్రివర్గ విస్తరణ ఎప్పుడు జరుగుతుంది, ఎవరికి మంత్రి పదవులు వస్తాయనేది తాను చెప్పలేనని, అది అధిష్టానం చూసుకుంటుందని తెలిపారు. అయితే, మహబూబ్‌నగర్‌ జిల్లాకు చెందిన శ్రీహరికి మాత్రం మంత్రి పదవి వస్తుందని చెప్పగలనన్నారు.

ఏడాదిలోనే కాంగ్రెస్‌ పాలనపై ప్రజా వ్యతిరేకత

- జనవరి మొదటి వారంలో కార్మికులతో ప్రత్యేక సమావేశం
- బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌

సాక్షి, హైదరాబాద్‌: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పబ్లిక్‌ సెక్టార్‌ కంపెనీలను అదానీవైపు నడిపిస్తోందని, బయ్యారంలో స్టీల్‌ ఫ్యాక్టరీ పెట్టకుండా దానికి అవసరం అయిన గనులను అదానీకి రాసిచ్చిందని బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ ధ్వజమెత్తారు. మరో పక్క ఏడాది కాలంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని అన్నారు. సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో ప్రభుత్వరంగ సంస్థ బీడీఎల్‌ కార్మికులు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తమ హక్కుల కోసం పోరాడుతున్న రైతులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ ఉద్యోగులు, లగచర్ల బాధితులపై అణచివేత చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. 'సామాన్య ప్రజల హక్కులను హరిస్తున్న కాంగ్రెస్‌ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న వర్గాలు తెలంగాణ భవన్‌ను పరిష్కార కేంద్రంగా భావిస్తుండటంతో ఇది జనతా గ్యారేజీగా మారింది' అని కేటీఆర్‌ పేర్కొన్నారు. జనవరి మొదటి వారంలో కార్మికుల కోసం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మహమూద్‌ అలీ, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీలు వాణీదేవి, నవీన్‌కుమార్‌ రెడ్డి, శంభీపూర్‌ రాజు పాల్గొన్నారు.

వీహెచ్‌ వ్యాఖ్యలతో కలకలం

- కాంగ్రెస్‌ పార్టీ హైదరాబాద్‌ జిల్లా సమావేశం రసాభాస
- కార్యకర్తల ఘర్షణ.. ఉద్రిక్తత
- సీనియర్‌ నేత జోక్యంతో పరిస్థితి అదుపులోకి..

సాక్షి, హైదరాబాద్‌: హైదరాబాద్‌ జిల్లా కాంగ్రెస్‌ పార్టీ విస్తృతస్థాయి సమావేశం రసాభాసగా మారింది. సాక్షాత్తు పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీ, పీసీసీ చీఫ్‌ మహేశ్‌కుమార్‌ గౌడ్, మంత్రి పొన్నం సమక్షంలో ఆ పార్టీ సీనియర్‌ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. ఒకవర్గం వారు ఎన్నికల వరకు కాంగ్రెస్‌ పార్టీతో ఉండి.. పోలింగ్‌ సమయంలో హ్యాండిస్తున్నారంటూ వీహెచ్‌ వ్యాఖ్యానించారు. దీంతో ఒక్కసారిగా సమావేశంలో గందరగోళం నెలకొంది. వీహెచ్‌ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ.. ఆ వర్గం నేతలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో మున్షీ, మహేశ్‌కుమార్, పొన్నం సమావేశం నుంచి వెళ్లిపోయారు. తర్వాత గాంధీ భవన్‌ ఆవరణలో కాంగ్రెస్‌ కార్యకర్తలు ఘర్షణకు దిగారు. అయితే సీనియర్‌ నేతలు వారికి సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

మంత్రి పదవి ఇవ్వాల్సిందే: అంజన్‌కుమార్‌

తన తనయుడికి రాజ్యసభ పదవి ఇచ్చినంత మాత్రాన తనకు మరో పదవి ఇవ్వకూడదా? అని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌ యాదవ్‌ ప్రశ్నించారు. నగర సీనియర్‌ నాయకుడిగా, తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకొని ఉన్నారని, మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని ఆయన అనుచరులు నినాదాలు చేశారు. నగరం నుంచి మంత్రివర్గంలో ఎవరికీ స్థానం కల్పించని కారణంగా ఎమ్మెల్సీ పదవి ఇచ్చి కేబినెట్‌లో స్థానం కల్పించాలన్నారు.

పార్టీకి పూర్వవైభవం తేవాలి: మున్షీ

సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌ మున్షీ మాట్లాడుతూ.. పార్టీకి హైదరాబాద్‌లో పూర్వవైభవం తేవాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో పార్టీ నగరంలో ఎంతో బలంగా ఉండేదని, అందరూ ఐక్యతగా ఉంటే సంస్థాగతంగా బలపడతామని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నందున నగరంపై పట్టు సాధించేందుకు మంచి అవకాశమన్నారు. డివిజన్ల వారీగా సమావేశాలు నిర్వహించి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

టార్గెట్‌ జీహెచ్‌ఎంసీ ఎన్నికలు: పీసీసీ చీఫ్‌


రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు గెలవడమే మన టార్గెట్‌ అని పీసీసీ చీఫ్‌ మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ చెప్పారు. గ్రామీణ ప్రజలు కాంగ్రెస్‌ పార్టీని గుండెల్లో పెట్టుకున్నారని, జీహెచ్‌ఎంసీ పరిధిలో మాత్రం పార్టీకి ఆశాజనకంగా సీట్లు రాలేదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో భూబకాసురులు రెచ్చిపోయారని, వందల చెరువులు కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. కాగా, గ్రేటర్‌ ఎన్నికల్లో బలమైన నాయకులకు టికెట్లు ఇస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ ప్రకటించారు. నామినేటెడ్‌ పోస్టుల భర్తీలో సైతం అంకిత భావంతో పనిచేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

నేడు అసెంబ్లీలో పర్యాటక విధానంపై చర్చ

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర శాసనసభ మూడో రోజు సమావేశాల్లో భాగంగా.. మంగళవారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక విధానంపై స్వల్పకాలిక చర్చ జరగనుంది. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే ప్రశ్నోత్తరాలను చేపడతారు. అనంతరం తెలంగాణ స్టేట్‌ ట్రేడ్‌ ప్రమోషన్‌ కార్పొరేషన్‌ ఏడో వార్షిక నివేదికను సభకు సమర్పిస్తారు. తెలంగాణ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ అండ్‌ స్పోర్ట్స్‌ యూనివర్సిటీ సవరణ బిల్లు–2024, తెలంగాణ యూనివర్సిటీస్‌ సవరణ బిల్లు–2024, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లు–2024ను ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి సభలో ఆమోదం కోసం ప్రతిపాదిస్తారు.

జిల్లాల సంఖ్య తగ్గించేది లేదు


మండలిలో మంత్రి పొంగులేటి సమాధానం



సాక్షి, హైదరాబాద్‌ : రాష్ట్రంలోని జిల్లాల సంఖ్యను తగ్గించే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలను పునర్వ్యవస్థీకరణ చేయనున్నట్టు గతంలో సీఎం ప్రకటించినందున అలాంటి కసరత్తు ఏమైనా జరుగుతోందా? అయితే వివరాలేమిటి అంటూ బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నకు సోమవారం మంత్రి పొంగులేటి సమాధానమిచ్చారు. మహబూబాబాద్‌ జిల్లాలను యథాతథంగా కొనసాగిస్తామని, కొడంగల్‌ను జిల్లాగా చేసే ఉద్దేశమేదీ లేదని మంత్రి బదులిచ్చారు.


- రాష్ట్రంలో వెనుకబడిన జిల్లాలకు నిధులు, ప్రతీ జిల్లాకో నవోదయ పాఠశాలలు తీసుకొనిరావడంలో కేంద్రంతో సఖ్యతతో ఉన్న రేవంత్‌రెడ్డి సర్కార్‌ ఎన్ని నిధులు తీసుకొచ్చిందని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కవిత ప్రశ్నించగా..ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుమార్లు ఢిల్లీ వెళ్లి ప్రభుత్వం తరఫున కేంద్రంపై పోరాడుతూనే ఉంటారని, వెళ్లి వచ్చినంత మాత్రాన వ్యాగన్లలో డబ్బులు రావని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

కొత్తగా బీసీ గురుకులాలు లేవు : మంత్రి పొన్నం



కొత్తగా బీసీ గురుకులాలు ఏర్పాటు చేసే ప్రతిపాదన ఏదీ లేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ స్పష్టం చేశారు. శాసనమండలిలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ కవిత అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్‌ రెసిడెన్షియల్‌ స్కూళ్లు నిర్మిస్తోందని, అంటే ఒక్కొక్కటి నాలుగు గురుకులాలు అని, ఒక ఏడాదిలోనే 216 గురుకులాలతో సమానం అని పేర్కొన్నారు. గురుకుల విద్యాలయాలు బీఆర్‌ఎస్‌ వచ్చిన తర్వాతే రాలేదని, కాంగ్రెస్‌ హయాంలోనే గురుకులాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు హాస్టల్‌ మెస్‌చార్జీలు, కాస్మెటిక్‌ చార్జీలు పెంచామని మంత్రి వివరించారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో గురుకులాలు ఏర్పాటు చేయడం మినహా.. ఒక్క బిల్డింగ్‌ కూడా నిర్మించలేదని, విద్యార్థులను ఇరుకు గదుల్లో వదిలిపెట్టారని వ్యాఖ్యానించారు.

జాబ్‌ క్యాలెండర్‌ ప్రకారం ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం : డిప్యూటీ సీఎం భట్టి



ఉద్యోగాల భర్తీపై పలువురు సభ్యులు మండలిలో అడిగిన ప్రశ్నలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 55,172 ఉద్యోగాలు భర్తీ చేశామని ఇందులో 54,573 మందికి నియామక ఉత్తర్వులు జారీ చేశామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ను ప్రక్షాళన చేసి జాబ్‌ క్యాలెండర్‌ విడుదల చేశామని, దానికి తగ్గట్టుగా ఉద్యోగాలను భర్తీ చేస్తామని వివరించారు. గత పాలకులు పదేళ్ల కాలంలో గ్రూప్‌–1 పరీక్ష ఒక్కసారి కూడా నిర్వహించలేకపోయారని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదని చెప్పారు. తాము ఇచ్చిన మాట ప్రకారం 563 పోస్టులకు పరీక్ష నిర్వహించామని, 11,062 ఖాళీలతో డీఎస్సీ నిర్వహించి 10,600 మందికి అపాయింట్‌మెంట్‌ ఆర్డర్లు ఇచ్చామని డిప్యూటీ సీఎం చెప్పారు. ఉద్యోగ నియామక పరీక్షలన్నీ పారదర్శకంగా, ప్రశ్నపత్రం లీక్‌ వంటివి లేకుండా చూసుకుంటూ ఖాళీలను భర్తీ చేసుకుంటూ పోతున్నామని వివరించారు. ఉర్దూ మీడియంలో బ్యాక్‌లాగ్‌ పోస్టుల భర్తీకి డీ రిజర్వేషన్‌ విధానం పరిశీలించాలని కొందరు సభ్యులు అడిగారు కానీ అందుకు అవకాశం లేదని తెలిపారు.


ప్రతిపక్షం లేవనెత్తిన సమస్యలు పట్టించుకోవట్లేదు

మండలి బీఆర్‌ఎస్‌ పక్షనాయకుడు మధుసూదనాచారి



సాక్షి, హైదరాబాద్‌: ప్రతిపక్షం లేవనెత్తిన ప్రజా సమస్యలను కాంగ్రెస్‌ ప్రభుత్వం పట్టించుకోవటం లేదని మండలి బీఆర్‌ఎస్‌ పక్షనాయకుడు ఎస్‌.మధుసూదనాచారి తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం శాసనమండలి మీడియా పాయింట్‌ వద్ద ఆయన మాట్లాడుతూ లగచర్ల గిరిజన రైతుల ఘటనపై మండలిలో బీఆర్‌ఎస్‌ పక్షం వాయిదా తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా, మండలి చైర్మన్‌ తిరస్కరించటం ప్రజాసమస్యలను విస్మరించటమేనన్నారు. ప్రభుత్వ వ్యవహార శైలిని చూస్తే.. సాంకేతికంగా సభను జరిపి, బిల్లులు పెట్టుకోవాలన్న చందంగా ఉందని చెప్పారు. రైతులు, ఉద్యోగులు, పేద వర్గాలపై ప్రభుత్వానికి ఏమాత్రం ప్రేమ లేదని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వలాభంతోపాటు కుటుంబ సభ్యుల కోసం గిరిజన రైతులకు బేడీలు వేయించారని ఆరోపించారు. అనారోగ్యంతో ఉన్న గిరిజన రైతులపై ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఓటుకు నోటుకు కేసులో జైలుకు వెళ్లివచ్చిన రేవంత్‌ తన ప్రత్యర్థులను కూడా జైలుకు పంపాలన్న దురుద్దేశంతో పట్నం నరేందర్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీలు కవిత, ఎల్‌.రమణ, శంభీపూర్‌రాజు, వాణిదేవి, రవీందర్‌రావు ఉన్నారు.

చేనేత ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే: ఎమ్మెల్సీ ఎల్‌.రమణ



చేనేత కార్మికుల ఆత్మహత్యలు.. ప్రభుత్వ హత్యలేనని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ ఎల్‌.రమణ ఆరోపించారు. వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలతోనే ఆత్మహత్యలు జరుగుతున్నాయన్నారు. మండలి మీడియా పాయింట్‌ వద్ద ఆయన మాట్లాడుతూ తెలంగాణలో 28 మంది చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోగా, ప్రభుత్వం 13 మంది మాత్రమే ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్పిందనన్నారు. ఇందులో కూడా ముగ్గురికి మాత్రమే ఎక్స్‌గ్రేషియా ఇచ్చినట్లు ప్రభుత్వం చెబుతోందని చెప్పారు. బీఆర్‌ఎస్‌ మండలి పక్షం మాత్రం ఆత్మహత్య చేసుకున్న 28 మంది చేనేత కార్మికుల జాబితాను ప్రభుత్వానికి అందజేసినట్లు పేర్కొన్నారు. వస్త్ర పరిశ్రమను కాపాడేందుకు అవసరమైన నిధుల కేటాయింపు, సబ్సిడీలను ప్రభుత్వం అందించే వరకు పోరాడతామని రమణ చెప్పారు.



ఇతరుల్లా ఉండే క్రమంలో మనల్ని మనం మూడొంతులు నష్టపోతాం.
– ఆర్థర్ షోపెన్‌హోవర్

సాక్షి
మంగళవారం, 17 డిసెంబర్ 2024

చర్చ జరగాలి కానీ, ఇలాగా..?

పార్లమెంట్ శీతకాల సమావేశాలు ఈ సోమవారంతో ఆఖరి వారం వ్యవధిలోకి ప్రవేశించాయి. దేశంలో చలి పెరుగుతుంటే, సభలో వాతావరణం మాత్రం వేగంగా వేడెక్కుతోంది. మొన్న నవంబర్ 26న 75 వసంతాలు పూర్తి చేసుకున్న భారత రాజ్యాంగం అమలుపై అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల పర్వం చూస్తే ఆ భావనే కలుగుతుంది. లోక్‌సభలో గత శుక్ర, శనివారాలు రాజ్యాంగ చర్చ జరిగితే, ఈ సోమ, మంగళవారాలు రాజ్యసభలో అది కొనసాగుతోంది. 'ఒకే దేశం... ఒకే ఎన్నిక' బిల్లుకు కావాల్సిన రాజ్యాంగ సవరణ మాట అటుంచితే, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కాక గాంధీల కుటుంబ శ్రేయానికై కాంగ్రెస్ నిస్సిగ్గుగా రాజ్యాంగాన్ని సవరిస్తూ పోయిందని ఆర్థిక మంత్రి ఆరోపించడం తాజాగా అగ్గి రాజేసింది. అనేక జటిల సమస్యలకు రాజ్యాంగ సవరణలే ఏకైక పరిష్కారం అంటూ నెహ్రూకు సాక్షాత్తూ సర్దార్ పటేలే లేఖ రాశారంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తిప్పికొట్టాల్సి వచ్చింది. వెరసి, భారత గణతంత్రానికి ఆత్మ లాంటి రాజ్యాంగంపై చర్చ పక్కదోవ పట్టి, పార్టీలు బురదజల్లుకొనే ప్రక్రియగా మారిపోయింది.

నిజానికి, స్వాతంత్ర్యానంతరం భారతదేశ భవితవ్యమెలా ఉంటుందన్న దానిపై బోలెడన్ని అనుమానాలు, జోస్యాలు వెలువడినా, మన రాజ్యాంగం పటాపంచలు చేసింది. నిజానికి, నవ యువ గణతంత్ర రాజ్యంగా మనం అనేక ఒడుదొడుకులను ఎదుర్కొన్నాం. వాటన్నిటినీ తట్టుకొని నిలవడంలోనూ విజయవంతమయ్యాం. భారత రాజ్యాంగం కాలపరీక్షకు నిలిచి, దేశానికి మూలస్తంభంగా నిలిచింది. ఇవాళ అనేక దేశాల్లో, చివరకు సోకాల్డ్ ప్రజాస్వామ్యాల్లోనూ అధికార బదలాయింపులో పలు సమస్యలను ఎదుర్కొంటున్నా, భారత్‌లో మాత్రం ప్రజాభీష్టాన్ని ప్రతిఫలించే అధికార బదలీ శాంతియుతంగా సాగిపోవడం మన రాజ్యాంగం వేసిన పటిష్ఠమైన పునాదికీ, చూపిన ఆచరణాత్మకమైన మార్గానికీ తార్కాణం. ఈ ఏడున్నర దశాబ్దాల సుదీర్ఘ ప్రస్థానంలో వేర్వేరు రాజకీయ పార్టీలు, కూటములు దేశాన్ని పాలించాయి. 1975లో ఎమర్జెన్సీ విధింపు లాంటి అశనిపాతాలు అడపాదడపా ఎదురైనా, ప్రభుత్వాలన్నీ దేశాన్ని ముందుకే నడిపాయి.

క్రియాశీలక సజీవపత్రంగా రాజ్యాంగ రూపకర్తలు సంభావించిన భారత రాజ్యాంగం అంతర్గత సంకల్పబలం, స్థితిస్థాపక చైతన్యంతో నవ భారత అవసరాలకు తగ్గట్టుగా మార్పులతో నిత్య నూతనంగా నిలుస్తూ వచ్చింది. దానికి తగ్గట్టే రాజ్యాంగాన్ని ఇప్పటికి శతాధిక పర్యాయాలు సవరించడం జరిగింది. దేశ సామాజిక, ఆర్థిక ప్రయోజనాలకు తగ్గట్టు దేశం ముందుకు పోయేందుకు అనేక ఏళ్ళుగా భారత రాజ్యాంగం వీలు కల్పిస్తూనే వచ్చింది. అనేక పార్శ్వాలున్న ఈ రాజ్యాంగ ప్రస్థానాన్ని పార్లమెంట్‌లో చర్చిస్తున్నారంటే, భవిష్యత్తుపై దృష్టి సారిస్తారని భావించాం. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదర్శాలు, లక్ష్యాలు సాకారమయ్యేందుకు పథ నిర్దేశం జరుగుతుందని ఆశించాం. భారత స్వాతంత్ర్య శతవర్ష సమారోహం సాగే 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై మేధా మథనం జరపాలని ఆకాంక్షించాం. ఆ దిశలో సామాన్యుల జీవితాలు మెరుగయ్యేలా లక్షించాల్సింది పోయి విమర్శల పర్వానికే చర్చ పరిమితమైపోవడం శోచనీయం.

నిజానికి, ఎవరూ విమర్శలకు అతీతులు కారు. గాంధీ, నెహ్రూలైనా అంతే. వారిని విమర్శించదలుచుకుంటే నేరుగా విమర్శించవచ్చు. అంతేకానీ, రాజ్యాంగంపై చర్చ పేరిట పరోక్షంగా కొందరిపై బురద జల్లడం ఏమిటన్నది ఒక వాదన. తాజా చర్చ సందర్భంలో అధికార ఎన్డీఏ వర్గీయులు ఉద్దేశపూర్వకంగానే రాజ్యాంగ నిర్మాతల లక్ష్యాలను తప్పుబడుతున్నారని కూడా ఆరోపణ. అయితే, అసలు భావప్రకటనా స్వేచ్ఛపై సహేతుకమైన పరిమితులు పెట్టవచ్చంటూ తొలి రాజ్యాంగ సవరణ తెచ్చింది కాంగ్రెసే అని బీజేపీ ఎత్తిచూపుతోంది. స్వేచ్ఛ ఉండాలి నిజమే కానీ, అన్ని సమయాల్లోనూ అది నిర్నిబంధమైతే కష్టం గనక సహేతుకమైన పరిమితులు విధించవచ్చని అలా ప్రథమ సవరణతో రాజ్యాంగ రూపకర్తలే దిద్దుబాటు బాట పట్టారన్నది కాంగ్రెస్ వర్గీయుల ప్రతివాదన. రాజ్యాంగ అమలుకు అమృతోత్సవ వేళ చర్చ దాని అమలు తీరుతెన్నులు, భవిష్యత్ సవాళ్ళపైనే సాగాల్సింది. సామూహిక ఆత్మపరిశీలనకు దీన్ని అవకాశంగా మలుచుకోవాల్సింది. కానీ, జరుగుతున్నది వేరు. చర్చంతా రాజకీయ రంగు పులుముకొని, నెహ్రూ కుటుంబం, ఎమర్జెన్సీ, మోదీ సర్కార్ చుట్టూ సాగుతోంది. ఆరోపణలు, ప్రత్యారోపణలతో అవిశ్వాస తీర్మానంపై చర్చ ఫక్కీలోకి జారిపోయింది.

1975 ఎమర్జెన్సీలోనైనా, ఇప్పుడు 'అప్రకటిత ఎమర్జెన్సీ' ఉందంటున్నా... రెండు సందర్భాల్లో పాలకుల చేతిలో నలిగిపోయింది రాజ్యాంగానికి గుండె లాంటి పౌరుల ప్రాథమిక హక్కులే అని విస్మరించరాదు. ఏళ్ళు గడుస్తున్నకొద్దీ సవాళ్ళు అధికరిస్తున్నాయి. లౌకికవాదం, సమాఖ్య వాదం, న్యాయవ్యవస్థ స్వతంత్రత, దుర్విచక్షణ లేకపోవడం, మైనారిటీల హక్కుల పరిరక్షణ లాంటి రాజ్యాంగ మౌలిక సూత్రాలపైనే ప్రశ్నార్థకాలు పొడసూపుతున్నాయి. సమాన అవకాశాల మాట దేవుడెరుగు, ఆర్థికంగా– సామాజికంగా– లింగపరంగా సమానత్వం సైతం నేటికీ పూజ్యం. అంతరాలు పెరుగుతున్న సమాజంలో అసమానతల నిర్మూలనకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామా? అన్ని పక్షాలూ ఆత్మావలోకనం చేసుకోవాలి. రాజకీయ పత్రం, దేశ రాజకీయాలకు పునాది అయినప్పటికీ, రాజ్యాంగమనేది అదే సమయంలో రాజకీయాలకు అతీతమైనది. దానిపై చర్చలో ప్రధాని సహా అందరూ సంకుచిత రాజకీయాలకే చోటిస్తే ఇంకేమనాలి? ఈ ధోరణి మారాలి. రాజ్యాంగం ఇన్నేళ్ళుగా జాతికి దిక్సూచిగా నిలిచింది. ప్రభుతకూ, పౌరులకూ ప్రజాస్వామ్య ఫర్మానాగా వెలిగింది. ఆ ఉజ్జ్వల స్ఫూర్తికి కట్టుబడడమే సమస్త సమస్యలకూ పరిష్కారం. సామాన్యుల హక్కులకు శ్రీరామరక్ష.

తిరుగు వలసలు చెబుతున్నదేమిటి?

విశ్లేషణ



దేవీందర్ శర్మ

కోవిడ్ మహమ్మారి కాలంలో లక్షలాది మంది నగరాల నుంచి తమ గ్రామాలకు తిరిగి వెళ్లారు. మహమ్మారి ముగిసిన తర్వాత వీరందరూ తిరిగి నగరాలకు చేరుకుంటారన్న అంచనాలకు భిన్నంగా గ్రామాల్లోనే ఉండిపోయారు. 2020–22 మధ్య కాలంలో గ్రామీణ శ్రామిక శక్తికి సుమారు 5 కోట్ల 60 లక్షల మంది కార్మికులు జోడించబడ్డారు. వీళ్లలో ఎక్కువమంది యువత. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ లాంటివాటిని మినహాయిస్తే, చాలా రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబాల సంఖ్య పెరిగింది. ఇవన్నీ కూడా జీవనోపాధికి చెందిన సవాళ్లను ఎదుర్కోవటంలో వ్యవసాయానికి ఉన్న ప్రాముఖ్యాన్ని చాటుతున్నాయి. వ్యవసాయం మీద ఆధారపడేవారి సంఖ్యను తగ్గించే ఆర్థిక విధానాలకు బదులుగా, వ్యవసాయాన్ని స్థిరమైన, లాభదాయకమైన వ్యవస్థగా మార్చాలి.

భారత ప్రజలు ప్రస్తుతం పెద్ద సంఖ్యలో తమ గ్రామాలకు తిరిగి వెళ్తున్నారు. గత ఐదేళ్లలో, పట్టణ కేంద్రాల్లో మెరుగైన ఉపాధి అవకాశాల కోసం, 'తక్కువ–ఉత్పాదకత' కలిగిన వ్యవసాయం నుండి కార్మికులను బయటకు నెట్టడానికి సంకల్పించిన విధానం ఇప్పుడు అడ్డం తిరిగింది.

కోవిడ్–19 మహమ్మారి కాలంలో మొదటిసారి తిరుగు వలసలు (రివర్స్ మైగ్రేషన్) మొదలయ్యాయి. లక్షలాది మంది పట్టణ పేదలు అనంత దూరాలు, చాలామంది కాలినడకన తమ తమ ఊళ్లకు ప్రయాణించారు. దేశ విభజన రోజుల తర్వాత ఇది ప్రజల అతిపెద్ద చలనం. కనీవినీ ఎరుగనంత స్థాయిలో సాగిన ఈ అంతర్–రాష్ట్ర వలసలు, రాష్ట్రం లోపలి వలసలు తాత్కాలికమని నమ్మారు. కానీ, మహమ్మారి ముగిసిన తర్వాత శ్రామికశక్తి నగరాలకు తిరిగి వస్తుందనే అంచనాను తోసిపుచ్చుతూ, వాళ్లలో ఎక్కువ మంది తమ ఊళ్లలోనే ఉండడానికి ఇష్టపడటం జరిగింది.



వ్యవసాయంలోనే ఉపాధి

'నేషనల్ శాంపిల్ సర్వే', 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే'ల డేటా ఆధారంగా, 'ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్', న్యూఢిల్లీకి చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్' రూపొందించిన ఒక నివేదికలో వ్యవసాయ ఉపాధి పెరిగిందని తేలింది. సాధారణ అభిప్రాయానికి విరుద్ధంగా, 2020–2022 మధ్య గ్రామీణ శ్రామికశక్తికి 5 కోట్ల 60 లక్షలమంది కార్మికులు జోడించబడ్డారు. నిరుద్యోగం వృద్ధి చెందుతున్న సమయంలో, నగరాల్లో లభించే ఉపాధి అవకాశాలు వలస కార్మికులకు అంతగా ఆకర్షణీయంగా లేవని ఇది నిరూపిస్తోంది. తయారీ రంగంలో మందగమనం, నిర్మాణ రంగ ఉద్యోగాలు తగ్గుముఖం పట్టడం వల్ల నగరాలకు వలస వచ్చినవారు గ్రామాలకు తిరిగి వెళ్లడమే మంచిదని భావించారు.

ఆసక్తికరమైన విషయమేమిటంటే, 2004–05, 2018–19 మధ్య అంటే 13 సంవత్సరాల కాలంలో 6 కోట్ల 60 లక్షల మంది వ్యవసాయ శ్రామికులు పట్టణాలలో చిన్న ఉద్యోగాల కోసం వలస వెళ్లారు. కానీ 2018–19, 2023–24 మధ్య ఐదేళ్లలో 6 కోట్ల 80 లక్షల మంది పైగా ప్రజలు గ్రామాలకు తిరిగి వచ్చారని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయానికి చెందిన ఆర్థికవేత్త హిమాన్షు అంచనా వేశారు. వ్యవసాయం అకస్మాత్తుగా లాభదాయకంగా మారిందని దీని అర్థం కాదు. ప్రజలను పొలాల నుండి బయటకు నెట్టడం ఆచరణీయమైన వ్యూహం కాదని ఇది స్పష్టంగా చెబుతోంది.

గ్రామీణ శ్రామిక శక్తిలో వ్యవసాయం వాటా 2018–19లో 42.5 శాతం నుండి 2023–24లో 46.1 శాతానికి పెరిగిందని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక చెబుతోంది. పైగా ఇందులో గణనీయమైన యువ జనాభా కూడా ఉంది. ఇది విస్మరించలేని సందేశాన్ని ఇస్తోంది. ప్రజలను ఆ రంగం నుండి బయటకు నెట్టాలనే లక్ష్యంతో సంవత్సరాలుగా వ్యవసాయాన్ని ఉద్దేశపూర్వకంగా వెనుకపట్టున ఉంచిన విధానాల మీద మన ఆర్థిక ఆలోచనలు నడుస్తున్నాయి. కానీ ఢిల్లీ సరిహద్దుల్లో ఒక సంవత్సరం పాటు జరిగిన ఆందోళనల తరువాత రైతుల నిరసనలు వెల్లువెత్తాయి. తమకు సరైన ఆదాయాన్ని నిరంతరం తిరస్కరించడంపై రైతాంగం ఆగ్రహంతో ఉంది.

ప్రపంచ బ్యాంకుకు దూరంగా– గాంధీజీకి దగ్గరగా!

భారతదేశం తన వ్యవసాయరంగం నుండి 40 కోట్ల మంది ప్రజలను నగరాలకు వలసబాట పట్టించాలని ప్రపంచ బ్యాంకు 1996లో కోరింది. ఇది బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీల ఉమ్మడి జనాభా కంటే రెండింతలకు సమానం. అయితే పట్టణ కేంద్రాలకు వలస వెళ్లడానికి వీలుగా ఆర్థిక పరిస్థితులను సృష్టించే బదులు, వ్యవసాయాన్ని ఆచరణీయమైన వాణిజ్యంగా మార్చడం ద్వారా వ్యవసాయాన్ని పునర్నిర్మించడంపై దృష్టి సారించాలి. మహాత్మా గాంధీ కోరుకున్నది ఇదే. వలస కార్మికులు తిరిగి వచ్చిన రేటు ఆయన అభిప్రాయం ఎంత సరైనదో చూపిస్తుంది. అందువల్ల, ప్రపంచ బ్యాంకు ఆలోచనను విడనాడి వ్యవసాయాన్ని పునరుజ్జీవింపజేయడం, వ్యవసాయాన్ని స్థిరమైన, ఆచరణీయమైన, లాభదాయకమైన వ్యవస్థగా మార్చడంపై దృష్టి పెట్టాల్సిన సమయం ఇది.

మీకు ఇంకా నమ్మకం లేకుంటే, ఇటీవల విడుదల చేసిన 'నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్' (నాబార్డ్)కు చెందిన 'ఆల్ ఇండియా రూరల్ ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సర్వే 2021–22' నివేదికను చూడండి. దీని ప్రకారం, వ్యవసాయంలో నిమగ్నమై ఉన్న జనాభా వాటా సంవత్సరాలుగా గణనీయంగా పెరిగింది. 2016–17లోని 48 శాతం నుండి 2023–24లో గరిష్ఠంగా 57 శాతానికి చేరుకుంది. వ్యవసాయ కుటుంబాల సంఖ్యలో పెనుగంతు స్థానికుల తిరిగిరాకను స్పష్టంగా సూచిస్తోంది. వ్యవసాయ కుటుంబాల వాటా 2016–17లో 42 శాతం నుండి 2021–22 నాటికి 36 శాతానికి తగ్గిన పంజాబ్; 70 నుండి 63 శాతానికి తగ్గిన హిమాచల్ ప్రదేశ్, కొంచెం తగ్గుదల చూపిన గుజరాత్, కర్ణాటకలను మినహాయిస్తే... అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబాల పెరుగుదల గణనీయంగా ఉంది. వ్యవసాయ కుటుంబాలు గోవాలో 3 నుండి 18 శాతానికి, హరియాణాలో 34 నుండి 58 శాతానికి పెరిగాయి. ఉత్తరాఖండ్‌లో 41 నుంచి 57 శాతం; తమిళనాడులో 13 నుండి 57 శాతం పెరుగుదల కనబడింది. ఇతర రాష్ట్రాలు కూడా ఈ పెరుగుదల ధోరణినే చూపుతున్నాయి.

కారణాలు ఏమైనప్పటికీ, అంతర్జాతీయ కార్మిక సంస్థ, పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే, నాబార్డ్ చేసిన మూడు అధ్యయనాలు కూడా ఉపాధి, జీవనోపాధికి చెందిన సవాళ్లను ఎదుర్కోవటంలో వ్యవసాయానికి ఉన్న ప్రాముఖ్యతను చాటుతున్నాయి. అందుకే గృహ ఆహార భద్రతను నిర్ధారించడంలో వ్యవసాయ రంగం సామర్థ్యాన్ని విస్మరించకూడదు.

ఆందోళనలో శుభవార్త

వ్యవసాయంలో సంఖ్యలను తగ్గించడంపై ఆధారపడిన మునుపటి ఆర్థిక విధానాలను రివర్స్ మైగ్రేషన్ తారుమారు చేసినప్పటికీ, వ్యవసాయంలో ఉపాధి పెరుగుదలను ప్రధాన ఆర్థికవేత్తలు 'ఆందోళన కలిగించే అంశం'గా చూస్తున్నారు. భారతదేశంలో కనిపిస్తున్న ఈ తిరుగు వలసల ధోరణి తక్కువ మధ్య–ఆదాయ వర్గానికి ప్రత్యేకమైనదిగా చూస్తున్నారు. కానీ వ్యవసాయాన్ని పునర్నిర్మించడానికి అవసరమైన ఆర్థిక విధానాలను పునరుజ్జీవింపజేయవలసిన అవసరాన్ని ఇది సూచిస్తుంది. మారుతున్న క్షేత్ర వాస్తవికతను గుర్తించాల్సిన సమయం ఇది.

ప్రభుత్వం తగిన వనరులను కల్పించడానికి సిద్ధంగా ఉంటే, వ్యవసాయంపై ఆధారపడటం దాని సొంత ఆచరణీయ మార్గాలను సృష్టిస్తుంది. వ్యవసాయం కోసం కేటాయించే బడ్జెట్ వ్యయంలో ఏదైనా పెరుగుదలను ప్రతిపాదిస్తే, అది ఆర్థిక లోటుకు అదనపు మొత్తంగా పరిగణించడాన్ని ఆర్థికవేత్తలు ఇకనైనా మానేయాలి. 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్' (ఓఈసీడీ) ప్రకారం, వ్యవసాయంలో నిమగ్నమై ఉన్న 54 ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం మాత్రమే రైతుల నష్టాలను బడ్జెట్ కేటాయింపుల ద్వారా భర్తీ చేయడం లేదు. నేను తరచుగా చెప్పినట్లు, రైతులు దాదాపు 25 సంవత్సరాలుగా ఏటా పంట నష్టపోతున్నారు. రైతులకు 'దేవుడే దిక్కు' అయ్యే ఈ లోపభూయిష్ఠ ఆర్థిక రూపకల్పన ఇకనైనా అంతం కావాలి.

ఒక విధంగా తిరుగు వలసలను శుభవార్తగా చూడాలి. వనరులను అత్యంత అవసరమైన చోట ఉంచడానికి ఇది సరైన సమయం. అది చివరకు 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్'కు దారి తీస్తుంది.

వ్యాసకర్త ఆహార, వ్యవసాయ రంగ నిపుణులు
ఈ–మెయిల్: hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సంపూర్ణ సంగీతకారుడు



జాకిర్ (హుస్సేన్) భాయితో 1974 నుంచి నా కచేరీలు కొన్ని జరిగాయి. ప్రపంచం చూసిన అత్యంత గొప్ప తబలా వాద్యకారుల్లో ఆయనొకరు. ఇంకో గొప్ప గుణం ఏమిటంటే, ఆయన సాటి సంగీతకారులకు ఎల్లవేళలా సాయంగా ఉండేవారు.

– 'ఉస్తాద్' అమ్జద్ అలీ ఖాన్, సరోద్ విద్వాంసుడు

అస్థిరత ఇంకానా?



రాజ్యాంగ బద్ధత లేకపోయినప్పటికీ, బంగ్లాదేశ్ సైన్యం ఏర్పాటు చేసిన యూనస్ నేతృత్వంలోని ప్రభుత్వం ఇంకా అధికారంలో ఉండాలనుకుంటోంది. మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నప్పటికీ జాతీయ ఎన్నికలు 2025 చివరకు లేదా 2026 తొలి సగం వరకు జరగవని యూనస్ చెబుతున్నారు. ఇది రాజకీయ అస్థిరతను పొడిగించడమే కాక, బంగ్లా ఆర్థికంగా పుంజుకోవడానికి అడ్డంకి అవుతుంది.

– బ్రహ్మ చెల్లానీ, స్ట్రాటెజిక్ థింకర్

భారతీయులకు తెలుసు!



తీవ్రవాద ప్రతిచర్యల గురించి నేను మాట్లాడటానికి ఎక్కువగా ఇష్టపడేది భారతీయులతో! అతివాదం మీద వారికి అవగాహన ఉంది. దాన్ని ఎదుర్కోవడానికి ఏం చేయాలో తెలుసు. అదే సమయంలో అవి సైద్ధాంతికంగా ఉండవు; ఆచరణాత్మకంగా, సాక్ష్యాధారాలతో ఉంటాయి.

– మ్యాక్స్ అబ్రహామ్స్, అంతర్జాతీయ భద్రతాంశాల ప్రొఫెసర్

తప్పిపోయిందా?



ఇజ్రాయెల్ దేశాన్ని 1903లో ఆఫ్రికా, కెన్యాలో ఏర్పాటు చేసేందుకు బ్రిటన్ ఆలోచించింది. ఒకవేళ అదే జరిగివుంటే, ఇప్పుడు పాలస్తీనాలో జరుగుతున్నది ఆఫ్రికాలో జరిగేది.

– అడేమోలా, పాన్ ఆఫ్రికనిస్ట్

పేరొద్దనే పేరు?



యూఎస్‌ఏ డబ్బు కోసం పేరొందింది. రష్యా అధికారం కోసం పేరొందింది. చైనా టెక్నాలజీ కోసం పేరొందింది. మరి ఇండియాకు ఏ విషయంలో పేరుంది?

– నీతూ ఖండేల్వాల్, ఇన్వెస్టర్

గీత కార్మికులకు ఏం చేశారు?

తెలంగాణ రాష్ట్రంలో కల్లు గీత వృత్తిపై ఆధారపడి సుమారు 5 లక్షల కుటుంబాలు జీవిస్తున్నాయి. ఏ వృత్తిలో లేని ప్రమాదాలు కల్లుగీత వృత్తిలో జరుగుతున్నాయి. ఈ పదేళ్ళ కాలంలో 5,400 మంది ప్రమాదానికి గురయ్యారు. వీరిలో 775 మంది చనిపోయారంటే కల్లుగీత ఎంత ప్రమాదాలతో కూడినదో అర్థం చేసుకోవచ్చు. వీటిని పాలకులు అర్థం చేసుకొని నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

బెల్ట్ షాపులు పెట్టి మద్యం అమ్మితే బెల్ట్ తీస్తామని సీఎం రేవంత్ రెడ్డి అనేక సభలలో అన్నారు. ఎన్నికల ప్రణాళికలో బెల్ట్ షాపులు పూర్తిగా లేకుండా చేస్తామన్నారు. కానీ ఆచరణలో అమలు చేయడం లేదు. ఆదాయం పెంచుకోవడం కోసం ఎక్సైజ్ శాఖ అధికారులకు టార్గెట్‌లు పెట్టి లిక్కర్ అమ్మకాలు పెంచుతున్నారు. కల్లుగీతలో ప్రమాదాలను నివారించడానికి 'కాటమయ్య రక్షణ కవచం' పేరుతో సేఫ్టీ కిట్‌ను జూలై 14వ తేదీన అబ్దుల్లాపూర్ మెట్ లోని లష్కర్ గూడాలో గీత కార్మికుల సభలో ముఖ్యమంత్రి విడుదల చేశారు. ఇప్పటివరకు ఈ ఐదు నెలల కాలంలో పదివేల మందికి ఎలా వాడాలో ట్రైనింగ్ ఇప్పించి ఈ రక్షణ కవచం పంపిణీ చేశారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే సభ్యత్వం కలిగిన వాళ్లు 2 లక్షల 50 వేల మంది ఉన్నారు. సభ్యత్వం లేకుండా వృత్తి చేసే వాళ్ళు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. కొన్ని గ్రామాల వారికి ఇంకా రాలేదు. వచ్చినా గ్రామాలలో రెండు మూడు మాత్రమే ఇచ్చారు. మిగతా వాళ్లంతా ఎప్పుడు ఇస్తారా అని ఎదురుచూస్తున్నారు. ఈ ఐదు నెలల కాలంలోనే 16 మంది గీత కార్మికులు ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి పడి చనిపోయారు. రక్షణ కవచం ఇచ్చి ఉంటే బతికేవారు కదా అని ఆ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కల్లుగీత సమయంలో ప్రమాదాలు జరిగిన వారికి టాడి కార్పొరేషన్ నుండి ఇస్తున్న తక్షణ సహాయం దహన సంస్కారాల కొరకు రూ. 25,000లు, దెబ్బలు తగిలిన వారికి రూ. 10,000 బడ్జెట్ లేదనే పేరుతో నిలిపివేశారు. దీనిని కొనసాగించాలి. సొసైటీల పరిధిలో ఉన్న భూములకు ప్రభుత్వమే రక్షణ కోసం కంచెలు నిర్మించాలి. ప్రతి సొసైటీకి 5 ఎకరాలు భూమి ఇవ్వాలనే జీఓ నం. 560ని అమలు చేయాలి. హైబ్రీడ్ తాటి, జీలుగ, ఖర్జూర, ఈత చెట్లను అభివద్ధి చేసి సొసైటీలకు పంపిణీ చేస్తే భవిష్యత్‌లో యువతను ఆకర్షించేందుకు, మరణాలకు తగ్గించేందుకు వీలు కలుగుతుంది. తాటి, ఈత చెట్లు నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా కొత్త చట్టం తీసుకురావాలి.

– ఎమ్.వి. రమణ
తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు

మళ్లీ తెరపైకి రెండో రాజధాని?

అభిప్రాయం



పగిడి రంగారావు

పార్లమెంట్ సమావేశాలు దేశ రాజధాని ఢిల్లీ వెలుపల, ప్రత్యేకించి దక్షిణాది రాష్ట్రాల్లోని ఏదైనా రాష్ట్రంలో నిర్వహించాలని ఇటీవల డిమాండు వస్తోంది. ఇది దేశానికి రెండో రాజధాని అవసరమనే వాదనకు దారి తీయవచ్చనేది ఒక అభిప్రాయం. రాజధాని ఢిల్లీలో తీవ్రమైన వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో దక్షిణాదిలోనూ పార్లమెంట్ సమావేశాలు నిర్వహించాలని ఇటీవల వైసీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. ఈమేరకు ప్రధాని నరేంద్ర మోదీ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజూలకు ఆయన లేఖ రాశారు. ఢిల్లీలోని వాతావరణం వల్ల ఎంపీల పనితీరుపై ప్రతికూల ప్రభావం పడుతోందనీ, దక్షిణాదిన పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం వల్ల ఈ ఇబ్బంది తొలగడంతో పాటు, జాతీయ సమగ్రత వెల్లివిరుస్తుందనీ ఆయన చెబుతున్నారు.

దేశానికి మరో రాజధాని కావాలని ప్రత్యేకించి ఎవరూ ప్రస్తుతానికి డిమాండ్ చేయనప్పటికీ ఆ ప్రతిపాదన మాత్రం పాతదే. రాజధానిలోని పార్లమెంట్‌లో కాకుండా, బయట రాష్ట్రాల్లో సమావేశాలను నిర్వహిస్తే సాంకేతికంగా రెండో రాజధానిని అంగీకరించినట్లేనని కొందరు మేధావులు చెబుతున్నారు. అయితే ఈ అంశాన్ని మరికొందరు విభేదిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో, కొన్ని ప్రయోజనాల కోసం రాజధాని నగరాన్ని వినియోగిస్తార ని, ఒకటి లేదా అంత కంటే ఎక్కువ ఇతర రాష్ట్రాలు లేదా ప్రాంతాలను... వేర్వేరు ప్రయోజనాల కోసం వినియోగిస్తారనేది కొందరు మేధావుల అభిప్రాయం. ఈ విధంగా ప్రాధాన్యతనిచ్చే ఇతర నగరం మరో అధికారిక రాజధానిగా పరిగణించబడదని వారు చెబుతున్నారు.

చట్టబద్ధంగా నిర్వచించిన ఒక రాజధాని ఉన్న సందర్భంలో... రాజధాని అవసరాలు తీర్చేందుకు ప్రత్యేకంగా మరో రాష్ట్రంలోని నగరాన్ని రాజధానిగా పేర్కొని ఉపయోగించుకుంటే మాత్రం తప్పేమిటని మరికొందరు వాదిస్తున్నారు. ఒకటికన్నా ఎక్కువ రాజధానులను కలిగి ఉన్న దేశాలు ప్రపంచంలో పదమూడు ఉన్నాయి. మూడు రాజధానీ నగరాలను కలిగి ఉన్న ఏకైక దేశంగా దక్షిణాఫ్రికా నిలిచింది. 'ప్రిటోరియా' పరిపాలన, కార్యనిర్వాహక రాజధానిగా;' కేప్ టౌన్' శాసన రాజధానిగా, 'బ్లూమ్ ఫోంటైన్' న్యాయ రాజధానిగా ఉన్నాయి.

1950వ దశకం నుంచే దక్షిణ భారతదేశంలో పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలి అన్న డిమాండ్ మొదలైందని ఎంపీ గురుమూర్తి చెబుతున్నారు. ఈ అంశంపై 1968లో స్వతంత్ర ఎంపీ ప్రకాశ్ వీర్ శాస్త్రి ప్రైవేట్ మెంబర్



బిల్లు కూడా పెట్టారనీ, నాడు 18 మంది ఎంపీలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేశారనీ ఆయన గుర్తు చేస్తున్నారు. అప్పటి కేరళ, మైసూరు ప్రభుత్వాలు పార్లమెంటు సమావేశాలకు మౌలిక వసతులు కల్పిస్తామని ముందుకు వచ్చాయనీ, అయితే అప్పట్లో సాధ్యాసాధ్యాలు పరిశీ లించిన అనంతరం ఈ ప్రతిపాదనను ప్రభుత్వం తిరస్కరించిందన్నారు. అప్పటితో పోల్చితే వీడియో కాన్ఫరెన్స్, ఇంట ర్నెట్ వంటి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఇప్పుడు ఎంతో అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలు ఢిల్లీ వెలుపల నిర్వహించడం సాధ్యమైన విషయమేనని మేధావులు, పార్లమెంటేరియన్లు అంటున్నారు.

ప్రస్తుతం పార్లమెంట్ ఉభయ సభలు ఏడాదికి మూడు సార్లు సమావేశమవుతున్నాయి. జనవరి నెలాఖరున ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలు మధ్యలో కొన్నాళ్ల విరామంతో రెండు విడతలుగా సాగుతాయి. జూలై–ఆగస్ట్ నెలల్లో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు, నవంబర్ – డిసెంబర్ మాసాల్లో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతాయ నేది అందరికీ తెలిసిన విషయమే. ఈ మూడు సెషన్లలో కనీసం ఒకటైనా దక్షిణ భారతదేశంలో నిర్వహించాలని దక్షిణాదికి చెందిన వివిధ పార్టీల ఎంపీలు అభిప్రాయ పడుతున్నారు. వారిలో కొందరైతే రెండు సమావేశాలను దక్షిణాదిన నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

దేశంలో జమ్మూ కాశ్మీర్‌కు రెండు రాజధానులు ఉన్నాయి. శ్రీనగర్ వేసవి రాజధాని, జమ్మూ శీతాకాల రాజధాని. రాష్ట్రానికే పరిపాలనా సౌలభ్యం కోసం, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రెండు రాజధానులు ఉన్న నేపథ్యంలో... దేశానికి ఉండడం అభ్యంతరం చెప్పాల్సిన విషయం కాదని కొందరంటున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూ–కశ్మీర్ వంటి పలు రాష్ట్రాల్లో/ కేంద్ర పాలిత ప్రాంతాల్లో రెండు నగరాల్లో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో... దక్షిణ భారతదేశంలో పార్లమెంట్ సమావేశాల్లో ఒకటీ రెండు సెషన్లను నిర్వహించాలన్న డిమాండ్ సహేతుకంగానే ఉందని చెప్పవచ్చు. దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ దేశ రెండో రాజధాని రేసులో ఉన్నాయి.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకుడు
మొబైల్: 94401 38573

భక్త పరాధీనత



ధర్మరాజు ఒకనాడు తెల్లవారు జామున శ్రీకృష్ణుని మందిరానికి వెళ్ళాడు. ఉదయ సూర్యునిలా ప్రకాశిస్తున్న కృష్ణునికి నమస్కరించి 'నీ దయ వల్లనే ముల్లో కాలు గౌరవించే కీర్తి పొందాను. మాకు నీవే అండ ఎప్పుడూ' అన్నాడు. కృష్ణుడు ఏమీ మాట్లాడలేదు. ధ్యానంలో ఉన్నాడు. నిత్య చైతన్య మూర్తి, మహనీయుడు అయిన కృష్ణుడు సమస్తాన్నీ స్తంభింపజేసి ధ్యాన స్థితిలో ఉండటం ధర్మరాజును ఆశ్చర్యపరచింది. ఇందుకు ప్రత్యేక కారణం ఉందనిపించింది. గాలి లేనందువలన కదలకుండా నిశ్చలంగా ఉన్న దీపంలా ప్రకా శిస్తున్న కృష్ణుని ధర్మజుడు, 'లోకమంతా ప్రశాంతంగా ఉంది. ఏ అలజడి, అశాంతి లేదు. మరి ఈ ధ్యానం ఎందుకు?' నీ ధ్యాన స్థితికి కారణం నాకు చెప్పవా?' అనడిగాడు.

జ్యోతిర్మయం

అప్పుడు కృష్ణుడు తన మనో బుద్ధి, ఇంద్రియాలను సహజ స్థితికి తెచ్చి, ధ్యానాన్ని విరమించి కారణాన్ని ధర్మరాజుకు ఇలా చెప్పాడు:

'భారత యుద్ధం ముగిసింది. భీష్ముడు శర తల్పగతుడై ఉత్తరాయణ పుణ్య కాలం కోసం ఎదురుచూస్తున్నాడు. ఆ కాలం సమీపిస్తోంది. భీష్ముడు జ్ఞాన కర్మేంద్రియాలను మనసులో నిగ్రహించి సమాధి నిష్ఠలో ఉండి నన్ను స్మరించాడు. అందుకే భక్త పరాధీనుడనైన నేను ఆ భీష్ముని మనసునందు చేరి ఉన్నాను'.

ఇక్కడ భక్తి తత్త్వం భీష్మునిలో, భక్త పరాధీనత కృష్ణునిలో కనిపిస్తాయి. నాడు భీష్ముని భక్తికే కాదు... నేడైనా పరమాత్మ నిర్మలమైన భక్తికే వశుడవుతాడు. ధ్యానంలో మనసు పరి పరి విధాల పక్క దారులకు పోతూ ఉంటుంది. ధ్యాన ఫలం, పూజా ఫలం వంటివి సిద్ధించడం లేదని భక్తులు బాధ పడటం సహజమే అయినా... అది భక్తిలో లోపమే. నిష్ఠతో, నిశ్చల భక్తితో ధ్యానిస్తే దేవుడు భక్త పరాధీనుడే.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.విదియ ప.12.21 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** పునర్వసు రా.3.01 వరకు, తదుపరి పుష్యమి, **వర్జ్యం:** ప.3.02 నుండి 4.36 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.37 నుండి 9.21 వరకు తదుపరి రా.10.36 నుండి 11.30 వరకు, **అమృతఘడియలు:** రా.12.35 నుండి 2.11 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.27, **సూర్యాస్తమయం:** 5.25.

క్లుప్తంగా...

నదుల అనుసంధానంపై సీఎంలతో సమావేశం 19న

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరితో పాటు దేశంలోని ఇతర నదుల అనుసంధానంపై 9 రాష్ట్రాల సీఎంలతో నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్డీఎస్ఏ) ఈ నెల 19న మధ్యాహ్నం 3 గంటలకు వార్షిక సాధారణ సమావేశం నిర్వహించనుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి అధ్యక్షతన హైబ్రిడ్ విధానంలో జరగనున్న ఈ సమావేశానికి.. తెలంగాణ, ఏపీతో సహా ఇతర రాష్ట్రాల సీఎంలను ఎన్డీఎస్ఏ ఆహ్వానించింది. ఈ సమావేశంతో పాటే నదుల అనుసంధానంపై ఏర్పాటు చేసిన స్పెషల్ కమిటీ సమావేశాన్ని సమాంతరంగా నిర్వహిస్తున్నామని ఎన్డీఎస్ఏ తెలిపింది. గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టు విషయంలో ఇప్పటివరకు సాధించిన పురోగతిపై రాష్ట్రాలను ఒప్పించడానికి ఎన్డీఎస్ఏ ఈ సమావేశాలను ఏర్పాటు చేసింది. హైబ్రిడ్ విధానంలో జరగనున్న ఈ సమావేశానికి ఇరు రాష్ట్రాల సీఎంలు, నీటిపారుదల శాఖల మంత్రులు పాల్గొనే అవకాశం ఉంది.

తెలంగాణ సాయుధ యోధుడు దర్గ్యానాయక్ కన్నుమూత



దేవరుప్పుల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలక పాత్ర పోషించిన జాటోతు దర్గ్యానాయక్ (107) సోమవారం రాత్రి కన్నుమూశారు. ఈయన స్వస్థలం జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధర్మాపురం (పడమటితండా). జనగామ, పాలకుర్తి ప్రాంతాల్లో గిరిజనులపై జరిగిన ఆకృత్యాలను ఎదురించే క్రమంలో కడవెండి నల్లా నర్సింహులు వెంట ఉండి విస్నూర్ దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాడారు. నర్సింహులుతోపాటు జైలు జీవితం కూడా గడిపాడు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వస్తారని పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి తెలిపారు. దర్గ్యానాయక్ మృతిపై వామపక్ష పార్టీల ప్రతినిధులు తిరుపతిరెడ్డి, సింగారపు రమేశ్, ఎల్లయ్య, వెంకట్‌రెడ్డి సంతాపం తెలిపారు.

కుక్కల దాడిలో చిన్నారులు, మహిళకు గాయాలు



గాయపడిన వర్షిత్

చిట్యాల/కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం పాసి గడ్డతండా, ఒడితల, దంతాలపల్లి గ్రామాల్లో పిచ్చి కుక్కలు స్వైరవిహారం చేశాయి. సోమవారం ఇద్దరు చిన్నారులను, ఓ మహిళను గాయపరిచాయి. పాసి గడ్డ తండాకు చెందిన జరుపుల వర్షిత్ (8) ఇంటి వద్ద ఆడుకుంటుండగా పిచ్చికుక్క కరిచింది. అదే కుక్క ఒడితల గ్రామంలో కందుకూరి రాహుల్ (9) ఆడుకుంటుండగా కరిచింది. గాయపడిన బాలురను 108లో జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఇదే జిల్లా కాటారం మండలం దంతాలపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం ఆయా దుర్గమ్మపై సోమవారం కుక్కలు దాడి చేశాయి. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి.

'గురుకులం'లో బాలికలను కరిచిన ఎలుకలు



ఆస్పత్రిలో చికిత్సకోసం వచ్చిన బాలికలు

కీసర: మేడ్చల్ జిల్లా కీసరలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల (సనత్‌నగర్, కూకట్‌పల్లి) గురుకుల పాఠశాల విద్యార్థినులను ఎలుకలు కరవడం చర్చనీయాంశమైంది. ఆదివారం రాత్రి హాస్టల్‌లో బాలికలు నిద్రిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. ఐదుగురు విద్యార్థినులను ఎలుకలు కరవడంతో అధికారులు గుట్టుచప్పుడు కాకుండా కీసరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వారికి వైద్యం చేయించారు. కాగా, ఈ అంశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు 'ఎక్స్'లో స్పందించారు. బాలికలు ఆసుపత్రి పాలుకావడం దారుణమన్నారు. గురుకులాల్లో పిల్లల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని, పాములు, ఎలుకల కాట్లనుంచి రక్షణ కల్పించాలని సూచించారు.



చుక్‌చుక్‌మంటూ చుట్టేస్తోంది..

ఓ వైపు పచ్చనిపంట పొలాలు..
మరోవైపు దట్టమైన అటవీ ప్రాంతం..
ఆ అందాలను తాకుతూ చుక్‌చుక్ మంటూ సాగిపోతున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు.. తలమడుగు మండలంలోని గిరి పల్లెల ప్రకృతి అందాల నడుమ నిత్యం కనువిందు చేసే మనోహర దృశ్యమిది.

– చింతల అరుణ్ రెడ్డి,
సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

● తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల 2025 మార్చి నెల కోటాను డిసెంబరు 18 ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

ఆంధ్రా రియల్ ఎస్టేట్.. టీడీపీ విజన్ డాక్యుమెంట్

గ్రూప్-2లో తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని ప్రశ్నలు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి సంబంధించిన అర్హత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. అయితే, పేపర్–4 పరీక్షలో కొన్ని ప్రశ్నలు తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేవని, కేవలం సమాచారం కోణంలో మాత్రమే ఉన్నాయని కొందరు అభ్యర్థులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రా రియల్ ఎస్టేట్ కంపెనీలు, ఆంధ్రా నిర్మాణ రంగ సంస్థలు, 1983 ఎన్నికల సమయంలో ఎన్టీఆర్ చేసిన వాఖ్యలు, తెలుగుదేశం పార్టీ ఎన్నికల నినాదం, విజన్–2020 డాక్యుమెంట్ రూపొందించిన అంతర్జాతీయ సంస్థ, చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో తీసుకున్న నిర్ణయాలు తదితర ప్రశ్నలు రావడం పట్ల అభ్యర్థులు కొంత గందరగోళానికి గురయ్యారు.

● తెలంగాణ ఉద్యమ నేపథ్యానికి సంబంధించిన ప్రశ్నల్లో వాస్తవాధారిత ప్రశ్నలు వచ్చాయని మరికొందరు అభ్యర్థులు చెప్పుకొచ్చారు. తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించిన ప్రశ్న వచ్చిన సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆవిష్కరించిన కొత్త విగ్రహానికి సంబంధించినది కాకుండా పాత రూపురేఖల గురించి ఇవ్వడంతో అభ్యర్థులు కొంత ఇబ్బంది పడ్డారు.



నల్లగొండలోని ఓ కేంద్రంలో రెండో అంతస్తులో ఉన్న పరీక్ష హాల్‌కు మెట్లపై నుంచి వెళుతున్న దివ్యాంగురాలు

● తెలంగాణ పోరాటయోధుడు వెలిచాల జగపతిరావుకు సంబంధించి రెండు ప్రశ్నలు వచ్చాయి. తెలంగాణ కోసం త్యాగం చేసిన మరికొందరికి సంబంధించిన ప్రశ్నలు కూడా వచ్చాయి. మొత్తంగా పేపర్–4 ప్రశ్నపత్రంలో కొన్ని ప్రశ్నలు మినహాయిస్తే మధ్యస్తంగానే ఉందని అభ్యర్థులు చెబుతున్నారు.

పేపర్–3 లో ప్రశ్నలు కష్టతరంగా...: ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన ప్రశ్నల్లో చాలావరకు కష్టతరంగానే ఉన్నట్టు పరీక్ష రాసిన అభ్యర్థులు చెప్పారు. ప్రశ్నలు చాలా లోతుగా ఉండడంతో వాటికి సమాధానాలు ఎంచుకునేందుకు ఎక్కువ సమయం పట్టిందని, దీంతో చివరి వరకు సమయం చాలక ఆందోళనకు గురైనట్టు వారు అభిప్రాయపడ్డారు. అయితే ప్రశ్నల్లో నాణ్యత పెరిగిందని సబ్జెక్ట్ నిపుణులు చెబుతున్నారు.

రెండ్రోజులపాటు నాలుగు సెషన్లలో జరిగిన ఈ పరీక్షలకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా 1,368 కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. 5,51,855 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా తొలిరోజు(ఆదివారం) జరిగిన రెండు పరీక్షలకు కేవలం 2,55,490(46.30%) మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పేపర్–3 (ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్), మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–4 (తెలంగాణ మూవ్‌మెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్) పరీక్షలు జరిగాయి. ఉదయం జరిగిన పేపర్–3 పరీక్షకు 2,51,738 (45.62%) మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పేపర్–4 పరీక్షకు 2,51,486(45.57%) మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ గణాంకాలు ప్రాథమికంగా మాత్రమే నని, ఓఎంఆర్ షీట్లు పూర్తిస్థాయిలో అందిన తర్వాత హాజరుశాతంపై స్పష్టత వస్తుందని టీజీపీఎస్సీ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ తెలిపారు.

పురిటి నొప్పులు భరిస్తూ.. పరీక్ష రాసి..

● ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో గర్భిణి
● అంబులెన్సు తెచ్చినా వెళ్లేందుకు తిరస్కృతి
● పరీక్ష అనంతరం ఆస్పత్రికి గర్భిణి తరలింపు

నాగర్‌కర్నూల్ క్రైం: ఉద్యోగం సాధించాలన్న తపనతో ఓ నిండు గర్భిణి గ్రూప్–2 పరీక్షకు హాజరైంది. పరీక్ష రాస్తుండగానే పురిటినొప్పులు వచ్చినా ఆమె చలించలేదు.. పట్టుబట్టి పరీక్ష రాసిన తర్వాతే కాన్పు కోసం ఆస్పత్రికి వెళ్లింది. నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. జిల్లాకేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి బల్మూరు మండలం బాణాల గ్రామానికి చెందిన రేవతి (25) నిండు గర్భిణి. అయితే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో చాలా కష్టపడి చదివి గ్రూప్–2 పరీక్షల కోసం వేచి చూసింది. ఈ మేరకు సోమవారం పరీక్ష రాస్తుండగా అకస్మాత్తుగా పురిటి నొప్పులు వచ్చాయి. విషయం తెలుసుకున్న అధికారులు కలెక్టర్ బదావత్ సంతోశ్‌కు సమాచారం అందించగా.. ప్రత్యేక అంబులెన్స్ ఏర్పాటు చేశారు. అయితే అందుకు నిరాకరించిన గర్భిణి.. పరీక్ష పూర్తయిన తర్వాతే కాన్పు కోసం వెళ్తానని పట్టుబట్టింది. తీవ్రమైన పురిటి నొప్పులను భరిస్తూనే పరీక్ష రాసిన అనంతరం ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



గర్భిణిని అంబులెన్స్‌లో జనరల్ ఆస్పత్రికి తరలిస్తున్న వైద్య సిబ్బంది

తాడ్వాయి అడవుల్లో పెద్దపులి సంచారం



నర్సాపూర్ వాగులో గుర్తించిన పులి పాదముద్రలు

ఎస్ఎస్ తాడ్వాయి: పెద్దపులి తాడ్వాయి అడవుల్లో సంచరిస్తున్నట్టు అటవీ అధికారులు గుర్తించారు. సోమవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలంలోని నర్సాపూర్ వట్టివాగు సమీపంలో రైతులు పెద్దపులి అడుగులను చూసి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. కోట సత్తయ్య సిబ్బందితో కలిసి నర్సాపూర్ వాగు బ్రిడ్జి వద్ద పెద్దపులి పాదముద్రలను గుర్తించారు. నర్సాపూర్ నుంచి బ్రిడ్జి కింద నుంచి కేశవపాడు మీదుగా చౌలెడు అటవీ ప్రాంతానికి వెళ్లినట్టు అధికారులు భావిస్తున్నారు. ఇటీవల మంగపేట మండలంలో నుంచి తాడ్వాయి మండలంలోని పంబపూర్ అటవీ ప్రాంతంలోకి పులి ప్రవేశించినట్టు గుర్తించిన అటవీశాఖ అధికారులు అప్పటి నుంచి దారి జాడ కోసం వెతుకుతున్నారు. ఈనెల 14 న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని రఘునాథపాలెం, ఆళ్లపల్లి అటవీ ప్రాంతాల్లోకి పులి ప్రవేశించినట్టు అధికారులు పాదముద్రలను గుర్తించిన విషయం తెలిసిందే. తాజాగా తాడ్వాయి అడవుల్లోకి మళ్లీ పులి రావడంతో ఈ రెండు జిల్లాల పరిధిలోనే సంచరిస్తున్నట్టు అధికారులు భావిస్తున్నారు.

ఇంటర్ పరీక్షల టైంటేబుల్..

తేదీ	ప్రథమ సంవత్సరం	తేదీ	ద్వితీయ సంవత్సరం
5.3.25	ద్వితీయ భాష పేపర్–1	6.3.25	ద్వితీయ భాష పేపర్–2
7.3.25	ఇంగ్లిష్ పేపర్–1	10.3.25	ఇంగ్లిష్ పేపర్–2
11.3.25	మ్యాథ్స్ పేపర్–1ఎ బాటనీ పేపర్–1 పొలిటికల్ సైన్స్–1	12.3.25	మ్యాథ్స్ పేపర్–2ఎ బాటనీ పేపర్–2 పొలిటికల్ సైన్స్–2
13.3.25	మ్యాథ్స్ పేపర్ 1–బి జువాలజీ పేపర్–1 హిస్టరీ పేపర్–1	15.3.25	మ్యాథ్స్ పేపర్–2 బి జువాలజీ పేపర్–2 హిస్టరీ పేపర్–2
17.3.25	ఫిజిక్స్ పేపర్–1 ఎకనామిక్స్ పేపర్–1	18.3.25	ఫిజిక్స్ పేపర్–2 ఎకనామిక్స్ పేపర్–2
19.3.25	కెమిస్ట్రీ పేపర్–1 కామర్స్ పేపర్–1	20.3.25	కెమిస్ట్రీ పేపర్–2 కామర్స్ పేపర్–2
21.3.25	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ –1 బ్రిడ్జ్ కోర్సు మ్యాథ్స్–1 (బైపీసీ విద్యార్థులకు)	22.3.25	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్–2 బ్రిడ్జికోర్సు మ్యాథ్స్–2 (బైపీసీ విద్యార్థులకు)
24.3.25	మోడ్రన్ లాంగ్వేజ్ –1 జాగ్రఫీ పేపర్–1	25.3.25	మోడ్రన్ లాంగ్వేజ్–2 జాగ్రఫీ పేపర్–2

త్వరలో నాన్ ప్రొఫెషనల్ కాలేజీ బకాయిల చెల్లింపు

సాక్షి, హైదరాబాద్: త్వరలో నాన్ ప్రొఫెషనల్ కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు ప్రక్రియను.. అసెంబ్లీ సమావేశాల తర్వాత మొదలు పెడతామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సచివాలయంలో సోమవారం డిప్యూటీ సీఎం భట్టితో.. నాన్ ప్రొఫెషనల్ కళాశాలల యూనియన్ ప్రతిని ధుల భేటీ సందర్భంగా ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల అంశం చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తీసుకొచ్చిన ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమోషనల్ బాండింగ్ ఉందని స్పష్టం చేశారు. అందుకే ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని.. అధికారంలోకి రాగానే ఆలోచన చేశామన్నారు. భేటీలో కాలేజీ యూనియన్ నాయకులు గౌరీ సతీశ్, సూర్యనారాయణ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, జనార్దన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, కేఆర్‌కే రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, రామ్ దాస్ పాల్గొన్నారు.



భట్టిని కలసిన కళాశాలల ప్రతినిధులు

అమ్మానాన్నకు అబద్ధం చెప్పానంటూ..

● బీటెక్ విద్యార్థి బలవన్మరణం



రాజాపూర్: తల్లిదండ్రులకు అబద్ధం చెప్పానని.. మనస్తాపానికి గురైన ఒక బీటెక్ విద్యార్థి ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రానికి చెందిన మీసేవా కేంద్రం నిర్వాహకుడు సున్నపు రాధాకృష్ణ కుమారుడు సుభాశ్(22) హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. కాగా, సుభాశ్ బీటెక్‌లో కొన్ని సబ్జెక్టులు ఫెయిలైన విషయాన్ని దాచి.. పాస్ అయినట్టు తల్లిదండ్రులకు అబద్ధం చెప్పాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే ఏమంటారోనని లోలోపలే మదనపడ్డాడు. ఈ క్రమంలోనే సోమవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న సుభాశ్.. ఉరి వేసుకుని మృతి చెందాడు. కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు.

ఆ లేఖల్లో ఏముంది?

నెహ్రూ లేఖలపై రాజకీయ రగడ

- పీఎం మ్యూజియం నుంచి సోనియా చెంతకు
- 2008లో యూపీఏ హయాంలో ఉదంతం
- తిరిగివ్వాలని కోరిన మ్యూజియం వర్గాలు
- వాటిలో ఎడ్వినా-నెహ్రూ రాసుకున్న లేఖలు
- మరోసారి తెరపైకి వారిద్దరి సాన్నిహిత్యం
- వ్యక్తిగత ఆస్తి కాదు, తిరిగివ్వాల్సిందే: బీజేపీ

దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ లేఖలు మరోసారి వార్తల్లోకెక్కాయి. స్వాతంత్ర్య పోరాట సమయంలో పుంఖానుపుంఖాలుగా ఆయన రాసిన లేఖలు అనంతర కాలంలో ఎంతగానో ప్రసిద్ధికెక్కాయి. బ్రిటిషర్ల చెరలో జైలు జీవితం అనుభవిస్తూ కూతురు ఇందిరకు రాసిన లేఖలైతే సంకలనాలుగా వెలువడి ఎంతో ఆదరణ కూడా పొందాయి. జయప్రకాశ్ నారాయణ్ వంటి రాజకీయ ఉద్దండులు మొదలుకుని భౌతికశాస్త్ర దిగ్గజం ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ దాకా ప్రముఖులెందరితోనో నెహ్రూ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు లోకప్రసిద్ధం. చక్కని రచనా శైలికే గాక అద్భుతమైన అభివ్యక్తికి వాటిని నిలువెత్తు నిదర్శనంగా చెబుతుంటారు. నెహ్రూ తదనంతరం ఆయన లేఖలన్నింటినీ ప్రధానమంత్రి మ్యూజియం, లైబ్రరీ (పీఎంఎంఎల్)లో భద్రపరిచారు. అయితే యూపీఏ హయాంలో 2008లో కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ వాటన్నింటినీ తన నివాసానికి తరలించిన వైనం ఇప్పుడు రాజకీయ రగడకు దారితీస్తోంది. నెహ్రూ లేఖలతో కూడిన ఏకంగా 51 పెట్టెలను తన సోనియా తరలించుకుని వెళ్లారని బీజేపీ ఆరోపిస్తోంది. వాటన్నింటినీ తిరిగివ్వాల్సిందిగా పీఎంఎంఎల్ తాజాగా సోనియాను కోరింది. కనీసం జిరాక్సులో, పీడీఎఫ్‌లో అయినా అందజేస్తే భద్రపరుస్తామంటూ విజ్ఞప్తి చేసింది. దాంతో, ''అసలు నెహ్రూ లేఖలను సోనియా పనిగట్టుకుని తీసుకెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది? అందుకెవరు అనుమతించారు? 16 ఏళ్లుగా తన వద్దే ఎందుకు ఉంచుకున్నారు? ఎందుకు తిరిగివ్వడం లేదు? అంతగా దాచాల్సిన అంశాలు ఆ లేఖల్లో ఏమున్నాయి?'' వంటి అనేకానేక ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. వీటికి సమాధానంగా అన్ని వేళ్లూ నెహ్రూ-ఎడ్వినా లేఖలవైపే చూపిస్తుండటం విశేషం. ఎడ్వినా నాటి వైస్రాయ్ లార్డ్ మౌంట్‌బాటెన్ భార్య. ఆమెకు, నెహ్రూకు మధ్య చాలా సాన్నిహిత్యం ఉండంటారు. ''నిజానికిది బహిరంగ రహస్యమే. అప్పట్లో రాజకీయ వర్గాల్లో నిత్యం అందరి నోళ్లలోనూ నానిన అంశం కూడా'' అని చరిత్రకారులు కూడా చెబుతారు. ''నెహ్రూ, ఎడ్వినా సాన్నిహిత్యానికి వారి నడుమ సాగిన లేఖలు అద్దం పట్టాయి. దాంతో అవి వెలుగు చూడకూడదని సోనియా భావించారు. అందుకే వాటితో పాటు అన్ని లేఖలనూ పీఎంఎంఎల్ నుంచి తరలించుకుపోయారు''



అని బీజేపీ ఆరోపిస్తోంది. 'గాంధీ-నెహ్రూ కుటుంబం' అంటూ ఇప్పటికే ప్రధాని నరేంద్ర మోదీ అవకాశం దొరికినప్పుడల్లా పదునైన విమర్శలు చేస్తున్న నేపథ్యంలో ఈ లేఖల రగడ ఎంత దూరం వెళ్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

సోనియా తరలించుకుపోయిన నెహ్రూ లేఖలన్నింటినీ తిరిగి ఇప్పించాలంటూ ఆమె కుమారుడు, విపక్ష నేత రాహుల్‌గాంధీకి పీఎంఎంఎల్ సభ్యుడు, చరిత్రకారుడు రిజ్వాన్ కాద్రీ డిసెంబర్ 10న లేఖ రాశారు. ''అవన్నీ ఎడ్వినా, ఐన్‌స్టీన్, జేపీ, పద్మజా నాయుడు, విజయలక్ష్మీ పండిట్, అరుణా అసఫ్ అలీ, బాబూ జగ్జీవన్‌రాం, జేబీ పంత్ తదితరులకు నెహ్రూ జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు. 1971లో ఇందిర వాటిని పీఎంఎంఎల్ (అప్పట్లో నెహ్రూ మ్యూజియం)కు అప్పగించారు. అవి పీఎంఎంఎల్‌లో ఉంటే స్కాలర్లకు, పరిశోధకులకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుంది'' అని పేర్కొన్నారు. దాంతో నెహ్రూతో ఎడ్వినా సాన్నిహిత్యం ఆయన మరణించిన 80 ఏళ్ల తర్వాత మరోసారి తెరపైకి వచ్చింది. మిగతా లేఖల సంగతి ఎలా ఉన్నా గత చరిత్ర, బీజేపీ ఆరోపణల పుణ్యమా అని నెహ్రూ-ఎడ్వినా లేఖలపైనే అందరికీ ఆసక్తి నెలకొంది. ''వాటిలో అంత గోప్యంగా ఉంచాల్సిన అంశాలేమున్నాయి? ఎందుకు వాటిని సోనియా తన ఇంట్లో దాచిపెట్టుకున్నారు? ఆమె బదులిచ్చి తీరాలి'' అంటూ బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ డిమాండ్ చేయడం విశేషం. పార్టీ మరో అధికార ప్రతినిధి సంబిత పాత్ర కూడా సోమవారం ఏకంగా లోక్‌సభలోనే ఈ అంశాన్ని ప్రస్తావించారు. దీనిపై సరైన చర్యలు తీసుకుంటామంటూ కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ బదులివ్వడం విశేషం. అనంతరం పాత్ర మీడియాతో కూడా దీనిపై మాట్లాడారు. ''నెహ్రూ లేఖలు గాంధీ కుటుంబపు వ్యక్తిగత ఆస్తి కాదు. దేశ సంపద. వాటిని బయట పెట్టడానికి గాంధీ కుటుంబం వెనకాడుతుండటం ఎన్నో సందేహాలకు తావిస్తోంది. సరిగ్గా పీఎంఎంఎల్‌లోని లేఖల డిజిటైజేషన్ ప్రక్రియ మొదలు పెట్టే ముందే నెహ్రూ లేఖలను సోనియా తీసుకెళ్లారు. వాళ్లేం దాస్తున్నారో తెలుసుకోవాలని దేశం భావిస్తోంది'' అన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

'గాఢమైన' బంధం

నెహ్రూ, ఎడ్వినా మధ్య నడిచిన లేఖలు ఇప్పుడు ఎవరికీ అందుబాటులో లేవు. అయితే ఎడ్వినా కూతురు పమేలా హిక్స్ తదితరులు వాటికి సంబంధించిన పలు విశేషాలను గతంలో పంచుకున్నారు. నెహ్రూ, ఎడ్వినా మధ్య 'అత్యంత గాఢమైన' బంధం కొనసాగిందని పమేలా తన పుస్తకంలో స్పష్టంగా పేర్కొనడం విశేషం! ''నా తల్లి, నెహ్రూ పరస్పరం ఎంతగానో ప్రేమించుకున్నారు. ఒకరంటే ఒకరికి చెప్పలేనంత గౌరవాభిమానాలుండేవి. దీన్ని నేను ఎన్నోసార్లు గమనించాను. మా అమ్మ తానెంతగానో తపించిన ఆదర్శ సాహచర్యాన్ని పండిట్‌జీ (నెహ్రూ) రూపంలో పొందింది. అయితే వారిద్దరి మధ్య శారీరక బంధానికి అంతగా అవకాశం లేకపోయింది. నిత్యం తమను చుట్టుముట్టి ఉండే సిబ్బంది తదితరుల వల్ల ఏకాంతం దొరకడం గగనంగా ఉండేది. ఎడ్విన్ భారత్ వీడేముందు నెహ్రూకు ఓ ఉంగరమివ్వాలని భావించారు. తీసుకుంటారో లేదోనని చివరికి ఆయన కుమార్తె ఇందిరకు ఇచ్చి వెళ్లారు'' అని పమేలా చెప్పుకొచ్చారు. నెహ్రూ తన వీడ్కోలు ప్రసంగంలోనూ ఎడ్వినాను ఆకాశానికెత్తిన వైనాన్నీ ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఆ ఒక్క కుటుంబం కోసం... రాజ్యాంగాన్నే మార్చారు!



కాంగ్రెస్ మహిళా వ్యతిరేకి: నిర్మల

- మహిళా బిల్లును పట్టించుకోలేదు
- వాక్ స్వాతంత్ర్యాన్ని హరించిన నెహ్రూ
- రాజ్యసభలో నిప్పులు చెరిగిన మంత్రి

న్యూఢిల్లీ: కేవలం ఒక కుటుంబపు స్వార్థ ప్రయోజనాల కోసం రాజ్యాంగాన్నే ఇష్టారాజ్యంగా సవరించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆరోపించారు. రాజ్యాంగ వజ్రోత్సవాలపై రాజ్యసభలో రెండు రోజుల చర్చను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా 80 నిమిషాల సుదీర్ఘ ప్రసంగంలో కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. తొలి ప్రధాని నెహ్రూ 1951లో మొదటి రాజ్యాంగ సవరణతో వాక్ స్వాతంత్ర్యాన్ని హరించారన్నారు. ''మిల్లు కార్మికుల సమావేశంలో నెహ్రూను విమర్శిస్తూ రాసిన కవితను చదివారని 1949లో కవి మజ్రూ సుల్తాన్‌పురిని, నటుడు బల్‌రాజ్ సాహ్నీని జైల్లో పెట్టారు. 'నెహ్రూ' పేరుతో 1975లో మైకేల్ ఎడ్వర్డ్స్ రాసిన పుస్తకాన్ని నిషేధించారు. ఇందిర, ఆమె కుమారుడి చర్యలను ప్రశ్నించేలా ఉందంటూ 'కిస్సా కుర్సీ కా' సినిమాను బ్యాన్ చేశారు. ఎమర్జెన్సీ వేళ ఏకంగా రాజ్యాంగ పీఠికనే మార్చేశారు. ఇందిర, రాజీవ్ గాంధీ పలుమార్లు రాజ్యాంగాన్ని ఇష్టానుసారం సవరించారు. తద్వారా ప్రజాస్వామ్యానికి పాతర వేస్తూ కుటుంబ పాలనకు బాటలు వేసుకున్నారు. పత్రికా స్వేచ్ఛను కొనియాడే నెహ్రూ తన ప్రభుత్వంపై విమర్శలను మాత్రం తట్టుకునే వారు కాదు. ఎన్నికైన ప్రభుత్వం కాకున్నా, వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ వంటివి లేకున్నా 1951లో నెహ్రూ తొలి రాజ్యాంగ సవరణ చేపట్టారు. రష్యా మాదిరిగా సోషలిస్ట్ విధానం తెచ్చారు. దాన్నే ఇందిర అనుసరించారు. ఆ మోడల్‌తో దేశానికి ఏ ప్రయోజనమూ కలగలేదు'' అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందన్నారు.

మహిళా రిజర్వేషన్లు తేలేదెందుకు?

కాంగ్రెస్ మహిళా వ్యతిరేకి అని నిర్మల దుయ్యబట్టారు. ''రాజీవ్ హయాంలో షా బానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును ముస్లిం మహిళల విడాకుల హక్కుల చట్టంతో తలకిందులు చేశారు. ముస్లిం మహిళలకు భరణం హక్కు లేకుండా చేశారు. రాజీవ్ హయాంలో కాంగ్రెస్‌కు పార్లమెంట్‌లో తిరుగులేని మెజారిటీ ఉన్నా మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించేందుకు చేతులు రాలేదు'' అన్నారు. ''స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆరెస్సెస్ పాత్రను ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ దేశ ఆర్థిక స్వాతంత్ర్యానికి చేసిందేమిటి?'' అంటూ నిలదీశారు. మన రాజ్యాంగం కాల పరీక్షను తట్టుకుని నిలబడిందన్నారు. ''దృఢతరమవుతున్న మన ప్రజాస్వామ్యాన్ని చూసి గర్వపడాలి. రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగిస్తూ సాగాలి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 50 దేశాలు స్వాతంత్ర్యం పొందాయి. వాటిలో మన రాజ్యాంగమే ప్రజావసరాలకు తగ్గట్లుగా మారుతూ నిలబడింది'' అన్నారు.

మోదీ క్షమాపణ చెప్పాలి

- ఆయన గతంలో, ఊహల్లో విహరిస్తున్నారు: ఖర్గే
- నెహ్రూ లేఖపై వాస్తవాలను ప్రధాని వక్రీకరించారు
- రాజ్యాంగంపై చర్చ సందర్భంగా ధ్వజం



న్యూఢిల్లీ: రాజ్యాంగ వజ్రోత్సవాలపై చర్చ సందర్భంగా పార్లమెంటులో ప్రభుత్వ, ప్రతిపక్షాల వాగ్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇరు పక్షాల నడుమ శుక్ర, శనివారాల్లో లోక్‌సభలో రెండు రోజుల వాడివేడి సంవాదం అనంతరం సోమవారం వేదిక రాజ్యసభకు మారింది. లోక్‌సభలో చర్చకు బదులిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలను రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. తొలి ప్రధాని నెహ్రూను కించపరిచేందుకు మోదీ తీవ్రంగా ప్రయత్నించారంటూ దుయ్యబట్టారు. రిజర్వేషన్ల విషయమై సీఎంలకు నెహ్రూ రాసిన లేఖను మోదీ వక్రీకరించారని ఆరోపించారు. అందుకు మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గాంధీ కుటుంబాన్ని విమర్శించడమే లక్ష్యంగా మోదీ పట్ల బీజేపీ నేతలు చూపుతున్న మితిమీరిన స్వామిభక్తి చివరికి దేశాన్ని నియంతృత్వం దిశగా తీసుకెళుతుందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ వజ్రోత్సవాలపై సోమవారం రాజ్యసభలో చర్చ సందర్భంగా ఖర్గే 79 నిమిషాలపాటు మాట్లాడారు. ''రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకి. అందుకే కులగణనకు అంగీకరించడం లేదు. కాంగ్రెస్ హయాంలో అమలైన విధానాల వల్లే రిజర్వేషన్లు సాకారమయ్యాయి'' అన్నారు.

గతంలో, ఊహల్లో విహరిస్తున్న మోదీ

1947–1952 మధ్య దేశంలో ఎన్నికైన ప్రభుత్వమే లేదని, అలాంటి సమయంలో రాజ్యాంగానికి కాంగ్రెస్ అక్రమంగా సవరణలు చేసిందని మోదీ చేసిన ఆరోపణలను ఖర్గే ఖండించారు. ''తొలి రాజ్యాంగ సవరణ ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు , విద్య, ఉద్యోగ సమస్యల పరిష్కారం, జమిందారీ వ్యవస్థ రద్దు తదితరాల కోసం ఉద్దేశించినది. దాన్ని రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులే చేపట్టారు. అందులో జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ కూడా ఉన్నారు. మోదీ గతంలో, ఊహల్లో విహరిస్తున్నారు. ఆయన డిక్షనరీలో ప్రస్తుతమనే పదమే లేదు. ఆయన వర్తమానంలోకి రావాలి. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఏం చేస్తున్నారో చెప్పాలి'' అన్నారు. ''ఎమర్జెన్సీ విధించి ఇందిర తప్పు చేశారు. దిద్దుకున్నారు గనుకే తిరుగులేని మెజారిటీతో గెలిచారు'' అన్నారు.

బీజేపీ నోట నీతులా!

''ఆరెస్సెస్‌ది జాతీయ జెండాను, అశోకచక్రను కూడా వ్యతిరేకించిన చరిత్ర. అలాంటిది బీజేపీ నేతలు నేడు మాకు సలహాలిస్తున్నారు'' అంటూ ఖర్గే నిప్పులు చెరిగారు. వాక్ స్వాతంత్ర్యంపై నెహ్రూ ఆంక్షలు విధించారన్న మంత్రి నిర్మల ఆరోపణలను ఖండించారు. ''నేను మున్సిపల్ స్కూల్లో చదివా. నిర్మల ఢిల్లీ జేఎన్‌యూలో చదివారు. బాగా మాట్లాడగలరు. ఆర్థిక నిపుణురాలు. అయినా మంచి చేయడం లేదు'' అన్నారు.



1951 2024

జాకిర్ హుస్సేన్ అస్తమయం

ఊపిరితిత్తుల వ్యాధితో కన్నుమూసిన తబలా మేస్ట్రో ● ప్రముఖుల సంతాపాల వెల్లువ

న్యూఢిల్లీ: సంగీత ప్రపంచంలో సముజ్జ్వల ఘట్టానికి శాశ్వతంగా తెర పడింది. దేశం గర్వించదగ్గ తబలా మేస్ట్రో ఉస్తాద్ జాకిర్ హుస్సేన్ 60 ఏళ్ల అద్భుత సంగీత ప్రస్థానం ముగిసింది. ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్ అనే అరుదైన ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న 73 ఏళ్ల హుస్సేన్ సోమవారం తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) తుదిశ్వాస విడిచారు. అమెరికాలో ఉంటున్న ఆయన తీవ్ర అనారోగ్యం కారణంగా రెండు వారాల క్రితం శాన్‌ఫ్రాన్సిస్కోలో ఆస్పత్రిలో చేరారు. ఆదివారం ఉదయం పరిస్థితి విషమించడంతో ఐసీయూకు మార్చారు. ఆదివారం రాత్రే ఆయన మరణించినట్టు వార్తలొచ్చాయి. పలువురు ప్రముఖులు సంతాప సందేశాలు కూడా విడుదల చేశారు. కానీ ఆయన మృతి వార్తలను కుటుంబీకులు ఖండించారు. ఉస్తాద్ ఆరోగ్యం అత్యంత విషమంగా ఉందని, ఐసీయూలో ఉన్నారని ఆయన సోదరి ఖుర్షీద్ ఔలియా తెలిపారు. అయితే సోమవారం తెల్లవారుజామున జాకిర్ హుస్సేన్ తుదిశ్వాస విడిచినట్టు అనంతరం ఆమె ధ్రువీకరించారు. 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న అసంఖ్యాకులైన సంగీత ప్రియులకు తన తిరుగులేని వారసత్వాన్ని వదిలి ఉస్తాద్ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు' అంటూ ప్రకటన విడుదల చేశారు. దాంతో భారత్‌లోనే గాక ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. సంగీత ప్రపంచంలో తీవ్ర విషాదం అలముకుంది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తదితర రాజకీయ ప్రముఖులు, అమితాబ్ బచ్చన్ వంటి సినీ నటులు మొదలుకుని హరిప్రసాద్ చౌరాసియా వంటి సంగీత దిగ్గజాల దాకా అందరూ ఆయన మృతి పట్ల సంతాపం వెలిబుచ్చారు. సంగీతకారులు అమ్జద్ అలీ ఖాన్, ఏఆర్ రెహ్మాన్, శంకర్ మహదేవన్, వసీఫుద్దీన్ డాగర్, బేలా ఫ్లెక్, సినీ ప్రముఖులు కమల్ హాసన్, షారుక్‌ఖాన్, అక్షయ్‌కుమార్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తదితరులు వారిలో ఉన్నారు. జాకిర్ హుస్సేన్ అంత్యక్రియలను బుధ, లేదా గురువారం నిర్వహిస్తామని ఆయన కుటుంబం తెలిపింది.

తబలాకు పర్యాయపదం

1951 మార్చి 9న ముంబైలో జన్మించిన ఉస్తాద్ అసలు పేరు జాకిర్ హుస్సేన్ అల్లారఖా ఖురేషీ. ఆల్‌టైం గ్రేట్ తబలా ప్లేయర్‌గా పేరొందిన ఉస్తాద్ అల్లా రఖా ఖాన్ కుమారుడు. చిరుప్రాయంలోనే తబలా చేతబట్టిన ఆయన తండ్రిని మించిన తనయునిగా పేరు తెచ్చుకున్నారు. అంతర్జాతీయ ఖ్యాతి గడించడమే గాక తబలాకు మారుపేరుగా నిలిచిపోయారు. ఆరు దశాబ్దాల పాటు భారతీయులతో పాటు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది సంగీతప్రియులను అలరించారు. దేశవిదేశాల్లో లెక్కలేనన్ని ప్రదర్శనలిచ్చారు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. పలు సినిమాలకు సౌండ్‌ట్రాక్స్ అందించడమే గాక కొన్నింట్లో నటించారు కూడా. మిస్టర్ అండ్ మిసెస్ అయ్యర్ వంటి సినిమాలకు సంగీత దర్శకత్వం కూడా వహించారు. లెక్కలేనన్ని జాతీయ, అంతర్జాతీయ బహుమతులు, పురస్కారాలు అందుకున్నారు. పండిట్ రవిశంకర్, అలీ అక్బర్ ఖాన్, శివకుమార్ శర్మ వంటి భారత సంగీత ప్రముఖులతోనే గాక అంతర్జాతీయ దిగ్గజాలందరితోనూ జాకిర్ హుస్సేన్ చేసిన జుగల్‌బందీలు అజరామరంగా నిలిచిపోయాయి. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్, సంగీత నాటక అకాడమీ, గ్రామీ వంటి లెక్కలేనన్ని అవార్డులు అందుకున్నారు. హిందూస్తానీ క్లాసికల్ మ్యూజిక్ పాటు జాజ్ ఫ్యూజన్ తదితర పాశ్చాత్య శైలుల్లోనూ జాకిర్ అందెవేసిన చేయి. 'వాహ్ తాజ్' టీవీ ప్రకటనతో దేశంలో ప్రతి ఇంటికీ చిరపరిచితునిగా మారిపోయారు. ఆయన జులపాల జుత్తు, అందమైన నవ్వు మొహం జన హృదయాల్లో శాశ్వతంగా ముద్ర పడిపోయాయి. సంగీతమే తనకు సర్వస్వమనే నిత్యం చెప్పేవారాయన. తన ఫ్యూజన్ బ్యాండ్ 'శక్తి'తో ముంబైలో వచ్చే ఏడాది వరుసగా సంగీత ప్రదర్శనలు ఇచ్చేందుకు సర్వం చేసుకున్నారు. జాకిర్ హుస్సేన్ పదేళ్ల క్రితమే కుటుంబంతో కలిసి శాన్‌ఫ్రాన్సిస్కోలో స్థిరపడ్డారు. కథక్ నృత్యకారిణి, ఉపాధ్యాయురాలు ఆంటోనియా మిన్నెకోలాను పెళ్లి చేసుకున్నారు. వారికి కుమార్తెలు అనీసా ఖురేషీ, ఇసబెలా ఖురేషీ ఉన్నారు. జాకిర్ హుస్సేన్ సోదరులు తౌఫీక్ ఖురేషీ, ఫజల్ ఖురేషీ కూడా సంగీత కళాకారులే.

భారతీయ, పాశ్చాత్య సంగీత సంప్రదాయాలకు జాకిర్ హుస్సేన్ వారధిగా నిలిచారు. ఆయన మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

తబలాకు అంతర్జాతీయ స్థాయి గౌరవం తెచ్చిన అరుదైన కళాస్రష్ట ఉస్తాద్ జాకిర్ హుస్సేన్. అద్వితీయ నైపుణ్యంతో కోట్లాదిమంది మనసు దోచుకున్నారు. భారతీయ, పాశ్చాత్య సాంస్కృతిక ఐక్యతకు చిహ్నంగా నిలిచారు. ఆయన వారసత్వం సంగీతకారులకు, సంగీత ప్రియులకు తరాల పాటు స్ఫూర్తిగా నిలుస్తుంది.

- ప్రధాని నరేంద్ర మోదీ

తరాల అంతరాన్ని అధిగమించిన తిరుగులేని సాంస్కృతిక వారధి జాకిర్ హుస్సేన్. ఆయన కుటుంబానికి, కోట్లాది సంగీతప్రియులకు నా ప్రగాఢ సానుభూతి

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

జాకిర్ హుస్సేన్ తన నైపుణ్యంతో కోట్లాది హృదయాలకు ఆనంద పరవశం కలిగించిన లెజెండ్

- మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్యా నాదెళ్ల

కింగ్ ఆఫ్ తబలా ఇక లేరు. మిత్రమా, మరో లోకంలో మళ్లీ కలుద్దాం

- ప్రఖ్యాత గిటారిస్టు మెక్‌లాలిన్

ఆ వ్యాధి ప్రాణాంతకం

ఉస్తాద్ జాకిర్ హుస్సేన్ మృతికి కారణమైన ఇడియోపతిక్ పల్మనరీ ఫైబ్రోసిస్ (ఐపీఎఫ్) ప్రాణాంతకమైన ఊపిరితిత్తుల వ్యాధి. దీనికి చికిత్స లేదు. ''ఊపిరితిత్తుల మార్పిడి మాత్రమే శరణ్యం. అది కూడా తొలి దశలోనే గుర్తిస్తేనే సాధ్యం. పైగా సక్సెస్ అయినా ఆయుష్షు మరో ఐదారేళ్లు మాత్రం పెరుగుతుంది. మందుల ద్వారా కూడా మరణాన్ని ఏడెనిమిది ఏళ్లపాటు మాత్రమే వాయిదా వేయవచ్చు'' అని వైద్య నిపుణులు చెబుతున్నారు! ఈ వ్యాధి ఎందుకు వస్తుందన్నది కూడా తెలియకపోవడం విశేషం. అయితే రుమటాయిడ్ ఆర్థ్రైటిస్, సిస్టెమిక్ క్లెరోసిస్ రోగులు ఐపీఎఫ్ వంటివాటి బారిన పడే ఆస్కారం ఎక్కువన్నది వైద్యుల మాట.

బంగ్లాలో ఏడాదిలో ఎన్నికలు

ఆపద్ధర్మ నేత యూనస్ ప్రకటన

ఢాకా: బంగ్లాదేశ్‌లో 2025 చివర్లో, లేదా 2026 ప్రారంభంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని ఆపద్ధర్మ ప్రభుత్వ నేత మహ్మద్ యూనస్ సోమవారం తెలిపారు. ఎన్నికలు నిర్వహించాలంటూ ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో ఆయన ఈ మేరకు ప్రకటించారు. అన్ని పార్టీల ఏకీభావంతోనే ఎన్నికల తేదీని నిర్ణయిస్తామన్నారు. ''సంస్కరించిన ఓటరు జాబితాతో ఎన్నికలకు పార్టీలు అంగీకరిస్తే నవంబర్ నెలాఖరులోగా జరగవచ్చు. సంస్కరణల వల్ల కొన్ని నెలలు ఆలస్యమూ కావచ్చు'' అన్నారు.

మహిళల అంశంపై మీరు వాదించలేరా?

మహిళా న్యాయవాదిపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ: మహిళలకు గుజరాత్ బార్ అసోసియేషన్‌లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని పిటిషన్ దాఖలు చేసి, దానిపై వాదనలకు పురుష న్యాయవాదిని నియమించుకోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. మహిళల అంశంపై మీరెందుకు వాదించడం లేదంటూ సదరు మహిళా న్యాయవాదిని నిలదీసింది. ''మహిళలకు సంబంధించిన విషయాల్లో పురుష న్యాయవాదిపై ఆధారపడటం దేనికి? స్వయంగా వాదించవచ్చు కదా? అని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం సోమవారం ప్రశ్నించింది. ''దీనిపై గుజరాత్ హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదు? పిటిషనర్ స్వయంగా ఎందుకు వాదించడం లేదు? ఆమె రిజర్వేషన్‌కు అర్హురాలా, కాదా అనే అంశాన్ని చూడదలచుకున్నాం'' అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ హైకోర్టులోనూ ఇలాంటి పిటిషన్ ఉన్నందున గుజరాత్ హైకోర్టుకు వెళ్లలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. విచారణ ఈ నెల 19వ తేదీకి వాయిదా పడింది.

త్వరలో రక్షణ సహకార ఒప్పందం

భారత్, శ్రీలంక అంగీకారం ● రెండు దేశాల విద్యుత్ గ్రిడ్ కనెక్టివిటీ
పెట్రోల్ ఉత్పత్తుల పైప్‌లైన్ ఏర్పాటు ● మోదీ, దిసనాయకే చర్చలు



ప్రధాని మోదీతో దిసనాయకే

న్యూఢిల్లీ: భారత్, శ్రీలంక భవిష్యత్తులో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునేందుకు నిర్ణయించాయి. త్వరలోనే రక్షణ సహకారం ఒప్పందానికి తుది రూపు తేవడంతోపాటు, విద్యుత్ గ్రిడ్ కనెక్టివిటీ, పెట్రోలియం ఉత్పత్తుల పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఇంధన సహకారాన్ని విస్తృతం చేసుకోవాలని అంగీకారానికి వచ్చాయి. భారత్ పర్యటనలో ఉన్న శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిసనాయకేతో సోమవారం ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇంధన, రక్షణ, వాణిజ్య రంగాల్లో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని ఇద్దరు నేతలు నిర్ణయించారు. శ్రీలంకలోని విద్యుత్ ప్లాంట్లకు ద్రవీకృత సహజ వాయువును సరఫరా చేయనున్నామని ప్రధాని మోదీ చెప్పారు. చెప్పారు. రామేశ్వరం- శ్రీలంకలోని తలైమనార్ మధ్య ఫెర్రీ(బల్లకట్టు) సర్వీసును ప్రారంభించనున్నట్లు వివరించారు. సముద్ర దీవుల అధ్యయనంలో సహకరించుకోవాలని, రెండు దేశాల మధ్య రక్షణ సహకార ఒప్పందానికి త్వరలోనే తుది రూపు ఇవ్వాలని అంగీకారానికి వచ్చామన్నారు. శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే మాట్లాడుతూ.. మా భూభాగంపై భారత ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఎటువంటి చర్యను అనుమతించబోమని ప్రధాని మోదీకి హామీ ఇచ్చానన్నారు. హంబన్‌తోట పోర్టులో చైనా కార్యకలాపాలు, హిందూ మహా సముద్రంలో పాగా వేసేందుకు ఆ దేశం చేస్తున్న యత్నాల నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

నేడు లోక్‌సభలో జమిలి బిల్లు

సాక్షి, న్యూఢిల్లీ: జమిలి ఎన్నికలకు సంబంధించిన 129వ రాజ్యాంగ (సవరణ) బిల్లు–2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు–2024ను కేంద్రం మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు వాటిని లోక్‌సభ బిజినెస్ జాబితాలో చేర్చారు. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'కు సంబంధించిన ఈ బిల్లులను కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ లోక్‌సభలో ప్రవేశ పెడతారని ప్రభుత్వ వర్గాలు సోమవారం వెల్లడించాయి. అనంతరం విస్తృత సంప్రదింపులకు వీలుగా బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపాల్సిందిగా స్పీకర్‌ను మంత్రి అభ్యర్థించవచ్చని వివరించాయి. ఇందుకు వీలుగా కమిటీకి చైర్మన్, సభ్యులను స్పీకర్ నియమిస్తారు. సంఖ్యాబలం ఆధారంగా పార్టీలకు అందులో స్థానం కల్పిస్తారు. బీజేపీ ఎంపీల్లో ఒకరిని చైర్మన్‌గా ఎంపిక చేయనున్నారు. భాగస్వామ్య పక్షాలందరితో చర్చించిన మీదట కమిటీ 90 రోజుల్లో నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అవసరమైతే గడువు పొడిగిస్తారు. 20వ తేదీతో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ముగియనున్నందున జమిలి బిల్లులను మంగళవారమే ప్రవేశపెట్టనున్నట్టు జాతీయ మీడియా కూడా పేర్కొంది. జమిలి ఎన్నికలకు 32 పార్టీలు మద్దతివ్వగా 15 పార్టీలు వ్యతిరేకించినట్టు రామ్‌నాథ్ కోవింద్ కమిటీ వెల్లడించింది.

ఆ సదుపాయమూ ఉంది

జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై దేశవ్యాప్తంగా విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఏదైనా రాష్ట్ర శాసనసభకు లోక్‌సభతో పాటుగా ఎన్నికలు జరపలేని పరిస్థితి ఎదురైతే ఎలా అన్న సందేహాలూ తలెత్తుతున్నాయి. అలాంటప్పుడు ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు సదరు అసెంబ్లీకి లోక్‌సభ అనంతరం ఎన్నికలు నిర్వహించేందుకు వీలు కల్పిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేస్తారు. ఇందుకు వీలు కల్పిస్తూ బిల్లులో సెక్షన్ 2, సబ్ క్లాజ్ 5లో నిబంధన పొందుపరిచారు.



'పాలస్తీనా' బ్యాగ్‌తో పార్లమెంట్‌కు ప్రియాంక

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక సోమవారం పాలస్తీనా అనే అక్షరాలు, చిహ్నాలున్న బ్యాగ్‌తో పార్లమెంట్‌కు వచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై అఘాయిత్యాలను పట్టించుకోకుండా పాలస్తీనాపై ఆమె ఫ్యాషన్ స్టేట్‌మెంట్ ఇస్తున్నారంటూ బీజేపీ దుయ్యబట్టింది.



న్యూ ఇయర్ వేడుకలే టార్గెట్

న్యూ ఇయర్ వేడుకలను దృష్టిలో పెట్టుకుని ఇతర రాష్ట్రాల నుంచి సిటీకి డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. -8లో



భాగ్యనగర్..బిస్కెట్ కా ఘర్

భాగ్యనగరానికి ఒక్క బిర్యానీతో మాత్రమే కాదు.. పలు రకాల బిస్కెట్లతోనూ అనుబంధం ఉందంటున్నారు ఇక్కడి బేకరీల నిర్వాహకులు. - సిటీప్లస్‌లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0/12.0

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు భారీగా కురుస్తుంది. సాయంత్రం నుంచి చల్లని గాలులు పెరుగుతాయి.

కూల్ కూల్..హాట్ హాట్



చలి నుంచి రక్షణ కోసం పులి ఎన్‌క్లోజర్‌లో హీటర్ ఏర్పాటు



జింకల ఎన్‌క్లోజర్‌లో ఫెన్సింగ్‌కు గోనె సంచులు కట్టిన దృశ్యం



చలి నుంచి రక్షణ కోసం ఇలా..



'సిటీ'జనులను చలి వణికిస్తోంది. ఇక మూగ జీవాల సంగతి చెప్పనక్కర్లేదు. శీతల గాలులతో అల్లాడుతున్నాయి. జంతు ప్రదర్శనశాలలో ఈ పరిస్థితిని అధిగమించేందుకు యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. చలికాలం నుంచి మూగజీవాలను కాపాడేలా హీటర్లు, గన్నీ బ్యాగులను అందుబాటులోకి తెచ్చింది. ఎన్‌క్లోజర్లలోకి చలి చొరబడకుండా గోనె సంచులను అడ్డంగా కడుతోంది. అంతేగాకుండా చలిని నివారించే..వేడిగాలి వచ్చేలా హీటర్లు, యూవీ లైట్లు అమర్చారు. తీసుకునే ఆహారంలోనూ పలుమార్పులు చేశారు. పక్షుల కోసం వెదురు బుట్టలు, కుండలు పెట్టారు. ఎన్‌క్లోజర్ కింది భాగంలో చల్లగా ఉంటుంది. వెచ్చదనం కలిగించేలా కలప, ఎండుగడ్డి పరిచారు. జంతువులు, పక్షుల గూళ్లలో హీటర్లు, బల్బులు, ట్యూబ్‌లైట్లు ఏర్పాటు చేశారు. మౌస్‌డీర్ బ్రీడింగ్ సెంటర్‌లోని యానిమల్ హౌస్ బయట ఆకుపచ్చ షేడ్‌నెట్ అమర్చారు. శీతాకాలంలో జంతువులను సంరక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నట్లు జూ క్యూరేటర్ వసంత 'సాక్షి'కి తెలిపారు. – సాక్షి, సిటీబ్యూరో

రాష్ట్రపతి రాక నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు



కంటోన్మెంట్: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరంలో ఆరు రోజుల శీతాకాల విడిది కోసం ఇక్కడికి వస్తున్న నేపథ్యంలో నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి హకీంపేట ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకోనున్నారు. మంగళవారం సాయంత్రం 5.00 గంటల నుంచి 7.00 గంటల మధ్య హకీంపేట నుంచి రాజ్‌భవన్ వరకు మార్గంలోని బొల్లారం, యాప్రాల్, బైసన్ ఎక్స్ రోడ్, అమ్ముగూడ జంక్షన్, లోతుకుంట టి జంక్షన్, లాల్ బజార్, తిరుమలగిరి చౌరస్తా, కార్ఖానా, టివోలీ, ప్లాజా, రసూల్‌పురా, బేగంపేట, గ్రీన్‌లాండ్స్, పంజగుట్ట, యశోదా ఆసుపత్రి, క్షత్రియ హాస్పిటల్, మెట్రో రెసిడెన్సీ, వీవీ స్టాట్యూ ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు రాష్ట్రపతి పర్యటనకు అనుగుణంగా ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగనున్నాయి. ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు సోషల్ మీడియా అకౌంట్‌ల ద్వారా, లేదా నేరుగా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్ 9010203626ను సంప్రదించి తెలుసుకోవచ్చని పోలీసులు వెల్లడించారు.

ఏఐ అంతర్జాతీయ కేంద్రంగా సిటీ

మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఐఎస్ఎఫ్ ప్రతినిధులు

రాయదుర్గం: హైదరాబాద్‌ను ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)కు అంతర్జాతీయ కేంద్రంగా మార్చడమే తెలంగాణ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖా మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్(ఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మొదటి గ్లోబల్ ఏఐ సమ్మిట్, మొదటి అంతర్జాతీయ జూనికార్న్స్, స్టార్టప్ ఫెస్టివల్ కర్టెన్ రైజర్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏఐ సిటీని ప్రారంభించడంతోపాటు నైపుణ్యం కలిగిన మానవ వనరుల పెంపు, అభివృద్ధి కోసం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తోందని చెప్పారు. కంప్యూట్ పవర్, ఏఐ ఎథిక్స్ ముందున్న ప్రధాన సవాళ్లను ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, థింక్ ట్యాంక్‌ల సహకారంతో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి జీవితం, వ్యాపారంలో ఏఐ క్లిష్టమైన, వైవిధ్యం కలిగించే పాత్రను పోషిస్తోందన్నారు. జెన్ ఏఐ ఆగమనం ప్రపంచాన్ని అపూర్వమైన వేగంతో మారుస్తుందన్నారు. ఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది మే 28 నుంచి 30వ తేదీ వరకు అమెరికాలోని డల్లాస్‌లో ఐఎస్ఎఫ్ గ్లోబల్ ఏఐ సమ్మిట్‌ను నిర్వహించాలని నిర్ణయించామని ఐఎస్ఎఫ్ వ్యవస్థాపకుడు, చైర్మన్ జేఏ చౌదరి తెలిపారు. ఈ సమ్మిట్‌లో 8 నుంచి 18 ఏళ్ల వయసు గల యువ ఆవిష్కర్తల కోసం మొదటి ఇంటర్నేషనల్ జూనికార్న్ ఫెస్టివల్‌ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్, డాటావివ్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, ఎండీ వేదాంత్ అహ్లువాలియా తదితరులు పాల్గొన్నారు.

గడ్డు కాలమే!



ఆర్థికంగా క్లిష్ట పరిస్థితిలో జీహెచ్ఎంసీ

రూ.2 వేల కోట్ల క్యాపిటల్ నిధులకు..అందింది రూ.760 కోట్లే..

- అప్పుల కిస్తీలకే రూ.1664 కోట్లు
- ప్రభుత్వం ఆదుకోకుంటే పరిస్థితి విషమమే..



జీహెచ్ఎంసీ పరిస్థితి పేరుగొప్ప..ఊరు దిబ్బ అన్న చందంగా మారుతోంది. ఎన్నో ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపడుతూ..కోట్లాది మందికి మౌలిక సేవలు అందిస్తూ గొప్పలు చెప్పుకుంటున్న బల్దియా ఆర్థిక పరిస్థితి మాత్రం ఏమాత్రం బాగా లేదు. అందాల్సిన నిధులు అందక..చేయాల్సిన వ్యయాన్ని నివారించలేక జీహెచ్ఎంసీ క్లిష్ట పరిస్థితుల్లోకి వెళ్లిపోతోంది. తాజాగా బల్దియాకు రూ.2వేల కోట్ల క్యాపిటల్ నిధులు రావాల్సి ఉండగా కేవలం రూ.760 కోట్లే వచ్చాయి. ఇప్పుడు అత్యవసరంగా అప్పుల కిస్తీలు రూ.1664 కోట్లు కట్టాల్సి ఉంది. ఈ పరిస్థితి నుంచి ఎలా గట్టెక్కుతుందో చూడాలి.
– సాక్షి, సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ బడ్జెట్..అంకెల్లో మాత్రం భారీగా ఉంటున్నప్పటికీ ఆమేరకు నిధులు అందడం లేదు. దాంతో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాజెక్టులకు సంబంధించిన పనుల నుంచి..నిర్వహణ పనుల దాకా అదే పరిస్థితి. నిధుల లేమితో ప్రాజెక్టులకు సంబంధించిన పనులు కుంటుతున్నాయి. నిర్వహణ పనులు జరగకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాదు, నెలనెలా సిబ్బంది వేతనాల చెల్లింపులకు సైతం తిప్పలు పడాల్సి వస్తోంది. చెల్లింపులు జరిగేంతదాకా సంబంధిత అధికారులు దినదినగండంగా గడపాల్సి వస్తోంది. మరో మూడునెలల్లో ముగియనున్న ప్రస్తుత ఆర్థిక సంవత్సర బడ్జెట్ (2024–25)లో వివిధ మార్గాల ద్వారా నిధులందుతాయనే అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించినప్పటికీ అవి అందక పోవడంతో పలు పనులు కుంటుతున్నాయి. కొన్ని పనులు అసలు ప్రారంభమే కాలేదు. రాష్ట్రప్రభుత్వ బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి రూ.3,065 కోట్ల కేటాయింపులు చూపింది. దాంతో ఆ నిధులు రాగలవనే ఆశతో అధికారులు జీహెచ్ఎంసీ బడ్జెట్‌లో క్యాపిటల్ నిధులుగా వాటిని చూపినప్పటికీ రూ.200 కోట్లు కూడా రాలేదు. గత సెప్టెంబర్ వరకు రూ.186 కోట్లు మాత్రం వచ్చాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా ఎన్ని నిధులొస్తాయో వేచి చూడాల్సిందే. క్యాపిటల్ వ్యయం కింద మొత్తం రూ.2 వేల కోట్లు సమకూరతాయనుకుంటే వచ్చింది రూ.760 కోట్లే.

ఇంకా...

- మ్యుటేషన్ ఫీజులు రూ.200 కోట్లు రాగలవనుకుంటే వచ్చింది రూ.123 కోట్లు.
- ట్రేడ్ లైసెన్సుల ఫీజులుగా రూ.110 కోట్లకుగాను కేవలం రూ.15 కోట్లే వచ్చాయి.
- అసైన్డ్ రెవెన్యూగా రూ.85 కోట్లు వస్తాయనుకున్నప్పటికీ రాలేదు.
- ప్రాజెక్టుల పనులకు రూ.1370 కోట్లు వస్తాయని ఆశిస్తే, రూ.587 కోట్లు మాత్రం అందాయి.
- అలాగే రోడ్ల పనుల కోసం రూ.880 కోట్లు కోరితే రూ.119 కోట్లే వచ్చాయి.
- నాలాలకు సైతం రూ.150 కోట్లకు గాను రూ.30 కోట్లే అందాయి.

...ఇలా వివిధ పద్దుల కింద వస్తాయనుకున్న నిధులు రాకపోవడంతో ప్రతినెలా సిబ్బంది జీతభత్యాలు చెల్లించేందుకు ఆస్తిపన్ను వసూళ్ల కోసం సంబంధిత సిబ్బందిని ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నారు. ఈ సంవత్సరానికి సంబంధించి చాలామంది ఇప్పటికే ఆస్తిపన్ను చెల్లించడంతో రాబోయే నెలల్లో ఆ ఆదాయం కూడా తగ్గే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆదుకోకుంటే జీతాలకు కటకట తప్పేలా లేదు.

కేంద్రమే నయం?

కేంద్ర ప్రభుత్వం నుంచి అందుతాయనుకున్న నిధులు మాత్రం అందడం విశేషం. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లుగా బల్దియాకు రూ.350 కోట్లు వస్తాయనుకుంటే రూ.351.50 కోట్లు వచ్చాయి.

అప్పుల పద్దు పెద్దదే..

గడచిన సంవత్సరాల్లో ఎస్సార్డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ తదితర ప్రాజెక్టుల కింద బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలు భారీ మొత్తంలో ఉండటంతో వాటి వడ్డీలు, కట్టాల్సిన ఈఎంఐలు భారీగా ఉన్నాయి. రూ.7,937 కోట్ల బడ్జెట్‌లో రూ.1664 కోట్లు వాటికే చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ.వెయ్యి కోట్లు చెల్లించగా, మరో రూ.600 కోట్లకు పైగా రాబోయే మూడు నెలల్లో చెల్లించాల్సి ఉంది.

ఎల్ఆర్ఎస్.. ఎంతో దూరం!



ఏడాదిగా ఎక్కడి ఫైళ్లు అక్కడే..

- ఇరిగేషన్, రెవిన్యూ ఎన్ఓసీల కోసం ఎదురు చూపులు
- క్షేత్ర స్థాయిలో తనిఖీలకు సిబ్బంది కొరత
- సుమారు 3 లక్షల దరఖాస్తులు పెండింగ్

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో స్థలాల క్రమబద్ధీకరణ పడకేసింది. హెచ్ఎండీఏలో సుమారు 3 లక్షలకు పైగా ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ఫైళ్లు నత్తనడక నడుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ ఫైళ్ల పరిష్కారం కోసం హెచ్ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచిపోయాయి. అనంతరం కాంగ్రెస్ అధికారం చేపట్టిన తరువాత మరోసారి ఉత్తర్వులు విడుదల చేసింది. ఎల్ఆర్ఎస్ ఫైళ్ల పరిష్కారం కోసం సత్వర చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొంది. నెలరోజుల్లోనే ఫైళ్లకు పరిష్కరించి ప్రొసీడింగ్స్ అందజేయనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా పెద్దగా పురోగతి లేదు. హైడ్రా ఏర్పాటు అనంతరం మరోసారి ప్రతిష్టంభన నెలకొంది. చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను కచ్చితంగా నిర్ధారించిన అనంతరమే ప్రొసీడింగ్స్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకోసంహెచ్ఎండీఏతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలను సైతం భాగస్వాములను చేశారు. కానీ వివిధ విభాగాల మధ్య సమన్వయ లోపం కారణంగా ఎల్ఆర్ఎస్ పథకం ముందుకు సాగడం లేదు. హెచ్ఎండీఏలోని 6 జోన్‌లలో నమోదైన సుమారు 3.44 లక్షల ఫైళ్లలో ఇప్పటి వరకు 44 వేల ఫైళ్లు వివిధ దశల్లో ఉండగా, మిగతా 3 లక్షల ఫైళ్లలో ఎలాంటి కదలిక లేకపోవడం గమనార్హం.

హెచ్ఎండీఏలో అప్పట్లో నాలుగు జోన్‌లకు అందిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు

జోన్	మొత్తం దరఖాస్తులు
శంకర్‌పల్లి	73,915
ఘట్కేసర్	1,59,672
మేడ్చల్	30,850
శంషాబాద్	80,289
మొత్తం	3,44,726

సమన్వయం లేకపోవడం వల్లేనా...

ప్లాట్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం అప్పటి ప్రభుత్వం 2020లో నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో రూ.1000 రుసుముతో లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ పెండింగ్ జాబితాలోనే పేరుకుపోతోంది. హైడ్రా ఏర్పాటు తరువాత ప్రతి ఫైల్‌ను ఇరిగేషన్, రెవెన్యూ విభాగాలను చెందిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదించిన తరువాత మాత్రమే హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం నుంచి ప్రొసీడింగ్స్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది కొరత కారణంగా క్షేత్రస్థాయిలో ఎలాంటి తనిఖీలు జరగడం లేదు. మరో వైపు చెరువులు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను దృష్టిలో ఉంచుకొని హెచ్ఎండీఏ అధికారులు ప్రతి ఫైల్‌కు ఎన్ఓసీని తప్పనిసరి చేస్తున్నారు.ఆ ఎన్ఓసీని అందజేయవలసిన రెవిన్యూ, నీటిపారుదల అధికారులు మాత్రం జాప్యం చేస్తున్నారు. ఎల్ఆర్ఎస్ కోసం హెచ్ఎండీఏలో ఇటీవల ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినప్పటికీ పెద్దగా కదలిక లేకపోవడం గమనార్హం. '' మూడు విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఇప్పట్లో ఫైళ్ల పరిష్కారమవుతాయనే అంచనాలు కూడా లేవు.'' అని ఒక అధికారి విస్మయం వ్యక్తం చేశారు.

ఆదాయం రూ.1000 కోట్లకు పైగా...

హెచ్ఎండీఏ పరిశీలనలో ఉన్న 3.44 లక్షలకు పైగా దరఖాస్తుల నుంచి ప్రభుత్వానికి ఫీజుల రూపంలో రూ.1000 కోట్లకు పైగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రభుత్వాన్ని నిధుల లేమి వెంటాడుతున్న దృష్ట్యా ఆదాయం రాకపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే ఎల్ఆర్ఎస్ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు.కానీ అది ఒక అడుగు ముందుకు, నాలుగడుగులు వెనక్కి అన్నట్లుగా మారింది.

తప్పిన ముప్పు

నడిరోడ్డుపై డీజిల్ ట్యాంకర్ బోల్తా

- ట్రాఫిక్, హైడ్రా, ఫైర్ విభాగాల చాకచక్యంతో తప్పిన ప్రమాదం
- మద్యం తాగి వాహనం నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు



చిలకలగూడ: ట్రాఫిక్ రద్దీ ప్రాంతంలో నడిరోడ్డుపైన ఓ డీజిల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో అటు పోలీసులు.. ఇటు ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో అప్రమత్తమైన ట్రాఫిక్, హైడ్రా, ఫైర్ విభాగాలు చాకచక్యంగా వ్యవహరించి పెను ప్రమాదాన్ని తప్పించాయి. వివరాల్లోకి వెళ్తే..చిలకలగూడ ట్రాఫిక్ ఠాణా పరిధిలోని మెట్టుగూడ ఆలుగడ్డబావి వద్ద సోమవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో లోడుతో వెళ్తున్న డీజిల్ ట్యాంకర్ వెనుక టైర్ పగిలి..డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో డీజిల్ లీకై రోడ్డుపై ప్రవహించింది. నిప్పు అంటుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న వెంటనే ఈస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు స్పందించి సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. వెంటనే ఫైరింజన్లను రప్పించి మంటలు అంటుకోకుండా భారీగా ఫోమ్‌ను స్ప్రే చేయించారు. మూడు క్రేన్ల సాయంతో బోల్తా పడిన ట్యాంకర్‌ను అక్కడి నుంచి తొలగించారు. జీహెచ్ఎంసీ సిబ్బంది సాయంతో రహదారులపై పడిన డీజిల్‌పై మట్టిపోయించారు. వాహనదారులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా బారికేడ్లను అడ్డుపెట్టారు. సుమారు మూడున్నర గంటలు శ్రమపడి పరిస్థితిని చక్కదిద్దారు. ట్యాంకర్ వాహనం డ్రైవింగ్ చేస్తున్న మల్లాపూర్‌కు చెందిన చంద్రశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అనుమానం వచ్చిన ట్రాఫిక్ పోలీసులు డ్రైవర్ చంద్రశేఖర్‌కు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా, మద్యం తాగి వాహనం నడిపినట్లు నిర్ధారణ అయింది. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో 105 బీఏసీ (బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్)పాయింట్లు వచ్చాయి. దీంతో చంద్రశేఖర్‌పై గోపాలపురం లా అండ్ ఆర్డర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సకాలంలో స్పందించిన ట్రాఫిక్ పోలీసులను పలువురు అభినందించారు. మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత ఘటన స్థలానికి చేరుకుని తన వంతు సాయం అందించారు.



ట్యాంకర్ బోల్తాపడి డీజిల్ రోడ్డుపైకి లీకైన దృశ్యం



మంటలు చెలరేగకుండా ఫోమ్ స్ప్రే చేస్తున్న సిబ్బంది

కంటోన్మెంట్‌కు రక్షణ మంత్రి అవార్డు



అవార్డు అందుకుంటున్న కంటోన్మెంట్ బోర్డు సీఈఓ, అధికారులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ప్రతిష్టాత్మక రక్షణ మంత్రి అవార్డు దక్కించుకుంది. రక్షణ మంత్రి ఎక్సలెన్స్ అవార్డు- 2024, 'స్వచ్ఛ చావనీ- స్వస్థ చావనీ' విభాగంలో అవార్డు లభించింది. డిఫెన్స్ ఎస్టేట్స్ డే (డిసెంబర్ 16)ను పురస్కరించుకుని సోమవారం రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. డిఫెన్స్ ఎస్టేట్స్ డైరెక్టర్ జనరల్ జి.ఎస్.రాజేశ్వరన్ సమక్షంలో, కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ రామకృష్ణ, హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, శానిటరీ సూపరింటెండెంట్ మహేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మధుకర్ నాయక్ మాట్లాడుతూ ఈ అవార్డు కంటోన్మెంట్ బోర్డు ఉద్యోగుల బాధ్యతను మరింత పెంచిందన్నారు. తమకు దక్కిన ఉన్నత స్థానాన్ని నిలబెట్టుకునేందుకు అంకిత భావంతో పనిచేస్తామన్నారు.

పన్నెండేళ్లలో మూడో అవార్డు

2013 నుంచి కేంద్ర ప్రభుత్వం రక్ష మంత్రి అవార్డులను ప్రదానం చేస్తోంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తొలిసారిగా 2016లో ఇన్నోవేటివ్ మెసర్స్/ ప్రాజెక్టు ఫర్ పబ్లిక్ గుడ్ కేటగిరీలో అవార్డు దక్కింది. గతేడాది సైతం స్వచ్ఛ చావనీ- స్వస్థ చావనీ విభాగంలో బీ కేటగిరీ అవార్డు దక్కగా, ఈసారి ఏ కేటగిరీలో అవార్డు వరించింది. స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించిన పదేళ్లలో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు మొత్తం ఆరుసార్లు అవార్డులు దక్కాయి. ఇందులో మూడు అవార్డులు కాగా, మరో మూడు స్వచ్ఛ భారత్ మిషన్ కింద దక్కాయి. 2018లో ఓడీఎఫ్ విభాగంలో, 2021లో సెల్ఫ్ సస్టెయినబుల్, 2022లో బెస్ట్ సిటిజన్ ఫీడ్ బ్యాక్ విభాగాల్లో స్వచ్ఛ భారత్ అవార్డులు దక్కాయి. ఇక సికింద్రాబాద్ డిఫెన్స్ ఎస్టేట్స్ కార్యాలయానికి సైతం రెండు సార్లు రక్షణ మంత్రి అవార్డు లభించింది. 2013లో అవుట్ స్టాండింగ్ వర్క్ ఇన్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో, 2019లో లాండ్ అండ్ రికార్డ్ మేనేజ్‌మెంట్ విభాగంలో సికింద్రాబాద్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్కిల్‌కు అవార్డు దక్కాయి.

సాక్షి మంగళవారం । 17 । డిసెంబర్ । 2024

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సాక్షి,సిటీబ్యూరో: ప్రజలకు అందించే సేవలు, చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నాణ్యత ప్రమాణాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ జలమండలి చేపట్టే పనుల కోసం ప్రొక్యూర్ చేసే యంత్రాలు, ఎలక్ట్రికల్ సామగ్రి, పైపులు, మాన్ హోల్స్, వాల్వ్ లు, ఇతర పరికరాలు ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాల మేరకు ఉన్నాయా, లేదా అనేది ఎలా తెలుసుకోవాలన్నారు.ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన వస్తువులను వినియోగించడం ద్వారా పనుల్లో నాణ్యత పెరుగుతుందన్నారు. ఏవైనా వస్తువుల నాణ్యతపై అనుమానాలు ఉంటే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే బీఐఎస్ వాటి నాణ్యతను తెలియజేస్తుందని తెలిపారు.

Office of the Jt.Sub-Registrar. R.O.Banjara Hills, Hyderabad. (South)

WILL ENQUIRY

Notice Under Document No. P. 161/2024

Dated :07-12-2024.

Known all men that Sri. Malireddy Ajababu S/o Malireddy Koti Reddy presented a WILL Deed for Registration after enquiry before the under signed, which was executed by his Wife Late Smt. Malireddy Padmavathi, who was demised on 01-06-2024, bequeathing her self acquired Movable and Immovable Properties to be withdrawn by the beneficiaries who were entrusted in this Will.

The WILL was executed by Late Smt. Malireddy Padmavathi w/o Malireedy Ajababu R/o H.No. 8-3-191/146/2.3. 4/304, Madhuranagar, Ameerpet, Hyderabad with a sound mind and capability of making will on 05-05-2023, at Hyderabad on Rs.100/- Non-Judicial Stamp Paper in respect of her self acquired Movable and Immovable properties Bearing Schedule-1 (1) Flat No.304, 3rd Floor in "Vaishnavi's Sai Surabhi Awas" H.No.8-3-191/146/2.3.4 (B-9) Situated at Vengal rao Nagar, Hyderabad.(2) Open Plot No.350 and (3) Plot No.327 to an extent of 414 and 704 Sq. Yards in Sy.No.44/1, situated at "Mathrusri Co-op. House Building Society, Miyapur (V), Serilingampall (M), R.R.Dist. (4) Plot No.768 in Sy.No.54 situated at "Mathrusri Co-op.House Building Society, Hafeezpet, Serilingampally (M) (5) Plot No.34 in Sy.No.79 at Vattinagulpally(V), Narsingi Municipality, Gandipet (M),R.R.dist. (6)Open land in Sy.No.288/part at Gajularamaram (V), Medchal Malkajgiri Dist to an extent of 790 Sq.yards and.(7) 395 Sq. Yards (8) Agri. Land A.C 0.04 Gts. In Sy.No.511/ ఆ1, Ameenpur (V) & (M) Sangareddy Dist, (9) Agri. Wet land Khatha No.73 Ac.4.09Cents, (10) KhataNo.850 A.c.0.42 Cents. (12) S.Y No.57/1, A.c.2.06 Cents. Sl.No.9,10 and 12 Situated at Maheswarapuram (V), Pedaparupudi(M), Gudiwada, Krishna Dist. (A.P). (11) Khatha No.79 A.c.2.08 Cents at Bhushanagulla (V) Pedaparupudi (M), Gudiwada, Krishna Dist. (A.P). (13)Agri.land Ac.4-49 Cts. In Sy.No. 27/6F at Cheemallapalli (V), Porlupalem (G.P), Pendurthi (M), Visakhapatnam. Dist.(A.P) Schedule-2 908 sq. yards in Sy.No.469/ఆ1 at Ameenpur (V) sangareddy Dist. Schedule-3, 605 and 726 Sq. Yards in Sy.No. 469/ఈ2, ఈ3, ఈ4 at Ameenpur (V) sangareddy Dist Schedule-4 Plot No.29,30,40 and 41 in Sy.No.74 at Bandlaguda Jageer (V), Gandipeta (M), R.R.Dist. Schedule 2,3 and 4 Constructed apartments and some other movable properties also noted in the Will.

Her Husband and children are the Beneficiries and A.V.L Narasimha Murthy and Sonna Swamidas are the attesting witnesses to the WILL.

The Enquiry of this Will is to be held at the Office of the Joint Sub-Registrar-1, R.O.Banjara Hills, Hyderabad (South) and objections if any against the will can be brought to the notice of the under signed in any manner within 15 days after publication of this notice.

(Syed Siraj Anwar)
Jt. Sub-Registrar-1, R.O.Banjrahills, HYDERABAD. (South)

అప్పు అడిగితే డ్రగ్ పెడ్లర్‌గా మార్చాడు!

- నిందితుడిని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్
- 13.9 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం
- పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలింపు



సాక్షి, సిటీబ్యూరో: తనను అప్పు అడిగిన చిన్ననాటి స్నేహితుడిని డ్రగ్ పెడ్లర్‌గా మార్చాడో వ్యక్తి. ముంబైలో ఉండే సప్లయర్స్‌ను కూడా పరిచయం చేశాడు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో మాదకద్రవ్యం అమ్మి దండిగా సంపాదించవచ్చని ప్రేరేపించాడు. ఈ దందాపై సమాచారం అందుకున్న ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఓ నిందితుడిని పట్టుకుని 13.9 గ్రాములు ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం చేసుకున్న పోలీసులు పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. సోమవారం అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు కేసు వివరాలు వెల్లడించారు. కడప జిల్లా, ప్రొద్దుటూరుకు చెందిన షేక్ మహ్మద్ హనీఫ్ పదో తరగతి వరకు చదివాడు. ఆపై క్యాబ్ డ్రైవర్‌గా మారి 2016లో బతుకుతెరువు కోసం కువైట్ వెళ్లాడు. మూడేళ్ల తర్వాత అక్కడి నుంచి తిరిగి వచ్చిన అతను తన స్వస్థలంలోనే ఉంటున్నాడు. నెలకు రూ.16 వేల జీతానికి క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్న హనీఫ్‌కు కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ నేపథ్యంలో కొంత మొత్తం అప్పు కావాలంటూ తన చిన్ననాటి స్నేహితుడు చాంద్ పీర్‌ను కోరాడు. ఆర్థికంగా బలపడాలంటే డ్రగ్స్ దందా చేయాలని, ముంబై నుంచి తక్కువ ధరకు డ్రగ్స్ ఖరీదు చేసి తీసుకువచ్చి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు అమ్మితే భారీ లాభాలు ఉంటాయని చెప్పాడు. న్యూ ఇయర్ వేడుకలు సమీపిస్తున్న నేపథ్యంలో డ్రగ్స్‌కు మంచి డిమాండ్ ఉంటుందనీ సలహా ఇచ్చాడు. అందుకు హనీఫ్ అంగీకరించడంతో ముంబైకి చెందిన డ్రగ్స్ సప్లయర్స్ విక్కీ, రోహిత్‌లను పరిచయం చేశాడు. దీంతో వారి వద్దకు వెళ్లిన హనీఫ్ 13.9 గ్రాములు ఎండీఎంఏ ఖరీదు చేశాడు. దానిని తీసుకుని నేరుగా నగరానికి వచ్చిన అతను కస్టమర్ల కోసం కార్ఖానాలోని దోభీఘాట్ వద్ద వేచి ఉన్నాడు. దీనిపై సమాచారం అందడంతో తూర్పు మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున నేతృత్వంలో ఎస్సైలు ఎం.అనంతాచారి, ఎస్.కరుణాకర్ రెడ్డి, పి.నాగరాజు తన బృందంతో దాడి చేసి హనీఫ్‌ను పట్టుకుని డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. ఇతడిని తదుపరి చర్యల నిమిత్తం కార్ఖానా అధికారులకు అప్పగించి పరారీలో ఉన్న చాంద్ పీర్ కోసం గాలిస్తున్నారు.

న్యూ ఇయర్ వేడుకలే టార్గెట్..

- నగరానికి భారీగా డ్రగ్స్ సరఫరా
- ముగ్గురి అరెస్టు
- రూ.1.15 కోట్ల విలువైన 53.5 కిలోల పాపిస్ట్రా స్వాధీనం



మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు



పోలీసుల అదుపులో నిందితులు

నాగోలు: నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకుని నగరానికి ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు అంతరాష్ట్ర డ్రగ్స్ పెడ్లర్స్‌ను అదుపులోకి తీసుకున్న ఎల్బీనగర్ ఎస్ఓటీ, మీర్‌పేట్ పోలీసులు వారి నుంచి రూ.1.15 కోట్ల విలువైన 53.5 కిలోల పాపిస్ట్రా, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం ఎల్బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు.. రాజస్థాన్‌కు చెందిన మంగిలాల్ భీశాయ్, మంగీలాల్ డాక, బీరా రామ్ నగరంలోని మీర్ పేట్, అశోక్ రెడ్డి కాలనీలో ఉంటూ స్టీల్ రేలింగ్ వర్కర్లుగా పని చేస్తున్నారు. వీరికి మధ్యప్రదేశ్‌కు చెందిన పింటు అలియాస్ మోహన్ సింగ్‌తో పరిచయం ఏర్పడింది. సులభంగా డబ్బులు సంపాదించేందుకు డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయించారు. మోహన్‌సింగ్ తాను మధ్యప్రదేశ్ నుంచి మాదకద్రవ్యాలను సరఫరా చేస్తానని ఎక్కువ ధరకు ఇతర ప్రాంతాల్లో విక్రయించాలని చెప్పడంతో అందుకు వారు అంగీకరించారు. దీంతో మధ్యప్రదేశ్ వెళ్లిన వారు ముగ్గురు మోహన్ సింగ్ వద్ద పాపిస్ట్రాను కొనుగోలు చేసి రైల్లో నగరానికి తీసుకువచ్చారు. అశోక్ రెడ్డి నగర్‌లోని తన ఇంట్లో భద్రపరిచిన వారు దానిని బీఎన్‌రెడ్డి నగర్ లో నివాసం ఉంటున్న రాజస్థాన్‌కు చెందిన శంకర్ లాల్, కరీంనగర్‌లో ఉంటున్న శర్వాన్ ద్వారా నగరంలో అధిక ధరకు విక్రయించాలని నిర్ణయించుకున్నారు. దీనిపై సమాచారం అందడంతో ఎల్బీనగర్ ఎస్ఓటీ, మీర్‌పేట పోలీసులు ఆదివారం రాత్రి అశోక్ రెడ్డి నగర్‌లోని వారి ఇంటిపై దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి 53.5 కిలోల పాపిస్ట్రా, మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల్లో ఒకరైన మంగీలాల్ 2023లో గంజాయి విక్రయిస్తూ హయత్‌నగర్ పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మోహన్ సింగ్, శంకర్ లాల్, శర్వాన్‌లను త్వరలో అరెస్ట్ చేస్తామని సీపీ తెలిపారు.

మాదక ద్రవ్యాలపై నిరంతర నిఘా..

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణకు రాచకొండ పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ తెలిపారు. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నామని, నగర శివార్లలోని రిసార్ట్‌ల యాజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు సీపీ పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఓటీ డీసీపీ . మురళీధర్,అడిషనల్ డీసీపీ షాకీర్ హుస్సేన్, ఇన్‌స్పెక్టర్లు కీసర నాగరాజు, భాస్కర్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చింది రూ.720 ..పోయింది రూ.4.49 లక్షలు

- ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో నష్టపోయిన గృహిణి
- వాట్సాప్ ద్వారా వలవేసిన సైబర్ నేరగాళ్లు
- కేసు దర్యాప్తు చేస్తున్న సీసీఎస్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన మహిళను టార్గెట్‌గా చేసుకున్న సైబర్ నేరగాళ్లు పెట్టుబడుల పేరుతో ఎర వేశారు. ఆమెకు రూ.720 లాభం ఇవ్వడం ద్వారా నమ్మకం కలిగించి ఏకంగా రూ.4.49 లక్షలు టోకరా వేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఓ వివాహితకు సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా ట్రేడ్ మార్కెటింగ్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో ఎర వేశారు. దానికి ముందు కొన్ని టాస్క్‌లు పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఇందులో ఆయా వీడియోలు, ఫొటోలను షేర్ చేయడం, ఫైవ్ స్టార్ రేటింగ్ ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చని నమ్మబలికారు. మొదటి టాస్క్ పూర్తి చేసిన ఆమెకు రూ.120, రెండో టాస్క్ పూర్తి చేయడంతో రూ.300 చెల్లించారు. దీంతో వారిపై పూర్తిగా నమ్మకం కలిగిన గృహిణి తాను పెట్టుబడులు పెడతానంటూ వాట్సాప్ ద్వారా సందేశం ఇచ్చారు. దీంతో ఆమెకు ఓ లింక్ పంపిన సైబర్ నేరగాళ్లు అందులో ఖాతా తెరవడం ద్వారా పెట్టుబడులు పెట్టాలన్నారు. తొలుత రూ.వెయ్యి పెట్టుబడి పెట్టిన ఆమెకు రూ.300 లాభంతో రూ.1300 చెల్లించారు. ఆపై పెద్ద మొత్తాలు ఇన్వెస్ట్ చేయిస్తూ, త్వరలోనే లాభాలు వస్తాయని కాలయాపన చేశారు. మొత్తమ్మీద రూ.4.49 లక్షలు పెట్టుబడి పెట్టిన తర్వాత రిఫండ్ కోరితే మరి కొంత మొత్తం ఇన్వెస్ట్ చేస్తేనే వస్తుందని చెప్పారు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

తెలుగు మ్యాట్రిమోనీలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే...

తెలుగు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రైవేట్ ఉద్యోగికి పెళ్లి కూతురి పేరుతో ప్రొఫైల్ పంపిన సైబర్ నేరగాళ్లు రూ.2.05 లక్షలు కాజేశారు. దీనికోసం వాళ్లు క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ కథ చెప్పారు. నగర యువకుడు తెలుగు మ్యాట్రిమోనీలో రిజిస్టర్ చేసుకోగా... మలేషియాలో ఉంటున్న విశాఖపట్నం యువతిగా ఓ యువతి తన ప్రొఫైల్ పంపింది. వాట్సాప్ ద్వారా ఇద్దరూ కొన్నాళ్లు చాటింగ్ చేసుకున్నారు. ఆపై తన తండ్రి క్రిప్టో కరెన్సీ యాప్స్‌లో పెట్టుబడులు పెట్టి, లాభాలు పొందటంతో నిష్ణాతుడని చెప్పింది. తొలుత నిజమైన క్రిప్టో కరెన్సీ యాప్‌లోనే పెట్టుబడి పెట్టి, లాభాలు పొందేలా చేశారు. ఆపై నకిలీ యాప్ లింక్‌ను పంపి, అందులో రూ.2.05 లక్షలు ఇన్వెస్ట్ చేయించి కాజేశారు. ఇది జరిగిన కొన్ని రోజులకే తెలుగు మ్యాట్రిమోనీ నుంచి వాట్సాప్ ద్వారా బాధితుడికి ఓ మెసేజ్ వచ్చింది. అందులో సైబర్ నేరగాళ్లు పెళ్లి కుమారులు, పెళ్లి కుమార్తెలుగా పరిచయమై ఎర వేస్తున్నారని, ఆపై వివిధ అంశాల్లో తమ అంకుల్, తండ్రి నిష్ణాతులని చెప్పి మోసం చేస్తున్నారని ఉంది. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

తక్షణం ఫిర్యాదు చేయండి

అపరిచితులతో ఎలాంటి లావాదేవీలు వద్దు. ఆన్‌లైన్ ద్వారా ఇన్వెస్ట్‌మెంట్స్ అంటూ వచ్చే ప్రకటనలు నమ్మవద్దు. ఎవరైనా సైబర్ నేరాల బారినపడితే ఏ మాత్రం ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి లేదా 8712665171 నెంబర్‌ను వాట్సాప్ ద్వారా, (cybercrimespshyd@gmail.com) మెయిల్‌కు ఐడీకి ఈ-మెయిల్ ద్వారా సంప్రదించి లేదా (www.cybercrime.gov.in) వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేయాలి.

– సైబర్ క్రైమ్ పోలీసులు

చలి..పులి!

- రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- పటాన్‌చెరులో కనిష్ట ఉష్ణోగ్రత 6.4 డిగ్రీలు

సాక్షి,సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువగా నమోదవుతున్నాయి. గత నాలుగు రోజులుగా చలిపులి వణుకు పుట్టిస్తోంది. రాత్రి ఉష్ణోగ్రతలు అంతకంతకూ పడిపోతుండడంతో సాయంత్రం నుంచే చలి తీవ్రత మొదలవుతోంది. ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలులే ఇందుకు కారణమని వాతావరణ శాఖ సమాచారం. దీంతో గతంలో ఎన్నడూ లేనంతగా రాత్రి కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. పటాన్ చెరులో కనిష్ట ఉష్ణోగ్రత 6.4 డిగ్రీలు, ఇబ్రహీంపట్నం మండలం వెలిమినేడు, షాబాద్ మండలం చందనవెల్లిలో అత్యల్పంగా 6.7 డిగ్రీలు, రాజేంద్రనగర్‌లో 8.4 డిగ్రీలు నమోదయ్యాయి. హైదరాబాద్‌లో సగటున గరిష్ట పగటి ఉష్ణోగ్రత 29.2 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 11.4 డిగ్రీలు నమోదయ్యాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు భారీగా మంచు కురుస్తుంది.

అక్రమ మద్యం పట్టివేత...

154 బాటిళ్లు స్వాధీనం

అబిడ్స్: అక్రమంగా నగరానికి తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి నగరానికి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ తెస్తున్నట్లు సమాచారం అందడంతో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిండెంట్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు చెంగిచెర్ల ప్రాంతంలో కారును తనిఖీ చేయగా 40 బాటిళ్లు లభించాయి. అదే విధంగా రాజేందర్‌నగర్‌లో మరో కారులో 70 బాటిళ్లు, షేక్‌పేట్‌లో క్రాంతి అనే వ్యక్తి ఇంట్లో 20 బాటిళ్లు, ఎస్ఆర్‌నగర్ వద్ద ఓ వ్యక్తి నుంచి 16 బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తరుణ్‌వర్మ, రవీందర్ గౌడ్, విన్ని, సురేందర్‌రెడ్డి, క్రాంతి, నాగరాజ్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులను ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ చేవూరి హరికృష్ణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

వడివడిగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు

- బౌరంపేట సబ్ స్టేషన్‌లో తనిఖీలు
- అదనపు 8 ఎంవీఏ పీటీఆర్‌ను ప్రారంభించిన సీఎండీ

సాక్షి, సిటీబ్యూరో: రానున్న వేసవి కాలంలో పెరగనున్న డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరా కోసం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చర్యలు చేపట్టింది. వేసవి సన్నాహక చర్యల్లో భాగంగా సీఎండీ ముషారఫ్ ఫారూఖీ సోమవారం మేడ్చల్ పరిధిలోని బౌరంపేట 132 కేవీ సబ్‌స్టేషన్, టవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బౌరంపేట్ 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతుందన్నారు. గత ఏడాది వేసవిలో అత్యధికంగా 90.68 మిలియన్ యూనిట్లు నమోదు కాగా, ఈ ఏడాది ఏకంగా 100 ఎంయూలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు అంచనా వేసి, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ..

యువకుడి దారుణ హత్య

అల్వాల్: గంజాయి, మద్యం మత్తులో ముగ్గురు స్నేహితుల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కానాజిగూడకు చెందిన సుంధీల్ సైంథిల్ పెయింటర్‌గా, షేక్ రహీల్, నర్సింహ సెంట్రింగ్ పని చేసే వారు. వీరు ముగ్గురు స్నేహితులు. ఆదివారం సైంథిల్ తన ఇంట్లో అతడి బంధువు రాజ్‌కుమార్, స్నేహితులు రహీల్, నర్సింహలతో కలిసి మద్యం తాగాడు. మద్యం మత్తులో మాటామాటా పెరగడంతో సైంథిల్ కత్తితో రహీల్, నర్సింహపై దాడి చేయబోగా ఆ కత్తి లాక్కున్న వారు అతడిపై విచక్షణరహితంగా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. నిందితులు రహీల్, నర్సింహ నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఆ దారి 'జూ'బ్లీహిల్స్..!

జూబ్లీహిల్స్ రోడ్‌నెం. 45లో జంతుజాలంతో అబ్బురపరిచే చిత్రాలు

ఆ దారిలోకి వెళ్లగానే ముందుగా ఓ జింక కనిపిస్తుంది... దాన్ని దాటగానే దాన్నే చూస్తుండే ఓ చిరుతపులి కనిపిస్తుంది... ఇంకాస్త ముందుకు వెళ్లగానే నక్కినక్కి చూస్తున్న గుంట నక్కలు కనిపిస్తాయి... అలాగే ఇంకొంచెం ముందుకెళ్తే.. అందాల నెమళ్లు, బెంగాల్ టైగర్, అవి దాటగానే తిమింగలాలు, జలచర జీవులు మనల్ని చూపు తిప్పుకోకుండా చేస్తుంటాయి... ఏంటిదంతా అనుకుంటున్నారా..? నగర సుందరీకరణలో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45లోని దుర్గం చెరువును కనెక్ట్ చేసే ఫ్లై ఓవర్ కింద 'జూ'లోని జంతువులన్నింటినీ అద్భుతమైన చిత్రాల రూపంలో అధికారులు నగరవాసులకు ప్రజెంట్ చేసిన తీరు ఇప్పుడు అబ్బురపరుస్తోంది. దీంతో ఈ దారిలోకి వచ్చిన వెంటనే ఓ అడవి ప్రాంతంలోకి వచ్చిన అనుభూతి కలుగుతుంది.

– బంజారాహిల్స్















మాజీ క్రికెటర్, కామెంటర్ సి.వెంకటేశ్ రచించిన 'బిట్ అండ్ పీసెస్ ది లైటర్ సైడ్ ఆఫ్ క్రికెట్' పుస్తకాన్ని సోమవారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి వి.వి.లక్ష్మీనారాయణ, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు వి.చాముండేశ్వరీ నాథ్, బిహార్ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ పరుశురామయ్య, రిటైర్డ్ ఇన్‌కంట్యాక్స్ అధికారి సుబ్బారావులు ఆవిష్కరించారు.

– పంజగుట్ట

ధనుర్మాసోత్సవాలు ప్రారంభం

స్వామివారికి ప్రత్యేక పూజలు



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధనుర్మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, ధనుర్మాస వ్రత దీక్షలు, తిరుప్పావై సేవాకాలం, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. ధనుర్మాస సేవా కాలంలో భాగంగా తెల్లవారుజాము నుంచే గోదాదేవి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. దీంతో ఆలయంలో ధనుర్మాస సందడి నెలకొంది. ఆలయ ప్రధాన అర్చకులు శశికాంతాచార్యులు నేతృత్వంలో విశేష పూజలు జరిగాయి.

జీహెచ్‌ఎంసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

వెంగళరావునగర్: జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని జీహెచ్‌ఎంఈ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) నేతలు డిమాండ్ చేశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని యూసుఫ్‌గూడ సర్కిల్–19 కార్యాలయం ఎదుట మంగళవారం సీఐటీయు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నేతలు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, హైకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలన్నారు. పనికి సమాన వేతనం, నాలుగు లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. అలాగే పారిశుద్ధ్య సేవలో ప్రైవేటీకరణ చర్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లతోపాటు ఎస్‌ఎఫ్‌ఏలకు రూ. 30 వేలు జీతం పెంచాలన్నారు. హాజరులో బయోమెట్రిక్, ఫేస్ రీడింగ్‌ను తక్షణమే రద్దు చేయాలని, తప్పనిసరి పరిస్థితుల్లో గైర్హాజరైతే దానిని వీకాఫ్‌గా పరిగణించాలని అన్నారు. ప్రతినెల మెడికల్ హెల్త్ చెకప్ చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ అధికారులకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నేతలు టి.సాయిశేషగిరిరావు, టి. నాగేష్, మల్లేష్, రాపర్తి అశోక్, జె.స్వామి, సుగుణ, నాగమణి, యాదమ్మ, లక్ష్మి, కళావతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–17లో కొలువుదీరిన శ్రీ సీతారామస్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాస మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా తెల్లవారుజామున తిరుప్పావై పాశురాలు అర్చక స్వాములు వినిపించారు. ఈ సందర్భంగా స్వామివార్లను వైభవోపేతంగా అలంకరించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు.

– బంజారాహిల్స్

21 నుంచి ధ్యాన మహాయాగం



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

పంజగుట్ట: ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వారి సహకారంతో ఈ నెల 21వ తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు 11 రోజులపాటు 'పత్రీజీ ధ్యాన మహాయాగం 3' నిర్వహిస్తున్నట్లు ది పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ హైదరాబాద్ చైర్మన్ విజయభాస్కర రెడ్డి తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండలం, అన్మాస్‌పల్లి గ్రామంలోని పత్రీజీ శక్తిస్థల్ కైలాస్‌పూరిలో జరిగే ఈ కార్యక్రమంలో దేశ విదేశాల నుంచి 11 రోజుల్లో పది లక్షలమంది హాజరై 225 గంటల అఖండ ధ్యానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ధ్యానం, సంగీత ధ్యానం, పత్రీజీ వీడియో సందేశాలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు, సత్సంగాలు, ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జగదీశ్ బాబా, జ్ఞాన వత్సల స్వామి, ఎర్రా ప్రగడ రామకృష్ణ, దాజీనిత్యై సేవిని దేవిల ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. హాజరైన ప్రతీ ఒక్కరికీ నిత్యాన్నదానం, వసతి సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రతినిధులు సాంబశివరావు, మారం శివప్రసాద్, సురేష్ బాబు, బాలకృష్ణ, నిర్మల, రాజేష్ పులా, ధూళిపూడి చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజ వర్మకు ఘన సన్మానం



బంజారాహిల్స్: సోమాజిగూడలోని అయ్యప్ప స్వామి ఆలయానికి పందలరాజ వంశీకులు రాజరాజ వర్మ సోమవారం విచ్చేశారు. ఆలయానికి చెందిన ప్రధాన అర్చకులు 2023–24 సంవత్సరంలోని మాలిక పూర్వ మంజుమాత మేల్ శాంతిగా విధులు నిర్వహించిన మురళి నంబూద్రిని కలిశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాజరాజ వర్మను ఆలయ కమిటీ సెక్రటరీ ప్రసాద్‌తో, జగన్ గురుస్వామి, రాజు ఘనంగా సన్మానించారు.

పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



ఇలంబర్తికి వినతిపత్రం అందజేస్తున్న వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: ఫిలింనగర్, ఇంద్రనగర్‌లలో పెండింగ్‌లోని వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా జూబ్లీహిల్స్ కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తిని కలిసి ఆయనతో చర్చలు జరిపారు. పద్మాలయ అంబేద్కర్‌నగర్, రోడ్డునెంబర్–9 అంబేద్కర్‌నగర్, సాయిబాబా టెంపుల్ రోడ్డు, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ రోడ్డులలో నూతన సీసీ రోడ్ల నిర్మాణంతోపాటు నూతన కమ్యూనిటీ హాళ్లు నిర్మించాల్సిందిగా వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా ప్రారంభ దశలో ఆగిన ఇతర రోడ్లను సైతం పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కమిషనర్ త్వరలోనే పనులను ప్రారంభిస్తామని హామీనిచ్చారు.

సన్మానం



సీఎన్‌రెడ్డిని సన్మానిస్తున్న కమలానగర్ బస్తీ మహిళలు

రహమత్‌నగర్: తమకు కమలానగర్‌లో డబుల్‌బెడ్‌రూం నివాసాలు కేటాయించేందుకు కృషి చేసిన కార్పొరేటర్ సీఎన్‌రెడ్డిని మహిళలు సోమవారం ఆయన కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా బస్తీ మహిళలు లత, పుష్పలు మాట్లాడుతూ కమలానగర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయించడంలో సీఎన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబర్చారని వారు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తాము పడ్డ ఇబ్బందులు కార్పొరేటర్ చొరవతో తీరిపోయాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీ నాయకులు పల్లె సాయిలు, అంతారం యాదగిరి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేస్తే ఊరుకోం

పంజగుట్ట: ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేస్తే ఊరుకోమని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీష్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావులు హెచ్చరించారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత గురువారం రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్, జాఫర్గూడ చెరువు వద్ద నోవా కాలేజీకి సంబంధించిన నిర్మాణాలు బఫర్ జోన్‌లో ఉన్నాయని ఫిర్యాదు అందిందని తెలిపారు. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ఏఈఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్, లష్కర్, రెవెన్యూ సిబ్బంది అక్కడకు వెళ్లగా సుమారు 30 మంది కాలేజీకి చెందిన బౌన్సర్లు ఉద్యోగులపై దాడి చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతాయుతంగా ఉద్యోగం చేస్తుంటే వారిపై దాడి చేయడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు తాము నిత్యం అండగా ఉంటామని, మరోమారు ఎవరైనా ఉద్యోగులపై దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్, టైగర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నూనె శ్రీధర్, ఉపాధ్యక్షులు వి.ప్రకాష్, కార్యదర్శి టీవీ ప్రసాద్, చక్రధర్, బండి శ్రీనివాస్, నాగరాజు, సంతోష్ రెడ్డి, శ్రీకాంత్, సిద్ధార్థ్ పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారణ ఎంతో పవిత్రం



శ్రీనగర్‌కాలనీ: అయ్యప్ప మాలధారణ ఎంతో పవిత్రమని, కోరికలతో పాటు మనిషిలో పరివర్తన, జీవన సత్యాన్ని తెలిపే దీక్షని గురుస్వామి ఎస్.గోపీ అన్నారు. సోమవారం ఎర్రగడ్డ డివిజన్ బి.శంకర్‌లాల్‌నగర్‌లో గోపీ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్నె స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో గణపతిహోమం అనంతరం పడిపూజలో పాల్గొని అయ్యప్ప భక్తి గీతాలను, భజన నిర్వహించారు. పూజలో స్వాములు పృథ్వీరాజ్, రవిప్రసాద్, శ్రీనివాస్, మహేష్, గణపతి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్‌లోని నందగిరిహిల్స్, జూబ్లీహిల్స్, సాగర్ సొసైటీల్లో జరుగుతున్న ప్రభుత్వ స్థలాల కబ్జాలను అరికట్టాలని, కబ్జాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

హ్యాకథాన్‌లో ముఫకంజా విద్యార్థుల సత్తా



హ్యాకథాన్‌లో గెలుపొందిన ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు

బంజారాహిల్స్: ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వంలోని మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్స్ ఇన్నోవేషన్ సెల్ సంయుక్తంగా జాతీయ స్థాయిలో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో బంజారాహిల్స్‌లోని ముఫకంజా ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. కాలేజీకి చెందిన రెండు జట్లు జాతీయ స్థాయిలో వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన హ్యాకథాన్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. రెండురోజులపాటు ఐఐటీ గౌహతి, ఐఐటీ ఖరగ్‌పూర్, ఎన్ఐటీ సురత్కల్, ఐఐటీ గాంధీనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన హ్యాకథాన్‌లో దేశవ్యాప్తంగా పలు కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ విభాగాల్లో ప్రతిభను ప్రదర్శించారు. ముఫకంజా కాలేజీకి చెందిన హబీబ్ సలేహా, సయ్యద్ ఖషీఫ్ ముజ్తబా, మహ్మద్ అబ్రార్, అబ్దుర్ రఫే అఖీల్, జైనా ఫాతిమా అబేది, హుస్సేన్‌లు సభ్యులుగా ఉన్న జట్టు గౌహతిలో జరిగిన పోటీల్లో గెలుపొందగా, మహ్మద్ అఫాన్ ఆసిఫ్, సయ్యద్ ఖరీమ్ ఫౌజాన్, సయ్యద్ ఇమ్రాన్, ఎంఏ ఇబ్రహీం ఫారూఖ్, అమీనా బేగం సభ్యులుగా ఉన్న జట్టు చెన్నైలో జరిగిన పోటీల్లో గెలుపొందింది. గెలుపొందిన జట్లు రూ. 1 లక్ష చొప్పున నగదు బహుమతిని సైతం అందుకున్నట్లు కాలేజీ అధ్యాపకులు తెలిపారు. సోమవారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గెలుపొందిన జట్లను ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ కార్యదర్శి జాఫర్ జావెద్, డీన్ ఫర్హతుల్లా హుస్సేని తదితరులు అభినందించారు.

స్కూల్ లీగ్ క్రికెట్ పోటీల్లో అనిరుద్‌గౌడ్ ప్రతిభ



రహమత్‌నగర్: రహమత్‌నగర్‌కు చెందిన అనిరుధ్‌గౌడ్ క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు. మోతినగర్‌లోని డాన్‌బోస్కో హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న అనిరుధ్‌గౌడ్ హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అజీజ్‌నగర్ (వన్ చాంపియన్ క్రికెట్ గ్రౌండ్)లో నిర్వహించిన అండర్–14 బాలుర స్కూల్ లీగ్ క్రికెట్ పోటీల్లో ఆల్ రౌండర్ నిలిచాడు. మొదటి బ్యాటింగ్‌లోనే 113 రన్‌లకుగాను 127 బాల్స్ ఆడి 14 ఫోర్లను బాదాడు. అలాగే బౌలింగ్‌లో 9.5 ఓవర్లకుగాను 53 రన్‌లు ఇచ్చి 6 వికెట్లను తీసి తన ప్రతిభను చాటుకున్నాడు. ఈ సందర్భంగా అనిరుధ్ మాట్లాడుతూ స్టేట్ క్రికెట్ పోటీల్లో పాల్గొనడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. అనంతరం ప్రతిభ కనబర్చిన అనిరుధ్‌ను పాఠశాల యాజమాన్యం అభినందించారు.

ఆభరణాల దొంగతనానికి పక్కా స్కెచ్

అన్న వేసిన ప్లాన్‌లో ఇరుక్కున్న తమ్ముడు



నిందితులు అన్నదమ్ములు జహీరుద్దీన్, అజహరుద్దీన్..

ఫిలింనగర్: అన్న వేసిన స్కెచ్‌లో ఓ తమ్ముడు ఇరుక్కుపోయి అన్నతో పాటు తమ్ముడు కూడా కటకటాలపాలయ్యాడు. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. టోలిచౌకిలో నివసించే ఎండీ జహీరుద్దీన్ (35), ఎండీ అజహరుద్దీన్ (33) అన్నదమ్ములు. జహీరుద్దీన్ టోలిచౌకిలోని బ్లూస్టోన్స్ ఆభరణాల దుకాణంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తేలిగ్గా డబ్బు సంపాదించే మార్గంలో భాగంగా తాను పని చేస్తున్న దుకాణానికే కన్నం వేయాలని తమ్ముడితో కలిసి పథకం రూపొందించాడు. ఈక్రమంలో తాను స్టోర్‌లో ఉన్నప్పుడు కస్టమర్‌లాగా వచ్చి పక్కనే ఉన్న తన సహచర సేల్స్‌మెన్‌ను ఎలా బురిడీ కొట్టించి ఆభరణాలతో ఉడాయించవచ్చో పక్కా ప్లాన్ వేసి తమ్ముడికి ప్రతి కదలికను వివరించాడు. దీంతో అజహరుద్దీన్ ఆ దుకాణానికి కస్టమర్ లాగా వచ్చి తనకు బ్రాస్‌లెట్ కావాలని సేల్స్‌మెన్‌ను అడిగాడు. అలాగే బంగారు గాజులు కూడా కావాలని చూపించమన్నాడు. ఈ రెండింటినీ సేల్స్‌మెన్ చూపించగా వీటిల్లోనే మరిన్ని డిజైనర్లు కావాలని అడగడంతో సదరు సేల్స్‌మెన్ మరో కౌంటర్ వద్ద వెళ్లాడు. అన్న సైగ చేయగానే అజహరుద్దీన్ అక్కడ ఉన్న నగలతో ఉడాయించాడు. షాపు మేనేజర్ అభినవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగి దుకాణంలో సీసీ పుటేజీని పరిశీలించగా జహీరుద్దీన్ సైగ చేస్తున్న విషయం బయటపడింది. కౌంటర్ మీద బంగారు నగలు ఉన్నా ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఎందుకు ఉన్నావని జహీరుద్దీన్ స్టేషన్‌కు తీసుకువచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించారు. దీంతో తన తమ్ముడే ఈ నగలు దోచుకెళ్లాడని, ఇద్దరం కలిసి ప్లాన్ వేశామని ఒప్పుకున్నాడు. ఫిలింనగర్ పోలీసులు నగలు రికవరీ చేసి సోమవారం ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: రాత్రి ఇంట్లో నిద్రించిన యువతి ఉదయం కనిపించకుండా పోయిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఎస్పీఆర్ హిల్స్‌లోని బస్తీల్లో నివసించే రాములు, అతని కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ఇంట్లో నిద్రపోయారు. ఉదయం 5 గంటలకు రాముల భార్య నిద్రలేచి చూడగా వారి కుమార్తె కనిపించలేదు. సోమవారం ఉదయం నుంచి యువతి కోసం చుట్టుపక్కల, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఫలితం లభించలేదు. యువతికి ఫోన్ కూడా స్విచాఫ్‌గా వస్తుంది. ఇదిలా ఉండగా రెండునెలల కిందట యువతి ఫోన్‌లో ఓ వ్యక్తితో మాట్లాడుతుండగా తల్లి ఎవరని ప్రశ్నించడంతో స్నేహితుడని సమాధానం చెప్పించి. ప్రతిరోజు ఆ యువకుడితో ఫోన్‌లో ఎక్కువగా యువతి మాట్లాడుతుండేది. దీంతో బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి బస్తీబాట



బస్తీ బాటలో బీసీ రాజ్యాధికార నేతలు

వెంకటేశ్వరకాలనీ: బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి బీసీ రాజ్యాధికార సమితి పోరాడుతుందని బీసీ రాజ్యాధికార వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. సోమవారం బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా ఆయన బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీశంకర్ కాలనీ బస్తీలో బస్తీబాట నిర్వహించి అనంతరం బస్తీవాసులతో కలిసి కమ్యూనిటీ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీల్లో నెలకొన్న సమస్యలు గెలుపొందిన ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక అధికారులు, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని బస్తీలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు. అందుకే బస్తీ వారికి బాసటగా నిలిచి సమస్యల పరిష్కారానికై బీసీ రాజ్యాధికార సమితి పని చేస్తుందని అన్నారు. రాధ, పద్మావతి, కిశోర్, శివ పాల్గొన్నారు.

విల్లామేరీలో అదరగొట్టిన విద్యార్థినులు



పంజగుట్ట: విల్లామేరీ జూనియర్ కాలేజీ మ్యాథ్స్, సైన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం 'ఎ థియేట్రికల్ డైమెన్షన్స్' పేరుతో సైన్స్, మ్యాథ్స్ అద్భుతాలను విద్యార్థులు వారి సృజనాత్మకత ద్వారా ప్రదర్శించారు. విద్యార్థులు గణితం, సైన్స్ విభాగాల్లోని వివిధ రూపాలను నాటకాల ద్వారా, డ్యాన్స్‌ల ద్వారా ప్రదర్శించారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కాలేజీ సెక్రటరీ చిన్నమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధిక వడ్డీ పేరుతో మహిళ మోసం

- లక్షలాది రూపాయలు వసూలు
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

బంజారాహిల్స్: అధిక వడ్డీ ఇప్పిస్తానని పలువురి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలని బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల ప్రకారం... అమరావతి ప్రాంతానికి చెందిన కొడాలి శ్రీలక్ష్మి ఆమె భర్త సత్యప్రసాద్‌తో కలిసి వెంకటేశ్వరనగర్ బస్తీలో ఉంటూ బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో పనిచేసింది. ఈ క్రమంలో ఆమె పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు బస్తీలోని ఇతర మహిళలతో పరిచయం పెంచుకుంది. తాను అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని పద్మ కుమార్తెకు మెడికల్ సీటు వచ్చిందని, రూ.2 కోట్ల దాకా ఖర్చవుతుందంటూ నమ్మించింది. ఆమె ఇంటి యజమానికి డబ్బులు ఇస్తే మళ్లీ అధిక వడ్డీతో సహా ఇప్పిస్తానని చెప్పి పలువురి వద్ద లక్షలాది రూపాయలు వసూలు చేసింది. అంతేకాకుండా ఆమె కొడుకు ఇంజినీరింగ్ ఫీజు కోసమని, ఆమె భర్త పెట్టబోయే ఫ్యాక్టరీలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ నమ్మించి లక్షలాది రూపాయలు అప్పు చేసింది. అయితే ఇటీవల భార్యభర్తల వ్యవహారం బయటకు రావడంతో బాధితులు శ్రీలక్ష్మిని నిలదీశారు. కొంతమందికి చెక్కులు రాసి ఇచ్చి ఇంటికి తాళం వేసి ఉడాయించింది. ఆమె ఇచ్చిన చెక్కులను బ్యాంకులో వేయగా బౌన్స్ అయ్యాయి. దీంతో తాము మోసపోయినట్లు గుర్తించిన సుమారు 20 మంది బాధితులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టారు.

ఆన్‌లైన్‌లో డీసిల్టింగ్ వివరాలు తప్పనిసరి



సిటీబ్యూరో: జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో చేసిన డీ సిల్టింగ్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఈడీ మయాంక్ మిట్టల్ ఆదేశించారు. సోమవారం జలమండలి ప్రధాన కార్యాలయంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీసిటీ హైదరాబాద్' లక్ష్యంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటిదాకా 14 వేల ప్రాంతాల్లో 1,758 కిలో మీటర్ల మేర సీవరేజీ పైపులైన్ కు డీ–సిల్టింగ్ పనులు నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా 1.40 లక్షల మ్యాన్ హోళ్లను శుభ్రం చేసినట్లు వెల్లడించారు. కొన్ని రోజులుగా జరుగుతున్న ఈ డ్రైవ్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల పని తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. చాలా సెక్షన్ల మంచి పనితీరు కనబర్చాయని ప్రశంసించారు. అయితే కొన్ని సెక్షన్ల మేనేజర్లు డీ–సిల్టింగ్ వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయడం లేదని తమ దృష్టిలోకి వచ్చిందని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు అలాంటి వారు ప్రక్రియను పూర్తి చేయాలని ఈడీ సూచించారు. జలమండలి ఈ–ఎన్ సీ డైరెక్టర్ రెవెన్యూ ప్రవీణ్ కుమార్, ఆపరేషన్ డైరెక్టర్లు స్వామి, అమరేందర్ రెడ్డి, సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు మాయం

వెంగళరావునగర్: ఇంట్లో దాచిన బంగారు ఆభరణాలు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మధురానగర్‌కు చెందిన జె.శ్రీను మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతని ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉంటున్నారు. ఈనెల 12వ తేదీన బీరువాలో దాచిన బంగారు ఆభరణాలు (బ్రాస్‌లెట్, ఉంగరం, లాకెట్, చైన్) కనిపించకుండాపోయాయి. వాటి విలువ దాదాపు రూ.50 వేలు వరకు ఉంటుంది. ఈనెల 10వ తేదీన శ్రీను తల్లి కంటి ఆపరేషన్ చేయించుకుని వచ్చింది. ఆమెను చూడటానికి అదేరోజు అతడి అక్క పిల్లలు, అతడి పెద్ద కుమారుడు కూడా వచ్చారు. ఈ మేరకు నిందితులపై చర్యలు తీసుకోవాలని బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్య ప్రవర్తన

మహిళ ఫిర్యాదు.. ఇద్దరిపై కేసు నమోదు

వెంగళరావునగర్: తనతో పాటు తన భర్త పట్ల ఇద్దరు వ్యక్తులు అసభ్యకరంగా ప్రవర్తించారంటూ ఓ మహిళ మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వెంగళరావునగర్‌లో నివసిస్తున్న ప్రముఖ పార్టీకి చెందిన సీనియర్ నాయకురాలు తన భర్తతో కలిసి ఆదివారం కాలనీలో వెళుతుండగా స్థానికంగా ఉన్న హాస్టల్ నిర్వాహకుడైన పెద్దపులి శ్రీకాంత్, అతని సోదరుడు పి. శ్రీనివాస్‌లు తీవ్రమైన పదజాలంతో దూషించారు. ఇదేమని ప్రశ్నించగా ఆమెతోపాటు ఆమె భర్త పట్ల అసభ్యకర రీతిలో ప్రవర్తించారు. దీంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని లేబుల్స్ పాప్ అప్ స్పేస్‌లో డి సన్స్ పటోలా ఆర్ట్స్ వస్త్ర ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ కొనసాగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శకులకు ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆలిండియా క్రాఫ్ట్ మేళా ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ఏమండీ.. సిబ్బంది ఏరండీ!

- మార్కెట్లలో సిబ్బంది కొరత.. 60 శాతం మేరకు ఖాళీలు
- అరకొర సిబ్బందికి అదనపు బాధ్యతలు
- సిబ్బంది లేమితో అధికారుల్లో కొరవడిన పర్యవేక్షణ



సాక్షి, సిటీబ్యూరో: మార్కెటింగ్ శాఖను ఉద్యోగుల కొరత వేధిస్తోంది. సిబ్బంది లేమి మార్కెట్ల రాబడిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉండాల్సిన ఉద్యోగుల సంఖ్య 1830 అయితే మాత్రమే ఉన్నారు. గ్రేటర్ పరిధిలోని 4 మార్కెట్ల(మండి)లో 192 ఉద్యోగులు ఉండాల్సి ఉండగా.. కేవలం 67 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఫలితంగా మార్కెట్ల నిర్వహణను ప్రభావితం చేస్తోంది. సిబ్బంది కొరత కారణంగా లక్ష్యసాధనలోనూ మార్కెట్లు వెనుకబడుతున్నాయి. నగరంలోని 4 మార్కెట్లలో కూరగాయలు, పండ్ల, ధాన్యం, పూల క్రయవిక్రయాలు సాగుతున్నాయి. కొన్నేళ్లుగా ఉద్యోగుల నియామకాలు చేపట్టకపోవడం.. ఉన్న ఉద్యోగుల్లో అధికశాతం పదవీ విరమణతో పోస్టులు ఖాళీ అయ్యాయి. సిబ్బంది కొరతతో పర్యవేక్షణ లేక రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. మరోవైపు మార్కెట్‌కు తీసుకొచ్చే సరుకుకు పూర్తిస్థాయిలో ఫీజు కూడా వసూలు కావడం లేదని, సిబ్బంది తక్కువగా ఉండటంతో మార్కెట్ నిర్వహణ కూడా కష్టంగా మారిందని తమపై అదనపు భారం పడుతోందని సిబ్బంది ఉన్నత అధికారులకు పలు దఫాలు గోడు చెప్పుకుంటున్నారని ఓ అధికారి సాక్షికి వివరించారు. సిబ్బంది కొరత ఉండటంతో లక్ష్యం సాధ్యం కావడం లేదని ఉన్నతాధికారులు వాపోతున్నారు.

మార్కెట్	నిర్దేశించిన ఉద్యోగుల సంఖ్య	పనిచేస్తున్న ఉద్యోగులు
గడ్డి అన్నారం మార్కెట్	70	23
హైదరాబాద్ మార్కెట్	68	16
బోయిన్‌పల్లి	30	11
గుడిమల్కాపూర్	24	10

ప్రతి మార్కెట్‌లో 70 శాతం సిబ్బంది కొరత

మార్కెట్లలో 70 శాతం కంటే ఎక్కువ ఉద్యోగుల కొరత ఉన్న ఈ విషయంలో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే కొత్తపేట్ పండ్ల మార్కెట్, ఎల్బీనగర్ మార్కెట్‌తో పాటు మూడు రైతు బజార్లకు వివిధ విభాగాల్లో 70 మంది ఉద్యోగులను కేటాయించారు. కానీ ప్రస్తుతం కేవలం 23 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు.

- హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో మలక్‌పేట్, మాదన్నపేట్, ఉస్మాన్ గంజ్, మీరాలంమండితో పాటు ఇతర మూడు రైతుబజార్లు వస్తాయి. ఇక్కడ కేటాయించిన పోస్టులు 68. కానీ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సంఖ్య కేవలం 16 మంది మాత్రమే. బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి కూరగాయ లు, భరత్‌నగర్ మార్కెట్‌తో పాటు ఐదు రైతుబజార్లు పనిచేస్తాయి. ఈ కమిటీకి 30 మంది ఉద్యోగులను కేటాయించగా కేవలం 11 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.
- గుడిమల్కాపూర్ వ్యవసాయ కమిటీ పరిధిలో కూరగాయలు, పూల మార్కెట్ వస్తాయి. ఈ మార్కెట్‌కు 24 మంది ఉద్యోగులను కేటాయించారు. కానీ పనిచేస్తోంది కేవలం 10 మంది మాత్రమే. ఇలా నగరంలోని ప్రతి మార్కెట్‌లో ఉద్యోగుల కొరత విపరీతంగా ఉంది. దీంతో మార్కెట్‌ల నిర్వహణ సరిగ్గా జరకపోవడంతో ఇటు రైతులు అటు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఉద్యోగుల భర్తీ వెంటనే చేపట్టాలి



గ్రేటర్ పరిధిలోని మార్కెట్లలో 60 శాతం కంటే ఎక్కువ ఖాళీలు న్నాయి. రైతులకు, కమీషన్ ఏజెంట్ల అవసరాలు పూర్తిస్థాయిలో తీరాలంటే మార్కెట్‌లో సిబ్బంది ఉండాలి. పలుమార్లు గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఫలితం లేకుండా పోయింది. మార్కెట్ కార్యకలాపాలు సవ్యంగా సాగాలంటే, ఆదాయం పెరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉద్యోగుల నియామయం చేపట్టాలి.

– చిలుక నర్సింహరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు

గిరిజన గ్రామాల్లో మార్పు లక్ష్యంగా..

- ములుగు జిల్లాలో నాలుగు గ్రామాల దత్తత
- మంత్రి సీతక్క ఆధ్వర్యంలో అవగాహన ఒప్పందం



బంజారాహిల్స్: సమాజాభివృద్ధే లక్ష్యంగా ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఓపెన్ టెక్స్ట్ ఇండియా 'ఒక కార్పొరేట్–ఒక గ్రామం' కింద నగరానికి చెందిన నిర్మాణ్ ఆర్గనైజేషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ భాగస్వామ్యంతో తెలంగాణలోని ములుగు జిల్లాలోని నాలుగు గ్రామాలను అభివృద్ధి చేయనున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–6లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో సోమవారం జరిగిన నిర్మాణ్ సోషల్ ఇంపాక్ట్ కాన్‌క్లేవ్–2024లో ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ప్రారంభించిన 'ఒక కార్పొరేట్–ఒక గ్రామం' కింద గ్రామీణ, గిరిజన గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆమె తెలిపారు. ఇందులో భాగంగా ఓపెన్ టెక్స్ట్ ములుగు జిల్లాలోని చంద్రుతండా, ఎల్బీనగర్, కొడిశాలకుంట, జగన్నపేట్ గ్రామాలను దత్తత తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నాలుగు గ్రామాల అభివృద్ధికి సుమారు రూ.కోటి బడ్జెట్ అవుతుందని అంచనా వేయడం జరిగిందని చెప్పారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, నీటి ట్యాంక్‌లు, బోర్‌వెల్స్ ఏర్పాటు, సోలార్ లైటింగ్ సిస్టం, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, పాఠశాల మరమ్మతులు, ఆరోగ్య శిబిరాలు తదితర అభివృద్ధి పనులు ఉన్నాయన్నారు. ఈ ప్రోగ్రాం ఐదు వేల మంది వ్యక్తులపై ప్రభావం చూపనున్నట్లు వివరించారు. ఈ భాగస్వామ్యం గిరిజన గ్రామాల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సామాజిక, ఆర్థిక అభివృద్ధికి దీర్ఘకాల ప్రయోజనం చేకూరేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఓపెన్ టెక్స్ట్ ఇండియా ఎండీ మనోజ్ నాగ్‌పాల్ మాట్లాడుతూ తెలంగాణలోని గ్రామీణ, గిరిజన గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. నిర్మాణ్ ఆర్గనైజేషన్‌తో ఈ అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం గ్రామీణ భారతదేశ అభివృద్ధి అవసరాలను తీర్చడంలో తమ సంకల్పాన్ని తెలియజేస్తుందన్నారు. మెరుగైన భవిష్యత్తుకు మద్దతు అందించనున్నామని తెలిపారు. జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలని ఆశిస్తున్నామన్నారు. అర్థవంతమైన, శాశ్వత ప్రభావం చూపాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. కార్యక్రమానికి కార్పొరేట్ నాయకులు, సామాజిక ప్రభావ నిపుణులు, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని రకాల వైద్యసేవలు ఒకే చోట


నిలోఫర్ సెంటర్‌లో స్థలాన్ని పరిశీలిస్తున్న శివరాంప్రసాద్, డాక్టర్ నరేందర్, డాక్టర్ రవికుమార్

నిలోఫర్‌లో త్వరలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పీడియాట్రిక్ ఏర్పాటు

నాంపల్లి: ప్రముఖ నవజాత శిశు సంరక్షణ కేంద్రం నిలోఫర్ ఆస్పత్రి త్వరలోనే సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పీడియాట్రిక్ ఆస్పత్రిగా మారబోతోందని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(అకాడమిక్) శివరాం ప్రసాద్ అన్నారు. ఈ సెంటర్ అందుబాటులోకి రాగానే అన్ని రకాల వైద్యసేవలు ఒకే చోట అందుతాయని చెప్పారు. ఇకపై నిలోఫర్‌కు వచ్చే గుండె సంబంధిత రోగులను ఉస్మానియా, గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేసే అవకాశం ఉండదని అన్నారు. ఇది వరకు నిలోఫర్‌లో కార్డియాట్రిక్ సర్జరీలు జరిగేవి కావని, ఇకపై ముక్కు, గొంతు, చెవి, చర్మం, గాయాలు వంటి ఆపరేషన్లు కూడా నిలోఫర్‌లోనే జరుగుతాయని పేర్కొన్నారు. ఇందుకు అవసరమైన వైద్య సిబ్బందిని కూడా త్వరలోనే భర్తీ చేస్తారని అన్నారు. అన్ని రకాల వ్యాధులను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి సర్జరీలు చేయాలన్న రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో సోమవారం నిలోఫర్ ఆస్పత్రి డీఎంఈ –అకాడమిక్ శివరాం ప్రసాద్, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్ నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రవికుమార్‌తో కలిసి ఆస్పత్రిలో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ పీడియాట్రిక్‌ను ఏర్పాటు చేసే విషయమై వారు సమాలోచన చేశారు. ఇందుకోసం పాత బిల్డింగ్‌లోని రెండవ అంతస్తు, రాజీవ్ ఇంటెన్సివ్ కేర్ బ్లాక్ ఐదవ అంతస్తులోని పలు ఖాళీ గదులను పరిశీలించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే అంశంపై చర్చించారు. అలాగే హెచ్‌ఏఎల్ ఓపీ భవన నిర్మాణం పనులను పరిశీలించారు. జీ+3 స్థానంలో జీ+5 అంతస్తులను నిర్మించాలని ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్ సూచించారు. కార్యక్రమంలో సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ నాగజ్యోతి, డాక్టర్ భువనేశ్వర్ పాల్గొన్నారు.

శిల్పా ఫ్లైఓవర్ పనుల్లో వేగం పెంచాలి

– జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి


గచ్చిబౌలిలోని శిల్పా ఫ్లై ఓవర్ రెండో దశ పనులను పరిశీలిస్తున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

గచ్చిబౌలి: శిల్పా ఫ్లైఓవర్ రెండో దశ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో కలిసి గచ్చిబౌలిలోని శిల్పా ఫ్లైఓవర్ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. పియర్స్ క్యాప్, డెక్‌స్లాబ్ కాస్టింగ్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. సర్వీస్ రోడ్డు పనులకు ఆటంకంగా ఉన్న ఆస్తుల సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గచ్చిబౌలి కూడలిని మరింత విస్తరించాలని, రహదారి విస్తరణలో అడ్డుగా ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ప్రత్యామ్నాయ ఏరాట్లు చేయాలని ఆయన స్పష్టం చేశారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు. హెచ్ఎంఎస్‌డబ్ల్యూ బ్యాలెన్స్ యుటిలిటీ షిఫ్ట్‌కు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సదరు విభాగంతో సమన్వయం చేస్తున్నామని, షిఫ్టింగ్ పూర్తయితే సర్వీస్ రోడ్డు పనుల్లో మరింత వేగం పెరిగే అవకాశం ఉందని ఆయన కమిషనర్‌కు వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ సీఈ దేవానంద్, డీసీ ముకుంద్‌రెడ్డి, వెస్ట్ జోనల్ సీపీ శ్యామ్‌కుమార్, ఏసీపీ వెంకటరమణ, ఈఈ మల్లిఖార్జున్, రోడ్ వైడనింగ్ అధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాలకు సముచిత స్థానం కల్పించాలి


మాట్లాడుతున్న సిరిగిరి మన్నెం, కడమంచి సహదేవుడు

కాచిగూడ: ఎస్సీ కులాల ఎబీసీడీ వర్గీకరణలో బేడ బుడగ జంగాలకు సముచిత స్థానం కల్పించాలని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్నెం, జాతీయ అధ్యక్షుడు కోడిగంటి నర్సింహ, కడమంచి సహదేవుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కమీషన్ల పేరుతో 5నెలలుగా కాలయాపన చేస్తోందని వారు విమర్శించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 15 శాతం రిజర్వేషన్లలో ఎస్సీలు ఉన్నా 59 కులాల్లో కేవలం మాలలు, మాదిగలకు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు అందాయే తప్ప మిగతా 57 కులాలకు ఏమాత్రం రిజర్వేషన్ ఫలాలు అందలేదని అన్నారు. రాష్ట్రంలో 8 నుంచి 10 లక్షల వరకు ఉన్న బేడ బుడగ జంగాల ప్రజలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీల్లోని సంచార జాతుల కులాలన్నింటినీ ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి రిజర్వేషన్ల కోటా పెంచాలన్నారు. ఈ నెల 30న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బేడ బుడగ జంగాల ఆత్మీయ సమ్మేళనంలో పలు అంశాలపై చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, గగనం మన్యం, చిన్న కోటయ్య, మోతె రాములు, రమేష్, అంజి, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

రసూల్‌పురా: సీఎం కప్–24 హైదరాబాద్ జిల్లాస్థాయి క్రీడాపోటీలు సోమవారం సికింద్రాబాద్ జింఖానా మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడాకారులను తయారు చేయడానికి క్రీడా యూనివర్సిటీ, క్రీడాపాలసీ అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా క్రీడాశాఖకు రూ.320 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. జిల్లా యువజన, క్రీడాధికారి సుధాకర్ మాట్లాడుతూ సీఎం కప్ పోటీల్లో మండలస్థాయిలో 16 మండలాల్లో జరిగిన పోటీల్లో 1,700 మంది క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశామని, ఈనెల 21వ తేదీ వరకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సీఐఎస్ఎఫ్ ఉత్తమ ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ కమాండోలు

జవహర్‌నగర్: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో 29వ సీఏపీఎఫ్ డిబేట్ కాంపిటీషన్–2024 న్యూఢిల్లీలోని అటల్ అక్షయ ఉర్జా భవన్‌లో దేశంలోని సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సాయుధ బలగాలకు ఇటీవల పోటీలను నిర్వహించారు. పోటీల్లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ హైదరాబాద్ గ్రూప్ నుంచి సాయుధ బలగాలు హాజరై ప్రత్యేక ప్రతిభ కనబర్చి ట్రోఫీ సాధించారు. మానవ హక్కుల సమస్యలపై అవగాహనలో ప్రతిభ కనబర్చి ఎస్ఐ రాహుల్, అసిస్టెంట్ కమాండెంట్ కన్హా జోషి విజయం సాధించగా హిందీ, ఇంగ్లిష్ భాషలో అసిస్టెంట్ కమాండెంట్లు అక్షయ్ బడోలా 2వ స్థానం, భాస్కర్ చౌదరి 3 స్థానాల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ దీపక్‌వర్మ సీఐఎస్ఎఫ్ కమాండోలను అభినందించారు.

గ్రేటర్ పరిధిలో ప్రజావాణికి 142 దరఖాస్తులు

లక్డీకాపూల్: ప్రజావాణికి ప్రాధాన్యత ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, సుభద్ర దేవి, నళిని పద్మావతి, పంకజ, సరోజ, చంద్రకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, రఘుప్రసాద్, యాదగిరిరావు, వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ సీసీపీలు గంగాధర్, ప్రదీప్, ఏసీపీ సుదర్శన్, ఎస్టేట్ అధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19 ఏళ్ల క్రితం స్థలం సేకరించారు..

ప్రజావాణికి వీల్‌చైర్‌లో వచ్చిన డాక్టర్ మీనాక్షి హిమాయత్‌నగర్ మెయిన్ రోడ్డు విస్తరణలో భాగంగా 19 ఏళ్ల క్రితం తన ఇంటి స్థలాన్ని సేకరించారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు తనకు రావాల్సిన రూ.93 లక్షల పరిహారాన్ని అధికారులు ఇంకా చెల్లించలేదని ఆవేదన చెందారు. తమకు న్యాయం చేయాల్సిందిగా ఆమె వేడుకున్నారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ ఇలంబర్తి

20 నుంచి మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో


మాట్లాడుతున్న ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్

సుల్తాన్‌బజార్: ప్రజలకు సొంతింటి కల నెరవేర్చేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో ద్వారా హోమ్ లోన్స్ ప్రవేశ పెడుతుందని ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కోఠిలోని ఎస్‌బీఐ లోకల్ హెడ్‌ఆఫీస్‌లో మెగా ప్రాపర్టీ ఎక్స్‌పో అడ్వటైజ్ మెంట్ వాహనాలను అనే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల మావేశంలో రాజేష్‌కుమార్‌తో పాటు డీజీఎంలు రవికుమార్, బాలానంద్‌లతో కలిసి మాట్లాడారు. ఎస్‌బీఐ ఇప్పటికే మార్కెట్ లీడర్‌గా దూసుకుపోతుందన్నారు. దేశంలో 22,500 వేల బ్రాంచ్‌లతో కొనసాగుతుందన్నారు. ఇప్పటికే 7.95 ట్రిలియన్ మార్క్ హోమ్ లోన్ బిజినెస్‌ను నిర్వహించిందని ఆయన తెలిపారు. హైదరాబాద్ సర్కిల్ రూ.10 వేల కోట్ల హౌసింగ్ లోన్ మార్కెటింగ్ చేసిందన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 20, 21, 22 తేదీలలో మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ ప్రాపర్టీ ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో 50 కి పైగా పెద్ద బిల్డర్లు, పేరొందిన ప్రాజెక్ట్స్ పాల్గొంటాయని తెలిపారు. ఆసక్తిగల ప్రజలు ఫ్రీ ఎంట్రీ ద్వారా పాల్గొనవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి వాటర్ పోల్ జట్టుకు అనిరుధ్ ఎంపిక

లక్డీకాపూల్: రాష్ట్రస్థాయి వాటర్ పోల్ జట్టుకు హైదరాబాద్‌కు చెందిన లింగంనేని అనిరుధ్ ఎంపికైనట్లు హైదరాబాద్ స్విమ్మింగ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ ఎస్.గిరిధర్‌రావు తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ రాష్ట్ర జట్టును వెల్లడించినట్లు సోమవారం స్థానిక ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఈ నెల 7, 8 తేదీల్లో భూపాలపల్లిలోని సింగరేణి స్విమ్మింగ్ పూల్‌లో వింటర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో పాల్గొన్న బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థి అనిరుధ్ సత్తాచాటి హైదరాబాద్ జిల్లా నుంచి వాటర్ పోల్ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. స్టాక్స్ స్విమ్ స్కూల్ నిర్వాహకులు భరత్ కుమార్, ఇన్‌చార్జి ప్రసాద్‌ల పర్యవేక్షణలో కోచ్ సయ్యద్ ముఖ్తార్ అహ్మద్, శ్రీధర్ కోడిల వద్ద వాటర్ పోల్‌లో నైపుణ్యాన్ని పొందిన అనిరుధ్ రాష్ట్రస్థాయి జట్టులో కూడా సత్తా చాటుకుంటారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ నెల 27 నుంచి 3 రోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో 35వ సౌత్ జోన్ ఆరవ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయని చెప్పారు. సమావేశంలో సీనియర్ స్విమ్మర్ లింగంనేని మారుతి శంకర్ పాల్గొన్నారు.



తెలంగాణ వాటర్ పోల్ జట్టుకు ఎంపికైన అనిరుధ్‌ను అభినందిస్తున్న గిరిధర్

ఎక్సైజ్ శాఖ మంత్రిగా గౌడ కులస్తులను నియమించాలి


మాట్లాడుతున్న మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్

మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్

కాచిగూడ: త్వరలో జరగనున్న మంత్రివర్గ విస్తరణ, మంత్రుల శాఖల మార్పు సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రిగా గౌడ కులస్తులకు కేటాయించాలని మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోకుదెబ్బ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ శాఖ మంత్రి పదవిని గౌడ కులస్తులకు కేటాయించి కల్తీ పేరిట రాష్ట్రవ్యాప్తంగా అబ్కారి దాడులను అరికట్టి అక్రమ వసూళ్లు, వేధింపులు అరికట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఆనవాయితీగా ఎక్సైజ్ శాఖ మంత్రిగా గౌడ కులస్తులైన ఎమ్మెల్యేలకు కేటాయిస్తున్నారని, ఇప్పుడు గౌడలకు కాకుండా ఇతర కులస్తులకు ఇవ్వడం వల్ల కులవృత్తిలో ఉన్న గౌడ కులస్తులకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ఆరు నెలల నుంచి రాష్ట్రవ్యాప్తంగా గౌడ కులస్తులపై కల్లు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ దాడులు అధికమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో రాగుల సిద్ది రాములుగౌడ్, కొండాపురం బాలరాజ్ గౌడ్, ఏవీ బాలేశం గౌడ్, బాలసాని సురేష్ గౌడ్, కేసరి ఆంజనేయులు గౌడ్, ముత్యం నర్సింహులు గౌడ్, సిపతి లింగాగౌడ్, బాలగోని రేఖగౌడ్, శైలజ, కదిరే అంజనేయులు గౌడ్, మొండిగౌడ్, పచ్చిమడ్ల స్వామిగౌడ్, కొండ్ర మనోహర్‌గౌడ్ పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి యత్నం

- ముట్టడిని భగ్నం చేసిన పోలీసులు
- బండ్లగూడ పీఎస్‌కు ఆందోళనకారుల తరలింపు


ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాంపల్లి: రాష్ట్రవ్యాప్తంగా అన్నిశాఖల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని, అడ్డాగా మారిన డ్రగ్స్, గంజాయి తదితర మాదక ద్రవ్యాలతో పాటు మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్స్, నర్సు, శానిటరీ పోస్టులను భర్తీ చేసి అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందించాలని, మందులు, టెస్టులు, స్కానింగ్‌లను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోని దోపిడీని అరికట్టాలని, ఫీజుల వివరాలు నోటీస్ బోర్డులో పొందుపర్చాలని డిమాండ్ చేస్తూ.. వీటిపై అసెంబ్లీలో చర్చించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ప్రగతిశీల యువజన సంఘం పీవైఎల్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, నాయకులకు మధ్య తీవ్రమైన తోపులాట జరిగింది. బలవంతంగా ఆందోళనకారులను అరెస్టు చేసి బండ్లగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పివైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు ఎండమావిలా మారాయని ధ్వజమెత్తారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు. ఫలితంగా ఆ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెడితే, కాంగ్రెస్ కూడా గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే అనుసరిస్తోందని విమర్శించారు. ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు ఉద్యోగ ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనమాల సత్యం, గౌర్రెపాటి రమేష్, సహాయ కార్యదర్శులు పర్శిక రవి, బేజాడి కుమార్, కోశాధికారి ధరావత్ రవి, రాష్ట్ర నాయకులు పగడాల శివ, బండి రవి, షేక్ షబ్బీర్, భాస్కర్, అంగోత్ లాలునాయక్, డి.శంకర్, ఎస్.సుధాకర్, అరుణ్‌కుమార్, పి.నర్సింహ, పవన్, నగర నాయకుడు వేణు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం
17 డిసెంబర్ 2024



సేవే.. సంకల్పం..

- భవిష్యత్తు తరాలకు బాసటగా
- ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు హాసినీరెడ్డి

ప్రజలకు సేవ చేయాలంటే పెద్ద స్థాయి, పేరు ప్రఖ్యాతులే ఉండాల్సిన అవసరం లేదు. మంచి చేయాలనే సంకల్పం, లక్ష్యంపై స్పష్టమైన అవగాహన ఉంటే చాలు. అది ప్రకృతి పరిరక్షణకైనా, పేదల పిల్లల విద్యాభివృద్ధికోసమైనా.. యువతకు ఉపాధి అవకాశాల కల్పన, డ్రగ్స్ నిర్మూలన, ఇలా ఏ కోణంలోనైనా చూడొచ్చు. మనం క్రమశిక్షణతో నడుచుకున్నా పరోక్షంగా ఎంతో మందికి మేలు చేసినట్లే అవుతుందని అంటున్నారు ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు హాసినీ రెడ్డి. ఐఏఎస్ కావాలనుకున్న కల తృటిలో తప్పింది. దీంతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 'మనం కావాలనుకున్నది మనకు లభించనప్పుడు మరో మార్గంలో ప్రయత్నించాల్సిందే. అప్పుడే మన కల సాకారం అవుతుందంటారు'.. ఆమె. - సాక్షి, సిటీబ్యూరో

నాకు ఏదో ఒక మంచి పొజిషన్ వస్తేనే నేను ఇది చేయాలని లక్ష్యాలను నిర్దేశించుకోవడం మంచిది కాదనుకున్నాను. మెరుగైన సమాజం కోసం ప్రతి ఒక్కరు ప్రయత్నించాలి. అందుకే నా వంతుగా ఏం చేయాలనుకున్నానో అదే చేస్తున్నాను. నా ఆలోచనలకు అనుగుణంగా టార్గెట్ ఎంచుకున్నా. హైదరాబాద్‌లోని హెచ్‌సీయూలో చదువుకున్నాను. స్థానిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. వీలైతే ప్రకృతిని పెంపొందించి, భవిష్యత్తు తరాలకు అందించాలే తప్ప ఉన్నదాన్ని నాశనం చేసే హక్కు మనకి ఎవరిచ్చారు.? ఫౌండేషన్ నుంచి పది రకాల కార్యక్రమాలను రూపకల్పన చేశాం. అవగాహనా కార్యక్రమాలు, ఆపదలో ఉన్నవారికి సహాయ, సహకారాలు అందిస్తున్నాను. ఈ క్రమంలో వాలంటీర్లు, మా సహచరులతో అండగా నిలుస్తున్నారు. 2019లో చలి కాలంలో రోడ్లపై ఉన్న వారికి దుప్పట్లు పంపిణీ, పేదలకు ఆహారం అందించడం వంటి సేవా కార్యక్రమాలు మొదలుపెట్టాను. ప్రస్తుతం డ్రగ్స్ నిర్మూలనకు, యువతకు సరైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం ప్రయత్నిస్తున్నాం. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విజయవాడలో ఇస్కాన్‌తో కలసి భారీ ర్యాలీ చేశాం. భారీ స్పందన వచ్చింది. పలువురు అభినందనలు తెలిపారు. ఇది చాలా సంతోషం అనిపించింది.

మేమే ప్లాట్‌ఫాం ఇస్తాం..

ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన ఉన్న వారికి మేం ప్లాట్ ఫాం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. ఎలాంటి సర్వీస్ చేయాలని అనుకుంటున్నారో స్పష్టమైన అవగాహనతో ముందుకొచ్చిన వారికి మా వాలంటీర్లు, ఫౌండేషన్ సభ్యులు పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందిస్తారు.

పది రకాల ప్రాజెక్టులు..

ప్రతిఒక్కరి విద్యాభివృద్ధికి అవసరమైన పరిస్థితులను కల్పించడం, సకల సదుపాయాలతో స్థిరమైన నగరాలు, కమ్యూనిటీలను అభివృద్ధి చేయడం, ఆరోగ్యంపై అవగాహన, ఉచిత మెడికల్ క్యాంపులు, స్వచ్ఛమైన తాగు నీరు, మెరుగైన పారిశుద్ధ్యం, యువతకు ఉపాధి అవకాశాలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి వాటిపై పనిచేస్తున్నాం.



హెచ్‌సీఎల్ నుంచి 'టెక్ బీ'..


సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థి దశలోనే ఉపాధిని అందించే వీలుగా డిజైన్ చేసిన తమ టెక్ బీ ప్రోగ్రామ్ కోసం ప్రముఖ టెక్నాలజీ ఉత్పత్తుల కంపెనీ హెచ్‌సీఎల్ టెక్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. నగరంలో 12వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ఎంపిక చేసిన అభ్యర్థులకు 12 నెలల పాటు శిక్షణా తరగతులు ఉంటాయని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నవారికి ఉద్యోగాలతో పాటు, బిట్స్ పిలానీ, తదితర సంస్థల్లో ఉన్నత విద్యకు పార్ట్ టైమ్ కోర్సులు చేసేందుకు వీలు కల్పిస్తామన్నారు. అదనపు వివరాలకు తమ వెబ్‌సైట్‌ని సందర్శించాలని కోరారు.





హైదరాబాద్ అంటే బిర్యానీ.. బిర్యానీ.. అంటే హైదరాబాద్.. ఈ రెండింటికీ మధ్య విడదీయరాని బంధం అలాంటిది. ఈ విషయం భాగ్యనగర వాసులతోపాటు ప్రపంచమంతా తెలిసిందే.. ఎందుకంటే దశాబ్దాల తరబడి బిర్యానీకి హైదరాబాద్ నగరం కేరాఫ్ అన్నట్టుగా మారింది. అయితే మన చవులూరించే చరిత్ర కేవలం బిర్యానీ మాత్రమే కాదు.. దీంతోపాటు పలు రకాల బిస్కెట్లకు కూడా గుర్తింపు ఉందని అంటున్నారు నగరానికి చెందిన బేకరీ నిర్వాహకులు. ఈ బిస్కెట్స్‌లో ఇరానీ చాయ్‌తో జోడీ కట్టేవి కొన్నయితే.. క్రిస్మస్ లాంటి పండుగల సందర్భంగా ఇచ్చిపుచ్చుకునే గిఫ్ట్ ప్యాకెట్స్‌గా మారేవి మరికొన్ని. అలాంటి కొన్నింటిపైనే ఈ కథనం.. - సాక్షి, సిటీబ్యూరో

భాగ్యనగర్.. బిస్కెట్ కా ఘర్..



- చాయ్ రుచికి చక్కని జోడీ
- ఉస్మానియా నుంచి.. కారా వరకూ..
- హైదరాబాద్ బిస్కెట్లకూ ఓ ప్రత్యేకత
- ఒరిజినల్ టేస్ట్‌కి కేరాఫ్ అడ్రస్‌గా
- అప్పట్లో రోగులకు అల్పాహారంగా
- అల్పాహారం మాత్రమేనా..! గిఫ్ట్ ప్యాక్స్ కూడా..



నాటి నిజామ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ కాస్త సాల్ట్, కాస్త స్వీట్ కలగలిసిన రుచికరమైన ఈవెనింగ్ స్నాక్స్ కోసం చేసిన అన్వేషణే ఉస్మానియా బిస్కెట్‌కి ఊపిరిపోసిందని చరిత్ర చెబుతోంది. ఆయనే నిర్మించిన ఉస్మానియా ఆస్పత్రిలో రోగులకు అల్పాహారంగా కూడా ఇది వినియోగించారని చరిత్రకారులు చెబుతుంటారు. దేశంలోనే రాజ ప్రాసాదం నుంచి వచ్చిన రాయల్ గుర్తింపు కలిగిన తొలి బిస్కెట్‌గా దీన్ని చెప్పొచ్చు. వెన్న, పంచదార, కస్టర్డ్ పౌడర్, సోడా, యాలకుల పొడి, కుంకుమ పువ్వు, పాల మేళవింపుతో ఈ బిస్కెట్ అప్పుడు రోగుల ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తయారైందట.

తొలి రాయల్ బిస్కెట్..

కాగా ఈ రాయల్ బిస్కెట్‌ని నగర మార్కెట్‌కి పరిచయం చేసింది మాత్రం సుభాన్ బేకరీ. ఉస్మానియా బిస్కెట్ పేరుతో మార్కెట్‌లోకి విడుదలైన ఈ బిస్కెట్‌ను ఒక కప్పు ఇరానీ చాయ్‌తో ఆస్వాదించడం అప్పుడు.. ఇప్పుడూ.. ఎప్పుడూ హైదరాబాదీలకు నిత్యకృత్యం.

హిస్టారికల్ టూటీ ఫ్రూటీ..

పురాతన హైదరాబాదీ బిస్కెట్‌గా గుర్తింపు పొందిన మరొకటి ఫ్రూట్ బిస్కెట్. ఇది రోజువారీ వినియోగం కన్నా.. ఇచ్చి పుచ్చుకునే బహుమతిగా టూటీ ఫ్రూటీ ప్యాక్ బాగా పేరొందింది. నగరవాసులు విదేశీ పర్యటనకు వెళ్లడానికి ముందుగా కరాచీ బేకరీ నుంచి పుట్టిన ఫ్రూట్ బిస్కెట్‌ను ప్యాక్ చేయించుకోవడం చాలా మందికి అలవాటు.

ఛాయ్ అండ్ 'టై'.. సూపర్ భాయ్..

ప్రత్యేకమైన విల్లు–టై ఆకృతి ద్వారా ప్రసిద్ధి చెందిన ఈ బిస్కెట్లు కొంచెం గట్టిగా ఉంటాయి. ఇవి ఒక కప్పు ఇరానీ ఛాయ్‌కి అద్భుతమైన కాంబినేషన్‌గా చెప్పొచ్చు. వీటి తేలికైన, పొరలతో కూడిన రుచి తియ్యటి బిస్కెట్‌ల నుంచి వేరు చేస్తుంది. కిలో రూ.300 నుంచి రూ.350 వరకూ ఉంటుంది.



వెనీలా రుచుల చంద్రవంక..

చంద్రవంక ఆకారంతో ఉంటుంది కాబట్టి ఈ బిస్కెట్‌కి ఆ పేరు పెట్టారు. ఇది తేలికపాటి తీపితో మధ్యకు విరిగిన ఆకృతి కలిగి ఉంటుంది. ఈ బిస్కెట్‌లను తరచూ వెనిలా లేదా పాలతో బేక్ చేసి, వాటికి సున్నితమైన, లలితంగా ఉండే రుచిని అందజేస్తారు. వీటినే టూటీ ఫ్రూటీ బిస్కెట్స్ అని కూడా అంటారు. వీటి ధరలు సుమారు కిలో రూ.400 నుంచి రూ.500 మధ్యలో ఉన్నాయి.

చాయ్‌తో.. ఫైన్ బిస్కెట్..

నగరంలోని బేకరీలలో దీర్ఘకాల వారసత్వం కలిగిన మరొక హైదరాబాదీ ట్రీట్‌గా దీన్ని చెప్పొచ్చు. దీనిని పలుచని పొరలుగా వేయడం అనేది కొంత శ్రమతో కూడిన ప్రక్రియగా తయారీదారులు చెబుతారు. ఈ బిస్కట్‌లో పంచదార పాకం, కొద్దిగా మంచిగా పెళుసైన క్రస్ట్ ఉంటుంది. ఇది ఇరానీ చాయ్‌తో మరో చక్కని కాంబినేషన్. చాయ్‌లో ముంచినప్పుడు మెత్తగా మారి దానికి సరికొత్త తీపిని జోడిస్తుంది. ఇది కిలో రూ.300 నుంచి ఆపైన అందుబాటులో ఉన్నాయి.

రుచికి దాసోహం 'కారా'..

ఇది నగర టీ సంస్కృతి ప్రత్యేకతకు దోహదం చేసే మరో రుచికరమైన బిస్కెట్ ఖారా. వీటిని పిండి, వెన్నతో పాటు మరికొన్ని సుగంధ ద్రవ్యాల మిశ్రమంతో తయారు చేస్తారు. తరచుగా జీలకర్ర లేదా నువ్వులు కూడా ఈ మేళవింపులో చోటు చేసుకుంటాయి. ఇవి చాయ్ రుచికి మసాలాని జోడించి వైవిధ్యభరితమైన ఆస్వాదనను అందిస్తాయి. ఇది కిలో రూ.350 నుంచి రూ.400 మధ్య అందుబాటులో లభిస్తుంది.

బిస్కెట్ల చరిత్ర అ'పూర్వం'..



బిర్యానీ కన్నా అతి పురాతన చరిత్ర కలిగిన బిస్కెట్లు మన నగరానికి ఉన్నాయి. అయితే చాలా మందికి వాటి విశేషాలు తెలియవు. బిస్కెట్స్‌లో మేం పరిచయం చేసిన ఉస్మానియా బిస్కెట్ విదేశాలకు సైతం ఎగుమతి అవుతుంది. చాంద్ బిస్కెట్, టై బిస్కెట్ వంటివి ఇప్పటికీ పలువురు రాజకీయ ప్రముఖులు సైతం రెగ్యులర్‌గా ఆర్డర్ చేస్తుంటారు. ముఖ్యంగా వింటర్ సీజన్‌లో ఛాయ్‌కి డిమాండ్ ఎక్కువ.. దీంతో పాటే ఖారా వంటి బిస్కెట్స్‌కి డిమాండ్ పెరుగుతుంది.

– సయ్యద్ ఇర్ఫాన్, సుభాన్ బేకరీ



టేస్ట్ ఎంజాయ్ చేయాలంటే..

ఈ బిస్కెట్ల ఒరిజినల్ టేస్ట్‌ని ఎంజాయ్ చేయాలంటే కొంత ఎంక్వయిరీ చేసుకుని వెళ్లాల్సిందే. ఎందుకంటే.. కొన్ని పాత బేకరీలు మాత్రమే వాటిని పాత పద్ధతిలో తయారు చేస్తున్నాయి. '1951లో మా తాత మొహమ్మద్ యాసీన్ ఖాన్ బేకరీని ప్రారంభించినప్పుడు, జనాదరణ పరంగా అగ్రస్థానంలో ఉస్మానియా బిస్కెట్ ఉండగా ఆ తర్వాతి స్థానాల్లో ఖారా బిస్కెట్, చాంద్ బిస్కెట్, ఫైన్ బిస్కెట్, టై బిస్కెట్ ఉండేవి. ఇవి అప్పట్లో ఎంతగా ప్రాచుర్యం పొందాయంటే, అవి లేకుండా అల్పాహారం, టీ సమయం మాత్రమే కాదు, పెళ్లి విందులు సైతం ఉండేవి కావు. ఇప్పటికీ వీటిని రెగ్యులర్‌గా వినియోగించేవాళ్ల వల్ల తగినంత డిమాండ్ ఉంది' అని రోజ్ బేకరీ యజమాని ముజాఫర్ ఖాన్ అంటున్నారు. కాగా సోషల్ మీడియా ట్రెండ్స్‌తో మమేకమవుతున్న నేటి యువతకు హైదరాబాద్ సంప్రదాయ బిస్కెట్‌ల గురించి తెలియజేయాల్సిన అవసరం ఉంది అంటున్నారు నగరంలోని పలువురు బేకరీల నిర్వాహకులు.

రాయల్ బ్రిటిష్ స్టైల్‌లో.. కే పార్టీ..



సాక్షి, సిటీబ్యూరో: ఒక వైపు అందాల తారల క్యాట్ వాక్, మరో వైపు రాయల్ బ్రిటిష్ స్టైల్‌ను ప్రతిబింబించిన సోయగాలు.. వెరసి నగరంలో నిర్వహించిన సరికొత్త థీమ్ సెలబ్రేషన్స్ 'కే పార్టీ' విశేషంగా ఆకట్టుకుంది. నూతన సంవత్సర వేడుకలకు స్వాగతం పలికేలా ఈ వేడుకలను సుచిరిండియా గ్రూప్ సీఈఓ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బల్గేరియా గౌరవ కన్సల్ లయన్ డాక్టర్ కిరణ్ నిర్వహించారు. ప్రతి ఏడాదీ అత్యంత వైభవంగా నిర్వహించే 'కే పార్టీ' ఈ సారి కూడా హాట్ టాపిక్‌గా నిలిచింది. ఇందులో భాగంగా టాప్ మోడల్స్‌తో నిర్వహించిన ఫ్యాషన్ షో ఔత్సాహికులను అలరించింది. ఇందులో పలువురు సినిమా ప్రముఖులు, వ్యాపారవేత్తలతో పాటు వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులు పాల్గొన్నారు.

ఫ్యాషన్, గ్లామర్, ఎలిగెన్స్‌తో ప్రత్యేక వేడుక
అలరించిన టాప్ మోడల్స్ ఫ్యాషన్ వాక్









మార్స్‌తో క్రాన్‌వెట్ జతకట్టి..

సాక్షి, సిటీబ్యూరో: పెంపుడు జంతువుల సంరక్షణకు సంబంధించిన సేవలు అందించే నగరానికి చెందిన క్రాన్ వెటర్నరీ సర్వీసెస్ (క్రాన్‌వెట్) అంతర్జాతీయ సంస్థ మార్స్ వెటర్నరీ హెల్త్‌తో చేతులు కలిపింది. ఈ విషయాన్ని క్రాన్ వెట్ వ్యవస్థాపకులు ప్రతాప్ సిన్హ్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంతో పాటు పూణె, ముంబయి, ఢిల్లీ, బెంగళూరులోనూ పెట్స్ యజమానులకు అవసరమైన సేవలు అందిస్తున్నామన్నారు. ఉత్తర అమెరికా, యూరప్‌తో పాటు అంతర్జాతీయంగా పేరొందింది. ఈ రంగంలో 90 ఏళ్ల అనుభవం కలిగిన 'మార్స్'తో తాము చేతులు కలపడం తమ సిబ్బందికి శిక్షణ నగరంలోని పెట్ ఓనర్స్‌కు మరింత మెరుగైన సేవల్ని అందించేందుకు వీలు కలుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రిస్మస్‌కు సోషల్ మజా!

డిసెంబర్ 19 నుంచి జనవరి 1 వరకూ నాన్‌స్టాప్ డిషెస్

సాక్షి, సిటీబ్యూరో: క్రిస్మస్‌కు సరికొత్త రుచులతో పలు రెస్టారెంట్లు సిద్ధమవుతున్నాయి. నగరంలోని సోషల్ రెస్టారెంట్ ఓ అడుగు ముందుకేసి.. క్రిస్మస్‌తో పాటు వింటర్ స్పెషల్ ఫుడ్ అందుబాటులోకి తీసుకురానుంది. డిసెంబర్ 19 నుంచి జనవరి 1 వరకూ నాన్ స్టాప్ డిషెస్‌లో ఆహార ప్రియులను అలరించనున్నాయి. ఎంతగానో ఎదురుచూస్తున్న 'ది నాటీ లిస్ట్ బాష్'తో ఉర్రూతలూగించనుంది. వెల్వెట్టీ కార్న్ సూప్, క్రిస్పీ లోటస్ స్టెమ్స్, డర్టీ బ్రెడ్ చికెన్, డర్టీ బ్రెడ్ పనీర్ వంటి ఎన్నో వెరైటీలను అందించేందుకు ఎదురు చూస్తోంది.



క్లుప్తంగా...


గోదాదేవికి పూజలు చేస్తున్న అర్చకులు

'గుట్ట'లో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. శ్రీస్వామి వారి ఆలయాన్ని వేకువజామునే తెరిచిన అర్చకులు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం ముఖ మండపంపై ఉన్న ఉత్తరభాగం హాల్‌లో గోదాదేవి అమ్మవారిని అధిష్ఠించి అలంకరించారు. అనంతరం అర్చకులు ఆగమ శాస్త్రానుసారంగా ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మంగళ హారతులతో అమ్మవారిని పూజించారు. అంతకుముందు అమ్మవారికి ప్రధానార్చకులు మొదటి పాశురాన్ని పఠించగా.. వేద మంత్రాలతో అర్చకులు, పారాయణికులు అమ్మవారిని ఆరాధించారు. గోదాదేవికి ఇష్టమైన కట్టె పొంగలిని ఆరగింపుగా పెట్టారు. 30 రోజుల పాటు అమ్మవారికి వేకువజామున పూజలు జరిపించి 30 పాశురాలను పఠిస్తారు.

స్పౌజ్ టీచర్ల బదిలీకి సీఎం సానుకూలం

పీఆర్‌టీయూటీఎస్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: స్పౌజ్ టీచర్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలన్న వినతిపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని పీఆర్‌టీయూటీఎస్ తెలిపింది. 317 జీవో వల్ల ఇబ్బంది పడుతున్న అన్ని జిల్లాల భార్యా భర్తలకు అంతర్ జిల్లా బదిలీకి అవకాశం ఇవ్వాలని సంఘం అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అభ్యర్థించారు. సంఘం అభ్యర్థనపై సీఎం సానుకూలంగా స్పందించారని వెల్లడించింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలను మినహాయించి.. అన్ని జిల్లాల్లో బదిలీలకు అవకాశం ఇచ్చేలా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. ఈ విజయం సాధించడానికి మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్‌రెడ్డి సహకరించినట్టు శ్రీపాల్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మెల్యే కోవా లక్ష్మికి సుప్రీం నోటీసులు



సాక్షి, న్యూఢిల్లీ : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అఫిడవిట్‌లో పలు అంశాలను దాచి పెట్టారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల అఫిడవిట్‌లో ఆదాయానికి సంబంధించిన ఐటీ రిటర్న్‌లను ఆమె పొందుపరచలేదని ఆసిఫాబాద్ కాంగ్రెస్ నేత అజ్మీరా శ్యామ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టును ఆ పిటిషన్ కొట్టి వేస్తూ తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ అజ్మీరా శ్యామ్ గత నెల 21న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్ శ్యామ్ తరఫున సీనియర్ అడ్వొకేట్ శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ ప్రతివాది తన అఫిడవిట్‌లో ఐటీ రిటర్న్‌లు, ఇతర అంశాలను పొందుపరచకుండా దాచిపెట్టారని, ఎన్నికల నియమావళి ప్రకారం ఆమె ఎన్నిక చెల్లదని వాదించారు. ప్రతివాది ఎమ్మెల్యే కోవా లక్ష్మి తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది మోహిత్ రావు ఈ వాదనలపై అభ్యంతరం తెలిపారు. తాజా ఐటీ రిటర్న్‌లతోపాటు, ఆమెకు వచ్చే జీతం, ఇతర ఆర్థిక పరమైన అంశాలను అఫిడవిట్‌లో పొందుపరిచారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం ఎమ్మెల్యేకు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై సమాధానం ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఈ పిటిషన్ వచ్చే ఏడాది జనవరి 30న మరోసారి బెంచ్ ముందుకు రానుంది.


పోలీసు శాఖకు డిజిటల్ ఇంజనీరింగ్ పురస్కారం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పోలీసు శాఖకు ప్రఖ్యాత డిజిటల్ ఇంజనీరింగ్ అవార్డ్స్‌లో భాగంగా చాలెంజర్ కేటగిరీలో టాప్ సస్టెయినబిలిటీ ఇనిషియేటివ్ పురస్కారం లభించింది. గణేశ్ ఉత్సవాల సందర్భంగా జీఐఎస్, ఏఐ టెక్నాలజీల వినూత్న ప్రయోగంతో ఈ అవార్డు లభించింది. అమెరికాలోని డల్లాస్ నగరంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ, ఐఎస్‌జీ, సీఎస్‌బీసీ–టీవీ18 ఆధ్వర్యంలో అవార్డులను అందజేశారు. 2024 గణేశ్ చతుర్థి ఉత్సవాల్లో దాదాపు 1,50,510 విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి భారీ సమావేశాలు, ట్రాఫిక్ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు టెక్నాలజీని వినియోగించారు. అత్యాధునిక జీఐఎస్, ఏఐ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని, 15,000 మంది మున్సిపల్ సిబ్బంది, 25,000 మంది పోలీసు సిబ్బందితో కలసి తెలంగాణ పోలీసు శాఖ వినాయక నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఈ అంశంపై ఏడీజీపీ వీవీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఈ అవార్డు పోలీసు శాఖకు మరింత స్ఫూర్తిని ఇస్తుందని అన్నారు.

బాబు అవినీతి బాగోతాన్ని మడతెట్టేద్దాం...

'ముఖ్య' నేత ఆదేశాలతో రంగంలోకి ఢిల్లీ సీనియర్ న్యాయవాది

- పోలీసు, సీఐడీ ఉన్నతాధికారులకు కుట్ర కార్యాచరణపై నిర్దేశం
- జీ హుజూర్ అంటున్న ఉన్నతాధికారులు
- ఇప్పటికే దర్యాప్తును అటకెక్కించేసిన సీఐడీ
- న్యాయస్థానంలో విచారణకు సహాయ నిరాకరణ
- బెయిల్ షరతులను యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: నారా చంద్రబాబు నాయుడు కుట్రదారు, లబ్ధిదారుగా సాగించిన కుంభకోణాల కేసులను పూర్తిగా నీరుగార్చే కుతంత్రానికి టీడీపీ కూటమి ప్రభుత్వం పదును పెడుతోంది! అందుకోసం ఇప్పటికే డీజీపీ, సీఐడీ కార్యాలయాలను పూర్తిగా ఆ పనిలో నిమగ్నం చేసిన చంద్రబాబు ప్రభుత్వం.. తాజాగా ఢిల్లీ నుంచి ఓ ప్రముఖ సీనియర్ న్యాయవాదిని రప్పించి కేసుల కొట్టివేత కుట్రలను వేగవంతం చేయడం గమనార్హం. 2014–19 మధ్య టీడీపీ హయాంలో చంద్రబాబు సూత్రధారిగా పాల్పడిన స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం, అసైన్డ్ భూముల దోపిడీ, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణం, ఫైబర్ నెట్ కుంభకోణం ఆధారాలతో సహా బట్టబయలయ్యాయి. వాటిని సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) పూర్తి ఆధారాలతో నిగ్గు తేల్చింది. అందులో స్కిల్ స్కామ్ కేసులో గతంలో చంద్రబాబును అరెస్ట్ చేయగా... ఏసీబీ న్యాయస్థానం ఆయనకు రిమాండ్ విధించింది. 52 రోజులపాటు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో చంద్రబాబు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆ నాలుగు కేసులూ సీఐడీ విచారణలోనే ఉన్నాయి. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఆ కేసుల దర్యాప్తును నీరుగార్చి ఏకంగా కేసులను కొట్టి వేసేందుకు కార్యాచరణ చేపట్టారు. అన్ని కేసుల నుంచి చంద్రబాబు పేరును తొలగించాలని సీఐడీ, పోలీసు ఉన్నతాధికారులకు ప్రభుత్వ పెద్దలు హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఆ కేసులను ఎప్పటిలోగా నీరుగార్చాలో కూడా దర్యాప్తు అధికారులకు గడువు కూడా విధించినట్లు తెలిసింది.

నేను చెప్పినట్టు చేయండి.. ఆ కేసులను మూసేద్దాం

పోలీసు, సీఐడీ ఉన్నతాధికారులకు ఢిల్లీ సీనియర్ న్యాయవాది నిర్దేశం స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు తరఫున వాదించిన ఢిల్లీకి చెందిన సీనియర్ న్యాయవాది అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమయ్యారు. ఏకంగా రోజుకు రూ.కోటికిపైగా ఫీజు చెల్లించి మరీ ఆయన్ను ప్రత్యేకంగా రప్పించారు. కానీ ఆయన వాదనను ఏసీబీ న్యాయస్థానం సమ్మతించలేదు. చంద్రబాబుకు రిమాండ్ విధించింది. అయినా సరే అదే న్యాయవాది చంద్రబాబు కేసుల విచారణను ఇటు విజయవాడలో అటు ఢిల్లీలో స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆ సీనియర్ న్యాయవాది సోమవారం హఠాత్తుగా విజయవాడలో వాలారు. జీ హుజూర్ అంటూ రాష్ట్ర పోలీసు, సీఐడీ ఉన్నతాధికారులు ఆయనతో ప్రత్యేకంగా భేటీ కావడం గమనార్హం. అసలు ఓ ప్రైవేట్ న్యాయవాదితో పోలీసు, సీఐడీ ఉన్నతాధికారులు సమావేశం కావడం ఏమిటని పోలీసు వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. చంద్రబాబు అవినీతి కేసులను మూసివేయడమే ఏకైక అజెండాగా ఆ సమావేశం సాగింది. స్కిల్‌స్కామ్, అసైన్డ్ భూముల దోపిడీ, ఇన్నర్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ అక్రమాలు, ఫైబర్ నెట్ కుంభకోణం కేసుల నుంచి చంద్రబాబు పేరును తప్పించడం... అనంతరం ఆ కేసులను మూసివేయడం... అందుకు ఆ కేసుల్లో సాక్షులను ఎలా వేధించాలి.... ఎలా తప్పుడు వాంగ్మూలాలు నమోదు చేయాలి...? న్యాయపరంగా ఇబ్బందులు రాకుండా ఎలాంటి అడ్డదారులు తొక్కాలి? అనే విషయాలను ఆ సీనియర్ న్యాయవాది అంశాలవారీగా వివరించారని తెలుస్తోంది. రానున్న రెండు నెలల్లోనే ఆ కేసులను క్లోజ్ చేసేలా పోలీసు, సీఐడీ వ్యవస్థలు పూర్తిగా సహకరించాలని ఆయన తేల్చిచెప్పారు. అందుకు పోలీసు, సీఐడీ ఉన్నతాధికారులు తలూపినట్లు తెలుస్తోంది. ఆ సీనియర్ న్యాయవాది పోలీసు, సీఐడీ ఉన్నతాధికారులతో మంగళవారం కూడా సమావేశం నిర్వహించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఇప్పటికే దర్యాప్తును అటకెక్కించిన ప్రభుత్వం

చంద్రబాబు ప్రధాన నిందితుడుగా ఉన్న స్కిల్ స్కామ్ కేసు దర్యాప్తును టీడీపీ కూటమి ప్రభుత్వం ఇప్పటికే అటకెక్కించేసింది. స్కిల్ స్కామ్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ కుంభకోణం, ఫైబర్‌నెట్ కుంభకోణం, అసైన్డ్ భూముల కుంభకోణం కేసుల చార్జిషీట్లను సీఐడీ గతంలో న్యాయస్థానానికి సమర్పించింది. దీనిపై కొన్ని వివరణలు కోరుతూ న్యాయస్థానం వాటిని ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ మధ్య సీఐడీకి పంపింది. అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వాటిని కేస్ స్టడీలతో సీఐడీ అధికారులకు అందచేశారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ కేసులను నీరుగార్చేలా కూటమి పెద్దలు సీఐడీపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో సీఐడీ ఆ చార్జిషీట్లను న్యాయస్థానానికి సమర్పించలేదు. కేసుల దర్యాప్తును పూర్తి చేసేందుకు ప్రయత్నం చేయడం లేదు.

సీబీఐకి అప్పగించాలి.. న్యాయస్థానం పర్యవేక్షణలోనే దర్యాప్తు జరగాలి

న్యాయ నిపుణుల సూచన

స్కిల్ స్కామ్, ఇతర కేసుల దర్యాప్తు, తాజా పరిణామాలను గమనిస్తున్న న్యాయ నిపుణులు చంద్రబాబుపై ఉన్న కేసుల విచారణను సీబీఐకి అప్పగించాలని సూచిస్తున్నారు. సీబీఐకి అప్పగించాలని కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు టీడీపీ కూటమి ప్రభుత్వం గడువు కోరిన విషయాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. చంద్రబాబుపై కేసుల దర్యాప్తును న్యాయస్థానం పర్యవేక్షించాలని స్పష్టం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి ఏపీలో మద్యం సిండికేట్ కేసు దర్యాప్తును హైకోర్టు పర్యవేక్షించిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు.

షరతులు ఉల్లంఘిస్తున్న బాబు

స్కిల్ స్కామ్ కేసులో న్యాయస్థానం విధించిన బెయిల్ షరతులను ఎన్నికల ముందు, ఆ తర్వాత చంద్రబాబు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా బేఖాతర్ చేస్తున్నారు. తన బావమరిది, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఓ ఓటీటీ చానల్ కోసం నిర్వహిస్తున్న టాక్ షోలో పాల్గొన్న చంద్రబాబు న్యాయస్థానాల షరతులంటే ఏమాత్రం లెక్కలేదనే రీతిలో షరతులను ఉల్లంఘిస్తూ మాట్లాడారు. ఏ ఒక్క అధికారినీ విడిచిపెట్టబోనని బెదిరింపులకు దిగడం గమనార్హం. హిందుస్థాన్ టైమ్స్ సంస్థ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన సదస్సులోనూ చంద్రబాబు బెయిల్ షరతులను ఉల్లంఘించి స్కిల్ స్కామ్ కేసు గురించి మాట్లాడారు. అధికారులను బెదిరించే రీతిలో వ్యాఖ్యలు చేస్తూ కేసు దర్యాప్తును ప్రభావితం చేసేందుకు యత్నించారు.

'సుప్రీం'లో విచారణకు సహాయ నిరాకరణ

స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోంది. 2023లో బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీం కోర్టు, హైకోర్టు విధించిన షరతులను చంద్రబాబు నిర్భీతిగా ఉల్లంఘించారు. కేసుల గురించి బహిరంగంగా, మీడియాతో మాట్లాడవద్దని న్యాయస్థానాలు స్పష్టమైన షరతులు విధించాయి. అయితే చంద్రబాబు దర్యాప్తు అధికారులను బెదిరిస్తూ.. రెడ్‌బుక్ పేరిట హెచ్చరిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. షరతులు ఉల్లంఘించినందున చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయాలని సీఐడీ 2023 డిసెంబర్‌లోనే సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దానిపై విచారణ కొనసాగుతోంది. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఐడీ హఠాత్తుగా రూటు మార్చేసింది. సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై విచారణకు సహకరించడం లేదు. సుప్రీం కోర్టులో సీఐడీ వాదనను వినిపించాల్సిన ఏపీ ప్రభుత్వ న్యాయవాది వాయిదాల మీద వాయిదాలు కోరుతున్నారు. అది సరైన పద్ధతి కాదని సుప్రీం కోర్టు చెప్పినా తీరు మారడం లేదు. కొద్దిరోజుల క్రితం చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీం కోర్టులో విచారణకు ఆయన నేరుగా హాజరు కాకుండా వర్చువల్‌గా పాల్గొన్నారు. వాదనలు వినిపించకుండా.. తాను ఢిల్లీలో లేనందున వాయిదా వేయాలని కోరారు. దీనిపై సుప్రీం కోర్టు మరోసారి అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రతిసారీ వాయిదాలు కోరడం సరైన చర్య కాదని వ్యాఖ్యానిస్తూ కేసు విచారణను జనవరి రెండో వారానికి వాయిదా వేసింది.

తప్పుడు వాంగ్మూలం ఇవ్వకుంటే ఇరికిస్తాం!

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డికి బెదిరింపులు
- ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి పేర్లు చెప్పాలని వేధింపులు
- మద్యం అక్రమ కేసులో ఇరికించేందుకు ఏపీ ప్రభుత్వ పెద్దల పన్నాగం
- 'ముఖ్య'నేత ఆదేశంతో సీఐడీ ఉన్నతాధికారి దాదాగిరీ ఇదీ
- డీజీపీ పోస్టు ఎర వేయడంతో బరితెగించి వేధింపులు

కావాలని కేసులు పెట్టి జైల్లో వేశారు..

- లగచర్ల కేసులో నిందితుల వాదనలు
- నేడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు

సిటీ కోర్టులు: లగచర్లలో అధికారులపై దాడి కేసులో రైతులు, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై నాంపల్లి కోర్టులో నిందితుల వాదనలు పూర్తయ్యాయి. నరేందర్‌రెడ్డితోపాటు 24 మంది రైతుల తరఫున న్యాయవాదులు సురేందర్ రావు, జక్కుల లక్ష్మణ్, జి.కిరణ్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. నిందితుల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. దాడి జరిగినప్పుడు మాజీ ఎమ్మెల్యే అక్కడలేరని, రైతులకు కూడా ఎలాంటి పాపం తెలియదని చెప్పారు. కేవలం రాజకీయ కక్షతోనే వారిపై కేసులు పెట్టి జైల్లో వేశారని చెప్పారు. 34 రోజులుగా వీరు రిమాండ్‌లో ఉన్నారన్నారు. ప్రజల తరఫున పోరాడుతున్నందుకు నరేందర్ రెడ్డిపై కేసులు పెట్టారని చెప్పారు. ఆయన కిడ్నీతోపాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, అలాంటి వ్యక్తిని రిమాండ్‌లో ఉంచటం సరైందికాదని తెలిపారు. ఇప్పటికే పలువురు రైతులకు గుండెపోటు వచ్చిందని, తమకు సంబంధం లేకున్నా.. జైల్లో వేశారన్న బాధతో వారి ఆరోగ్యం క్షీణిస్తోందని చెప్పారు. వారికి బెయిల్ మంజూరు చేయాలని కోరారు. దీనిపై పోలీసులు కౌంటర్ దాఖలుచేయాలని, దాని తర్వాత వెంటనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు కూడా పూర్తి చేయాలంటూ తదుపరి విచారణను కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. పీపీ వాదనలు పూర్తయితే మంగళవారం తీర్పు కూడా వచ్చే అవకాశం ఉందని రైతుల తరఫు న్యాయవాదులు తెలిపారు.

ఓటుకు నోటు కేసు విచారణకు రేవంత్ గైర్హాజరు



తదుపరి విచారణ జనవరి 10కి వాయిదా

సిటీ కోర్టులు: తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన ఓటుకు నోటు కేసు విచారణ సోమవారం నాంపల్లిలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి కోర్టులో జరిగింది. ఈ విచారణకు సీఎం రేవంత్ రెడ్డి, సెబాస్టియన్, వేం కృష్ణ కీర్తన్ గైర్హాజరుకాగా, ఉదయ్ సింహా, జెరూసలేం మత్తయ్య, సండ్ర వెంకటవీరయ్య హాజరయ్యారు. నిందితులను ఎగ్జామినేషన్ చేయాల్సి ఉండగా, తదుపరి విచారణను జనవరి 10కి వాయిదా వేశారు. 2015లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని నామినేటెడ్ ఎమ్మెల్యే స్టీఫెన్సన్‌కు రూ.కోట్లు ఆశచూపించారన్న ఆరోపణ లపై నాటి టీడీపీ ఎమ్మెల్యే, ప్రస్తుత సీఎం రేవంత్‌తో పాటు ఇతరులపై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ఏసీబీ రూ.50 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. ఈ డబ్బు అక్రమ మార్గాల్లో వచ్చిందన్న ఏసీబీ ఆరోపణలతో ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) ఓటుకు నోటు కేసు నమోదు చేసింది.

ఎమ్మెల్యే నుంచి ఫోన్ లాక్కోవడం సరికాదు

కౌశిక్‌రెడ్డికి ఇచ్చేయాలని పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మొబైల్ ఫోన్‌ను పోలీసులు లాక్కోవడం సరికాదని హైకోర్టు తప్పుబట్టింది. అతని ఫోన్‌ను తిరిగి ఇచ్చేయాలని స్పష్టం చేసింది. ఎవరిదైనా ఫోన్ సీజ్ చేయాలని పోలీసులు భావిస్తే చట్టప్రకారం విధా నాన్ని అనుసరించాలని పేర్కొంది. అలాగే ఎమ్మెల్యేకు నోటీసులు కూడా జారీ చేయాలని చెప్పింది. తదుపరి విచారణ జనవరి 6కు వాయిదా వేసింది. తన విధులను అడ్డుకున్నారని బంజారాహిల్స్ సీఐ చేసిన ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు ఈనెల 5న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని కొండాపూర్‌లోని ఆయన నివాసంలో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాసబ్‌ట్యాంక్ ఎస్‌హెచ్‌ఓ తన ఐఫోన్‌ను బలవంతంగా తీసుకున్నారని, తిరిగి ఇచ్చేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ ఆయన లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. కౌశిక్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌ను వేధించాలనే ఉద్దేశంతో పోలీసులు అతని మొబైల్ ఫోన్ లాక్కున్నారన్నారు. ప్రభుత్వం తరఫున పీపీ పల్లె నాగేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్ర చేశారని పిటిషనర్‌పై ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. దీన్ని తేల్చడం కోసమే ఎమ్మెల్యే ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపామని, ప్రస్తుతం అక్కడే ఉండటంతో తిరిగివ్వడం సాధ్యంకాలేదని తెలియజేశారు. పిటిషనర్, అతని అనుచరులు పోలీసుల విధులను అడ్డుకున్నారని పీపీ పేర్కొన్నారు.

రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడి ఆత్మహత్య!

మలుపు తిరిగిన అత్యాచారం నిందితుడి మృతి కేసు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా రెంజల్ పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇటీవల రెంజల్ మండలంలోని ఓ గ్రామంలో మతిస్థిమితం లేని బాలికపై అత్యాచారం జరిగిన కేసులో.. బాధిత కుటుంబ సభ్యుల దాడిలో తీవ్రంగా గాయపడిన నిందితుడు చికిత్స పొందుతూ మరణించినట్టు పత్రికల్లో వార్తలు ప్రచురితమైన విషయం విదితమే. అయితే దాడి ఘటన తర్వాత గాయపడిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. సీఐతోపాటు ఎస్సై విచారించారని, అనంతరం స్టేషన్‌లోనే నిందితుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. అదే రోజు రాత్రి సీఐ, ఎస్సై పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఆస్పత్రికి తరలించినట్టు తెలిసింది. రెంజల్ పోలీస్‌స్టేషన్‌కు అత్యంత సమీపంలో ఉన్న బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించకుండా పోలీసులు నిజామాబాద్‌లోని జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా పోలీస్‌స్టేషన్‌లో నిందితుడు చనిపోయిన ఘటనపై ఇన్‌చార్జ్ సీపీ సింధూశర్మ మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డితో విచారణ చేయిస్తున్నారు. నిందితుడి మృతిపై విచారణ కొనసాగుతున్నట్టు డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపారు.

విచారణ ఎదుర్కోవాల్సిందే!

- మంత్రి శ్రీధర్‌బాబుకు తేల్చిచెప్పిన హైకోర్టు
- 'కాళేశ్వరం' వివాదంపై వేసిన పిటిషన్ కొట్టివేత
- ట్రయల్ కోర్టుకు హాజరు నుంచి మినహాయింపు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం నిర్మాణ సమయంలో పర్యావరణ ప్రజాహిత విచారణను అడ్డుకున్నారంటూ నమోదైన కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందేనని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు హైకోర్టు స్పష్టం చేసింది. ట్రయల్‌కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. శ్రీధర్‌బాబు దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. పెద్దపల్లిలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై పర్యావరణ ప్రజాహిత విచారణను అడ్డుకున్నందుకు శ్రీధర్‌బాబు సహా 300 మంది కాంగ్రెస్ కార్యకర్తలపై 2017లో బసంతనగర్ పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కాటారం మండలానికి చెందిన ఇరిగేషన్ ఇంజనీర్, ప్రజాభిప్రాయ సేకరణ ఇన్‌చార్జి చేసిన ఫిర్యాదు మేరకు పలువురు కాంగ్రెస్ నాయకులపై వివిధ సెక్షన్ల కింద కేసులు పెట్టారు. అయితే ఈ కేసులకు.. తనకు ఎలాంటి సంబంధం లేదని, ఎఫ్ఐఆర్ నుంచి తన పేరును తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ శ్రీధర్‌బాబు ట్రయల్ కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ట్రయల్‌కోర్టు ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ట్రయల్ కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్ 13న తీర్పు రిజర్వు చేసి, సోమవారం వెలువరించారు.

హాజరు నుంచి మినహాయింపు..

కాగా, ఇదే కేసును కొట్టివేయాలంటూ శ్రీధర్‌బాబు ఈ నెల 13న మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. రాజకీయ దురుద్దేశంలో భాగంగా తన క్లయింట్‌పై తప్పుడు కేసు నమోదు చేశారని న్యాయవాది ధర్మేశ్ డీకే జైస్వాల్ వాదనలు వినిపించారు. కేసును కొట్టివేస్తూ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. శ్రీధర్‌బాబుకు ట్రయల్‌కోర్టులో విచారణకు హాజరు నుంచి మినహాయింపు ఇచ్చారు. ప్రతివాదులైన పోలీసులకు, నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జున ప్రసాద్‌కు నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతాయి

- బీసీసీఈ సెమినార్‌లో బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్
- ఓబీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసింది: భూపేంద్ర యాదవ్



సాక్షి, న్యూఢిల్లీ: మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇచ్చిన నివేదికకు మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. సోమవారం ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్లో 'ఓబీసీలు–సామాజిక సంస్కరణలు' అనే అంశంపై సెమినార్ జరిగింది. బీజేపీ నేత తూళ్ల వీరేందర్ గౌడ్ నేతృత్వంలోని బ్యాక్‌వార్డ్ క్లాసెస్ సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్ (బీసీసీఈ) ఈ కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమం అనంతరం లక్ష్మణ్ వన్ నేషన్–వన్ ఎలక్షన్‌పై స్పందించారు. మోదీ సంకల్పించిన ఈ విధానాన్ని సాధించి తీరుతామన్నారు. ఏపీ, తెలంగాణలో ముస్లింల పేరిట ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేస్తూ.. ఓబీసీలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ మాట్లాడుతూ, ఓబీసీలకు కాంగ్రెస్ అన్యాయం చేసిందని విమర్శించారు. ఓబీసీలకు దక్కాల్సిన ఫలాలను ఆ పార్టీ ఇవ్వలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమానికి భూపేంద్ర యాదవ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, బీజేపీ నేత వినయ్ సహస్రబుద్ధే, అధ్యాపకులు, మేధావులు పాల్గొన్నారు.

బీసీల్లో అవగాహన కోసమే బీసీసీఈ: వీరేందర్ గౌడ్

వెనుకబడిన వర్గాల్లో అవగాహన తీసుకువచ్చేందుకే తన తండ్రి తూళ్ల దేవేందర్‌గౌడ్ ఈ సంస్థను ఏర్పాటు చేశారని బీజేపీ నేత వీరేందర్‌గౌడ్ తెలిపారు. జాతీయ స్థాయిలో బీసీల సమస్యలపై చర్చ జరగాలనే ఉద్దేశంతోనే ఈ సెమినార్ నిర్వహించామని వెల్లడించారు.

సర్కారు దవాఖానాల్లో ఎన్నాళ్లీ ప్రైవేటు దందా!

- ఆసుపత్రుల్లో ప్రైవేట్ ఫార్మసీలపై మంత్రి రాజనర్సింహ ఆగ్రహం
- ప్రభుత్వ డాక్టర్లే ప్రైవేటులో కొనుగోలుకు సిఫారసు చేస్తున్నట్టు ఫిర్యాదులు
- కోర్టుల్లో స్టేలు ఎత్తివేయించే దిశగా సర్కారు చర్యలు



సాక్షి, హైదరాబాద్: సర్కారు దవాఖానాల్లో అడ్డూ, అదుపూ లేకుండా సాగుతున్న ప్రైవేటు మందుల దుకాణాల దందాపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. పీహెచ్‌సీల నుంచి మొదలుకొని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు ఉచితంగా మందులు సరఫరా చేస్తుండగా, ఆసుపత్రుల ఆవరణల్లోనే ప్రైవేటు మెడికల్ షాపుల దందా సాగుతుండడంపై ప్రభుత్వం ఆరా తీసింది. ఏయే ఆసుపత్రుల్లో ప్రైవేటు మందుల దుకాణాలు ఎన్నేళ్ల నుంచి కొనసాగుతున్నాయనే సమాచారాన్ని ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందించారు. ఈ నేపథ్యంలో ప్రైవేటు దందాపై వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానాల్లో ప్రైవేటు మందుల వ్యాపారం సాగిస్తున్న దుకాణాలను ఎత్తి వేయించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేటు ఫార్మసీల తొలగింపు అంశంపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ, కోర్టు కేసుల నేపథ్యంలో ముందుకు సాగలేదు. ఈ పరిస్థితుల్లో న్యాయ నిపుణుల సలహాలు తీసుకొని కోర్టుల్లో ఉన్న స్టేలను తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించినట్లు సమాచారం. అలాగే ప్రైవేటు మెడికల్ దుకాణాల్లో మందులు కొనాలని సిఫారసు చేస్తున్న డాక్టర్ల విషయంలో కూడా కఠినంగా వ్యవహరించాలని సర్కార్ నిర్ణయించింది. ఇదిలా ఉండగా తక్కువ ధరకే మందులు విక్రయించే జనరిక్ మందుల దుకాణాలను ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కోట్ల రూపాయల దందా..

హైదరాబాద్‌లో ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, నిమ్స్ వంటి ఆసుపత్రులతో పాటు పేట్ల బురుజు, ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి, వరంగల్ ఎంజీఎం, కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆదిలాబాద్ రిమ్స్ మొదలైన ఆసుపత్రుల్లో గతంలో ఎప్పుడో ఇచ్చిన అనుమతులను ఆసరాగా చేసుకొని ప్రైవేట్ మందుల దుకాణాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ ఆసుపత్రుల్లో ఏటా రూ. కోట్లలో వ్యాపారం సాగుతోంది. రాజకీయంగా పలుకుబడి ఉన్న వారే ఈ మందుల దుకాణాలు నిర్వహిస్తుండటంతో ఏ ప్రభుత్వం వచ్చినా ప్రైవేటు దందాను నిలువరించలేకపోతున్నారని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు వైద్యులు కొన్ని మందులను ఉచితంగానే ఇస్తున్నప్పటికీ, ఆసుపత్రుల్లో లభించని మందులను ప్రైవేటుగా కొనుగోలు చేయాలని వైద్యులే సిఫారసు చేయడం సర్వసాధారణ విషయంగా మారిందని రోగుల బంధువులు అంటున్నారు.

టెక్స్‌టైల్‌పై జీఎస్టీ పెంపు వద్దు



సాక్షి, హైదరాబాద్: టెక్స్‌టైల్ గార్మెంట్స్‌పై జీఎస్టీ పెంపు ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ స్టేట్ ఫెడరేషన్ ఆఫ్ టెక్స్‌టైల్ అసోసియేషన్.. కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, జి.కిషన్‌రెడ్డిలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు అమ్మనబోలు ప్రకాశ్ సోమవారం కేంద్ర మంత్రులకు ఒక లేఖ రాశారు. రూ.1,500 – రూ.10,000 లోపున్న గార్మెంట్స్‌పై 18 శాతం, రూ.10 వేల పైన ఉండే వాటిపై ఏకంగా 28 శాతం జీఎస్టీ ప్రతిపాదించటం వల్ల.. సామాన్య ప్రజలతో పాటు చిన్న, మధ్యతరహా టెక్స్‌టైల్ పరిశ్రమ ఇబ్బందులపాలయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా.. ఈ ప్రతిపాదనలను తక్షణం ఉపసంహరించుకోవాలని ప్రకాశ్ విజ్ఞప్తి చేశారు

12 మంది అడిషనల్ ఎస్పీలకు ఎస్పీలుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: 12 మంది అదనపు ఎస్పీలకు (నాన్ క్యాడర్) ఎస్పీలుగా పదోన్నతులు లభించాయి. ఈ ప్రమోషన్లతో పాటు వారికి వివిధ చోట్ల తాజా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఈ మేరకు హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సైబరాబాద్, హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్స్ సహా సిద్దిపేట, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్ జిల్లా యూనిట్స్, ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీలతో కూడిన వివరాలను వెల్లడించారు.

పేరు	ప్రస్తుతం	కొత్తగా పోస్టింగ్, ట్రాన్స్‌ఫర్
కె గుణశేఖర్	ఏడీఎస్పీ,అడ్మిన్ (జోగులాంబగద్వాల)	డీసీపీ, ట్రాఫిక్ (మేడ్చల్)
జి నర్సింహారెడ్డి	క్రైమ్స్–1 (సైబరాబాద్)	డీసీపీ, ఎస్‌బీ (రాచకొండ)
ఎస్.మల్లారెడ్డి	అడిషనల్ డీసీపీ (సిద్దిపేట)	డీసీపీ, ట్రాఫిక్ (రాచకొండ)
ఎం.శ్రీనివాస్‌రావు	అడిషనల్ డీసీపీ, సీటీసీ (హైదరాబాద్)	ఎస్పీ, సీఐడీ
పి.శోభన్‌కుమార్	అడిషనల్ డీసీపీ ఎస్‌ఓటీ (సైబరాబాద్)	డీసీపీ, ఎస్‌ఓటీ, మాదాపూర్
టి.సాయికుమార్	అడిషనల్ డీసీపీ, ట్రాఫిక్ (మాదాపూర్)	డీసీపీ, ట్రాఫిక్, మాదాపూర్
డి.రమేశ్	అడిషనల్ ఎస్పీ (ఇంటెలిజెన్స్)	ఎస్పీ, ఇంటెలిజెన్స్
జె.చెన్నయ్య	ఏఎస్పీ క్రైమ్స్ (మహబూబాబాద్)	ఎస్పీ, ఐసీసీసీ
పి.విజయ్‌కుమార్	అడిషనల్ డీసీపీ (రాజేంద్రనగర్)	ఎస్పీ, సీఐడీ
కె.కరుణాకర్	డీసీపీ ఎస్‌బీ (రాచకొండ)	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్
కె.మనోహర్	డీసీపీ, ట్రాఫిక్ (రాచకొండ)	డీసీపీ, రోడ్‌సేఫ్టీ (రాచకొండ)
డి.శ్రీనివాస్	డీసీపీ ఎస్‌ఓటీ (మాదాపూర్)	డీసీపీ, మేడ్చల్ ఎస్‌ఓటీ (సైబరాబాద్)

నివాళి
ఉస్తాద్ జాకిర్ హుసేన్

వాహ్ ఉస్తాద్ వాహ్



పుట్టిన వెంటనే చెవిలో 'కల్మా' కాకుండా
తబలా జతులు విన్నవాడు...
మూడేళ్లకే తబలాను పసి వేళ్లతో మీటిన వాడు...
ఏడేళ్లకు ప్రదర్శనలు ఇచ్చినవాడు...
పన్నెండేళ్లకు ప్రపంచ యాత్రకు బయల్దేరినవాడు...
మహా మహా విద్వాంసులకు సహ వాద్యగాడు...
తనే స్వయంగా అద్వితీయ వాద్యకారుడు...
తబలా ప్రపంచానికి ఈశ్వరుడు... దేవుడు...
ఉస్తాద్ జాకిర్ హుసేన్.
టీషర్ట్, జీన్స్ వేసుకుని ఆధునిక యువకుడిగా ఉంటూ
సంప్రదాయ శాస్త్రీయ సంగీతాన్ని కుర్రకారుకు చేరువ చేసిన
ఈ నవ యువ వాద్య మాంత్రికుడు కన్నుమూశాడు.
అతను లేడు. అతనిలాంటి వాడు మరి రాడు.
ఒక్కడే జాకిర్ హుసేన్.

జాకిర్ హుసేన్ ప్రదర్శనలో ఎవరైనా ఇది చూడాలి.

ఆయన తబలా మీద డమరుకాన్ని, శంఖాన్ని వినిపిస్తాడు.

'ఎడమ' మీద డమరుకం వినిపిస్తూ 'కుడి'ని మీటి శంఖనాదాన్ని సృష్టిస్తాడు. ఆ శంఖనాద సమయంలో జాకిర్ హుసేన్ వేళ్లు ఎంత వేగంగా కదులుతాయంటే అవి కనపడవు. పైగా తబలాని తాకినట్టుగా కూడా ఉండవు. ఇలా వాయించడం అసాధ్యం.


'ఇది ఎలా సాధించారు' అని అనడిగితే 'సాధన చేయాలి. తబలాతో స్నేహం చేయాలి. దాని మాటకు చెవి ఒగ్గాలి' అంటాడు జాకిర్ హుసేన్. అంత వినమ్రంగా ఉండటం వల్లే ఆయన తన తబలాకు ప్రపంచమే చెవి ఒగ్గేలా చేయగలిగాడు. 'ఉస్తాద్' కాగలిగాడు. 'మేస్ట్రో' అనిపించుకున్నాడు.

• • •

'మీరు తబలా ఏ వయసులో నేర్చుకోవడం మొదలెట్టారు' అని అడిగితే జాకిర్ హుసేన్ ఆశ్చర్యపోతాడు. 'అదేం ప్రశ్న' అంటాడు. నిజమే. అతను పుట్టిందే తబలా ఉన్న ఇంట్లో. జాకిర్ తండ్రి ఉస్తాద్ అల్లా రఖా జగమెరిగిన తబలా విద్వాంసుడు. మన దేశంలో తబలాకు ఔన్నత్యం తీసుకు వచ్చిన తొలి విద్వాంసుడు. ఆయనకు పెద్ద కొడుకుగా 1951లో ముంబైలో జన్మించాడు జాకిర్ హుసేన్. నర్సింగ్ హోమ్ నుంచి మరుసటిరోజు ఇంటికి తీసుకొస్తే ముస్లిం సంప్రదాయం ప్రకారం తండ్రి తన కొడుకు చెవిలో 'కల్మా' చదివి, పేరు పలికి లోపలికి తీసుకెళ్లాలి. కాని అల్లా రఖా జాకిర్‌ని తన చేతుల్లో తీసుకుని 'ధాధా ధినా.. ధాధా తునా' అని తబలా జతులు వినిపించాడు. భార్య 'ఇదేమిటండీ చోద్యం.. దైవ స్తోత్రం వినిపించక' అనంటే 'నా దైవం తబలాయే' అని బదులిచ్చాడాయన. అలా జాకిర్‌కు పుట్టిన వెంటనే తబలా తెలిసింది. జాకిర్‌ను పడుకోబెట్టడానికి తండ్రి రోజూ ఒడిలోకి తీసుకుని తబలా జతులు వినిపిస్తూనే వెళ్లాడు. ఇలా మూడేళ్లు ఆ పసికందు మెదడులోకి తబలా మాత్రమే వెళ్లింది. మూడేళ్లు వచ్చేసరికి జాకిర్ తబలా వరకూ బుడిబుడి అడుగులు వేస్తూ వెళ్లి అత్యంత సహజంగా దానిని మీటాడు.

జాకిర్ హుసేన్ తబలా యాత్ర మొదలైంది.

• • •



పండిట్ రవిశంకర్‌తో జాకిర్ హుసేన్

మన దేశానికి స్వతంత్రం వచ్చే వరకూ శాస్త్రీయ సంగీతం ఆస్థానాల్లో, దర్బారుల్లో, శ్రీమంతుల మహళ్లలో ఉండిపోయింది. స్వతంత్రం వచ్చాక అవన్నీ వెళ్లి సంగీత కచ్చేరీలు మొదలయ్యాయి. అయితే వాటికి ఆదరణ అంతంత మాత్రమే ఉండేది. ఆ సమయంలో సితార్ విద్వాంసుడు పండిట్ రవిశంకర్, సరోద్ వాద్యకారుడు అలి అక్బర్ ఖాన్‌లాంటి వారు అమెరికాకు వెళ్లి ప్రదర్శనలు ఇస్తూ మన దేశం తిరిగి వచ్చి అటెన్షన్ సంపాదించారు. ఆ తర్వాతి రోజుల్లో సంతూర్ పండిట్ శివకుమార్, వేణువు హరిప్రసాద్ చౌరాసియా కూడా పశ్చిమ దేశాలలోకి మన సంగీతాన్ని తీసుకెళ్లాడు. పండిట్ రవిశంకర్‌కు శాశ్వతంగా అల్లారఖా తబలాజోడిగా ఉండేవారు. అయితే అల్లా రఖాకు అనారోగ్యం వల్ల జాకిర్‌కు 19 ఏళ్లు ఉండగా మొదటిసారి అమెరికా వెళ్లి రవి శంకర్‌కు సహ వాయిద్యం అందించే వీలు జాకిర్‌కు దక్కింది. మొదటిసారి అలా అమెరికాలో అడుగు పెట్టిన జాకిర్ జీవితంలో అత్యధిక కాలం అమెరికాలో ఉంటూ అక్కడినుంచే దేశ విదేశాలలో ప్రదర్శనలు ఇస్తూ తబలా వాదనలో ఉండే ఉత్కృష్ట ధ్వనిని ప్రపంచానికి వినిపించాడు. చివరకు అక్కడే- డిసెంబర్ 16 (సోమవారం) అంతిమ శ్వాస వదిలాడు.

• • •

'తబలాకు ఎప్పుడూ కాలు తగలనివ్వకు బాబూ. అది మన సరస్వతి' అనేవారట ఉస్తాద్ అల్లారఖా. అందువల్ల జాకిర్ హడావిడి ప్రయాణాల్లో రైళ్లలో సీటు దొరక్కపోతే కింద కూచుని తబలాను ఒళ్లో జాగ్రత్తగా పెట్టుకునేవారు. 'నేను తబలా నేర్చుకుంటాను' అని ఏడేళ్ల వయసులో మొదటిసారి జాకిర్ తన తండ్రితో చెప్పినప్పుడు ఆ మరుసటి రోజు రాత్రి 3 గంటలకు నిద్ర లేపి సాధన మొదలేయించేవారట అల్లారఖా. రోజూ రాత్రి మూడు నుంచి ఉదయం 6 వరకు వారి సాధన సాగేది. ఆ తర్వాత స్కూల్ వెళ్లి సాయంత్రం మళ్లీ సాధన కొనసాగించేవాడు. 'పండితులకు జన్మించే పిల్లలకు పోలిక ఉంటుంది. అల్లా రఖా కొడుకై ఉండి ఇంత సామాన్యంగా వాయిస్తున్నాడా అనంటే మా నాన్న పరువేంగాను. అందుకే నేను మరింత కష్టపడేవాణ్ణి' అంటాడు జాకిర్. అంతేకాదు అన్ని మతాల సంగీతం నుంచి కూడా నేర్చుకోవడానికి చూశాడు. 'నేను స్కూల్‌కు వెళ్లే దారిలో చర్చిలో సంగీతం వినేవాణ్ణి. గుడిలో వినిపించే భక్తి గీతాలు ఆలకించేవాణ్ణి. ప్రపంచంలో ఏ మతమూ ఇంకో మతంపైన జబర్దస్తీ చేయదు. ఏ మతమైనా చెప్పేది నీ పొరుగువారిని ప్రేమించమనే' అంటాడు జాకిర్ హుసేన్. అందుకే జాకిర్ అన్ని మతాల, అన్ని ధోరణుల విద్వాంసులతో అతి సులువుగా కలిసిపోయి తన తబలాను వారి సంగీతానికి జత చేయగలిగారు. ముఖ్యంగా సంతూర్ శివకుమార్‌తో ఆయనకు సుదీర్ఘ స్నేహం సాగింది. కొన్నాళ్ల క్రితం శివకుమార్ మరణించినప్పుడు ఆయన అంత్యక్రియలకు హాజరైన జాకిర్ హుసేన్ దహన వాటిక నుంచి అందరూ వెళ్లిపోయినా తనొక్కడే మండుతున్న చితి పక్కన చాలా సేపు నిలబడిపోయి ఆ స్నేహితునికి అంతిమ వీడ్కోలు పలికాడు. ఈ భారతీయ హిందూ ముస్లిం శాస్త్రీయ సంగీత భాగస్వామ్యాన్ని జాకిర్ స్థిరంగా ప్రచారం చేశాడు. కొనసాగాలని కోరుకున్నాడు.

• • •

బీటిల్స్ గ్రూప్ ద్వారా ఖ్యాతి గాంచిన గిటారిస్ట్ జార్జ్ హారిసన్ 'లివింగ్ ఇన్ ది మెటీరియల్ వరల్డ్' అనే ఆల్బమ్‌లో జాకిర్ భాగస్వామ్యాన్ని కోరడంతో 1973 నుంచి ఫ్యూజన్ సంగీతానికి ప్రచారం కల్పించసాగాడు జాకిర్ హుసేన్. అమెరికన్ జాజ్ మ్యుజీషియన్ జాన్ హ్యాండీ, ఐరిష్ గాయకుడు వాన్ మారిసన్, అమెరికన్ డ్రమ్మర్ మికీ హర్ట్‌లాంటి ప్రసిద్ధులతో యాభై ఏళ్ల క్రితమే పని చేయడం వల్ల జాకిర్ హుసేన్‌కి హద్దులు లేని ప్రచారం, ప్రశంస లభించాయి. గాత్ర సంగీతమైనా, వాద్య సంగీతమైనా, జుగల్‌బందీ అయినా, వ్యక్తిగత ప్రదర్శన అయినా, ఫ్యూజన్ అయినా జాకిర్ నీరు పాత్ర రూపు దాల్చినంత సులభంగా ఇమిడిపోయి కచ్చేరికి అందం, ఆనందం తెచ్చేవాడు. పొడవైన తన గుబురు జుత్తు గాలిలో ఊగేలా ఆయన సాగించే తబలా వాదనను చూడటానికి జనం విరగబడేవారు. ముచ్చటపడేవారు.

• • •

జాకిర్ హుసేన్ మన దేశంలో 'పద్మశ్రీ'తో గౌరవించబడ్డ (1988) అత్యంత పిన్న వయస్కుడు (అవార్డు ప్రకటించే సమయానికి). ఆ తర్వాత ఆయనకు 'పద్మభూషణ్', 'పద్మవిభూషణ్' వచ్చాయి. నాలుగుసార్లు 'గ్రామీ' గెలుచుకున్న ఏకైక భారతీయ సంగీతకారుడు. అంతేనా? అమెరికా ప్రభుత్వం కళ, సాంస్కృతిక రంగాల్లో ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మక ఫెలోషిప్ 'నేషనల్ హెరిటేజ్ ఫెలోషిప్' జాకిర్‌ను వరించింది. జాకిర్ సినిమాలకు పని చేశాడు. మలయాళంలో మోహన్‌లాల్ నటించిన 'వానప్రస్థం' సినిమాకు పాటలు కంపోజ్ చేశాడు. లతా మంగేశ్కర్, ఆశా భోంస్లేల జీవితం ఆధారంగా తీసిన 'సాజ్' (1998)లో ఆశా భోంస్లే భర్త ఆర్.డి.బర్మన్ పాత్రలో కనిపించాడు. మంచి మాటగాడు, హాస్యప్రియుడు, భోజన ప్రియుడైన జాకిర్ హుసేన్ ఎక్కడ ఉంటే అక్కడ సందడిగా ఉంటుంది. నవ్వులు ఉంటాయి. తబలా ఎలాగూ ఉంటుంది.

• • •

గొప్ప సంగీతమయ ప్రపంచాన్ని సృష్టించి, శుభ నాదాలను జగత్తులోకి వదిలి సంగీతం ద్వారా శాంతము పొందమని కోరుతూ వీడ్కోలు తీసుకున్నాడు ఉస్తాద్ జాకిర్ హుసేన్.

ప్రపంచ సంగీత ప్రియులు అతణ్ణి తలచుకుని కన్నీరు కారుస్తున్నారు.

జాకిర్ ఆత్మ విశ్వ సంగీతంలో డోలలూగాలి.

– కె

● ముగ్గు-ముచ్చట



17 నుండి 9 వరకు
సందు చుక్కలు



జి. పద్మావతి
ఎంవిపి కాలనీ, విశాఖపట్నం



15 చుక్కలు, 3 వరుసలు
3 వచ్చేవరకు – సరిచుక్క



ఎం. సుగుణ
సాయి పేట, వైఎస్ఆర్ కడప



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

విద్యుత్ లేకుండా వాగు నీటిని ఎత్తిపోసే హైడ్రో లిఫ్ట్!

సాగుబడి
మూల కార్తె : డిసెంబర్ 17 నుంచి

- కొండ ప్రాంత వాగుల పరిసరాల్లోని రైతుల్లో ఆశలు రేపుతున్న 'హైడ్రో లిఫ్ట్'
- విద్యుత్ లేకుండానే వాగు నీటిని పొలాల్లోకి ఎత్తిపోసేందుకు దోహదపడుతున్న వినూత్న ఆవిష్కరణ
- ప్రభుత్వం ప్రోత్సహిస్తే నీటి కొరతతో పాటు విద్యుత్తు కొరత కూడా తీర్చవచ్చంటున్న ఆవిష్కర్త శ్రీనివాస్



వాగులో ఏర్పాటు చేసిన హైడ్రో లిఫ్ట్

కొండప్రాంత వాగుల్లో ఎత్తయిన ప్రాంతం నుంచి వాలుకు ఉరకలెత్తుతూ ప్రవహించే సెలయేళ్లు సందర్శకులకు కనువిందు చేస్తూ మనోల్లాసం కలిగిస్తుంటాయి. అయితే, ఆయా కొండల్లో వ్యవసాయమే జీవనాధారంగా బతికే రైతులకు మాత్రం ఈ సెలయేళ్లలో నీరు ఏ మాత్రం ఉపయోగపడదు. పొలాలు ఎత్తులో ఉండటమే కారణం. విద్యుత్ మోటార్లతో వాగుల్లో నిటిని రైతులు తోడుకోవచ్చు. అయితే, చాలా కొండ ప్రాంతాల్లో విద్యుత్ సదుపాయం ఉండదు.
డీజిల్ ఇంజన్లు పెట్టుకునే స్థోమత రెక్కాడితే గాని డొక్కడని అక్కడి చిన్న, సన్నకారు రైతులకు అసలే ఉండదు. కళ్ల ముందు నీరున్నా ఆ పక్కనే కొద్ది ఎత్తులో ఉన్న తమ పొలాల్లో పంటలకు పెట్టుకోలేని అశక్తత ఆ రైతుల పేదరికాన్ని పరిహసిస్తూ ఉంటుంది. ఏజన్సీవాసులకు శాశ్వతంగా మేలు జరిగేలా వాగుల్లో పారే నీటిని విద్యుత్తు అవసరం లేకుండా ఎత్తిపోసేందుకు తన శక్తిమేరకు ఏదైనా ఉపాయం ఆలోచించాలని గ్రామీణ ఆవిష్కర్త పంపన శ్రీనివాస్(47) లక్ష్యంగా పెట్టుకున్నారు. కాకినాడ జిల్లా కైకవోలు ఆయన స్వగ్రామం. చదివింది ఐటిఐ మాత్రమే అయినా, లక్ష్యసాధన కోసం అనేక ఏళ్ల పాటు అనేక ప్రయోగాలు చేస్తూ చివరికి విజయం సాధించారు. వాగుల్లో నుంచి నీటిని విద్యుత్ లేకుండా పరిసర పొలాల్లోకి ఎత్తిపోయటంలో ఆయన సాధించిన విజయాలు రెండు: 1. పాతకాలపు ర్యాం పంపు సాంకేతికతను మెరుగుపరచి వాగుల్లో ర్యాం పంపులను ఏర్పాటు చేయటం. 2. హైడ్రో లిఫ్ట్ అనే కొత్త యంత్రాన్ని ఆవిష్కరించటం.

హైడ్రో లిఫ్ట్ ఆవిష్కరణ

వాగులో 4–5 అడుగుల ఎత్తు నుంచి చెంగు చెంగున కిందికి దూకే నీటిని ఒడిసిపట్టి పరిసర పంట పొలాల్లోకి ఎత్తిపోసే 'హైడ్రో లిఫ్ట్' అనే వినూత్న యంత్రాన్ని శ్రీనివాస్ సొంత ఆలోచనతో, సొంత ఖర్చుతో ఆవిష్కరించారు. ఈ గ్రామీణ ఆవిష్కర్త రూపొందించిన చిన్న నమూనా (ప్రొటోటైప్) యంత్రాన్ని ఉమ్మడి తూ.గో. జిల్లా దివిలికి సమీపంలోని ముక్కోలు చెక్‌డ్యామ్ వద్ద విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించారు. దీని పనితీరును నిపుణులు ప్రశంసించారు.

ఇది మూడు అడుగుల పొడవు, ఒక డయామీటర్‌తో ఉంది. దీని చుట్టూతా అంగుళం బ్లేడ్లు వాలుగా అమర్చి వుంటాయి. నీటి ఉధృతికి లేదా వరదకు దుంగలు, రాళ్లు కొట్టుకొచ్చినా కదిలిపోకుండా ఉండేలా ఇనుప చట్రంలో ఈ చక్రాన్ని అమర్చారు. హైడ్రో లిఫ్ట్‌తో కూడిన ఈ చట్రాన్ని చెక్‌డ్యామ్ కింది భాగాన ఏర్పాటు చేశారు. సెకనుకు 20 లీటర్ల చొప్పున ఈ చక్రంపై పడేలా నీటి ప్రవాహం ఉంటే సెకనుకు 1 లీటరు నీటిని పొలంలోకి ఎత్తిపోయటానికి వీలవుతుందని శ్రీనివాస్ తెలిపారు. నీటి ప్రవాహ వేగం తక్కువగా వున్నా నిమిషానికి 40 సార్లు (ఆర్‌పిఎం) ఇది శక్తివంతంగా తిరుగుతోంది. ఈ బాక్స్ షాఫ్టనకు అమర్చిన పిస్టన్ 300 ఆర్‌పిఎంతో నడుస్తుంది.

చిన్న హైడ్రో లిఫ్ట్‌తో ఎకరానికి నీరు

నిమిషానికి 60 లీటర్ల నీటిని వాగులో నుంచి 20 అడుగుల ఎత్తుకు (40 అడుగుల ఎత్తుకైతే నిమిషానికి 40 లీటర్లు) తోడే శక్తి ఈ ప్రొటోటైప్ హైడ్రో లిఫ్ట్‌కు ఉంది. ఈ నీరు పారగడితే పావెకరంలో కూరగాయల సాగుకు సరిపోతుందని, డ్రిప్ ఏర్పాటు చేసుకుంటే ఎకరానికి సరిపోతుందని శ్రీనివాస్ తెలిపారు. దీని తయారీకి రూ. 35 వేలు ఖర్చవుతుందని, వాగులో ఇన్‌స్టాల్ చేయటానికి అదనంగా ఖర్చవుతుందన్నారు. వాగు నీటి ఉధృతిని బట్టి, అధిక విస్తీర్ణంలో సాగు భూమి నీటి అవసరాలను బట్టి హైడ్రో లిఫ్ట్ పొడవు 9–16 అడుగుల పొడవు, 2–4 అడుగుల డయామీటర్ సైజులో తయారు చేసుకుంటే అధిక పరిమాణంలో నీటిని ఎత్తిపోయవచ్చునని శ్రీనివాస్ వివరించారు. గత అక్టోబర్‌లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో శోధయాత్రలో భాగంగా పల్లె సృజన అధ్యక్షులు పోగుల గణేశం బృందం ఈ హైడ్రో లిఫ్ట్ పనితీరును పరిశీలించి మెచ్చుకున్నారన్నారు. పల్లెసృజన తోడ్పాటుతో పేటెంట్ కోసం దరఖాస్తు చేయబోతున్నారు. ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటునందించి పెద్ద హైడ్రో లిఫ్టులను తయారు చేసి పెడితే కొండ ప్రాంతవాసుల సాగు నీటి కష్టాలు కొంతైనా తీరుతాయి.

– లక్కింశెట్టి శ్రీనివాసరావు,
సాక్షి ప్రతినిధి, కాకినాడ

ఇటు పొలాలకు నీరు.. అటు ఇళ్లకు విద్యుత్తు!

రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటిడిఏల పరిధిలో కొండలపై నుంచి వాగులు, వంకలు నిత్యం ప్రవహిస్తున్నాయి. వాగు నీటి ప్రవాహ శక్తిని బట్టి వాగు ఇరువైపులా ఉన్నటు భూమి ఎత్తు, స్వభావాన్ని బట్టి తగినంత రూ. 15–20 లక్షల ఖర్చుతో 9–16 అడుగుల వరకు పొడవైన హైడ్రో లిఫ్ట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. దీని ద్వారా 6 అంగుళాల పంపుతో విద్యుత్ లేకుండానే వాగు ఇరువైపులా 50 నుంచి 100 ఎకరాల భూమికి సాగు నీరు అందించవచ్చు. అంతేకాకుండా, ఒక్కో వాటర్ వీల్ ద్వారా 15 కెవి విద్యుత్‌ను తయారు చేసి సుమారు 20–30 కుటుంబాలకు అందించవచ్చు. ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ, గిరిజనాభివృద్ధి శాఖలు, స్వచ్ఛంద సేవా సంస్థలు హైడ్రో లిఫ్ట్ పద్ధతిని ప్రోత్సహిస్తే నా వంతు కృషి చేస్తా.



– పంపన శ్రీనివాస్ (79895 99512),
గ్రామీణ ఆవిష్కర్త, కైకవోలు,
పెదపూడి మండలం, కాకినాడ జిల్లా

ర్యాం పంపుతో పదెకరాలకు నీరు

ఎత్తు నుంచి లోతట్టు ప్రాంతాలకు పారే వాగు నీటిని ఒడిసిపట్టే ర్యాం పంపు సాంకేతికత ఇప్పటికే అందుబాటులో ఉంది. ఏజన్సీవాసుల నీటి కష్టాలు తీర్చేందుకు విద్యుత్ అవసరం లేకుండా పని చేసే ఈ ర్యాం పంపును మెరుగైన రీతిలో వినియోగంపై శ్రీనివాస్ తొలుత కృషి చేశారు. వివిధ సంస్థల తోడ్పాటుతో కొన్ని చోట్ల ర్యాం పంపులు ఏర్పాటు చేశారు. అయితే, ర్యాం పంపు సాంకేతికతకు ఉన్న పరిమితులు కూడా ఎక్కువేనని శ్రీనివాస్ గ్రహించారు.

ర్యాం పంపు అమర్చాలి అంటే.. వాగులో 4 నుండి 6 అడుగుల ఎత్తు నుంచి నీరు కిందికి పారే చిన్నసైజు జలపాతం ఉండాలి. ఆ నీటిని ప్రవాహానికి ఎదురుగా పొడవాటి ఇనుప గొట్టాన్ని అమర్చి, ఆ గొట్టం ద్వారా ఒడిసిపట్టిన నీటిని పిస్టన్ల ద్వారా ఎత్తిపోసేందుకు ఏర్పాట్లు చేస్తారు. ఒక్కో ర్యాం పంపు బెడ్‌పైన రెండు పిస్టన్లు అమరుస్తారు. ఒక పిస్టన్‌ను కాలితో లేదా చేతితో రెండు మూడు సార్లు కిందికి నొక్కితే చాలా ఇక వాటంతట అవే రెండు పిస్టన్లు ఒకదాని తర్వాత మరొకటి, పైకి కిందకు లేచి పడుతూ ఉంటాయి. అలా పిస్టన్లు పనిచేయటం వల్ల నీరు వత్తిడి ద్వారా పక్కనే ఏర్పాటు చేసిన ఒక నాన్ రిటర్న్ వాల్వ్‌కు అమర్చిన పైపు ద్వారా పంట పొలాలకు నీరు ఎత్తిపోస్తారు. రెండున్నర అంగుళాల పైపు ద్వారా నీరు వెళ్తుంది. ర్యాం పంపు నెలకొల్పడానికి రూ. 2.5–3.5 లక్షలు ఖర్చవుతుంది. ఒకసారి పెట్టుబడి పెడితే రోజుకు కనీసం 10 ఎకరాలకు నీటిని పారించవచ్చు. విద్యుత్తు అవసరం లేదు. పిస్టన్లకు ఆయిల్ సీల్స్ లాంటి విడి భాగాలు ఏవీ ఉండవు కాబట్టి, నిర్వహణ ఖర్చేమీ ఉండదు. ర్యాం పంప్‌ల తయారీకి సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ రీసెర్చ్ (సీడీఆర్), టాటా ట్రస్టు విసిఎఫ్, సిసిఎల్ తదితర సంస్థలు ఆర్థిక సహాయాన్నందించాయి.





రంపచోడవరం ప్రాంతంలో వాగులో ఏర్పాటు చేసిన ర్యాం పంపు

ర్యాం పంపుల పరిమితులు

అయితే, కనీసం 8–10 అడుగుల ఎత్తు నుంచి కిందికి నీరు పారే చోట్ల మాత్రమే ర్యాం పంపును నిర్మించగలం. ఇందుకు అనుకూలమైన చోట్లు చాలా తక్కువే ఉంటాయి. దీన్ని నెలకొల్పడానికి సిమెంటు కాంక్రీటుతో పునాదిని నిర్మించాలి. బండ రాళ్లు అనువైన రీతిలో ఉంటేనే సివిల్ వర్క్ చేయడానికి అనుకూలం. అందువల్ల కాంక్రీట్ వర్క్ కొన్నిచోట్ల విఫలమవుతూ ఉంటుంది. ర్యాం పంపులకు ఉన్న ఈ పరిమితుల దృష్ట్యా తక్కువ ఎత్తు నుంచి నీరు పారే చోట్ల నుంచి నీటిని ఎత్తిపోసే కొత్త యంత్రాన్ని తయారు చేస్తే ఎక్కువ భూములకు సాగు నీరందించవచ్చన్న ఆలోచన శ్రీనివాస్ మదిలో మెదిలింది. అలా పుట్టిన ఆవిష్కరణే 'హైడ్రో లిఫ్ట్'.

6 జిల్లాల్లో శీతల గాలులు: పంటలను ఇలా రక్షించుకుందాం!

తెలంగాణా రాష్ట్రంలో వచ్చే రెండు రోజు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని, ఉదయపు వేళల్లో దట్టంగా పొగమంచు ఆవరించే అవకాశం ఉందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయ వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త **డా. పి. లీలారాణి** 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో శీతల గాలులు వీచే అవకాశం ఉంది. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వివిధ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. రైతులు ఈ కింది సూచనలు పాటించాలని డా. పి. లీలారాణి సూచించారు:



వరి: తెలంగాణా జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు చాలా ప్రాంతాలలో 15 డిగ్రీల కంటే తక్కువగా నమోదవుతున్నాయి. చలి ప్రభావంతో యాసంగి నారుమడుల్లో నారు ఎదగక పోవచ్చు. ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారవచ్చు. కొన్నిసార్లు నారు చనిపోవచ్చు. అందువల్ల రైతులు కొన్ని రక్షణ చర్యలు చేపట్టాలి. ● నారుమళ్ళపై ఇనుప చువ్వలు లేదా వెదురు కర్రలతో ఊతమిచ్చి పైన పలుచని పాలిథిన్ షీట్ లేదా ఖాళీ యూరియా బస్తాలతో తయారు చేసిన పట్టాలతో సాయంత్రం పూట కప్పి, మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి. ● రాత్రి వేళల్లో నారుమడిలో నీరు నిండుగా ఉంచి తెల్లవారుజామున తీసివేసి, కొత్త నీరు పెట్టాలి. ● 200 చదరపు మీటరు విస్తీర్ణం గల నారుమడికి ఆఖరి దుక్కిలో 2 క్వింటాళ్లు బాగా చివికిన కోళ్ళ లేదా గొర్రెల ఎరువు వేయాలి. విత్తే సమయంలో 1 కిలో నత్రజని, 1కిలో భాస్వరం, 1 కిలో పొటాషియం ఇచ్చే రసాయనిక ఎరువులు వేయాలి. ● వరి నారుమళ్ళలో జింక్ ధాతువు లోపం నివారణకు 2 గ్రా. జింక్ సల్ఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ● వరుసగా వరి పంట పండించే భూముల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి లేదా ప్రతి యాసంగిలో దమ్ములో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి. ● చలి వాతావరణం, పొగమంచు వరిని అగ్గి తెగులు ఆశించటానికి అనుకూలం. పొలంలో, పొలంగట్లపైన ఉండే గడ్డి కలుపు మొక్కలు అగ్గి తెగులను వ్యాప్తి చేస్తాయి. కాబట్టి, పొలం గట్లపై కలుపు లేకుండా చూసుకోవాలి. వరి నారుమళ్ళలో అగ్గి తెగులు గమనిస్తే, నివారణకు 0.5 గ్రా. ట్రైసైక్లాజోల్ లేదా 1.5 మి.లీ. ఐసోప్రొథైయోలిన్ లేదా 2.5 మి.లీ. కాసుగామైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మొక్కజొన్న: చలి వల్ల మొక్కజొన్నలో భాస్వరం లోపించి ఆకులు ఊదా రంగులోకి మారుతాయి. భాస్వరం లోప లక్షణాలు గమనించినట్లితే నివారణకు 10 గ్రా. 19-19-19 లేదా డి.ఎ.పి మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మిరప : ప్రస్తుత చలి వాతావరణం మిరపను బూడిద తెగులు ఆశించటానికి అనుకూలం. నివారణకు, 3గ్రా. నీటిలో కరిగే గంధకం లేదా 1 మి.లీ. అజాక్సిస్ట్రోబిన్ లేదా 2.5గ్రా. టేబుకొనజోల్ + గంధకం లేదా 1.5గ్రా. కార్బండజిమ్ + మాంకోజేబ్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మామిడి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మామిడిలో తేనె మంచు పురుగు, బూడిద తెగులు ఆశించటానికి అనుకూలం. నివారణకు, 0.3గ్రా. డైనోటేఫురాన్ + 1గ్రా. కార్బండజిమ్ + 2.5 మి.లీ. వేపనూనె లేదా 0.5 గ్రా. థయోమిథాక్సామ్ + 2 మి.లీ. హెక్సాకొనజోల్ + 2.5 మి.లి వేప నూనె మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కుసుమ: నవంబర్‌లో విత్తుకున్న కుసుమ పంటకు పేనుబంక ఆశించే అవకాశం ఉంది. నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్



బుమ్రాపై తప్పుడు వ్యాఖ్య... కామెంటేటర్ ఇసా గుహ క్షమాపణలు

మూడో టెస్టులో జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్ గురించి విశ్లేషిస్తున్న సందర్భంలో కామెంటేటర్ ఇసా గుహ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. బుమ్రాపై ఒక రకంగా ప్రశంసలు కురిపిస్తూనే ఆమె నోరు జారింది. 'మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్' అంటూనే మోస్ట్ వాల్యుబుల్ 'ప్రైమేట్' అంటూ బుమ్రాను వానరంతో పోల్చింది! ఆదివారం ఆటలో ఆమె ఈ వ్యాఖ్యలు చేయగా ఇసాపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దాంతో ఆమె మ్యాచ్ మూడో రోజు కామెంటరీలోనే బహిరంగంగా క్షమాపణ చెప్పింది. 'క్రీడా వ్యాఖ్యాతగా నా కెరీర్‌లో ఎంతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాను. కామెంటరీలో నేను బుమ్రా గురించి ఒక మాటను వాడాను. నిజానికి నాకు ఎలాంటి తప్పుడు ఉద్దేశం లేదు. నేను చెప్పిన మొత్తం మాటలను బట్టి చూస్తే నేను ఒక గొప్ప ఆటగాడిని ప్రశంసిస్తున్నానని మీకు అర్థమవుతుంది. అయితే వేరే అర్థంలో జనం దానిని చూశారు. అయినా సరే నేను తప్పు చేసినట్లు భావించి క్షమాపణలు చెబుతున్నా.' అని ఇసా వివరణ ఇచ్చింది. ఇసా గుహ ఇంగ్లండ్ తరఫున మూడు ఫార్మాట్‌లలో కలిపి 113 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది.



ప్రపంచ చాంపియన్‌షిప్ విన్నర్స్ ట్రోఫీ, స్వర్ణ పతకంతో గుకేశ్. చిత్రంలో గుకేశ్ తల్లిదండ్రులు రజనీకాంత్, పద్మ

చెన్నై అక్కున చేర్చుకోగా...

సొంతగడ్డపై గుకేశ్‌కు ఘనస్వాగతం

సాక్షి, చెన్నై: ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను గెలుచుకున్న నాలుగు రోజుల తర్వాత గుకేశ్ దొమ్మరాజు స్వదేశంలో అడుగు పెట్టాడు. టైటిల్ గెలుచుకున్న సింగపూర్ సిటీ నుంచి అతను సోమవారం చెన్నైకి చేరుకున్నాడు. పుట్టి పెరిగి ఆటలో ఓనమాలు చేర్చుకున్న గడ్డపై విశ్వ విజేత హోదాలో గుకేశ్‌కు సోమవారం భారీ స్థాయిలో ఘన స్వాగతం లభించింది. అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) ప్రతినిధులు, తమిళనాడు రాష్ట్ర అధికారులతో పాటు అతను చదువుకున్న వేలమ్మాల్ స్కూల్ విద్యార్థులు, వర్ధమాన చెస్ ఆటగాళ్లు పెద్ద సంఖ్యలో విమానాశ్రయంలో గుకేశ్‌కు వెల్‌కమ్ చెప్పారు. అతని ఫోటోలు, ఇతర చెస్ చిత్రాలతో అలంకరించి ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వాహనంలో ఈ యువ చాంపియన్ విమానాశ్రయం నుంచి ముందుగా తన ఇంటికి వెళ్లాడు. ఆపై వేలమ్మాల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నాడు. తల్లిదండ్రులు రజనీకాంత్, పద్మాకుమారి అతని వెంట ఉన్నారు. నేడు గుకేశ్‌కు స్థానిక కలైవానర్ ఆరంగం ఆడిటోరియంలో ప్రత్యేక సన్మానం జరిగే అవకాశం ఉంది. ఇదే కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పాల్గొని ఇప్పటికే ప్రకటించిన రూ.5 కోట్ల బహుమతి పురస్కారాన్ని గుకేశ్‌కు అందించనున్నారు. 'నాకు మద్దతు పలికిన అందరికీ కృతజ్ఞతలు. ఇలాంటి సహకారం నాకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుంది. వరల్డ్ చాంపియన్‌గా నిలవడం చాలా గొప్పగా ఉంది. భారత ఆటగాడు మరోసారి విశ్వ విజేత కాగలిగాడు. నా ఈ విజయంలో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం సహకారం కూడా ఎంతో ఉంది. గత ఏడాది గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ నిర్వహించి నాకు స్పాన్సర్‌షిప్ అందించడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేశారు. అక్కడ గెలవడంతో క్యాండిడేట్స్ విజయానికి పునాది పడింది. ఇలాంటి సహకారం ఉంటే రాష్ట్రం నుంచి మరెంతో మంది ఆటగాళ్లు హైస్థాయికి చేరతారు. ఈ రోజు లభించిన స్వాగతాన్ని ఎప్పటికీ మర్చిపోలేను. రాబోయే కొన్ని రోజులు కలిసి సంబరాలు చేసుకుందాం' అని గుకేశ్ వ్యాఖ్యానించాడు. తన చాంపియన్‌షిప్ విజయంపై స్కూల్ విద్యార్థులు అడిగిన ప్రశ్నకు సమాధానిస్తూ... 'చెస్‌లో విజయం అంటే బాగా ఆడితేనే సరిపోదు. ఎంతో మానసిక ఒత్తిడి ఉంటుంది. దానిని అధిగమించాలి. అందుకే మెంటల్ కండిషనింగ్ కోచ్ ప్యాడీ ఆప్టన్ సహకారం తీసుకున్నాను. ఆయనతో కలిసి పని చేయడం నాకు కలిసొచ్చింది' అని వెల్లడించాడు.

వచ్చే ఏడాది కార్ల్‌సన్‌తో గుకేశ్ 'ఢీ'

కొత్త ప్రపంచ చాంపియన్ గుకేశ్ వచ్చే ఏడాది మాజీ విశ్వవిజేత, చెస్‌లో అత్యధిక రేటింగ్ ఉన్న నార్వే దిగ్గజం మాగ్నస్ కార్ల్‌సన్‌తో తలపడనున్నాడు. నార్వేలోని స్టావెంజర్ నగరంలో మే 26 నుంచి జూన్ 6 వరకు జరిగే నార్వే చెస్ టోర్నీలో గుకేశ్ పోటీపడనున్నాడు. ఈ విషయాన్ని గుకేశ్ సోమవారం ఖరారు చేశాడు. పురుషుల, మహిళల విభాగాల్లో టాప్–6 ప్లేయర్లే నార్వే చెస్ టోర్నీలో డబుల్ రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో తలపడతారు. గత ఏడాది ఈ టోర్నీలో గుకేశ్ మూడో స్థానంలో నిలిచాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో


ఆదుకునేందుకు వాన వచ్చింది!



రోహిత్ శర్మ




యశస్వి జైస్వాల్



గిల్



కోహ్లి



పంత్

కంగారూ గడ్డపై భారత పేలవ బ్యాటింగ్ ప్రదర్శన మూడో టెస్టులోనూ కొనసాగింది. బౌలింగ్ వైఫల్యంతో ఆతిథ్య జట్టుకు భారీ స్కోరు చేసే అవకాశం కల్పించిన టీమిండియా తమ బ్యాటింగ్ వంతు వచ్చేసరికి చేతులెత్తేసింది. పది ఓవర్లలోపే పేలవ షాట్లతో యశస్వి జైస్వాల్, శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి వెనుదిరగ్గా... కొద్ది సేపటికి రిషభ్ పంత్ వీరిని అనుసరించాడు. ఆసీస్ బౌలర్లు చెలరేగుతున్న తీరు చూస్తే మూడో రోజే మన ఆట ముగిసిపోతుందేమో అనిపించింది. అయితే ఉదయం నుంచి పదే పదే అంతరాయం కలిగించిన వర్షం చివర్లో మళ్లీ వచ్చి ఊరట అందించింది. నాలుగో రోజు మన బ్యాటర్లు ఆదుకొని జట్టును కాస్త మెరుగైన స్థితికి చేరుస్తారా... లేక ఆసీస్‌కు విజయావకాశం సృష్టిస్తారా చూడాలి.

తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 51/4 ● మరో 394 పరుగులు వెనుకంజ
మూడో రోజూ టెస్టుకు వర్షం దెబ్బ ● ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 ఆలౌట్

బ్రిస్బేన్: భారత్, ఆస్ట్రేలియా మధ్య మూడో టెస్టుకు మరోసారి వర్షం అడ్డుగా నిలిచింది. మ్యాచ్ మూడో రోజు సోమవారం కేవలం 33.1 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 17 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 51 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (64 బంతుల్లో 33 బ్యాటింగ్; 4 ఫోర్లు), కెప్టెన్ రోహిత్ శర్మ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం భారత్ 394 పరుగులు వెనుకబడి ఉంది. ఫాలోఆన్ నుంచి తప్పించుకోవాలంటే టీమిండియా మరో 195 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 405/7తో ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (88 బంతుల్లో 70; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా, జస్‌ప్రీత్ బుమ్రా (6/76) ఆరు వికెట్లతో ముగించాడు.

మరో 40 పరుగులు...

మూడో రోజు ఆసీస్ ఆటను కేరీ నడిపించాడు. జడేజా బౌలింగ్‌లో ఫోర్‌తో 53 బంతుల్లోనే అతను అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా... మిచెల్ స్టార్క్ (30 బంతుల్లో 18; 1 ఫోర్, 1 సిక్స్) కొద్దిసేపు అండగా నిలిచాడు. స్టార్క్‌ను వెనక్కి పంపించి బుమ్రా తన ఆరో వికెట్‌ను సొంతం చేసుకున్నాడు. 11 ఓవర్ల తర్వాత వాన రావడంతో కొద్దిసేపు ఆట నిలిచిపోయింది. మళ్లీ మొదలయ్యాక మరో 5.1 ఓవర్లలో ఆసీస్ చివరి 2 వికెట్లు కోల్పోయింది. లయన్ (2)ను సిరాజ్ బౌల్డ్ చేసిన మరో 4 బంతులకు కేరీ వికెట్ ఆకాశ్‌దీప్ ఖాతాలో చేరింది. సోమవారం మొత్తం 16.1 ఓవర్లు ఆడిన ఆస్ట్రేలియా 40 పరుగులు జత చేసింది.

టపటపా...

ఇన్నింగ్స్ తొలి బంతికే ఫోర్‌తో మొదలు పెట్టిన యశస్వి జైస్వాల్ (4)ను స్టార్క్ రెండో బంతికే పెవిలియన్ చేర్చగా, అతని తర్వాతి ఓవర్ తొలి బంతికే గిల్ (3 బంతుల్లో 1) కూడా అవుటయ్యాడు. గల్లీలో మిచెల్ మార్ష్ అద్భుత రీతిలో గాల్లోకి ఎగిరి క్యాచ్‌ను అందుకోవడం విశేషం. విరాట్ కోహ్లి (16 బంతుల్లో 3) ఆఫ్‌స్టంప్ బలహీనతను మరోసారి సొమ్ము చేసుకుంటూ హాజల్‌వుడ్ చక్కటి బంతితో వెనక్కి పంపించాడు. కోహ్లి వికెట్ పడగానే వర్షం రావడంతో ఆట కాస్త ఆగింది. ఆట మళ్లీ మొదలయ్యాక రిషభ్ పంత్ (12 బంతుల్లో 9)ను అవుట్ చేసి కమిన్స్ మరో దెబ్బ కొట్టాడు. అనంతరం మరో 19 బంతులకే వాన రాకతో ఆట పూర్తిగా రద్దయింది. ఒకవైపు నాలుగు వికెట్లు పడినా... మరో ఎండ్‌లో రాహుల్ కొన్ని చక్కటి షాట్లతో పట్టుదలగా నిలబడ్డాడు.



మార్ష్, స్టార్క్ సంబరం

స్కోరు వివరాలు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: ఖ్వాజా (సి) పంత్ (బి) బుమ్రా 21; మెక్‌స్వీనీ (సి) కోహ్లి (బి) బుమ్రా 9; లబుషేన్ (సి) కోహ్లి (బి) నితీశ్ రెడ్డి 12; స్మిత్ (సి) రోహిత్ (బి) బుమ్రా 101; హెడ్ (సి) పంత్ (బి) బుమ్రా 152; మార్ష్ (సి) కోహ్లి (బి) బుమ్రా 5; కేరీ (సి) గిల్ (బి) ఆకాశ్‌దీప్ 70; కమిన్స్ (సి) పంత్ (బి) సిరాజ్ 20; స్టార్క్ (సి) పంత్ (బి) బుమ్రా 18; లయన్ (బి) సిరాజ్ 2; హాజల్‌వుడ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 35; **మొత్తం** (117.1 ఓవర్లలో ఆలౌట్) 445. **వికెట్ల పతనం:** 1–31, 2–38, 3–75, 4–316, 5–326, 6–327, 7–385, 8–423, 9–445, 10–445. **బౌలింగ్:** బుమ్రా 28–9–76–6, సిరాజ్ 23.2–5–97–2, ఆకాశ్‌దీప్ 29.5–5–95–1, నితీశ్ రెడ్డి 13–1–65–1, జడేజా 23–2–95–0.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 4; కేఎల్ రాహుల్ (బ్యాటింగ్) 33; గిల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 1; కోహ్లి (సి) కేరీ (బి) హాజల్‌వుడ్ 3; పంత్ (సి) కేరీ (బి) కమిన్స్ 9; రోహిత్ (బ్యాటింగ్) 0; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం** (17 ఓవర్లలో 4 వికెట్లకు) 51. **వికెట్ల పతనం:** 1–4, 2–6, 3–22, 4–44. **బౌలింగ్:** స్టార్క్ 8–1–25–2, హాజల్‌వుడ్ 5–2–17–1, కమిన్స్ 2–0–7–1, లయన్ 1–0–1–0, హెడ్ 1–0–1–0.

సినిమా

కన్నప్పలో కిరాట



మోహన్‌లాల్

మంచు విష్ణు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. ఇందులో ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్‌బాబు, మోహన్‌లాల్, శరత్‌కుమార్, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో నటించగా, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకాలపై మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 25న విడుదల కానుంది. ఈ సినిమాలోని కిరాట పాత్రలో మోహన్‌లాల్ నటిస్తున్నారని వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''కన్నప్ప' సినిమా ఈ తరం ప్రేక్షకులకైనా కొత్తగానే ఉంటుంది. భక్తి భావం, ధూర్జటి మహాకవి ఎలా రాశారు? శ్రీకాళహస్తి మహత్మ్యం ఏంటి? అన్నది ఈ చిత్రంలో చూపించనున్నాం. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు. అన్ని రకాల అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ఆ పరమేశ్వరుడి ఆజ్ఞతోనే ఈ సినిమా తీస్తున్నాం'' అన్నారు మోహన్‌బాబు.

ప్రభాస్‌కు గాయం



ప్రభాస్

హీరో ప్రభాస్ కాలికి గాయమైంది. ఈ విషయాన్ని ఆయనే వెల్లడించారు. కాలికి అయిన గాయం కారణంగా ప్రభాస్ 'కల్కి' ప్రమోషన్స్‌లో పాల్గొనలేకపోతున్నారు. ప్రభాస్ హీరోగా నటించిన సైన్స్ ఫిక్షన్ అండ్ మైథలాజికల్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ' జూన్ 27న విడుదలైన విషయం విదితమే. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి. అశ్వనీదత్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 3న జపాన్‌లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జపాన్‌లో జరగనున్న ప్రమోషనల్ కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రభాస్, నాగ్ అశ్విన్ ప్లాన్ చేశారు. కానీ ఈ కార్యక్రమాల్లో ప్రభాస్ పాల్గొనడం లేదు. ''మీరు (జపాన్ అభిమానులను ఉద్దేశిస్తూ...) నాపై, నా పనిపై చూపిస్తున్న ప్రేమకు ధన్యవాదాలు. మిమ్మల్ని కలవాలని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. కానీ నా కాలికి గాయమైన కారణంగా జపాన్‌కు రాలేకపోతున్నాను. త్వరలోనే మిమ్మల్ని కలుసుకుంటాననే నమ్మకం ఉంది'' అని జపాన్ భాషలో ప్రభాస్ ఓ నోట్‌ను షేర్ చేసినట్లు ప్రచారంలో ఉంది. ఇక ప్రభాస్ గాయం స్వల్పమైనదే అని, వైద్యుల సూచనల మేరకు ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిసింది. కాగా ప్రభాస్ ప్రస్తుతం 'రాజాసాబ్, ఫౌజీ' (ప్రచారంలో ఉన్న టైటిల్) సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన ఏ సినిమా షూటింగ్‌లో గాయపడ్డారనే విషయంపై సరైన స్పష్టత రావాల్సి ఉంది.



నిఖిల్, నాగార్జున

తెలుగు బిగ్ బాస్‌లో విజేత కన్నడ నటుడు

● బిగ్ బాస్ ఆఖరి వారం విశ్లేషణ

భాష ఏదైనా భావం ముఖ్యమన్న విషయాన్ని నిరూపించింది ఈ సీజన్ 'బిగ్ బాస్'. ఈ సీజన్ 8లో విన్నర్‌గా కన్నడ నటుడు నిఖిల్ విజేతగా నిలిచారు. 22 మంది కంటెస్టెంట్స్‌తో 105 రోజులు హోరాహోరీగా జరిగిన పోరాటంలో అజేయంగా నిలిచారు. మొదటి ఎపిసోడ్ నుండీ తన ఆధిక్యతను ప్రదర్శిస్తూనే వస్తున్నారు నిఖిల్. ఓ దశలో ఫస్ట్ రన్నరప్ గౌతమ్ గట్టి పోటీ ఇచ్చినా చివరికి విజయం మాత్రం నిఖిల్‌నే వరించింది. ఫైనల్ ఎపిసోడ్‌లో టాప్ 5గా నిలిచిన అవినాష్, ప్రేరణ, ముందుగా ఎలిమినేట్ అయ్యి టాప్ 3లో నబీల్, గౌతమ్, నిఖిల్ నిలిచారు. ఈ ముగ్గురిలో విన్నర్‌గా నిఖిల్‌ని ప్రకటించారు హోస్ట్ నాగార్జున. ఈ సీజన్లలో ప్రత్యేకత ఏంటంటే విన్నర్ పరభాషా నటుడవడం. ఆదివారం ప్రసారమైన గ్రాండ్ ఫినాలే యథావిధిగా ఆర్భాటంగా జరిగింది. ఈ సీజన్‌లో పలు సెలబ్రిటీస్‌తో పాటు ఫినాలేలో గ్లోబల్‌స్టార్ రామ్‌చరణ్ గెస్ట్‌గా రావడం ఎపిసోడ్‌కే హైలైట్.

ఇక ఎనిమిదో సీజన్ విశ్లేషణకొస్తే... 14మందితో ప్రారంభమైన బిగ్ బాస్ హౌస్‌లోకి తర్వాత మరో 8 మంది వైల్డ్ కార్డు ఎంట్రీస్‌తో ఎంట్రీ ఇచ్చారు. దీంతో మొత్తంగా 22 మంది పార్టిసిపెంట్స్‌తో 15 వారాలు ప్రేక్షకులను అలరించింది. బిగ్ బాస్ అనేది ప్రపంచ ప్రేక్షకాదరణ పొందిన కాన్సెప్ట్. అటువంటిది తెలుగులోనూ విశేష ఆదరణ లభించింది. ఇదే ఈ కార్యక్రమాన్ని భారత్‌లో నం.1గా నిలబెట్టింది. అన్ని సీజన్ల మాదిరిగానే ఈ సీజన్‌లోనూ పార్టిసిపెంట్స్ మధ్య వాడి, వేడి టాస్కులతో సెగలు పుట్టించగా.. హోస్ట్ నాగార్జున వారాంతంలో వీరి ఆట తీరుపై విశ్లేషణతో ప్రేక్షకులను కట్టిపడేసే ప్రయత్నం చేశారు. నత్తి మెదడు, మగాళ్ళు, కుట్టి వంటి పదాలు ఈ సీజన్‌లో పార్టిసిపెంట్స్ మధ్య బాగా ప్రాచుర్యం పొందాయి. ప్రతి సీజన్‌ని ఫాలో అయ్యే ప్రేక్షకులకు రొటీన్ టాస్కుల పరంగా కాస్తంత అసహనం కలిగించినా సెలబ్రిటీలతో సీజన్ కవర్ చేయడానికి బాగానే ప్రయత్నించారు. బిగ్ బాస్ టీవీ షోనే అయినా దీని తాకిడి మాత్రం సోషల్ మీడియాను ఓ ఊపు ఊపేసింది. సోషల్ మీడియాలోనే పార్టిసిపెంట్స్ పరంగా గ్రూపులతో పాటు కార్యక్రమంలోని అంశాలపై రోజువారీ చర్చలు జరిగాయి. బిగ్ బాస్ కార్యక్రమానికి కావలసిందీ ఇదే.

బిగ్ బాస్ తెలుగు చరిత్రలో ఇప్పటిదాకా ఎక్కువగా హోస్ట్‌గా చేసింది నాగార్జునే. తన ఛరిష్మాతో ఇటు పార్టిసిపెంట్స్‌ను అటు ప్రేక్షకుల్ని కూడా ఆకట్టుకుంటున్నారనడంలో అతిశయోక్తి లేదు. పార్టిసిపెంట్స్ గొడవ ఓ ఎత్తయితే ఆ గొడవకు సంబంధించిన నాగార్జున విశ్లేషణ మరో ఎత్తు. దీని కోసమే చాలా మంది వెయిట్ చేసేవారు. మామూలుగా అపరిచితులతో ప్రయాణం చేసేటప్పుడు జరిగే చిన్నపాటి ఘర్షణ తలెత్తినా చుట్టూ పదిమంది గుమిగూడి గొడవ సద్దుమణిగేదాకా సినిమా చూసినట్టు చూస్తారు. అలాంటిది 22 మంది అపరిచితులను వంద రోజులకు పై ఓ ఇంట్లో పెట్టి వారి మధ్య టాస్కులు పెడితే ఆ బొమ్మ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ప్రతిరోజూ ఒకే స్క్రీన్ మీద 22కు పైగా సినిమాలను చూసినట్టుండేది.. అదే బిగ్ బాస్. ఈ సీజన్‌తో బిగ్ బాస్ కార్యక్రమానికి కామా పడింది. మరో సీజన్ సినిమా కోసం ప్రేక్షకులు మరో 9 నెలలు వెయిట్ చేయాల్సిందే. వచ్చే సీజన్ వరకు ఈ సీజన్ వేడి మాత్రం చల్లారేదేలే. ఎందుకంటే బిగ్ బాస్ ఎప్పటికీ అస్సలు తగ్గేదేలే.

– ఇంటూరు హరికృష్ణ

ప్రేమికుల రోజున లైలా



విశ్వక్ సేన్

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లైలా'. ఈ చిత్రంతో ఆకాంక్షా శర్మ తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న రిలీజ్ చేయనున్నట్లుగా సోమవారం మేకర్స్ ప్రకటించి, కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రంలో అబ్బాయి, అమ్మాయిగా కనిపిస్తారు విశ్వక్ సేన్. అమ్మాయి పాత్రలో నటించడానికి బ్యూటిఫుల్‌గా మేకోవర్ అయ్యారు విశ్వక్. ప్రస్తుతం ఈ సినిమా షూట్ హైదరాబాద్‌లో జరుగుతోంది. 'లైలా' చిత్రం ఆడియన్స్‌కు మంచి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: రిచర్డ్ ప్రసాద్.

'పులిదండి మేరి... మే 22వ తారీఖున పన్నెండు... ఒంటిగంట మధ్య హత్యకు గురైంది' అనే డైలాగ్‌తో మొదలవుతుంది 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' సినిమా ట్రైలర్. 'వెన్నెల' కిశోర్ టైటిల్ రోల్‌లో నటించిన క్రైమ్ థ్రిల్లర్ ఫిల్మ్ ఇది. రవితేజ మహాదాస్యం, అనన్య నాగళ్ల జంటగా నటించిన ఈ సినిమాలో సీయా గౌతమ్ పోలీస్ కానిస్టేబుల్‌గా నటించారు. రైటర్ మోహన్ దర్శకత్వంలో శ్రీ గణపతి సినిమాస్ పతాకంపై లాస్య రెడ్డి సమర్పణలో వెన్నపూస రమణారెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను సోమవారం రిలీజ్ చేశారు. 'మూడు నెలల మధ్యలో మూడు చావులు... ఇంకెన్ని

ఇక తీగ లాగడమే...

చావులు చూడాలయ్యా ఈ బీచ్‌లో', 'ఇంద్ర ధనస్సులో కలర్లు ఏడు... ఈ క్రైమ్ సస్పెక్ట్‌లు కూడా ఏడే', 'నా కాడ ఇన్ఫర్మేషన్ ఉన్నాది... కన్ఫర్మేషన్ కోసం చూస్తున్నాను... ఇక తీగ లాగడమే...', అనే డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి. ''శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' టైటిల్‌కు వెన్నెల కిశోర్ జీవం పోశారు. షెర్లాక్ ప్రవర్తనలో హ్యూమర్ ఉన్నప్పటికీ, కేసును పరిష్కరించడంలో అతని తెలివితేటలు ఆడియన్స్‌ను ఆకట్టుకునేలా ఉంటాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



'వెన్నెల' కిశోర్

ప్రపంచాన్నే టాలీవుడ్ షేక్ చేస్తోంది

– ఉపేంద్ర



చంద్రు మనోహరన్, తులసీ రామ్, రేష్మ, ఉపేంద్ర, బుచ్చిబాబు, నవీన్ మనోహరన్

''ఇరవైఏళ్ల క్రితం నేను చేసిన సినిమాలను ఇంకా గుర్తుపెట్టుకుని, ఇప్పటికీ నన్ను ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. మీ అందరి ప్రేమ, ప్రోత్సాహం చూస్తుంటే ఇంకా అద్భుతమైన సినిమాలు తీయాలనే తపన కలుగుతోంది. ఈ గొప్పదనం అంతా తెలుగు ప్రేక్షకులదే. ప్రస్తుతం టాలీవుడ్ ఇండియానే కాదు... ప్రపంచాన్నే షేక్ చేస్తోంది. వెయ్యి కోట్లు, రెండువేల కోట్ల రూపాయల వసూళ్ల సినిమాలతో బ్లాక్‌బస్టర్ హిట్స్ సాధిస్తున్నారు'' అని ఉపేంద్ర అన్నారు. ఉపేంద్ర నటించి, స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'యూఐ'. లహరి ఫిల్మ్స్, వీనస్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై జి. మనోహరన్, కేపీ శ్రీకాంత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. గీతా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ఈ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఉపేంద్ర మాట్లాడుతూ– ''యూఐ' రెగ్యులర్ సినిమా కాదు. ఓ ఊహాత్మక ప్రపంచంలా ఈ సినిమా కనిపిస్తుంది. ఆడియన్స్ ఓ కొత్త సినిమాని ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. మీరు (ఆడియన్స్‌ను ఉద్దేశిస్తూ..) మైథలాజికల్ 'కల్కి 2898 ఏడీ' సినిమాను చూశారు. కానీ 'యూఐ' సినిమా సైకలాజికల్ కల్కి. 'యూఐ' సినిమాలోని అంశాలను ఆడియన్స్ డీకోడ్ చేస్తారనే నమ్మకంతో ఈ సినిమా తీశాను. కేపీ శ్రీకాంత్‌గారికి ఈ సినిమా ఐడియా చెప్పినప్పుడు, ఆయన లహరిలాంటి గొప్ప సంస్థను తీసుకొచ్చారు. ఇక 'యూఐ' సినిమాను అల్లు అరవింద్‌గారు తెలుగులో రిలీజ్ చేయడాన్ని నేను ఎంతో స్పెషల్‌గా ఫీల్ అవుతున్నాను'' అన్నారు. ''ఈ సినిమాతో తెలుగు ఆడియన్స్‌కు పరిచయం అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అని తెలిపారు రేష్మ. ఈ కార్యక్రమంలో దర్శకుడు బుచ్చిబాబు సాన, నిర్మాతలు ఎస్‌కేఎన్, అంబికా రామచంద్రరావు, ఈ చిత్రం ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ తులసీ రామ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ చంద్రు మనోహరన్, కో ప్రొడ్యూసర్ నవీన్ మనోహరన్, డైలాగ్ రైటర్ పార్థసారథి, లిరిక్ రైటర్ రాంబాబు గోసాల మాట్లాడి, 'యూఐ' సినిమా విజయాన్ని ఆకాంక్షించారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
17-12-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	385	81,749
నిఫ్టీ ▽	100	24,668

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,138	△	211
డోజోన్స్	43,780	▽	48
ఎఫ్‌టీఎస్ఈ 100	8,262	▽	38
డాక్స్	20,314	▽	92
షాంఘై	3,386	▽	6
నికాయ్	39,457	▽	13

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,908
బంగారం (99.5 స్వచ్ఛత)	76,600
వెండి (కిలో)	89,515

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.03	86.71
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.94	109.85
€	యూరో	ఎస్‌బీఐ	86.82	91.29
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	44.00	66.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	51.56	56.35
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.56	65.26
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.73	23.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.22	24.00
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.77	12.60


ఐపీవో వేవ్

- 4 కంపెనీలు రెడీ
- 19–23 మధ్య ఇష్యూలు
- రూ. 2,730 కోట్లకు గురి



న్యూఢిల్లీ: ఓవైపు సెకండరీ మార్కెట్లు ఆటుపోట్లు చవిచూస్తున్నప్పటికీ మరోపక్క ప్రైమరీ మార్కెట్లు కళకళలాడుతున్నాయి. గత వారం 4 ఇష్యూలు మార్కెట్లను పలకరించగా.. గురువారం(19న) మరో 4 కంపెనీల పబ్లిక్ ఇష్యూలు ప్రారంభంకానున్నాయి. 23న ముగియనున్న ఇవి 27న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టయ్యే వీలుంది. బుధవారం(18న) యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను విక్రయించనున్నాయి. వివరాలు చూద్దాం..

ట్రాన్స్‌రైల్ లైటింగ్



ప్రధానంగా విద్యుత్ ప్రసారం, పంపిణీ సంబంధ ఈపీసీ సేవలందించే ట్రాన్స్‌రైల్ లైటింగ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 410–432 ధరల శ్రేణి ప్రకటించింది. ఐపీవోలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు కంపెనీ ప్రమోటర్ 1.01 కోట్ల షేర్లను ఆఫర్ చేస్తున్నారు. ఇష్యూ ద్వారా మొత్తం రూ. 839 కోట్లు సమీకరించనుంది. ఈక్విటీ జారీ నిధులను పెట్టుబడి వ్యయాలు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు వినియోగించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 34 షేర్ల(ఒక లాట్)కు దరఖాస్తు చేయవలసి ఉంటుంది.

డీఏఎమ్ క్యాపిటల్



ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థ డీఏఎమ్ క్యాపిటల్ అడ్వయిజర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 269–283 ధరల శ్రేణి ప్రకటించింది. ఐపీవోలో భాగంగా కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఇన్వెస్టర్లు 2.97 కోట్ల షేర్లను ఆఫర్ చేస్తున్నారు. తద్వారా రూ. 840 కోట్లు సమకూర్చుకోనున్నారు. ఈక్విటీ క్యాపిటల్ మార్కెట్లు, విలీనాలు- కొనుగోళ్లు, ప్రైవేట్ ఈక్విటీ, బ్రోకింగ్, రీసెర్చ్‌లతోకూడిన సంస్థాగత ఈక్విటీల ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు కంపెనీ నిర్వహిస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 53 షేర్ల(ఒక లాట్)కు దరఖాస్తు చేయవలసి ఉంటుంది.

కంకార్డ్ ఎన్విరో



పర్యావరణ సంబంధ ఇంజనీరింగ్ సొల్యూషన్ల సంస్థ కంకార్డ్ ఎన్విరో సిస్టమ్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 665–701 ధరల శ్రేణి ప్రకటించింది. ఐపీవోలో భాగంగా రూ. 175 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఇన్వెస్టర్లు 46.41 లక్షల షేర్లను ఆఫర్ చేస్తున్నారు. ఇష్యూ ద్వారా మొత్తం రూ. 500 కోట్లుపైగా సమకూర్చుకోనుంది. ఈక్విటీ జారీ నిధులను వాటర్ ట్రీట్‌మెంట్ వ్యవస్థల కోసం ఏర్పాటు చేస్తున్న కొత్త అసెంబ్లీ యూనిట్(సీఈఎఫ్)లో ఇన్వెస్ట్ చేయనుంది. అంతేకాకుండా రోకెమ్ సెపరేషన్ సిస్టమ్స్‌పై మరికొన్ని నిధులను వెచ్చించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 21 షేర్ల (ఒక లాట్)కు దరఖాస్తు చేయవలసి ఉంటుంది.

సనాతన్ టెక్స్‌టైల్స్

విభిన్న యార్న్‌ల తయారీ కంపెనీ సనాతన్ టెక్స్‌టైల్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 305–321 ధరల శ్రేణి ప్రకటించింది. ఐపీవోలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటితోపాటు కంపెనీ ప్రమోటర్, గ్రూప్ సంస్థలు రూ. 150 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ చేస్తున్నాయి. ఇష్యూ ద్వారా మొత్తం రూ. 550 కోట్లు సమీకరించనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 46 షేర్ల(ఒక లాట్)కు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. టెక్నికల్ టెక్స్‌టైల్స్, ఇండస్ట్రియల్ పాలియస్టర్, కాటన్ తదితర యార్న్‌లను కంపెనీ రూపొందిస్తోంది.



గూగుల్ ఇండియా మేనేజర్‌గా ప్రీతి



న్యూఢిల్లీ: టెక్నాలజీ దిగ్గజం గూగుల్ ఇండియా నూతన కంట్రీ మేనేజర్, వైస్ ప్రెసిడెంట్‌గా ప్రీతి లోబానా నియమితులయ్యారు. గూగుల్‌లో ఆసియా పసిఫిక్ రీజియన్ ప్రెసిడెంట్‌గా ఇటీవల పదోన్నతి పొందిన సంజయ్ గుప్తా స్థానంలో ఆమె చేరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రయోజనాలను వినియోగదారులందరికీ అందించడం, ఆవిష్కరణలను పెంపొందించేందుకు వ్యూహాన్ని రూపొందించడంలో ప్రీతి కీలకపాత్ర పోషిస్తారని గూగుల్ సోమవారం ప్రకటించింది. 'జీ–టెక్ కస్టమర్ ఎక్స్‌పీరియెన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎనిమిదేళ్ల అనుభవం కలిగిన ప్రీతి ఇప్పుడు గూగుల్ ఇండియా విక్రయాలు, కార్యకలాపాల వ్యవహారాలకు నేతృత్వం వహిస్తారు. 'ఇది భారత్ అభివృద్ధి చెందుతున్న డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో కంపెనీ నిబద్ధతను పెంచుతుంది' అని తెలిపింది. గూగుల్‌కు ముందు ఆమె నాట్‌వెస్ట్ గ్రూప్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్, ఏఎన్‌జెడ్ గ్రిండ్‌లేస్ బ్యాంక్‌లలో నాయకత్వ స్థానాల్లో విధులు నిర్వర్తించారు. భారత్‌లోని విభిన్న మార్కెట్లలో వ్యాపార వ్యూహం, ఉత్పత్తి నిర్వహణ, కార్యాచరణ వంటి అంశాలలో నైపుణ్యం సాధించారు.

రూపాయి @ 84.91



డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలహీనపడి జీవితకాల కనిష్టం 84.91 వద్ద స్థిరపడింది. దేశీయ ఈక్విటీ మార్కెట్ నష్టాల ట్రేడింగ్, అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం రూపాయి క్షీణతకు కారణమయ్యాయి. ఇంట్రాడేలో 84.93 వద్ద సరికొత్త కనిష్టాన్ని తాకింది. ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు అంచనాలు, క్రూడాయిల్ ధరలు పెరగడమూ దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయి.

తగ్గిన టోకు ద్రవ్యోల్బణం

నవంబర్‌లో 1.89 శాతం ● మూడు నెలల కనిష్టం



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం నవంబర్‌లో 1.89%గా నమోదయ్యింది. గత 3 నెలల్లో ఇంత తక్కువ స్థాయిలో టోకు ద్రవ్యోల్బణం నమోదు కావడం ఇదే తొలిసారి. 2024 అక్టోబర్‌లో టోకు ధరల సూచీ 2.36%. నవంబర్‌లో ఆహార ద్రవ్యోల్బణం 8.63%. అక్టోబర్‌లో ఈ రేటు 13.54%. నవంబర్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.5%కి తగ్గడం, టోకు ధరలూ దిగిరావడంతో ఆర్‌బీఐ పాలసీరేటు రెపోను (ప్రస్తుతం 6.5%) పావుశాతం తగ్గించవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి.

మెటల్, ఐటీ షేర్లలో అమ్మకాలు

- సెన్సెక్స్ 385 పాయింట్ల పతనం
- నిఫ్టీకి 100 పాయింట్ల నష్టం



ముంబై: మెటల్, ఐటీ షేర్లలో అమ్మకాల వల్ల సోమవారం స్టాక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. దేశీయ టోకు ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడి, ఫెడ్ రిజర్వ్ సమావేశానికి ముందు ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. సెన్సెక్స్ 385 పాయింట్లు నష్టపోయి 81,749 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 100 పాయింట్లు పతనమై 24,668 వద్ద నిలిచింది. బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావంతో సూచీలు ఉదయం నష్టాలతో మొదలయ్యాయి. రోజంతా అదే వైఖరి కనబరుస్తూ ఏదశలోనూ కోలుకోలేకపోయాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 582 పాయింట్లు క్షీణించి 81,551 వద్ద, నిఫ్టీ 167 పాయింట్లు పతనమై 24,601 వద్ద కనిష్టాలు నమోదు చేశాయి. ఇంధన, ఆయిల్‌అండ్‌గ్యాస్, వినిమయ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. రియల్టీ, కన్జూమర్, క్యాపిటల్ గూడ్స్, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.73%, 0.47 శాతం రాణించాయి.

➔ చైనా నవంబర్ రిటైల్ అమ్మకాలు నిరాశపరచడంతో పాటు అంతర్జాతీయంగా లోహ ధరల అనూహ్య పతనంతో దేశీయ మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. నాల్కో 3%, జిందాల్ స్టీల్, జేఎస్ఎల్ 2% పతనమయ్యాయి. హిందాల్కో, వేదాంత, హిందుస్తాన్‌కాపర్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సెయిల్ 1% నష్టపోయాయి.

భారత్‌కు 'వాణిజ్య లోటు' భయాలు!



- నవంబర్‌లో 37.84 బిలియన్ డాలర్లు
- ఎగుమతులు 4.85 శాతం క్షీణత
- 32.11 బిలియన్ డాలర్లుగా నమోదు
- దిగుమతులు 27 శాతం పెరిగి 69.95 బిలియన్ డాలర్లకు చేరిక

న్యూఢిల్లీ: భారత్‌కు వాణిజ్యలోటు సవాళ్లు తలెత్తుతున్నాయి. ఎగుమతులు నవంబర్‌లో అసలు పెరగకపోగా, 4.85 శాతం క్షీణించి (2023 ఇదే నెలతో పోల్చి) 32.11 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఇక ఎగుమతులు భారీగా 27 శాతం పెరిగి 69.95 బిలియన్ డాలర్లకు చేరాయి. దీనితో ఎగుమతులు–దిగుమతుల మధ్య నికర వ్యత్యాసం– వాణిజ్యలోటు ఆల్‌టైమ్ హై 32.84 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది. వంట నూనెలు, ఎరువులు, పసిడి వెండి దిగుమతులు భారీగా పెరగడం మొత్తం వాణిజ్యలోటు తీవ్రతకు దారితీసిందని వాణిజ్య మంత్రిత్వశాఖ తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కొన్ని ముఖ్యాంశాలు చూస్తే..

➔ పసిడి దిగుమతుల విలువ ఆల్‌టైమ్ హై 14.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. 2023 నవంబర్‌లో ఈ విలువ 3.5 బిలియన్ డాలర్లు.

➔ క్రూడ్ ఆయిల్ దిగుమతులు సమీక్షా నెల్లో 7.9 శాతం పెరిగి 16.11 బిలియన్ డాలర్లకు చేరాయి.

➔ పెట్రోలియం ప్రొడక్టుల దిగుమతులు 50 శాతం తగ్గి, 3.71 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

➔ జౌళి, ఇంజనీరింగ్ గూడ్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, సుగంధ ద్రవ్యాల ఎగుమతులు బాగున్నాయి.

ఏప్రిల్–నవంబర్ మధ్య ఇలా..

ఏప్రిల్ నుంచి నవంబర్ మధ్య ఎగుమతులు 2.17 శాతం పెరిగి 284.31గా నమోదయ్యాయి. దిగుమతులు 8.35 శాతం పెరిగి 486.73 బిలియన్ డాలర్లుగా ఉంది. దీనితో వాణిజ్యలోటు 202.42 బిలియన్ డాలర్లుగా ఉంది. గత ఏడాది ఇదే కాలంలో ఈ విలువ 170.98 బిలియన్ డాలర్లు. కాగా, ఎనిమిది నెలల్లో పసిడి దిగుమతులు 49 శాతం పెరిగి 49 బిలియన్ డాలర్లకు ఎగశాయి.

సేవల రంగం ఇలా..

నవంబర్‌లో సేవల ఎగుమతుల విలువ గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే 28.11 బిలియన్ డాలర్ల నుంచి 35.67 బిలియన్ డాలర్లకు చేరాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

వేదాంతా డివిడెండ్ రూ. 8.5	ఒక్క రోజులో రూ.95,915 కోట్ల యూపీఐ లావాదేవీలు

గాజువాకలో కిస్నా డైమండ్, గోల్డ్ జ్యువెలరీ షోరూం



విశాఖపట్నం: కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ విశాఖపట్నం జిల్లా గాజువాకలో కొత్త షోరూం ప్రారంభించింది. దేశవ్యాప్తంగా కంపెనీకిది 60వ స్టోర్ కాగా, ఆంధ్రప్రదేశ్‌లో మొదటిది. ఈ సందర్భంగా ఆఫర్లు ప్రకటించింది. వజ్రాభరణాల తయారీ చార్జీలపై 100% వరకు, బంగారు ఆభరణాల తయారీ చార్జీలపై ఫ్లాట్ 15% తగ్గింపు అందిస్తుంది. వజ్రాలు, ప్లాటినం, స్వర్ణాభరణాలు కొనుగోలు చేసే కస్టమర్లు లక్కీ డ్రాలో 100 కార్లు గెలుచుకోవచ్చు. కార్యక్రమంలో కిస్నా సంస్థ వ్యవస్థాపకులు, ఎండీ ఘనశ్యామ్ ఢోలాకియా, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

బెల్ బెంగళూరులో 40 ట్రైనీ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) తాత్కాలిక ప్రాతిపదికన ట్రైనీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 40.
- **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్ 1–05, ట్రైనీ ఇంజనీర్–35.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుకు రూ.40,000. ట్రైనీ ఇంజనీర్ పోస్టులకు రూ.30,000.
- **వయసు:** ప్రాజెక్ట్ ఇంజనీర్‌కు 32 ఏళ్లు, ట్రైనీ ఇంజనీర్ పోస్టులకు 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల వయసు సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **దరఖాస్తులకు చివరితేది:** 01.01.2024.
- **వెబ్‌సైట్:** https://bel-india.in/

ఎన్‌ఐఏసీఎల్, ముంబైలో 500 అసిస్టెంట్ పోస్టులు

ముంబైలోని ది న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌ఐఏసీఎల్) దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌ఐఏసీఎల్ శాఖల్లో అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 500.
- **వేతనం:** నెలకు రూ.40,000.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థి దరఖాస్తు చేసుకున్న రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతం ప్రాంతీయ భాషపై పరిజ్ఞానం తప్పనిసరిగా ఉండాలి.
- **వయసు:** 01.12.2024 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక విధానం:** ప్రాథమిక రాతపరీక్ష, ప్రధాన రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 17.12.2024.
- **చివరితేది:** 01.01.2025.
- **వెబ్‌సైట్:** http://www.newindia.co.in.

ఎన్‌డీఏ, ఎన్‌ఏతో త్రివిధ దళాల్లో ఆఫీసర్

నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ.. ఇంటర్మీడియెట్‌తోనే త్రివిధ దళా(ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ)ల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాతో.. కొలువు సొంతం చేసుకునేందుకు చక్కటి మార్గం. కొలువుతోపాటు బీఏ, బీఎస్సీ, బీటెక్ డిగ్రీలు పొందే అవకాశం కూడా లభిస్తుంది. వీటిలో ప్రవేశానికి యూపీఎస్సీ ప్రతి ఏటా రెండుసార్లు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ (ఎన్‌డీఏ, ఎన్‌ఏ) ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తుంది. తాజాగా 2025 సంవత్సరానికి సంబంధించి.. ఎన్‌డీఏ,ఎన్‌ఏ(1)–2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌డీఏ, ఎన్‌ఏ (1)–2025 ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- » ఇంటర్‌తోనే అడుగు పెట్టే అవకాశం
- » ఎన్‌డీఏ, ఎన్‌ఏ ఎంపిక ప్రక్రియ ద్వారా నియామకాలు
- » మొత్తం ఖాళీలు: 406
- » శిక్షణ సమయంలో నెలకు రూ. 56,100 స్టయిఫండ్
- » శిక్షణ పూర్తయ్యాక కొలువుతోపాటు బీఏ, బీఎస్సీ, బీటెక్



త్రివిధ దళాల్లోని(ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ) విభాగాల్లో లెఫ్టినెంట్ లేదా పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకు హోదాలో ఖాళీల భర్తీ ప్రక్రియకు తొలి దశగా ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్షను యూపీఎస్సీ నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో విజయం ఆధారంగా అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న ప్రాధాన్యం అనుసరించి ఆయా విభాగాల్లో మలిదశ ఎంపిక ప్రక్రియలో పాల్గొనాల్సి ఉంటుంది.

406 పోస్టులతో నోటిఫికేషన్

ఎన్‌డీఏ, ఎన్‌ఏ(1)–2025 ద్వారా త్రివిధ దళాల్లో మొత్తం 406 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో నేషనల్ డిఫెన్స్ అకాడెమీకి సంబంధించి ఆర్మీ 208 ఖాళీలు, నేవీ 42 ఖాళీలు, ● ఎయిర్‌ఫోర్స్(ఫ్లయింగ్ విభాగం) 92 ఖాళీలు, ● ఎయిర్‌ఫోర్స్ గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్) 18 ఖాళీలు, ● ఎయిర్‌ఫోర్స్‌గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్) 10 ఖాళీలు, 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ 36 ఖాళీలు ఉన్నాయి. ● నేవల్ అకాడమీకి కేవలం పురుష అభ్యర్థులే అర్హులని పేర్కొన్నారు.

అర్హతలు

- ✦ **ఆర్మీ వింగ్:** ఏ గ్రూప్‌లోనైనా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- ✦ **ఎయిర్‌ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీ:** మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్ట్‌లుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణుల వ్వాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు 2025, డిసెంబర్ 15 నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.
- ✦ **వయసు:** జూలై 2, 2006–జూలై 1, 2009 మధ్య జన్మించి ఉండాలి.
- ✦ **రెండు దశల ఎంపిక:** ఇంటర్మీడియెట్ అర్హతతో నిర్వహించే ఎన్‌డీఏ, ఎన్‌ఏకు అభ్యర్థులను ఖరారు చేసే క్రమంలో రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. అవి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ. తొలిదశగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎన్‌డీఏ, ఎన్‌ఏ రాత పరీక్షను నిర్వహిస్తుంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా.. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న తమ ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుని వాటి ఆధారంగా.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సాధించిన వారికి తదుపరి దశలో సదరు విభాగాల్లో (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఎస్ఎస్‌బీల ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు ఉంటాయి. వీటిలోనూ ఉత్తీర్ణత సాధిస్తే త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కొలువు ఖరారవుతుంది.

శిక్షణ, డిగ్రీ సర్టిఫికెట్

- ✦ ఎంపిక ప్రక్రియలోని రెండు దశల్లోనూ విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో శిక్షణనిస్తారు.
- ✦ ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగాలకు సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ పుణెలో, నేవల్ అకాడమీ అభ్యర్థులకు ఎజిమలలోని నేవల్ అకాడమీలో శిక్షణనిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న విభాగాలను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి జేఎన్‌యూ నుంచి బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టాలు కూడా అందజేస్తారు. అంటే ఒకే సమయంలో కొలువు, ఉన్నత విద్య రెండింటినీ సొంతం చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది.

మూడేళ్ల శిక్షణ

- ✦ ఎన్‌డీఏ, ఎన్‌ఏ రాత పరీక్ష తర్వాత నిర్వహించే ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూలోనూ విజయం సాధించిన వారికి నేషనల్ డిఫెన్స్ అకాడమీ– పుణెలో మూడేళ్ల వ్యవధిలో శిక్షణ ఉంటుంది. మొదటి రెండున్నరేళ్లు అన్ని విభాగాల అభ్యర్థులకు ఒకే విధంగా శిక్షణ ఇస్తారు. చివరి ఆరు నెలలు అభ్యర్థులు ఎంపికైన విభాగం ఆధారంగా ఫిజికల్ ట్రెనింగ్ ఉంటుంది. ఇలా మొత్తం మూడేళ్ల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు వారు ఎంపిక చేసుకున్న కోర్సు ఆధారంగా జేఎన్‌యూ–ఢిల్లీ నుంచి బీఏ, బీఎస్సీ, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) డిగ్రీలను అందిస్తారు. ఎయిర్‌ఫోర్స్, నేవల్ విభాగాలను ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న వారికి బీటెక్ చదివేందుకు కూడా అవకాశం ఉంటుంది. వీరు ఈ విషయాన్ని ముందుగానే తెలియజేయాలి.

నేవల్ అకాడమీ 10+2 క్యాడెట్ ఎంట్రీ..ప్రత్యేక శిక్షణ

ఎన్‌ఏ 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు ఎంపికైన వారికి నేవల్ అకాడమీ(ఎజిమల)లో నాలుగేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. ఆ తర్వాత వీరికి అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్ అందిస్తారు.

ఆకర్షణీయమైన స్టయిఫండ్

ఎన్‌డీఏ, ఎన్‌ఏ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన వారికి శిక్షణ సమయంలో ఆకర్షణీయమైన స్టయిఫండ్ అందిస్తారు. పే లెవల్–10కు సమానమైన రూ.56,100 స్టైపెండ్‌గా అందిస్తారు. ఆ తర్వాత ఫీల్డ్ ట్రెనింగ్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి రూ.56,100–రూ.1,77,500 వేతన శ్రేణితో కెరీర్ ప్రారంభం అవుతుంది. ప్రారంభంలో ఆర్మీ విభాగంలో లెఫ్టినెంట్, నేవీ విభాగంలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్‌ఫోర్స్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్ కేడర్‌తో కెరీర్ ప్రారంభమవుతుంది.

తొలిదశ రాత పరీక్ష ఇలా

- ✦ ఎన్‌డీఏ, ఎన్‌ఏ ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్షను రెండు పేపర్లలో నిర్వహిస్తారు. పేపర్1లో మ్యాథమెటిక్స్ 300 మార్కులు, రెండున్నరగంటలు, జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు రెండున్నర గంటలకు పరీక్ష జరుగుతుంది. ఇలా మొత్తం 900 మార్కులకు పరీక్ష ఉంటుంది.
- ✦ పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పేపర్–2గా నిర్వహించే జనరల్ ఎబిలిటీ టెస్ట్‌లో పార్ట్–ఎ పేరుతో 200 మార్కులకు ప్రత్యేకంగా ఇంగ్లిష్ విభాగం ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగం పేరుతో పార్ట్–బిని నిర్వహిస్తారు. పార్ట్–బికి 400 మార్కులుంటాయి.

400 మార్కులకు పార్ట్–బి

- ✦ పేపర్–2లో పార్ట్–బిని 400లకు నిర్వహిస్తారు. ఈ పరీక్షలో మొత్తం ఆరు విభాగాలు(ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరెంట్ ఈవెంట్స్) నుంచి ప్రశ్నలడుగుతారు. ప్రతి విభాగానికి సంబంధించి నిర్దిష్టంగా వెయిటేజీని పేర్కొన్నారు. ఫిజిక్స్‌కు 25 శాతం, కెమిస్ట్రీకి 15 శాతం, జనరల్ సైన్స్‌కు 10 శాతం, హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమానికి 20 శాతం, జాగ్రఫీకి 20 శాతం కరెంట్ ఈవెంట్స్‌కు పది శాతం వెయిటేజీ కల్పించారు.
- ✦ ఈ వెయిటేజీ ప్రకారమే ఆయా విభాగాల్లో ప్రశ్నల సంఖ్య, మార్కులు ఉంటాయి.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ ఇలా

ఎన్‌డీఏ, ఎన్‌ఏ రాత పరీక్షలో విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన అభ్యర్థులకు మలిదశలో మరో 900 మార్కులకు ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకున్న సమయంలో పేర్కొన్న ప్రాథమ్యతలు, రాత పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా.. నిర్దేశిత విభాగం ఆధ్వర్యంలో ఎస్ఎస్‌బీ(సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్) నిర్వహించే ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్ట్‌లోనూ నెగ్గాల్సి ఉంటుంది. ఎయిర్‌ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు ఎస్ఎస్‌బీ తర్వాత జరిగే కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్‌లో కూడా విజయం సాధించాల్సి ఉంటుంది.

కమిషన్డ్ హోదాతో కొలువులు

అన్ని రకాల శిక్షణ పూర్తి చేసుకున్న వారికి త్రివిధ దళాల్లో కమిషన్డ్ హోదాలో కొలువులు ఖరారు చేస్తారు. ఆర్మీలో లెఫ్టినెంట్‌గా, నేవీలో సబ్ లెఫ్టినెంట్‌గా, ఎయిర్‌ఫోర్స్‌లో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా తొలి హోదా ఉంటుంది. ఆ తర్వాత పనితీరు ప్రతిభ ఆధారంగా జనరల్, అడ్మిరల్, ఎయిర్ చీఫ్ మార్షల్ వంటి హోదాలకు చేరుకోవచ్చు.

రాత పరీక్షలో రాణించేలా

- పేపర్–1లో మంచి మార్కులు సాధించాలంటే..అల్జీబ్రా, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, అనలిటికల్ జామెట్రీ, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ట్రిగ్నోమెట్రీ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ప్రాక్టీస్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా మేలు చేస్తుంది. బేసిక్ ప్రిన్సిపుల్స్, వివిధ సిద్ధాంతాలు, సూత్రాలు, ఫార్ములాలపై పట్టు సాధించాలి. ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
- పేపర్–2లో విజయానికి బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీ రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, చరిత్ర–భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్‌లను క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి. పాత ప్రశ్న పత్రాలు, ఆయా విభాగాలకు ఇచ్చిన వెయిటేజీ ఆధారంగా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి.
- ఫిజిక్స్‌లో ఎలక్ట్రోమాగ్నటిజం, మెకానిక్స్, డైనమిక్స్‌లోని అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కెమిస్ట్రీలో కెమికల్ అనాలసిస్, ఇనార్గానిక్ కాంపౌండ్స్, పిరియాడిక్ టేబుల్స్, కాన్సెప్ట్ ఆఫ్ ఫిజికల్ కెమిస్ట్రీ, ఈక్విలిబ్రియమ్, థర్మోడైనమిక్స్, క్వాంటమ్ మెకానిక్స్‌పై ప్రధానంగా దృష్టి సారించాలి.
- జనరల్ సైన్స్‌లో వ్యాధులు–కారకాలు, ప్లాంట్ అనాటమీ, మార్ఫాలజీ, యానిమల్ కింగ్ డమ్‌లపై అవగాహన ఏర్పరచుకోవాలి. కరెంట్ అఫైర్స్ కోసం పరీక్ష జరిగే తేదీకి ముందు ఆరు నెలల వ్యవధిలో జరిగిన సమకాలీన మార్పులపై దృష్టి సారించాలి.
- హిస్టరీ విభాగాలకు సంబంధించి స్వాతంత్ర్యోద్యమ సంఘటనలు, రాజులు–రాజ్య వంశాలు, చారిత్రక కట్టడాలు, యుద్ధాల సంబంధిత అంశాలను అధ్యయనం చేయాలి. భౌగోళిక శాస్త్రానికి సంబంధించి ప్రకృతి వనరులు, విపత్తులు, నదులు, పర్వతాలు, పర్యావరణం వంటి అంశాల్లో పట్టు సాధించడం మేలు చేస్తుంది.

ముఖ్య సమాచారం

- ✦ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ దరఖాస్తు చివరి తేదీ: 2024, డిసెంబర్ 31
- ✦ ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: 2025 జనవరి 1 నుంచి 7 వరకు
- ✦ పరీక్ష తేదీ: 2025 ఏప్రిల్ 13
- ✦ ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్: upsconline.gov.in
- ✦ వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in

నాడు..



నెలకు 5,000 ఖర్చు చేయలేక...

మొసళ్లను నదిలో వదిలేశారు

పునరావాస కేంద్రాన్నే ఎత్తేశారు.. విమర్శలకు దారితీస్తున్న అటవీశాఖ అధికారుల తీరు

నేడు..



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: ఒక మొసలికి ఆహారంగా రోజుకు సుమారు అర కిలో మాంసం వరకు సరిపోతుంది. వీటికి రోజువిడిచిరోజు ఓ కిలో వరకు బీఫ్ ఆహారంగా వేస్తారని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం నెలకు ఎక్కువలో ఎక్కువ రూ.ఐదు వేల వరకు.. ఏడాదికి రూ.60 వేలకు మించి ఖర్చు కావు. ఈ మాత్రం నిధులు లేవనే సాకుతో అటవీశాఖ అధికారులు మంజీరా అభయారణ్యం వద్ద ఉన్న మొసళ్ల పునరావాస కేంద్రాన్నే మూసివేశారు. ఈ కేంద్రంలో ఉన్న మొసళ్లను నదిలో వదిలేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

మూడింటిని కూడా మేపలేక..

సంగారెడ్డికి సమీపంలో ఉన్న మంజీరా అభయారణ్యం విభిన్న పక్షి జాతులకు నిలయం. మంజీరా డ్యాం వద్ద ఉన్న చిత్తడి నేలల్లో ఏటా వివిధ దేశాల నుంచి వలస పక్షులు కూడా వచ్చి సందడి చేస్తుంటాయి. ఈ డ్యాంవద్ద అటవీశాఖకు సంబంధించి మొసళ్ల పునరావాస కేంద్రం ఉంది. ఇందులో రెండు ఆడ, ఒక మగ మొసలి ఉండేవి. వీటికి మేతకు నిధులు రావడం లేదని ఆ మొసళ్లను నదిలో వదిలేసి ఈ కేంద్రాన్ని మూసివేశారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రభుత్వం రూ.కోట్లలో నిధులు ఖర్చు చేస్తుంటే, ఈ నామమాత్ర నిధులు రావడం లేదంటూ మొసళ్లను నదిలో వదిలేసి చేతులు దులుపుకోవడం విమర్శలకు దారితీస్తోంది.

పెదవి విరుస్తున్న వన్యప్రాణుల ప్రేమికులు

మొసళ్ల పునరావాస కేంద్రాన్ని మూసివేయడం పట్ల వన్యప్రాణుల ప్రేమికులు, సందర్శకులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ డ్యాం వద్దకు నిత్యం వందల సంఖ్యలో సందర్శకులు వస్తుంటారు. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు కూడా ఈ అభయారణ్యానికి వస్తుంటారు. ఈ కేంద్రం మూసి ఉండటంతో వీరంతా తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు.

కాంపా నిధులూ కేటాయించలేరా?

వన్యప్రాణుల సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం కాంపా (కాంపెన్‌సేటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్, ప్లానింగ్ అథారిటీ) నిధులు మంజూరు చేస్తుంది. ఈ పథకం కింద ఏటా రూ.కోట్లలో నిధులు వస్తున్నప్పటికీ., ఈ మొసళ్ల సంరక్షణ కేంద్రానికి మాత్రం నిధులు కేటాయించడం లేదని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

తక్షణం పునరుద్ధరించాలి..



→ మొసళ్ల పునరావాస కేంద్రాన్ని ప్రభుత్వం పునరుద్ధరించాలి. ఈ డ్యాం వద్దకు వచ్చే సందర్శకులకు ఈ మొసళ్ల సంరక్షణ కేంద్రం ఒక ఆకర్షణగా నిలిచేది. పర్యాటకులు పెరిగేలా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– రవి వర్మ, సంగారెడ్డి వాసి

ప్రతిపాదనలు పంపాం..

→ మొసళ్ల పునరావాస కేంద్రం నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఏడాదిగా నిధులు రాకపోవడంతో కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేయాల్సి వచ్చింది. ఆ మొసళ్లను నదిలో వదిలేశాము. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే కేంద్రాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– దేవీలాల్, అటవీశాఖ రేంజ్ ఆఫీసర్, సంగారెడ్డి

రెంట్ రియాక్టర్లతో 'డ్రగ్స్' తయారీ!

- ఫార్మా కంపెనీ నుంచి అద్దెకు తీసుకుంటున్న సూత్రధారులు
- వాటిలో కొన్ని రకాలైన నియంత్రిత డ్రగ్స్ ఉత్పత్తి
- నగరం కేంద్రంగా గుట్టుగా సాగుతున్న వ్యవహారం
- ఈ దందాపై లోతుగా దర్యాప్తు చేస్తున్న టీజీ ఏఎన్‌బీ



ఫ్యాక్టరీలో మెఫెడ్రోన్ తయారీకి వినియోగించిన రియాక్టర్..



ముంబైలో డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న మెఫెడ్రోన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (టీజీ ఏఎన్‌బీ) అధి కారులు ఇటీవల బీబీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీయాద్రాద్రి లైఫ్ సైన్సెస్ కెమికల్ ఫ్యాక్టరీపై దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి వీరి నుంచి 120 కేజీల మెఫెడ్రోన్ మాదక ద్రవ్యం స్వాధీనం చేసుకున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) ముంబై యూనిట్ పది రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ముంబై వెళ్లిన ఓ బస్సులో సోదాలు నిర్వహించి 16 కేజీల మెఫెడ్రోన్ సీజ్ చేశారు. డ్రైవర్ సమాచారంతో ముగ్గురిని అరెస్టు చేసి, రూ.1.09 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.

→ ఇప్పటివరకు పోలీసులు, ఏజెన్సీ పారిశ్రామికవాడల్లో ఖాయిలాపడ్డ పరిశ్రమల్లోనే ఎఫిడ్రిన్, మెఫెడ్రోన్ వంటి నియంత్రిత డ్రగ్స్ తయారవుతున్నట్లు భావించారు. అయితే ఈ రెండు ఉదంతాలు ఇప్పటివరకు పోలీసు రికార్డుల్లోకి ఎక్కని కొత్త కోణాన్ని ఆవిష్కరించాయి. అదే మాదకద్రవ్యాల తయారీదారులకు కలిసివస్తున్న ఫార్మా కంపెనీల 'రెంట్‌కు రియాక్టర్ల' దందా. ఈ పరిణామాల నేపథ్యంలో టీజీ ఏఎన్‌బీ అధికారులు ఈ కోణాన్ని దృష్టిలో పెట్టుకుని నిఘా పెంచడంతోపాటు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

పది రోజులకు రూ.3 లక్షల అద్దె...

ఎఫిడ్రిన్, మెఫెడ్రోన్లు నియంత్రణ పదార్థాల జాబితాలోకి వచ్చే ఇంటర్మీడియరీ ప్రొడక్ట్స్. ఫార్మా రంగంలో వినియోగించే వీటిని డ్రగ్స్‌గా నేరుగా సేవించే అవకాశం లేకపోయినా... కొంత ప్రాసెస్ చేసిన తర్వాత మాదకద్రవ్యంగా తయారు చేయవచ్చు. వీటి తయారీకి సంబంధించిన ఆనవాళ్లు ఏళ్లుగా నగరంలో కనిపిస్తున్నాయి. అయితే ఇప్పటివరకు తయారీదారులు ఖాయిలాపడిన పరిశ్రమల్నే అడ్డాగా చేసుకున్నారు. వీటిపై పోలీసుల నిఘా పెరగడంతో పంథా మార్చిన ఈ కేటుగాళ్లు పనిచేస్తున్న పరిశ్రమల్ని ఎంచుకుంటున్నారు. అసలు విషయం చెప్పకుండా కొన్ని కంపెనీల నుంచి రియాక్టర్లను అద్దెకు తీసుకుంటున్నారు. ఒక్కో రియాక్టర్ వినియోగించి పది రోజుల్లో 250 నుంచి 300 కేజీలు తయారు చేసే ఆస్కారం ఉంది. దీంతో ఈ కాలానికి రూ.3 లక్షల వరకూ అద్దె చెల్లిస్తున్నట్లు టీజీ ఏఎన్‌బీ గుర్తించింది.

సముద్రమార్గంలో విదేశాలకు సరఫరా...

ఈ సరుకు విదేశాలకు సముద్రమార్గంలోనే ఎక్కువగా అక్రమ రవాణా అవుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇతర మార్గాల్లో పంపాలంటే ఇబ్బందులు ఉంటున్న నేపథ్యంలో.. కంటైనర్లలో వేరే సరుకుల మధ్య దాచి, దేశం దాటిస్తున్నారని చెబుతున్నారు. వివిధ ప్రాంతాల్లో తయారైన ఎఫిడ్రిన్‌ను ఓడరేవులు ఉన్న ప్రాంతాలకు తరలించి, కంటైనర్ల ద్వారా బయటకు పంపడానికి అనేక ముఠాలు వ్యవస్థీకృతంగా పనిచేస్తున్నాయని టీజీ ఏఎన్‌బీ, డీఆర్ఐ అనుమానిస్తున్నాయి. 'లింక్' సిస్టంలో దందా చేస్తున్నందున ఎవరు పట్టుబడినా... చైన్ అక్కడితో తెగిపోయి సూత్రధారులు సేఫ్‌గా ఉండిపోతున్నారని అధికారులు చెబుతున్నారు.

డిమాండ్.. వేల నుంచి రూ.లక్షల్లోకి...

→ ఇక్కడ అంతగా డిమాండ్ లేని వీటి ధర ఇక్కడ రూ.వేలల్లోనే ఉంటోంది. అందుకే తయారీదారులే కాదు.. పట్టుబడిన ముఠాల దగ్గరా కేజీల లెక్కనే స్వాధీనం అవుతోంది. అయితే వివిధ ప్రాంతాలకు చెందిన దళారుల చేతులు మారేసరికి దీని ధర రూ.లక్షల్లోకి చేరుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లోకి వెళ్లేసరికి కేజీ రూ.కోట్లను తాకుతోంది. అవసరాన్ని బట్టి, చేతులు మారిన ముఠాల సంఖ్య పెరిగేకొద్దీ ఈ డ్రగ్ ధర పెరుగుతూనే ఉంటోంది.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక



- పినపాక నియోజకవర్గంలో పర్యటించిన బృందం..
- గతంలో మోతెగడ్డపై 'సాక్షి'లో కథనం

మోతెగడ్డకు పడవలో వెళుతున్న బృందం సభ్యులు

బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ బృందం, స్టూడియో పంచతంత్ర టీమ్ సభ్యులు సోమవారం పినపాక నియోజక వర్గంలో పర్యటించారు. గోదావరి నది మధ్యలో ఉన్న మోతెగడ్డ వీరభద్ర స్వామి ఆలయానికి పడవలో వెళ్లి పరిశీలించారు. భద్రాచలం నుంచి మోతెగడ్డకు బోటింగ్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తే పర్యాటకంగా అభివృద్ధి సాధిస్తుందనే అంశంతోపాటు, తెలంగాణ పట్టిసీమగా పిలిచే ఈ ప్రాంతం ఇటీవల వరదలతో దెబ్బతింటోందని 'సాక్షి'ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది. దీనిని పరిగణనలోకి తీసుకున్న జిల్లా అధి కారులు మోతె గడ్డను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశాలున్నాయని ఆ బృందాలకు వివరించారు. ఈ నేపథ్యంలో సభ్యులు డ్రోన్ కెమెరాలతో ఈ ప్రాంతాన్ని పరిశీలించి ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు. అనంతరం ముల్కలపల్లి నుంచి వినాయకపురం ఫారెస్ట్ రోడ్స్, హిల్స్ ట్రావెల్, రెడ్డిగూడెం గ్రామాన్ని పర్యాటక అభివృద్ధికి చేయాల్సిన పనులపై చర్చించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర పర్యాటకశాఖకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

చలి పెరగడంతో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో స్వెట్టర్లు కొంటున్న వినియోగదారులు



చలి గుప్పిట్లో తెలంగాణ

- 27 జిల్లాల్లో 10 డిగ్రీలలోపు ఉష్ణోగ్రత నమోదు
- అర్లీ (టీ)లో అత్యల్పంగా 6 డిగ్రీలు నమోదు

సాక్షి, హైదరాబాద్: తూర్పు, ఈశాన్య ప్రాంతాల నుంచి వీస్తున్న శీతల గాలులతో తెలంగాణలో అన్ని చోట్ల ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగింది. 27 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 7 డిగ్రీల వరకు పడిపోవటంతో వాతావరణ శాఖ అప్రమత్తత హెచ్చరికను జారీ చేసింది. సోమవారం తెల్లవారుజామున ఆదిలాబాద్ జిల్లా అర్లీ(టీ)లో 6.0 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు కాగా, సంగారెడ్డి జిల్లా సత్వార్‌లో 6.6, వికారాబాద్ జిల్లా బంట్వారం, ఇబ్రహీంపట్నంలలో 6.7, కుమురంభీం జిల్లా సిర్పూర్ (యు), సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 6.7, కామారెడ్డి జిల్లా మెనూరులో 6.9, నిర్మల్ జిల్లా కుంతాల, మెదక్ జిల్లా శివ్వంపేటలో 7.0, మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లో 7.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మొత్తంగా రాష్ట్రంలోని 27 జిల్లాల్లో 10 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదు కాగా, అత్యధికంగా వనపర్తి జిల్లా రేవల్లిలో 12.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఒక్కరే టీచర్.. ఇద్దరు విద్యార్థులు



మహబూబాబాద్ అర్బన్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఇద్దరు విద్యార్థులు మాత్రమే హాజరుకాగా.. వారికి బోధిస్తూ టీచర్ కనిపించారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా బజారులో ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు మొత్తం 15 మంది విద్యార్థులు నమోదై ఉన్నారు. వారికి ఇద్దరు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఈమేరకు సోమవారం ఇద్దరు విద్యార్థులు మాత్రమే హాజరుకాగా.. వారికి హెచ్‌ఎం పాఠాలు బోధించారు. మరో టీచర్ సెలవులో ఉన్నారని తెలిపారు. కాగా టీచర్లు వంతులవారీగా పాఠశాలలకు వస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తనిఖీ చేసేటప్పుడు.. ఒకరు సెలవులో ఉన్నారని చెప్పడం పరిపాటిగా మారిందని వారు ఆరోపించారు.

'మహాలక్ష్మి' పుట్టిందని..

- ఆటో డ్రైవర్లకు రూ.3.5 లక్షల విలువైన సెల్‌ఫోన్లు
- 1,500 మంది మహిళలకు చీరల పంపిణీ
- అవధుల్లేని దంపతుల సంబరం

సారంగాపూర్: కూతురు పుట్టడంతో.. మహాలక్ష్మి పుట్టిందని ఆ దంపతులు సంబరపడ్డారు. తమ సంతోషాన్ని పదిమందితో పంచుకోవాలని సంకల్పించారు. ఈ మేరకు వారు సోమవారం గ్రామంలోని 25 మంది ఆటో డ్రైవర్లకు రూ.3.5 లక్షల విలువ చేసే సెల్‌ఫోన్లు బహూకరించారు. మరో 1,500 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దీనికి జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం తుంగూర్ వేదికగా మారింది. గ్రామానికి చెందిన ఓగుల అజయ్, అనీల దంపతులకు 18 రోజుల క్రితం కూతురు జన్మించింది. దీంతో తమ ఇంటికి మహాలక్ష్మి వచ్చిందని సంబరపడ్డారు. ఆ సంతోషంతో గ్రామంలోని ప్రతి ఆడబిడ్డకు (1,500 మంది మహిళలకు) ఇటీవల చీరలు పంపిణీ చేశారు. తాజాగా ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కటి రూ.14 వేల విలువైన సెల్‌ఫోన్ అందజేశారు. అజయ్ పెళ్లికి ముందు ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ అతడు కొనుగోలు చేసిన లాటరీ టికెట్‌కు రూ.30 కోట్ల ప్రైజ్‌మనీ వచ్చింది. తరు వాత స్వదేశానికి వచ్చిన ఆయన.. శ్రీకృష్ణ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి పేద విద్యా ర్థుల చదువుకు.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేద కుటుంబాలకు.. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు, ఆలయాల నిర్మాణాలకు వెచ్చిస్తున్నారు.



ఆటో డ్రైవర్లకు సెల్‌ఫోన్లను అందజేస్తున్న అజయ్



డయల్ 100తో నిండు నూరేళ్లు

- ఉరి బిగించుకున్న మహిళ..
- సమయానికి వెళ్లి కాపాడిన పోలీసులు

కందుకూరు: డయల్ 100కు కాల్ చేసిన 8 నిమిషాల్లోనే.. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఒక మహిళ ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకుని ప్రాణాన్ని నిలబెట్టారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనపై పోలీసులు, మహిళ కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నేదునూరుకు చెందిన బొర్ర ప్రశాంతి ప్రభుత్వ పాఠశాలలో ఆయాగా పని చేస్తూ ఏడేళ్ల కుమారుడితో కలిసి నివసిస్తోంది. భర్త రమేశ్ రెండేళ్ల క్రితం మృతి చెందాడు. అప్పటి నుంచి భర్త సోదరుడు, అతని భార్య తరచూ ఆమెను వేధిస్తున్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన ప్రశాంతి ఆదివారం రాత్రి మండల పరిధిలోని బేగంపేటలోని తన సోదరి కుమారుడు విగ్నేశ్‌కు ఫోన్ చేసి ఉరేసుకుని చనిపోతున్నట్లు చెప్పింది. దీంతో ఆమెకు విగ్నేశ్ నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. అనంతరం బైక్‌పై నేదునూరుకు బయల్దేరాడు. ఆలస్యమైతే ఆమె అన్నంత పని చేస్తుందోనని రాత్రి 10.50 గంటలకు డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో వెంటనే స్పందించిన మొబైల్ ఇన్‌చార్జి కానిస్టేబుల్ చిరంజీవి, డ్రైవర్ శ్రీశైలంతో కలిసి ప్రశాంతి ఇంటికి 8 నిమిషాల్లో చేరుకున్నారు. తలుపులు పగులగొట్టగా అప్పటికే ఆమె ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని కొనఊపిరితో కనిపించింది. దీంతో ఆమెను రక్షించి కౌన్సెలింగ్ చేశారు. సత్వరమే స్పందించి ఓ ప్రాణాన్ని కాపాడిన పోలీసులను గ్రామస్తులు అభినందించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

మండల కేంద్రం.. అయినా అనుబంధ గ్రామం

ఆ ఊరుది విచిత్ర పరిస్థితి!

- నిజాంసాగర్ ప్రాజెక్టు పేరుతో గుర్తింపు
- మండల కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్ అన్నీ అక్కడే
- పంచాయతీ హోదాకు నోచుకోని వైనం



రోడ్డుకు ఒకవైపు ఇళ్లు బంజపల్లి గ్రామానివైతే, రోడ్డుకు ఇంకోవైపువి నిజాంసాగర్ గ్రామానివి

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వరప్రదాయిని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు పేరుతో వ్యవహారంలో ఉన్న నిజాంసాగర్ మండల కేంద్రం అయినా, ఇప్పటికీ గ్రామ పంచాయతీ కాదు. బంజపల్లి పంచాయతీకి అనుబంధ గ్రామంగా కొనసాగుతోంది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్, బంజపల్లి గ్రామాలు పక్కపక్కనే ఉంటాయి. 1931లో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యింది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే ముంపు గ్రామాలకు చెందిన వారితో పాటు ఇతర గ్రామాల ప్రజలు అక్కడ నివాసం ఏర్పాటు చేసుకున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు మూలంగా ఆ ఊరికి నిజాంసాగర్ అన్న పేరొచ్చింది. రాష్ట్రంలో తాలూకాలను రద్దు చేసి మండల వ్యవస్థను అమల్లోకి తెచ్చిన సందర్భంలో నిజాంసాగర్ పేరుతో మండలం ఏర్పాటైంది. మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రంథాలయం.. ఇలా మండలాఫీసులు అన్నీ నిజాంసాగర్‌లోనే ఉన్నాయి. అయితే మండల కేంద్రం మాత్రం ఇప్పటికీ పంచాయతీ హోదాకు నోచుకోలేదు. మండల కేంద్రానికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు.. నిజాంసాగర్ పంచాయతీ కాదన్నది తెలుసుకొని ఆశ్చర్యపోతుంటారు.

2 వందల పైచిలుకు కుటుంబాలున్నా..

బంజపల్లి, నిజాంసాగర్ గ్రామాలు కలిసే ఉంటాయి. రోడ్డుకు ఒకవైపు నిజాంసాగర్, మరోవైపు బంజపల్లి గ్రామానికి చెందిన ఇళ్లున్నాయి. నిజాంసాగర్ బంజపల్లి పంచాయతీకి అనుబంధ గ్రామంగా కొనసాగుతోంది. బంజపల్లి పంచాయతీ పరిధిలో 638 కుటుంబాలున్నాయి. ఇందులో బంజపల్లి గ్రామానికి చెందినవి 4 వందలపైచిలుకు కాగా, నిజాంసాగర్ గ్రామానికి 2 వందలపైచిలుకు ఉన్నాయి. రెండు వందల జనాభా కూడా లేని పల్లెలు, తండాలు పంచాయతీలుగా ఏర్పాటైనా.. నిజాంసాగర్ మాత్రం ఇప్పటికీ బంజపల్లికి అనుబంధ గ్రామంగానే కొనసాగుతోంది. నిజాంసాగర్ పంచాయతీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ స్థానిక ప్రజల నుంచి, ప్రజాప్రతినిధుల నుంచి సైతం లేకపోవడం గమనార్హం.



బంజపల్లి పంచాయతీ కార్యాలయం

భుజంగరావు మధ్యంతర బెయిల్ 23 వరకు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడు(ఏ-3), మాజీ అడిషనల్ ఎస్పీ భుజంగరావు మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు మరోసారి పొడిగించింది. వైద్య కారణాల నేపథ్యంలో తొలుత పొడిగించిన న్యాయస్థానం.. బెయిల్ పిటిషన్ విచారణ కొనసాగుతుండటంతో మరోసారి పొడిగిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో మార్చిలో అరెస్టయిన భుజంగరావుకు వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సల నిమిత్తం నాంపల్లి కోర్టు ఆగస్టులో మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ మధ్యంతర బెయిల్‌ను మూడుసార్లు పొడిగించింది. మరోసారి పొడిగింపునకు ట్రయల్‌కోర్టు నిరాకరించడంతో భుజంగరావు హైకోర్టులో రెగ్యులర్ బెయిల్ కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ కె.సుజన సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. భుజంగరావు ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నందున మధ్యంతర బెయిల్‌ను మరోసారి పొడిగించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. మళ్లీ జైలుకు పంపితే ఆరోగ్యం మరింత క్షీణించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ నెల 23 వరకు మధ్యంతర బెయిల్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బెయిల్ పిటిషన్‌లో వాదనలను మంగళవారానికి వాయిదా వేశారు.

బీజేపీ రాష్ట్రాల్లో కులగణన ఎప్పుడు?: వీహెచ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కులగణన 90 శాతం పూర్తయిందని, మరి మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో ఎప్పుడు కులగణన చేస్తారో చెప్పాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు బీజేపీని ప్రశ్నించారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఎప్పుడు న్యాయం జరుగుతుందో మోదీ బృందం చెప్పాలని డిమాండ్ చేశారు. సావర్కర్ బాటలో నడుస్తున్న మోదీ ఆర్ఎస్ఎస్ ఆలోచనలను దేశం మీద రుద్దాలని చూస్తున్నారని వీహెచ్ విమర్శించారు.

పీసీసీ అధ్యక్షుడు పనిమంతుడు

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్



సాక్షి, హైదరాబాద్: పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కు మార్‌గౌడ్ డమ్మీ కారని, డైనమెట్ అని, పప్పెట్ కాదు... పనిమంతుడని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్‌కౌశిక్ యాదవ్ తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద తరహాలో తండ్రి పేరు చెప్పుకుని ఆయన రాజకీయాల్లోకి రాలేదని ఎద్దేవా చేశారు. వివేకానంద లాగా పార్టీలు మారలేదని సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బీసీని పీసీసీ అధ్యక్షుడిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదయితే, కేసీఆర్ హయాంలో బీసీలకు అన్యాయం జరుగుతుంటే నోరు మెదపలేని దుస్థితి వివేకానందదని గుర్తు చేశారు. కేసీఆర్ చేసిన పాపాలను లేఖ రూపంలో విడుదల చేసినందుకు పీసీసీ అధ్యక్షునిపై వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆ ప్రకటనలో చరణ్‌కౌశిక్ యాదవ్ పేర్కొన్నారు.

31 నుంచి భద్రాచలంలో వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు

మంత్రి సురేఖకు ఆహ్వానం



అధ్యయనోత్సవాల ఆహ్వానపత్రాన్ని మంత్రికి అందజేస్తున్న అర్చకులు

బంజారాహిల్స్ (హైదరాబాద్): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 31 నుంచి 2025 జనవరి 20 వరకు నిర్వహించనున్న వైకుంఠ ఏకాదశి అధ్యయన నోత్సవాలకు రావాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖను భద్రాచలం ఆలయ అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు బంజారాహిల్స్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఆలయ ఈవో రమాదేవి, అర్చకులు మంత్రిని కలిసి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా అర్చకులు మంత్రి సురేఖకు వేదాశీర్వచనం ఇచ్చి, స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీవైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల పోస్టర్‌ను దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ జ్యోతిలతో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. డిసెంబర్ 31 నుంచి స్వామివారికి దశావతార అలంకార సేవలు, జనవరి 9న తెప్పోత్సవం, జనవరి 10న ఉత్తర ద్వార దర్శనం తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు మంత్రికి వివరించారు. ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు రావద్దని మంత్రి ఈవోకు సూచించారు.



పూజగదిలో నాగుపాము

గార్ల: ఓ ఇంట్లోని పూజగదిలోకి వచ్చిన పాము గంటలకొద్దీ అక్కడే ఉండిపోయింది. వివరాలివి. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం అంబేడ్కర్‌నగర్‌లో నివసించే చెవుల కుమారస్వామి, భార్య సంగమ్మ.. ఉదయం ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఇంటి తలుపులు తీయగా పూజ గదిలో శబ్దం వినిపించింది. లోపలికి వెళ్లి చూడగా పూజగదిలో దేవుని పటాల వద్ద నాగుపాము పడగవిప్పి కనిపించింది. దీంతో సోమవారం రోజు సాక్షాత్తూ మల్లికార్జునస్వామి పాము రూపంలో ఇంటికి వచ్చారని, ఎలాంటి హాని తలపెట్టొద్దని సంగమ్మ స్థానికులను కోరింది. సాయంత్రం వరకు నాగుపాము అక్కడే ఉండగా.. స్థానికులు దానిని దైవంగా భావించి దర్శనం చేసుకున్నారు.

సత్వర న్యాయానికి చకాచకా



సాక్షి, హైదరాబాద్: సత్వర న్యాయానికి హైకోర్టు చకాచకా కదులుతోంది. పెండింగ్ కేసులతో పోలిస్తే.. పరి ష్కార శాతం పెంచుతూ ప్రజలకు న్యాయం అందించేందుకు కృషి చేస్తోంది. ఏళ్లకేళ్లు పేరుకుపోయే సివిల్ కేసుల భారాన్ని నెమ్మదిగా తగ్గిస్తూ వస్తోంది. పరిష్కార శాతం ఒక నెల తగ్గినా, ఒక నెల పెరిగినా.. ఏడాది ముగిసే సరికి కేసుల పరిష్కారంలో ముందుంటోంది. హైకోర్టులో సివిల్, క్రిమినల్ పెండింగ్, పరిష్కార కేసుల గణాంకాలను ఒకసారి పరిశీలిస్తే..

మొత్తం పెండింగ్ సివిల్ కేసులు:	2,12,535
సంవత్సరానికిపైగా పెండింగ్‌లోని సివిల్ కేసులు:	1,64,817
మొత్తం పెండింగ్ క్రిమినల్ కేసులు:	31,444
సంవత్సరానికిపైగా పెండింగ్‌లోని క్రిమినల్ కేసులు:	18,232
మొత్తం పెండింగ్ కేసులు(సివిల్/క్రిమినల్):	2,43,979
సంవత్సరానికిపైగా పెండింగ్‌లోని కేసులు (సివిల్/క్రిమినల్):	1,83,049

పెండింగ్ కేసుల శాతం

ఏడాది లోపు	సివిల్: 78	క్రిమినల్: 22
1-3 ఏళ్లు	సివిల్: 86	క్రిమినల్: 14
3-5 ఏళ్లు	సివిల్: 89	క్రిమినల్: 11
5-10 ఏళ్లు	సివిల్: 91	క్రిమినల్: 9
10 ఏళ్లకుపైగా	సివిల్: 94	క్రిమినల్: 6

గత నెల నమోదైన, పరిష్కరించిన కేసులు

	నమోదు	పరిష్కారం
సివిల్	4,414	4,230
క్రిమినల్	1,510	1,318
మొత్తం	5,924	5,548

ఈ ఏడాది నమోదైన, పరిష్కరించిన కేసులు

	నమోదు	పరిష్కారం
సివిల్	48,953	53,046
క్రిమినల్	17,971	16,175
మొత్తం	66,924	69,221

విభాగాల వారీగా పెండింగ్ కేసులు ఇలా..

విభాగం	సివిల్	క్రిమినల్	మొత్తం
రిట్ పిటిషన్	1,40,596	0	1,40,596
సెకండ్ అప్పీల్	5,460	0	5,460
ఫస్ట్ అప్పీల్	7,514	0	7,514
అప్పీల్	31,814	9,130	40,944
కేసు/పిటిషన్	14,260	16,123	30,383
రివిజన్	11,136	6,191	17,327
సూట్	10	0	10
రివ్యూ	61	0	61
అప్లికేషన్	1,684	0	1,684

అసెంబ్లీ వార్తలు

కాలుష్యకారక ఫార్మా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి

అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుడు అనిరుధ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: పోలేపల్లి సెజ్‌లోని ఫార్మా పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్యం వల్ల రైతులు సాగుచేసేందుకు భయపడుతున్నారని, ఈ కాలుష్యం వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కాంగ్రెస్ సభ్యుడు అనిరుధ్‌రెడ్డి ప్రశ్నోత్తరాల సమయంలో పేర్కొన్నారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, పీసీబీ అధికారులు పర్యటించి అక్కడ కలుషిత జలాలు విడుదల కావటం లేదని నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. అయితే పీసీబీ అధికారులు సరిగా పనిచేయటం లేదని, కలుషిత జలాలు విడుదలవుతుండటాన్ని తాను ప్రత్యక్షంగా చూశానని, పలు పత్రికల్లో సచిత్ర కథనాలు ప్రచురితమయ్యాయని అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు. దీంతో మళ్లీ తనిఖీకి ఆదేశిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

కొత్త పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు 13,741 ఎకరాల భూసేకరణ..

రాష్ట్రంలో కొత్తగా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు 35 ప్రాంతాల్లో 13,741 ఎకరాల భూమిని గుర్తించినట్టు బీజేపీ సభ్యుడు వెంకటరమణారెడ్డి ప్రశ్నకు సమాధానంగా మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అయితే, రాష్ట్రంలో ఎన్ని సెజ్‌లున్నాయి, వాటిల్లో ఏయే తరహా పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి, సిక్ అయినవి ఎన్ని, భూములు తీసుకుని పరిశ్రమలు ప్రారంభించనివి ఎన్ని.. తదితర వివరాలు కోరితే సమాధానం అసంపూర్తిగా చెప్పటమేంటని వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వివరాలు సభ్యుడికి పంపుతానని మంత్రి సమాధానమిచ్చారు.

త్వరలో రాష్ట్ర పర్యాటక పాలసీ..

త్వరలో రాష్ట్ర పర్యాటక పాలసీకి తుదిరూపమిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడించారు. దీని తయారీ తుదిదశలో ఉందని చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో బాలు నాయక్, జయవీర్‌రెడ్డి, రామచంద్రనాయక్, వంశీకృష్ణ తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఆధ్యాత్మిక పర్యాటకం, ఎకో టూరిజం, మెడికల్ టూరిజంలను పాలసీలో చేరుస్తున్నట్టు మంత్రి పేర్కొన్నారు. నాగార్జునసాగర్ పరిసరాలను పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని, బుద్ధవనంలో స్టార్ హోటల్, కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని, అన్ని ప్రాంతాల్లో మినీ జూలు ఏర్పాటు చేయాలని, నల్లమల ప్రాంతంలోని చారిత్రక దేవాలయాలు, ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సభ్యులు కోరారు.

డిటెన్షన్ విధానం ఏకరూపకంగా లేదు: మజ్లిస్

జేఎన్‌టీయూ, ఓయూ ఇంజనీరింగ్ కాలేజీల్లో డిటెన్షన్ విధానం ఏకరూపకంగా లేదని, వాటిల్లో ఇష్టారాజ్యంగా కొనసాగుతుండటం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని మజ్లిస్ శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ పేర్కొన్నారు. దీనిపై త్వరలో ఓ సమావేశం ఏర్పాటు చేసి సిలబస్, డిటెన్షన్ విధానాలపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరంలో డిటెన్షన్ విధానానికి రిలాక్సేషన్ ఇస్తున్నట్టు ప్రకటించారు.

బీఆర్ఎస్ సభ్యుల తీరు బాగోలేదు

కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: శాసనసభలో బీఆర్ఎస్ తీరు బాగోలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ, గత పదేళ్లలో చేసిన తప్పులు, అప్పులను సమర్థించుకుంటూ సభను తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు పందికొక్కుల్లా దోచుకున్నారని మండిపడ్డారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలకులు చేసిన పాపాలను తాము సరిదిద్దుకుంటూ వస్తుంటే, మా ర్పింగ్‌తో.. యూట్యూబ్‌ల ద్వారా విషప్రచారాన్ని చేస్తున్నారని దుయ్యబట్టారు.

రైతులకు అన్యాయం జరగదు: కాంగ్రెస్ ఎమ్మెల్యే నాగరాజు

రైతులకు అన్యాయం జరిగే విధంగా తమ ప్రభుత్వం ఎప్పుడూ వ్యవహరించదని కాంగ్రెస్ ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. అధికారుల తప్పిదాల వల్లే ప్రభుత్వాలకు చెడ్డపేరు వస్తుందన్నారు. రైతులకు రూ.500 బోనస్ ఇచ్చామని గుర్తు చేశారు. అల్లు అర్జున్ విషయంలో ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదని, నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే పోలీసులు తగిన స్థాయిలో బందో బస్తు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

రైతుల రుణమాఫీపై చర్చ జరగాలి: బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్

రైతుల రుణమాఫీ అంశంపై సభలో చర్చించాలని బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. రైతులకు పూర్తిస్థాయిలో రుణ మాఫీ జరగలేదని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, జీవో నంబర్ 317 ఉద్యోగుల సమస్యపై చర్చ నిర్వహించాలన్నారు. 27 అంశాలపై ప్రాధాన్యతా క్రమంలో చర్చ నిర్వహించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని పేర్కొన్నారు. అసలు అసెంబ్లీ సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహిస్తారో స్పష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీఆర్ఎస్, కాంగెస్ ఒక్కటేనని.. రెండు పార్టీలు డ్రామాలాడుతున్నాయని విమర్శించారు.

రాద్ధాంతం చేస్తున్న విపక్షాలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో లగచర్ల ఘటనపై మాట్లాడే అవకాశం ఇస్తామన్నా కూడా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆయన సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సభలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలపడం, దురుసుగా ప్రవర్తించడమేమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలని హితవు పలికారు.

ప్రజా సమస్యలపై చర్చించేందుకు భయం : జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్ : అసెంబ్లీలో ప్రజాసమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం భయపడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ప్రజా సమస్యల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని, ఎంత తప్పించుకున్నా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ఎండగడుతూనే ఉంటామని చెప్పారు. స్పీకర్ సీఎంకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, అసెంబ్లీ స్పీకర్ రాష్ట్ర ప్రభుత్వంలో భాగం కాదన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. రేవంత్ సర్కార్ హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేసిందని మండిపడ్డారు. మూసీ సుందరీకరణ పేరుతో బడా బాబులకు దోచిపెట్టే కుట్రకు తెర తీసిందని ఆరోపించారు.

చిత్తశుద్ధి ఉంటే విద్యారంగంపై చర్చ పెట్టాలి : సబితాఇంద్రారెడ్డి



ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యారంగంపై చర్చించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. విద్యాలయాలపై తమ ప్రశ్నను చర్చకు అనుమతించలేదని పేర్కొన్నారు. తమ ప్రశ్నకు ఈ ఏడాది జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు 1,913 ఉన్నాయని ప్రభుత్వమే స్పష్టం చేసిందని, కానీ, వాటిపై చర్చకు మాత్రం అంగీకరించడం లేదని చెప్పారు. ప్రభుత్వ స్కూళ్లలో ఈ ఏడాది రెండు లక్షల మంది తక్కువగా చేరారని పేర్కొన్నారు. 10 మందిలోపు విద్యార్థులున్న స్కూళ్ల టీచర్లను వేరే చోటకు బదిలీ చేస్తున్నారని మండిపడ్డారు. దాదాపు 6 వేల స్కూళ్ల మూసివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. మూసివేయాలని చూస్తున్న స్కూళ్లపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్షించాలని సూచించారు.

టూరిజం కాదు లగచర్ల టెర్రర్‌పై చర్చ జరగాలి : పాడి కౌశిక్‌రెడ్డి



అసెంబ్లీలో చర్చించాల్సింది టూరిజంపై కాదని లగచర్ల టెర్రర్‌పైనని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బీఏసీలో చర్చించకుండానే అసెంబ్లీ ఎజెండాను ఖరారు చేయడం దారుణమని చెప్పారు. లగచర్ల రైతులు చేసిన తప్పేమిటి? నెల రోజులుగా జైల్లో వేసేంత తప్పు వారు ఏం చేశారని ప్రశ్నించారు. గుండెపోటు వచ్చిన హీరానాయక్‌ను బేడీలు వేసి దవాఖానాకు తీసుకెళ్లారని మండిపడ్డారు. అదానీ, అల్లుడు, అన్నదమ్ముల కోసం రేవంత్ భూసేకరణ చేస్తున్నారని ఆరోపించారు. సీఎం ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం తప్ప రాష్ట్రంలో ఏమీ లేదని విమర్శించారు.

అప్పులపై కాంగ్రెస్ నేతల అసత్య ప్రచారం: డాక్టర్ సంజయ్

అప్పులపై కాంగ్రెస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. ఆర్బీఐ హ్యాండ్‌బుక్‌లో పేర్కొన్న దాని ప్రకారం తెలంగాణ అప్పు రూ.3 లక్షల 17 వేల కోట్లే. కానీ, అప్పు రూ.7 లక్షల కోట్లంటూ ఆర్థికమంత్రి అసెంబ్లీని తప్పుదోవ పట్టించారని చెప్పారు. మంత్రి భట్టి విక్రమార్కపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులిస్తామని వెల్లడించారు.

డ్రగ్స్, బెల్టుషాపుల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైంది : కేపీ వివేకానంద

డ్రగ్స్, బెల్టు షాపుల నియంత్రణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. కల్లుగీత వృత్తిని నిర్వీర్యం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. గీత కార్మికులపై అక్రమ కేసులు పెడుతున్నారని, పల్లెల్లోని గల్లీగల్లీలో బెల్ట్ షాపుల బెడద ఎక్కువైందన్నారు.

క్లుప్తంగా...

'శ్రీవాణి' కౌంటర్‌ను పరిశీలించిన టీటీడీ చైర్మన్

రేణిగుంట: రేణిగుంటలోని తిరుపతి విమానాశ్రయంలోని శ్రీవాణి ట్రస్ట్ కౌంటర్‌ను సోమవారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పరిశీలించారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా టికెట్లు పొందుతున్న భక్తులతో మాట్లాడారు. భక్తులకు అందిస్తున్న సౌకర్యాలు, సదుపాయాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. విమానాశ్రయంలోని కౌంటర్లలో టికెట్లను పొందుతున్న భక్తులు టీటీడీ చైర్మన్‌కు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. విమానాశ్రయంలోని కౌంటర్‌లో భక్తులు రోజువారీ టికెట్లు ఎన్ని తీసుకుంటున్నారనే వివరాలను కౌంటర్ సిబ్బందిని అడిగి చైర్మన్ తెలుసుకున్నారు.

నగరి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

కలెక్టరేట్ ఎదుట టీడీపీ నేత నిరసన



చిత్తూరు కలెక్టరేట్: సొంత లాభాల కోసం పదవీ బాధ్యత ధర్మం మరచిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌నాయుడు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ నియోజకవర్గ టీడీపీ నాయకుడు రామానుజం చలపతి డిమాండ్ చేశారు. సోమవారం చిత్తూరులో కలెక్టరేట్ ఎదుట ఆ సంఘ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని, చెవులలో పూలు పెట్టుకుని వినూత్నంగా నిరసన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీకి వినతి పత్రం అందజేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో దోపిడి దొంగలపై చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా యథేచ్ఛగా ఎర్రచందనం, సారాయి, గంజాయి, రేషన్ బియ్యం, ఇసుక దోపిడి జరుగుతోందన్నారు. ఇవ్వన్నీ జరుగుతున్నప్పటికీ నగరి ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడం లేదో తెలియడం లేదన్నారు.

సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు ప్రాధాన్యత

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

పెనుకొండ: రాష్ట్రంలో సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యం ఇస్తామని ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికార సంక్షేమ సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా పెనుకొండలోని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎంఎస్ఎంఈల ఏర్పాటుపై అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా వ్యాపారాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి కృషి చేస్తున్నామన్నారు.

☞ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని శివానగర్‌కు చెందిన పట్టుచీరల వ్యాపారి రాము (పేరు మార్చాం) ఆన్‌లైన్ మట్కా యాప్‌కు బానిసయ్యాడు. రూ.10 వడ్డీకి అప్పు తెచ్చి మరీ మట్కాలో పెట్టాడు. వడ్డీలు కట్టేందుకు రెట్టింపు అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు తాళలేక ఉన్న ఇల్లు, పొలం అమ్మి అప్పులు చెల్లించి బెంగళూరుకు చేరుకుని కూలి పనులు చేసుకుంటున్నాడు.

☞ జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఆన్‌లైన్ మట్కా యాప్‌కు అలవాటు పడి బీటెక్ విద్యార్థి శివ తోటి స్నేహితులు, తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి ఎటో వెళ్లిపోయాడు. చివరకు బంధువుల వద్ద ఉన్నాడని తెలుసుకుని తల్లిదండ్రులు రూ.2 లక్షల అప్పులు చెల్లించి తిరిగి తీసుకువచ్చారు. చదువులో ఇంటెలిజెంట్ అయిన శివ ఆన్‌లైన్ జూదం కారణంగా బాగా వెనుకబడ్డాడు.

☞ బత్తలపల్లి మండలానికి చెందిన వెంకటప్ప కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆన్‌లైన్ మాట్కా యాప్ ద్వారా జూదం ఆడుతూ సంపాదన మొత్తం పోగొట్టుకుంటున్నాడు. దీంతో ఆ కుటుంబం దుర్భర పరిస్థితి అనుభవిస్తోంది. పైన చెప్పినవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ఆశ చూపి బానిసను చేసి..



- ఆన్‌లైన్ యాప్‌ల్లో మట్కా జోరు
- పేద, మధ్య తరగతి ప్రజలు చిత్తు
- అప్పులు తీర్చలేక బలవన్మరణాలు
- ఊర్లు వదులుతున్న మరికొందరు బాధితులు

ధర్మవరం: ఆన్‌లైన్ మట్కా యాప్‌లతో నిరుపేద, మధ్యతరగతి ప్రజలు, యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రూ.100 ఖర్చు పెడితే రూ.9వేలు డబ్బు వస్తుందని ఆశకు పోయి అప్పులు చేసి వడ్డీలు కట్టలేక రుణదాతల ఒత్తిళ్లతో ఊర్లు వదిలి వెళ్లిపోయిన వారు కొందరైతే... అవమాన భారం భరించలేక జీవితం మీద విరక్తి చెంది బలవన్మరణాలకు పాల్పడిన వారి ఉదంతాలు ఉన్నాయి. జిల్లా పరిధిలోని ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురం, రాప్తాడు నియోజకవర్గాలలో ఆన్‌లైన్ మట్కా యాప్‌ల ద్వారా జూదం జోరుగా సాగుతోంది.

జడలు విప్పుతున్న ఆన్‌లైన్ మట్కా భూతం

ఇటీవల సామాన్యుల నుంచి సంపన్నుల వరకు, నిరక్షరాస్యుల నుంచి విద్యా వంతుల దాకా ప్రతి ఒక్కరికీ ఆండ్రాయిడ్ ఫోన్‌లు 4జీ, 5జీ నెట్‌వర్క్‌తో అందుబాటులోకి వచ్చాయి. ఆన్‌లైన్ మట్కా యాప్‌ల ద్వారా జూదం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. ఆత్యాశకుపోయి ప్రజలు ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

అనధికార మట్కా యాప్‌లు

అనధికారికంగా రాష్ట్రీయంగా, జాతీయంగా, ప్రాంతీయంగా ఆన్‌లైన్ మట్కా యాప్‌లు నిర్వహిస్తున్నారు. కొందరు సైబర్ నేరగాళ్లు సైతం ఇలానే యాప్‌లను నిర్వహిస్తూ మోసం చేస్తున్నారు. ప్రస్తుతానికి అయితే రాష్ట్రంలో మట్కా కింగ్, సత్తా కింగ్ ఏపీ, ఏపీ మట్కా, తిరుమల మట్కా, విజయవాడ మట్కా తదితర యాప్‌లు ఎక్కువగా చలామణి అవుతున్నాయి. వీటి ద్వారా జిల్లాలో రోజూ లక్షలాది రూపాయల టర్నోవర్ జరుగుతున్నట్లుగా సమాచారం. వీటిలో ఏ ఒక్కటికి కూడా అనుమతి లేదు.

ఊర్లు వదులుతున్న బాధితులు

ఆన్‌లైన్ మట్కా యాప్‌ల కారణంగా అప్పులు చేసి.. రుణదాతల ఒత్తిళ్లు తాళలేక జిల్లా వ్యాప్తంగా పలు కుటుంబాలు ఊర్లు వదిలి వెళ్తున్నాయి. మరికొంత మంది బాహ్య ప్రపంచానికి ముఖం చూపించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మరెన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి.

కట్టడి కష్టతరం

మట్కా జూదం మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుండటంతో పోలీసులు కట్టడి చేయడం కష్టతరమౌతోంది. ఎందుకంటే జూదం ఆడేవారిని గానీ, ఆడించే వారిని గానీ కనుగొనడం సాధ్యం కాదు. అయితే సైబర్ క్రైమ్ ఆధ్వర్యంలో ఈ ఆన్‌లైన్‌యాప్‌లు ఇన్‌స్టాల్ కాకుండా వెబ్‌సైట్‌లను బ్యాన్ చేయడం ద్వారా కట్టడి చేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపడితే ఎంతో మంది పేద, మధ్యతరగతి, యువత జీవితాలను కాపాడిన వారవుతారు.

ఉక్కుపాదం మోపుతాం



ఆన్‌లైన్ మట్కా జూదం ఆడేవారిని, ఆడించే వారిపై ఉక్కుపాదం మోపుతాం. ఈ దిశగా ఇప్పటికే ప్రజలకు అవగాహన పెంపొందిస్తున్నాం. సైబర్‌క్రైం సహకారంతో ఆన్‌లైన్ మట్కా యాప్‌లు, వెబ్‌సైట్‌లు నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాం. పేద, మధ్య తరగతి ప్రజలు జూదం వల్ల కలిగే నష్టాలను తెలుసుకుని వ్యసనాలకు దూరంగా ఉండాలి.

– వి.రత్న, ఎస్పీ, శ్రీ సత్యసాయి జిల్లా

బానిసగా మారుస్తారు ఇలా..



ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మట్కా నిర్వహిస్తున్న పలు అనధికారిక కంపెనీలు, సైబర్ నేరగాళ్లు పేద, మధ్యతరగతి ప్రజలు, యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నారు. 24 గంటలూ అందుబాటులో ఉంటూ గంట గంటకూ ఫలితాలు వెల్లడిస్తూ అమాయకులను మోసం చేస్తున్నారు. ఆన్‌లైన్ మట్కా యాప్‌లలో తొలుత లాగిన్ అయిన తర్వాత ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బు స్వీకరిస్తారు. సింగిల్ డిజిట్, డబుల్ డిజిట్, త్రీస్టార్ వంటి పేర్లతో జూదం ఆడిస్తారు. ప్రజలు తాము చెప్పిన నంబర్ తగిలితేనే వారికి యాప్‌ల ద్వారా డబ్బు చెల్లిస్తారు. లక్షలో పది మంది కూడా ఈ యాప్‌ల ద్వారా లబ్ధి పొందరు. అయితే తొలుత చిన్న చిన్న మొత్తాలు వేసిన వారి వివరాలు సేకరించి యాప్‌ల నిర్వాహకులు వారు చెప్పిన నంబర్లే తగిలే విధంగా చేస్తారు. నెమ్మదిగా వారు అలవాటు పడగానే జూదానికి బానిసయ్యే విధంగా మార్చేస్తారు.

295 ఫిర్యాదుల్లో 266 పరిష్కారం

ఏపీఈఆర్‌సీ 2022-23 నివేదిక విడుదల



సాక్షి, అమరావతి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్)కు 2022–23లో 295 ఫిర్యాదులు అందగా.. వాటిలో 266 అదే ఏడాదిలో పరిష్కారమయ్యాయని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) వెల్లడించింది. మండలి కార్యకలాపాలకు సంబంధించి 2022–23 ఆర్థిక సంవత్సరం నివేదికను ఏపీఈఆర్‌సీ సోమవారం విడుదల చేసింది. ఆ ఏడాదిలో సీజీఆర్‌ఎఫ్‌తో ఏపీఈపీడీసీఎల్‌లో 75 సార్లు, ఏపీఎస్పీడీసీఎల్‌లో 51 సార్లు, ఏపీసీపీడీసీఎల్‌లో 13 సార్లు సమావేశమైనట్లు తెలిపింది. ఏపీఈపీడీసీఎల్‌కు రూ.33,500 జరిమానా కూడా విధించినట్లు పేర్కొంది. విద్యుత్ అంబుడ్స్‌మెన్‌కు వచ్చిన 29 ఫిర్యాదుల్లో 28 పరిష్కరించినట్లు వివరించింది. స్టాండర్డ్స్ ఆఫ్ ఫెర్ఫార్మెన్స్ (ఎస్‌వోపీ)లో డిస్కంలు విఫలమైన కేసుల్లో జరిమానా విధించినట్లు తెలిపింది. ఆ ఏడాది 48 కేసులను విచారించి ఆదేశాలు వెలువరించినట్లు తెలిపింది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను ఆమోదించినట్లు వెల్లడించింది. మండలి ఖర్చులు, ఆదాయాలు, ఆస్తులు, అప్పులకు సంబంధించిన వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది.

'ఉద్దానం' అంచనాల సవరణకు ప్రభుత్వం ఆమోదం

- పులివెందుల, డోన్ సమగ్ర రక్షిత మంచినీటి పథకాలకు కూడా..
- ఉత్తర్వులుజారీ చేసిన పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ

సాక్షి, అమరావతి: వాటర్ గ్రిడ్ కార్యక్రమాల్లో భాగంగా ఉద్దానం సమగ్ర రక్షిత మంచినీటి పథకంతో పాటు వైఎస్సార్ జిల్లా పులివెందుల సమగ్ర రక్షిత మంచినీటి పథకం, కర్నూలు జిల్లా డోన్ సమగ్ర రక్షిత మంచినీటి పథకాలకు సంబంధించి టెండర్ విలువలో సవరణలు చేసుకోవడానికి అనుమతిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మూడు సమగ్ర రక్షిత మంచినీటి పథకాల పనుల అంచనాల విలువ పెంపునకు వీలుగా ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలోనే ఈ పథకాలకు సంబంధించిన పనులకు ఆమోదం తెలపడంతో పాటు ఉద్దానం రక్షిత మంచినీటి పథకానికి ఎన్నికల ముందే నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభోత్సవం కూడా చేశారు. మిగిలిన రెండు పథకాల పనులు కూడా గత ప్రభుత్వ హయాంలోనే సగానికి పైగా పూర్తయ్యాయి.

పీఎంజీఎస్‌వై నిధుల విడుదలకు అనుమతి

ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై) పథకం ద్వారా రాష్ట్రంలో రోడ్ల పనులకు రూ.163.34 కోట్లు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆర్‌పీఎల్‌డబ్ల్యూఈఏ కార్యక్రమంలో భాగంగా రోడ్ల నిర్మాణానికి మరో రూ. 61.32 కోట్లను పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి విడుదల చేసేందుకు పరిపాలనపరమైన అనుమతులిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సోమవారం రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గిరిజన గురుకులాల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించాలని షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ (ఎస్టీటీఎఫ్) డిమాండ్ చేసింది. 26 జిల్లాల్లోని గిరిజన గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా 1659 మంది 15 ఏళ్లుగా పనిచేస్తున్నారని ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోర్ల సుధాకర్, కాశింగిరి కుమార్ తెలిపారు. తమ డిమాండ్ల సాధన కోసం గత 31 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, సమ్మె కారణంగా గిరిజన గురుకులాల్లో టెన్త్, ఇంటర్ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఔట్ సోర్సింగ్‌లో ఉన్న వీరిని కాంట్రాక్ట్ పద్ధతి లోకి మార్చి కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్టీ)గా పరిగణించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమస్యలను పరిష్కరించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఆగాలని పుట్టపర్తిలో రష్యన్ల యజ్ఞం



పుట్టపర్తి రూరల్: రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఆగి..ప్రపంచ శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ రష్యాకు చెందిన సత్యసాయి భక్తులు సోమవారం పుట్టపర్తి సమీపాన ఎనుములపల్లిలోని హరిహర క్షేత్రంలో యజ్ఞం నిర్వహించారు. ఈ యుద్ధం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం భారీస్థాయిలో జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పొరుగు దేశాలకు వలస వెళుతున్నారని రష్యాకు చెందిన జ్యోతి, లిలియా చెప్పారు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ భగవాన్ సత్యసాయి చేసిన బోధనలకు ఆకర్షితులమై 2005లో తాము పుట్టపర్తికి విచ్చేశామన్నారు. ప్రపంచ శాంతికి, మానవాళి సుఖశాంతులకు యజ్ఞ యాగాదులు దోహదపడతాయన్న అపార విశ్వాసంతో యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకుల నూతన కార్యవర్గం ఎన్నిక

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం(జీసీటీఏ ఏపీ) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ ఎం.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎం.శ్యాంబాబు వరుసగా రెండో సారి ఎన్నికయ్యారు. సోమవారం విజయవాడలోని ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కళాశాలలో 37వ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మదనపల్లి బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా పని చేస్తున్న రాఘవరెడ్డి అధ్యక్షుడిగా, ఎస్ఆర్ఆర్–సీవీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా పని చేస్తున్న శ్యాంబాబును ప్రధాన కార్యదర్శిగా, కర్నూలు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు జి.ఎల్లా కృష్ణను ఆర్థిక కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఇక అకడమిక్ కార్యదర్శిగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన పైడితల్లి, మహిళా కార్యదర్శిగా అద్దంకికి చెందిన సీహెచ్ అనిత ఎన్నికైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.శ్రీనివాసరావు ప్రకటించారు.

ఇంటర్మీడియట్ బోర్డు పునర్వ్యవస్థీకరణ

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ బోర్డును కొత్త సభ్యులతో పునర్వ్యవస్థీకరించారు. చైర్మన్‌గా మానవ వనరులు అభివృద్ధి శాఖ మంత్రి, పాఠశాల విద్య కార్యదర్శిని వైస్ చైర్మన్‌గా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో ఎక్స్ అఫీషియో సభ్యులుగా కళాశాల, ఇంటర్, స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్లు, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్, తెలుగు అకాడమీ డైరెక్టర్లు, ఓపెన్ స్కూల్ కార్యదర్శి, ఉన్నత విద్యామండలి చైర్మన్, ఇంటర్ విద్య కార్యదర్శి (కన్వీనర్ హోదా)ను నియమించారు. అలాగే ఏయూ, ఎన్జీ రంగా, ఎన్టీఆర్ హెల్త్, పద్మావతి వర్సిటీల వీసీలు, మరో ఆరు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపల్స్ నామినేటెడ్ సభ్యులుగా ఉంటారు.

వినియోగదారుని ప్రాధాన్యతను బట్టి వరి రకాల ఎంపిక

వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు సూచన

సాక్షి, అమరావతి: వరి ఆహార వినియోగదారుని ప్రాధాన్యతను బట్టి వరి రకాలను ఎంపిక చేసుకోవాలని, అందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులు ఢిల్లీరావు అధికారులకు సూచించారు. ఈ నెల 11వ తేదీన సీఎం చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం అన్ని జిల్లాల వ్యవసాయ, ఉద్యాన అధికారులు, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు అధికారులతో ఢిల్లీరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాల్లోని వ్యవసాయ జోన్‌ల వాతావరణం, పంటల సాగు, మార్కెటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

చాపకింద నీరులా మధుమేహ ముప్పు

ప్రతి ఇద్దరిలో ఒకరికి రక్తంలో అసాధారణ గ్లూకోజ్ స్థాయి

- థైరోకేర్ సంస్థ అధ్యయనంలో వెల్లడి
- దేశవ్యాప్తంగా 19.66 లక్షలమంది హెచ్‌బీఏ1సీ ఫలితాలపై అధ్యయనం
- 22.25 శాతం ప్రీడయాబెటిక్, 27.18 శాతం మందిలో మధుమేహం

సాక్షి, అమరావతి: దేశంలో మధుమేహం చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఇప్పటికే 10 కోట్ల మంది ఈ సమస్యతో బాధపడుతున్నట్టు ఐసీఎంఆర్ వెల్లడించింది. 2045 నాటికి 12 కోట్లకు చేరతారని అంచనాలున్నాయి. ప్రతి ఇద్దరిలో ఒకరికి రక్తంలో అసాధారణ గ్లూకోజ్ స్థాయిలు ఉన్నట్టు ప్రముఖ డయాగ్నోస్టిక్ ప్రివెంటివ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్ సంస్థ థైరోకేర్ అధ్యయనంలో వెల్లడైంది. గతేడాది దేశవ్యాప్తంగా 19.66 లక్షల మంది హెచ్‌బీఏ1సీ ఫలితాలను థైరోకేర్ సంస్థ విశ్లేషించింది. వ్యాధి వ్యాప్తిలో భయంకరమైన పోకడలను గుర్తించినట్టు స్పష్టం చేసింది.



కలవరపెడుతున్న అసాధారణ గ్లూకోజ్ స్థాయి

19.66 లక్షల మంది ఫలితాలను విశ్లేషించగా అందులో 49.43 శాతం మంది రక్తంలో అసాధారణ గ్లూకోజ్ స్థాయిలను కలిగి ఉన్నట్టు గుర్తించారు. 22.25 శాతం మంది ప్రీడయాబెటిక్ దశలో ఉండగా, 27.18 శాతం మంది మధుమేహంతో బాధపడుతున్నట్టు వెల్లడైంది. స్త్రీలతో పోలిస్తే పురుషుల్లో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా ఆహారంలో బియ్యాన్ని అధికంగా వినియోగిస్తున్న రాష్ట్రాలు మధుమేహం, ప్రీడయాబెటిస్ ముప్పు అధికంగా ఉన్నట్టు పరిశోధకులు స్పష్టం చేశారు. గోధుమ ఆధారిత ఆహారాలు తీసుకుంటున్న రాష్ట్రాల్లో తక్కువ ప్రాబల్యం రేటును ఉన్నట్టు వివరించారు.

యువకుల్లో అధికంగా ప్రీ డయాబెటిక్



18–35 ఏళ్ల యువతలో ప్రీ డయాబెటిక్ ప్రాబల్యం అధికంగా ఉండగా, 36–65 సంవత్సరాల వారిలో వ్యాధి ప్రభావం వృద్ధి చెందుతోంది. క్రమం తప్పకుండా స్క్రీనింగ్‌లు నిర్వహించడంతో పాటు, ముందస్తు జాగ్రత్తలు పాటించినట్లైతే వ్యాధిని నివారించవచ్చని థైరోకేర్ సూచించింది. ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరుచుకోవడంతో పాటు, తీసుకునే ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ, ఒత్తిడి నియంత్రణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నారు.

'హాని'కరమైన ఆహార అలవాట్లు



ప్రపంచ మధుమేహ రాజధానిగా భారత్ ఉండటానికి హానికరమైన ఆహార అలవాట్లే ప్రధాన కారణమని ఐసీఎంఆర్ గతంలో స్పష్టం చేసింది. సమోసా, పకోడీ, చిప్స్, నూడిల్స్ ఇలా మార్కెట్‌లో లభించే అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్స్‌తో మధుమేహం ప్రమాదం పెరుగుతున్నట్టు వెల్లడించింది. ఈ పదార్థాల్లో అడ్వాన్స్‌డ్ గ్లెకేషన్ అధికంగా ఉంటుందని, దీంతో ఈ ఆహారం తిసుకునే వారి రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా పెరిగి తొందరగా మధుమేహం బారినపడతారని పేర్కొంది.

ఈ-విధాన్ ప్రాజెక్ట్‌పై ఏపీ ఒప్పందం

● వైఎస్సార్ సీపీ ఎంపీల ప్రశ్నలకు రాజ్యసభలో కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: శాసన, శాసన మండలిలో ఈ-విధాన్ ప్రాజెక్ట్ అమలుపై ఏపీతో పాటు 26 రాష్ట్రాలు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్నట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్.మురగన్ తెలిపారు. రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఈ–విధాన్ ప్రాజెక్ట్ అంశంపై వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

డ్రోన్ల ఉత్పత్తి ప్రోత్సాహకం

ఏపీలో డ్రోన్లు, డ్రోన్ల భాగాల కోసం ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం (పీఎల్ఐ) కింద మూడేళ్లకు రూ.120కోట్లు ప్రకటించినట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర మోహల్ తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.



మహారాష్ట్రలోని ఆరు జిల్లాలకు గోదావరి నీళ్లు

గోదావరి బేసిన్‌లోని ప్రాణహిత ఉప బేసిన్‌లోని వైన్ గంగా నదిపై ఉన్న గోసిఖుర్ద్(ఇందిరా సాగర్) ప్రాజెక్ట్ నుంచి 1,772 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని మళ్లించి మహారాష్ట్ర విదర్భ ప్రాంతంలోని ఆరు జిల్లాలకు సరఫరా చేస్తున్నట్లు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి తెలిపారు. వైన్‌గంగా-నల్గంగా నదుల అనుసంధాన ప్రాజెక్ట్‌పై వైఎస్సార్ సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

73.22లక్షల మెట్రిక్ టన్నుల ఈ-వ్యర్థాలు


దేశవ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాల్లో 73,22,965లక్షల మెట్రిక్ టన్నుల ఈ–వ్యర్థాలు నోటిఫై చేసినట్లు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎంపీ ఎస్.నిరంజన్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.

స్మార్ట్ సిటీ కింద 47 ప్రాజెక్టులు..

విశాఖపట్నం, కాకినాడ, అమరావతి, తిరుపతి నగరాల్లో రూ.6,616కోట్లతో 281 స్మార్ట్‌సిటీ ప్రాజెక్టలను ప్రారంభించగా.. దాదాపు 83శాతం పూర్తి అయినట్లు కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖ సహాయ మంత్రి తోఖన్ సాహు తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎంపీ గొల్ల బాబురావు అడిగిన ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. 'అమరావతిలో రూ.930కోట్లతో 20 ప్రాజెక్టలను ప్రారంభించగా.. రూ.746కోట్ల వ్యయంతో 14 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. రూ.184కోట్లతో ఆరు ప్రాజెక్టల నిర్మాణం జరుగుతోంది. కాకినాడలో రూ.1,908కోట్లతో 92 ప్రాజెక్టలు మంజూరు కాగా.. రూ.1,722.97కోట్లతో 79 ప్రాజెక్టలు పూర్తయ్యాయి. రూ.185.12కోట్లతో 13 ప్రాజెక్టల పనులు జరుగుతున్నాయి.తిరుపతిలో రూ.2,082.75కోట్లతో 104 ప్రాజెక్టలు మంజూరు కాగా.. రూ.1,610.65కోట్లతో 79 ప్రాజెక్టలు పూర్తయ్యాయి. రూ.472.10కోట్లతో 25 ప్రాజెక్టల పనులు జరుగుతున్నాయి. ఇక విశాఖపట్నంకు రూ.1,695.23కోట్లతో 65 ప్రాజెక్టలు మంజూరు కాగా.. రూ.1,573.58కోట్లతో 62 ప్రాజెక్టలు పూర్తయ్యాయి. రూ.121.65కోట్లతో 3 ప్రాజెక్టల పనులు జరుగుతున్నాయి' అని కేంద్ర మంత్రి తెలిపారు.

241.4వేల మంది ఎల్‌పీజీ సబ్సిడీని వదులుకున్నారు

ఏపీలో 2,41.4వేల మంది తమ ఎల్‌పీజీ సబ్సిడీని వదులుకున్నట్లు పెట్రోలియం, సహజవాయువుల శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎంపీ పరిమళ్‌నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు.



● అలర్జీలూ, ఆస్తమాలతో జాగ్రత్త!

ఆస్తమా, అలర్జీ వేర్వేరనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. కానీ ఆస్తమా కూడా అలర్జీ తాలూకు వ్యక్తీకరణల్లో ఒకటి అని అంటున్నారు నిపుణులు. అలర్జీ వల్ల అప్పర్ ఎయిర్ వే అనే విండ్ పైపులోని పై భాగం ప్రభావితమైతే 'అలర్జిక్ రైనైటిస్' అనీ, అదే కింది భాగమైన లోయర్ రెస్పిరేటరీ ఎయిర్ వే ప్రభావితమైతే అయితే అది ఆస్తమా అని పేర్కొంటారన్నది నిపుణుల మాట. అందుకే తరచి చూసినప్పుడు మన జనాభాలోని బాధితుల్లో 60% నుంచి 70% మందిలో అలర్జీలూ, అస్తమా ఈ రెండూ ఉంటాయి. చలికాలంలో మరింత ప్రభావం చూపే అలర్జీలూ, ఆస్తమాల గురించి తెలుసుకుందాం.

వింటర్ ఎంటరైంది ఏరియా చూసుకోండి!

సరిపడని పదార్థమేదైనా ఒంట్లోకి ప్రవేశించినప్పుడు... ఒంట్లోని వ్యాధి నిరోధకశక్తి దాన్ని ఎదుర్కొనేందుకు ప్రయత్నిస్తుంది. ఈ ప్రయత్నంలో వ్యాధినిరోధక శక్తి చాలా తీవ్రంగా ప్రతిస్పందిస్తుంది. ఆ తీవ్రత కారణంగా దేహంపై పడే ప్రతికూల ప్రభావాన్ని 'అలర్జీ' అంటారు. ఆ అలర్జీని కలిగించే పదార్థాలను 'అలర్జెన్స్' అంటారు. ఈ అలర్జీ అన్నది ఏ పదార్థం లేదా కారణం వల్లనైనా రావచ్చు. ఉదాహరణకు... కొందరిలో గోధుమలతో లేదా పాలతో చేసిన పదార్థాలు సరిపడకపోవచ్చు. ఇక ఆహారాలు కాకుండా పొగ, దుమ్ము ధూళి, పుప్పొడి, దోమల మందులు... ఇలా ఏ కారణాలతోనైనా రావచ్చు. అలాగే కొన్ని మందులు సరిపడకపోవడంతోనూ అలర్జీలు వచ్చే అవకాశముంది.

అలర్జీ వచ్చినప్పుడు...

అలర్జెన్స్ లోపలికి రాగానే కొందరికి అప్పర్ ఎయిర్‌వేలోని సున్నితమైన ప్రాంతాలు ఎర్రబారతాయి. అక్కడి ప్రాంతాలను రక్షించుకునేందుకు స్రావాలు వెలువడతాయి. ముక్కు , కళ్లు ఎరుపెక్కడం, దురద, మంట వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలర్జీ కేవలం ముక్కు, దాని పరిసరాలూ, శ్వాస వ్యవస్థలో పైభాగానికే పరిమితమైతే దాన్ని 'అలర్జిక్ రైనైటిస్'గా చెబుతారు, ఒకవేళ కింది భాగమూ ప్రభావితమైతే మాటిమాటికీ దగ్గు వస్తుండటం (రికరెంట్ కాఫ్), పిల్లికూతలు, శ్వాస తీసుకోవడం కష్టం కావడం (బ్రీతింగ్ డిఫికల్టీ) కనిపిస్తాయి.

ఆస్తమా అంటే...?

అదే మరింత తీవ్రమై లోవర్ ఎయిర్‌వేస్ ప్రభావితం కావడం... అంటే ఊపిరితిత్తులూ, గాలిగదులతో పాటు కాస్త పైన ఉండే గాలి పీల్చుకున్నప్పుడు ప్రవహించే నాళాలైన (బ్రాంకై) వాచి, బాగా సన్నబారిపోయి శ్వాసతీసుకోవడం కష్టమవుతుంది. అలా ఊపిరి తీసుకోవడం కష్టమైపోయే సమస్యను 'ఆస్తమా' అంటారు. కొందరిలో దీని తీవ్రతతో ఆయాసపడే స్థితి మరింత ఎక్కువైనప్పుడు అది 'ఎనైఫిలాక్సిస్'' అనే ప్రమాదకరమైన స్థితికి దారి తీయవచ్చు.

ఆస్తమా లక్షణాలు...

● ఊపిరి అందడంలో ఇబ్బందితో ఆయాసం ● ఛాతీ పట్టేసినట్లుగా ఉండటం ● ఒక్కోసారి దగ్గు ● ఆయాసడుతున్నప్పుడు శ్వాస సమయంలో గొంతులోంచి పిల్లికూతలు వినిపించడం.

ఆస్తమాను ప్రేరేపించే (ట్రిగర్ చేసే) అంశాలు...

● **అలర్జిక్ ఆస్తమా:** అలర్జీ తీవ్రతరమైనప్పుడు ఆస్తమాకి దారితీయవచ్చు. సరిపడని పదార్థాన్ని తిన్నప్పుడు లేదా సరిపడని అంశానికి ఎక్స్‌పోజ్ అయినప్పుడు ఆయాసం మొదలుకావచ్చు.

ఇప్పుడు అలర్జీలనూ, ఆస్తమానూ వేర్వేరుగా చూడటం సరికాదని డాక్టర్లు చెబుతుంటారు. ఇందుకు 'ఏరియా' అనే అంశాన్ని ప్రమాణంగా చూపుతారు. ఇక్కడ 'ఏరియా' అంటే... 'ఏ.. ఆర్... ఐ.. ఏ' అనే స్పెలింగ్‌తో 'అలర్జిక్ రైనైటిస్ అండ్ ఇంటర్‌మిట్టెంట్ ఆస్తమా' అని అర్థం. అందుకే అలర్జీలనూ, ఆస్తమానూ కలిపి 'ఒన్ ఎయిర్‌వే డిసీజ్'గా పరిగణిస్తూ... అవసరాన్ని బట్టి శ్వాసవ్యవస్థ పైభాగంలోని రైనైటిస్‌కూ, కింద ఆస్తమాకూ చికిత్స చేయాలన్నది ఇప్పుడు ఆధునిక దృష్టికోణంలో అవసమన్నది డాక్టర్లు చెబుతున్న మాట. ఇక అలర్జీ అంటే ఏమిటో, ఆస్తమా అని దేన్ని అంటారో చూద్దాం.

ఆస్తమా ఎలా వస్తుందంటే...?

గొంతు భాగం వరకు కేవలం ఒకే నాళంగా ఉన్న ట్రాకియా... ఆ తర్వాత బ్రాంకై అనే రెండుభాగాలుగా చీలిపోతుంది. ఆ తర్వాత కూడా శ్వాసనాళాలు అనేకానేక భాగాలుగా చీలుతూ ఊపిరితిత్తుల్లోని గాలి గదుల్లోకి వెళ్తాయి. ఈ గాలి గదులను ఆల్వియోలై అంటారు. ట్రాకియా, బ్రాంకై, ఆల్వియోలై... వీటన్నింటికీ లోపలివైపున సన్నటి వెల్వెట్ వంటి పొర ఉంటుంది. ఊపిరితిత్తులకు సరిపడనిది లోనికి ప్రవేశించినప్పుడు ఈ వెల్వెట్ పొర ఎర్రబారిపోతుంది. నీరు కారుతూ ఉంటుంది. బాగా సన్నబారిన నాళాల నుంచి ఊపిరి అందడానికి సరిపోయినంత గాలి అందకపోవడంతో 'ఆస్తమా' మొదలవుతుంది. దాంతో ఊపిరి అందక ఆయాసం వస్తూ ఉంటుంది.

● **వ్యాయామం:** కాస్త కష్టమైన వ్యాయామం మొదలుపెట్టగానే కొందరిలో అది ఆస్తమాకు దారితీయవచ్చు. దాన్నే 'ఎక్సర్‌సైజ్ ఇండ్యూస్‌డ్ ఆస్తమా' అంటారు.

● **అజీర్తి /పులితేన్పులుతో:** కొందరిలో తిన్న ఆహారం గొంతులోకి రావడమేనే సమస్య ఉంటుంది. దీన్నే 'గ్యాస్ట్రో ఈసోఫేజియల్ ఇంటస్టినల్ డిసీజ్' (జీఈఆర్‌డీ) అంటారు. వీళ్లలో ఆహారం తీసుకున్న తర్వాత వాళ్ల కడుపులో ఆహారాన్ని జీర్ణం చేసేందుకు ఉపయోగపడే యాసిడ్ ఎక్కువ మోతాదులో ఉత్పత్తి అవుతుంది. ఆ యాసిడ్ గొంతులోకి తన్నినప్పుడు కడుపు/గొంతులో మంట కనిపిస్తుంది. అది పులితేన్పుల రూపంలో గొంతులోకి రాగానే యాసిడ్ కారణంగా గొంతు మండుతుంది, కడుపు ఉబ్బరంగా ఉంటుంది. చాలామందిలో రాత్రి భోజనం కాస్త ఎక్కువగా తింటే కడుపు బరువుగా మారి, ఆయాసంగా ఉండటం, తర్వాత నిద్రలో సమస్య తీవ్రమై మెలకువ వచ్చి ఆయాసంతో బాధపడతారు.

● **పెరిమెనుస్ట్రువల్ ఆస్తమా:** మహిళల్లోని కొందరికి రుతుస్రావం మొదలుకాబోయే ముందుగా కెటామేనియల్ ఆస్తమా లేదా ప్రీ/పెరీమెనుస్ట్రువల్ ఆస్తమా అని పిలిచే ఆస్తమా కనిపిస్తుంది.

● **ఇతర కారణాలతో:** పొగాకు పొగ, కట్టెల పొయ్యినుంచి వెలువడే పొగ, రంగులూ (పెయింట్స్) లేదా అగరుబత్తీల వంటి ఘాటైన వాసనలు సరిపడకపోవడంతో కూడా ఆస్తమా రావచ్చు. కొందరిలో తాము పనిచేసే ప్రదేశం తమకు సరిపడకపోవడం వల్ల కూడా ఆస్తమా రావచ్చు. దీన్నే 'వర్క్‌ప్లేస్ ఆస్తమా' అంటారు.

నిర్ధారణ పరీక్షలు...

అలర్జీలో ముక్కు కారడం, దగ్గు, కొందరిలో చర్మం మీద ర్యాష్, ముక్కు/కళ్లు ఎర్రబారి బాగా రుద్దుకోవాలనిపించడం, దురదగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇక శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్రమైన ఆయాసం, పిల్లికూతలు వంటి లక్షణాలతో ఆస్తమాను తెలుసుకోవచ్చు.

● కొన్ని అలర్జీలను 'స్కిన్ ప్రిక్ టెస్ట్' అనే పరీక్షతో నిర్ధారణ చేస్తారు.

● స్పైరోమెట్రీ/పీఎఫ్‌టీ (PFT) అనే పరీక్ష ఆస్తమా నిర్ధారణకు ఉపయోగపడుతుంది. ఈ పరీక్షలో బాధితులతో ఓ పరికరం ద్వారా గాలి ఊదేలా చేస్తారు. బాధితులు ఏమేరకు ఊదగలుగుతున్నారనే అంశం ఆధారంగా వాయునాళాలు ఏమేరకు ముడుచుకుపోయాయనే అంశాన్ని తెలుసుకుని, దాని ఆధారంగా రూపొందించిన గ్రాఫ్ సహాయంతో ఆస్తమా తీవ్రతను తెలుసుకుంటారు.

● **కొన్ని ప్రత్యేకమైన పరీక్షలు:** ఆస్తమా నిర్ధారణతో పాటు, దాని తీవ్రతను తెలుసుకోవడం కోసం ఊపిరితిత్తుల్లోని వాయునాళాలు ముడుచుకుపోయేలా చేస్తారు. ఇందులో 'మెథాకొలైన్' అనే రసాయనాన్ని ఉపయోగించడం గానీ... లేదా కొందరితో వ్యాయామం చేయించి ఆయాసపడేలా చేస్తారు. అటుతర్వాత 'పీక్ ఎక్స్‌పిరేటరీ ఫ్లో టెక్నిక్' అనే ప్రక్రియతో ఆస్తమాను తెలుసుకుంటారు. ఎవరికైనా ఆస్తమా వచ్చే అవకాశాలు ఉంటే ఈ పరీక్ష సహాయంతో అది ప్రారంభం కాకముందే తెలుసుకోవచ్చు.

● **నిశ్వాసలో ఉండే నైట్రిక్ ఆక్సైడ్ పరీక్ష (FENO):** గాలి వదిలే నిశ్వాస ప్రక్రియలో కార్బన్ డై ఆక్సైడ్‌ను వదిలే సమయంలో ఆస్తమా బాధితుల్లో ఇజినోఫిల్స్ అనే తెల్ల రక్తకణాల వృద్ధి కారణంగా వారి నిశ్వాసలో నైట్రిక్ ఆక్సైడ్ పాళ్లు ఎక్కువ. అందుకే ఆస్తమా బాధితుల్లో... మందులు ఏ మేరకు పనిచేస్తున్నాయి, ఊపిరితిత్తుల్లో వాపు, మంట, ఎర్రబారడం (ఇన్‌ఫ్లమేషన్) ఏమేరకు ఉన్నాయి అని తెలుసుకోడానికి ఈ పరీక్ష చేస్తారు.



● **రక్తపరీక్ష:** ఆస్తమా వచ్చినవారి రక్తంలో ఇజినోఫిల్స్ అనే తెల్లరక్తకణాలు ఎక్కువ. అవి రక్తంలో ఏ మేరకు ఉన్నాయో తెలుసుకోడానికి ఈ పరీక్ష చేస్తారు. అలాగే ఓ వ్యక్తిలో ఏ నిర్దిష్టమైన పదార్థం వల్ల ఆస్తమా వచ్చిందనేది తెలుసుకోవడం కోసం కూడా కొన్ని సెన్సిటివిటీ రక్త పరీక్షలు చేస్తారు.

● **ఎక్స్-రే:** ఆస్తమా వ్యాధి నిర్ధారణలో ఎక్స్-రే కీలకం.

● **సీటీ స్కాన్:** కొందరిలో సీటీస్కాన్ (ఛాతీ) అవసరం కావచ్చు.

ఆస్తమా నిర్ధారణలో కేవలం... ఆయాసం, పిల్లికూతలు అనే రెండు ప్రధాన అంశాలతో ఆస్తమాను నిర్ధారణ చేయకూడదు. ఇవే లక్షణాలు గుండెజబ్బులు, క్యాన్సర్, సీవోపీడీ (క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మునరీ డిసీజ్), వోకల్ కార్డ్‌లకు సంబంధించిన సమస్యల్లోనూ కనిపించే అవకాశమున్నందున ఆస్తమా నిర్ధారణలో నిశితమైన పరిశీలన అవసరం.



డా. ఏ. రఘుకాంత్
సీనియర్ కన్సల్టెంట్
ఇంటర్వెన్షనల్
పల్మనాలజిస్ట్

నివారణ / చికిత్స...

అలర్జీ అయినా లేదా ఆస్తమా అయినా దాన్ని ప్రేరేపించే 'అలర్జెన్స్'కు దూరంగా ఉండటం అన్నది మంచి నివారణ మార్గం. కొంత వయసు పైబడినవారికి డాక్టర్ సలహా మేరకు ఫ్లూ, నిమోకోకల్ వ్యాక్సిన్లు ఇప్పిస్తూ ఆస్తమాను నివారించవచ్చు.

అలర్జీలకు చికిత్స ఇలా...

అలర్జీలను నెమ్మదింపజేయడానికి 'అలర్జెన్ స్పెసిఫిక్ ఇమ్యూనోథెరపీ' (సిట్) చికిత్స ప్రక్రియలు అందుబాటులోకి వస్తున్నాయి.

అంతేకాదు... అలర్జీ సమయంలో బాధితుల దేహంలో వెలువడే జీవరసాయనాలను బట్టి ఆయా వ్యక్తులకు వ్యక్తిగతమైన మందులు అంటే 'హ్యామనైజ్‌డ్ మోనోక్లోనల్ యాంటీబాడీ'ల పరిశోధనలు ఇప్పటికే విజయవంతమయ్యాయి. అయితే వాటి ప్రభావాలు అందరి విషయంలో ఒకేలా ఉండకపోవచ్చు. ఉదాహరణకు ఒమాలిజుమాబ్ వంటివి మాస్ట్ సెల్స్, బేసోఫిల్స్ మీద... ఇక రెస్లిసుమాబ్, మెపోలిజుమాబ్, బెర్నాలిజుమాబ్ వంటివి ఐఎల్-5ల సహాయంతో ఇజినోఫిల్స్ వెలువడటాన్ని అరికడుతూ... అలా తీవ్రమైన ఆస్తమాతో బాధపడే వారి విషయంలో ప్రభావపూర్వకంగా పనిచేస్తాయి.

ఆస్తమా చికిత్స ఇలా...

ఆస్తమాను నివారించేందుకు 'ప్రివెంటార్స్' అనే ఇన్‌హేలర్లూ, ఆస్తమా వచ్చిన సమయంలో దాన్ని తగ్గించేందుకు 'రిలీవర్స్' అనే ఇన్‌హేలర్లు వాడుతుంటారు. ఈ ఇన్‌హేలర్లు హానికరమనే అపోహ కొందరిలో ఉంటుంది. నిజానికి అవి పూర్తిగా సురక్షితమైనవి. ముందస్తు నివారణ కోసం నెబ్యులైజర్‌లలాంటి పీల్చే చికిత్స (ఇన్‌హెలేషన్ థెరపీ) కూడా చేస్తుంటారు. నేసల్ స్ప్రేలు కూడా అందుబాటులో ఉన్నాయి. అవి బిగుసుకుపోయిన వాయునాళాలను రిలాక్స్ చేసి, తేలిగ్గా గాలి ఆడేలా చేస్తాయి. ఆస్తమా సమయంలో ఊపిరితిత్తుల లైనింగ్/మ్యూకస్ మెంబ్రేన్స్‌లో వచ్చిన వాపు, మంట, ఎర్రబారడాన్ని (ఇన్‌ఫ్లమేషన్‌ను) తగ్గించే యాంటీ హిస్టమైన్ వంటి మందుల్ని వాడతారు.

మన శరీరంలో అనేక గ్రంథులు ఉంటాయి. ఈ గ్రంథులలో థైరాయిడ్ గ్రంథి చాలా కీలకమైనది. మెడ భాగంలో సీతాకోకచిలుక ఆకృతిలో శ్వాసనాళానికి రెండు వైపులా ఉండే ఈ గ్రంథి థైరాయిడ్ హార్మోన్లను విడుదల చేస్తుంది. కొందరిలో ఈ గ్రంథి చాలా పెద్ద సైజుకు పెరిగిపోతుంది. ఇలా థైరాయిడ్ గ్రంథి అసాధారణమైన సైజుకు పెరగడాన్ని 'గాయిటర్' అంటారు.

గాయిటర్ రకాలు...

ఇది రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి డిఫ్యూస్ గాయిటర్, రెండోది నాడ్యులార్ గాయిటర్. సాధారణ పరిమాణం కంటే థైరాయిడ్ గ్రంథి ఉబ్బిపోయి ఇరువైపులా సమానంగా పెరగడాన్ని 'డిఫ్యూస్ గాయిటర్'గా పరిగణిస్తారు. ఇక రెండోది 'నాడ్యులార్ గాయిటర్'. ఈ నాడ్యులార్ గాయిటర్‌లో థైరాయిడ్ గ్రంథిలోని ఏదైనా ఒక భాగంలో ఒకటి లేదా ఇంకా ఎక్కువ సంఖ్యలో గడ్డలు ఏర్పడతాయి. థైరాయిడ్ గ్రంథిలో ఇలా గడ్డలు పెరగడాన్ని నాడ్యులార్ గాయిటర్ అంటారు.

గాయిటర్ అంటే...?



గాయిటర్ సమస్య వచ్చిన కొంతమందిలో సాధారణంగా థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిలో ఎలాంటి మార్పులూ కనిపించవు. కానీ మరికొందరిలో మాత్రం థైరాయిడ్ హార్మోన్లు ఎక్కువగా గానీ లేదా తక్కువ మోతాదులోగానీ ఉత్పత్తి అవుతుంటాయి. ఒకవేళ హార్మోన్ల ఉత్పత్తి మోతాదులు పెరిగితే దాన్ని 'హైపర్ థైరాయిడిజం' అనీ, తగ్గితే 'హైపోథైరాయిడిజమ్' అని అంటారు. హైపర్ థైరాయిడిజమ్‌లో జీవక్రియల వేగం పెరగడంతో బాధితులు సన్నబారిపోవడం, హైపో థైరాయిడిజమ్‌లో జీవక్రియలు మందగించడంతో బాధితులు లావెక్కడం అనే ప్రధాన లక్షణాలతో పాటు మరికొన్ని సమస్యలు కనిపిస్తాయి.

నిర్ధారణ పరీక్షలు...

గొంతు దగ్గర బాగా ఉబ్బి కనిపించడం అనే పైకి కనిపించే లక్షణంతో దీన్ని కొంతవరకు నిర్ధారణ చేసినప్పటికీ... పూర్తి నిర్ధారణ కోసం థైరాయిడ్ ప్రొఫైల్ పరీక్షలైన టీ3, టీ4, టీఎస్‌హెచ్, అల్ట్రాస్కాన్, ఎఫ్ఎన్ఏసీ వంటివి అవసరమవుతాయి.

చికిత్స...

థైరాయిడ్ సమస్య నిర్ధారణ కోసం చేసే పరీక్షల ఫలితాల ఆధారంగా గాయిటర్ చికిత్సకు ఎండోక్రైనాలజిస్ట్ ఆధ్వర్యంలో తగిన చికిత్స అందించాల్సి ఉంటుంది. ఇప్పటికి అందుబాటులో ఉన్న వైద్యపరిజ్ఞానంతో థైరాయిడ్ వ్యవస్థను సరిచేయడం ద్వారా కొంత మందిలో థైరాయిడ్ గ్రంథి వాపు (గాయిటర్) తగ్గుముఖం పడుతుంది. కాబట్టి ఇలాంటి రోగులు ఆందోళన పడాల్సిన అవసరం లేదు.



డా. బ్రిందా అగర్వాల్
కన్సల్టెంట్
ఎండోక్రైనాలజిస్ట్

● కంజెనిటల్ గ్లుకోమా

మీ కంటిపాపకు నీటి కాసులున్నాయా?



కంటిలో ఉండే ఓ ద్రవం తాలూకు ఒత్తిడి పెరగడం వల్ల కంటి నరం (ఆప్టిక్ నర్వ్) దెబ్బతిని చూపు కోల్పోయే పరిస్థితిని గ్లుకోమా (నీటికాసుల జబ్బు) అంటారన్న విషయం తెలిసిందే. చిన్న పిల్లల్లోనూ పుట్టుకతో వచ్చే కారణాలతో గ్లుకోమా వస్తే, దాన్ని కంజెనిటల్ గ్లుకోమాగా చెబుతారు. గతంలో కాస్త అరుదుగా కనిపించే ఈ కేసులు ఇటీవల విపరీతంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో కంజెనిటల్ గ్లుకోమా అంటే ఏమిటి, దాని లక్షణాలూ, ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సల వంటి అంశాలపై అవగాహన కోసమే ఈ కథనం.

కన్ను ఆరోగ్యంగా ఉండటానికి తోడ్పడుతూ... కంటిలో ప్రవహించే 'యాక్వస్ హ్యూమర్' అనే ఒక ద్రవం సరైన రీతిలో ఎప్పటికప్పుడు ఒక డ్రైనేజ్ యాంగిల్ ద్వారా బయటకు ప్రవహిస్తూ ఉంటుంది.

కొంతమంది చిన్నారుల్లో ఈ యాక్వస్ హ్యూమర్ ప్రవహించాల్సిన డ్రైనేజీ యాంగిల్ సరిగా అభివృద్ధి కాదు. దాంతో యాక్వస్ హ్యూమర్ బయటకు ప్రవహించలేక అక్కడే చిక్కుబడిపోతుంది. దాంతో కంటిలో ఒత్తిడి పెరిగి, కంటి నరంపైన కూడా ఒత్తిడి పెరిగి కంటి నరం దెబ్బతింటుంది. ఇలా కంటిలోని యాక్వస్ హ్యూమర్ బయటకు వెళ్లలేక ఒత్తిడి పెరిగి చూపు కోల్పోయే పరిస్థితినే 'కంజెనిటల్ గ్లుకోమా' లేదా చిన్నపిల్లల్లో పుట్టుకతో వచ్చే గ్లుకోమా అంటారు.

ఎప్పుడు బయటపడుతుంది?

కంజెనిటల్ గ్లుకోమా ముఖ్యంగా రెండు రకాలు. మొదటిది ప్రైమరీ కంజెనిటల్ గ్లుకోమా, రెండోది సెకండరీ కంజెనిటల్ గ్లుకోమా. ప్రైమరీ కంజెనిటల్ గ్లుకోమాలో ఇతరత్రా అబ్‌నార్మాలిటీస్ ఉండవు. సెండకరీ కంజెనిటల్ గ్లుకోమాలో కార్నియాకు, ఐరిస్‌లకు సంబంధించిన అబ్ నార్మాలిటీస్ కూడా ఉంటాయి.

ఇక ప్రైమరీ కంజెనిటల్ గ్లుకోమాలో వయసును బట్టి మరో మూడు రకాలుంటాయి. అవి... పుట్టుకతోనే వస్తే దాన్ని కంజెనిటల్ గ్లుకోమా. పుట్టిన మూడేళ్లప్పుడు (0 – 3) బయట పడేవి ఇన్‌ఫెంటైల్ గ్లుకోమా. మూడేళ్ల తర్వాతది జువెనైల్ గ్లుకోమా.

లక్షణాలు...

కొన్ని లక్షణాలను బట్టి పిల్లల్లో కంజెనిటల్ గ్లుకోమా ఉందేమోనని సాధారణంగా అనుమానిస్తుంటారు. ఉదాహరణకు పిల్లల కంట్లోంచి అదే పనిగా ఎక్కువగా నీరు స్రవిస్తున్నా, కొద్దిపాటి వెలుతురునూ పిల్లలు భరించలేకపోతున్నా లేదా కాంతి పడగానే కన్ను గట్టిగా మూయడం లేదా కనుగుడ్డు పెద్దదిగా మారడం, కంట్లోని నల్లపాప మసకగా మారిపోతున్నా పిల్లల్లో కంజెనిటల్ గ్లుకోమా ఉందేమోనని అనుమానించాలి. వీటన్నింటిలోనూ కనుగుడ్డు పరిమాణం (సైజ్) పెద్దగా మారిపోతుండటాన్ని తీవ్రంగా పరిగణించాలి. ఈ లక్షణాలతో పాటు పిల్లలు అదే పనిగా ఏడుస్తుండటం, తరచూ వాంతులు చేసుకుంటుండటం, ముఖ్యంగా తిన్న వెంటనే ఇలా జరుగుతుంటే తక్షణం కంటి వైద్యనిపుణులకు తప్పనిసరిగా చూపించాలి.



వంశపారంపర్యమా... కాదా?

ఇది పూర్తిగ వంశపారంపర్యమే అని చెప్పలేకపోయినప్పటికీ... తల్లిదండ్రులిద్దరిలోనూ గ్లుకోమా ఉంటే... వారి పిల్లల్లో చైల్డ్‌హుడ్ గ్లుకోమా వచ్చే అవకాశాలు 10 శాతం వరకు ఉంటాయి. ఒకవేళ తలిదండ్రులిద్దరిలో ఒకరికి గ్లుకోమా ఉంటే వారి తొలిచూలు, మలిచూలులో పుట్టిన పిల్లల్లో కంజెనిటల్ గ్లుకోమా వచ్చే అవకాశాలు 5 శాతం మందిలో ఉంటాయి. ఒకవేళ పుట్టిన తొలిచూలు, మలిచూలు పిల్లల్లో కంజెనిటల్ గ్లుకోమా ఉంటే... ఆ తర్వాత పుట్టే పిల్లల్లో గ్లుకోమా వచ్చే అవకాశాలు 25 శాతం మేరకు ఉంటాయి.

నిర్ధారణ ఇలా... ● కంట్లో ఉండే ఇంట్రా ఆక్యులార్ ప్రెషర్‌ను కొలవడం ● కంట్లోని నల్లపాప వ్యాసాన్ని కొలవడం ● కంటిలోని నల్ల పాప ఎంత స్పష్టంగా ఉందో చూడటం ● కనుగుడ్డు మొత్తం పరిమాణం (యాగ్జియల్ లెంగ్త్) కొలవడం ● కంటి నరం, కంటి డిస్క్‌కు జరిగిన నష్టాన్ని తెలుసుకోవడం ● కంటిలో దృష్టిలోపాలు ఏవైనా ఉన్నాయేమో తెలుసుకోవడం ● యాక్వియస్ హ్యూమర్ బయటకు వెళ్లే డ్రైనేజీ యాంగిల్‌ను అంచనా వేయడం కోసం 'గోనియోస్కోపీ' అనే పరీక్షను నిర్వహించడం.

సర్జికల్ చికిత్సలు...

ఇందులో యాంగిల్ సర్జరీ, ఫిల్టరేషన్ సర్జరీ, డ్రైయినేజ్ సర్జరీ అనే మూడు అంశాల కోసం సర్జరీలు జరుగుతాయి.

● యాంగిల్ సర్జరీ కోసం గోనియాటమీ, ట్రాబెక్యులాటమీ అనే శస్త్రచికిత్సలు చేస్తారు. కార్నియా స్పష్టంగా (క్లియర్‌గా) ఉన్నవాళ్లలో గోనియాటమీ అనే శస్త్రచికిత్స చేస్తారు. ఇందులో 70% వరకు మంచి ఫలితాలే వస్తాయి ● కార్నియా మసకగా ఉన్నవాళ్లలో ట్రాబ్యెక్యులాటమీ అనే శస్త్రచికిత్స చేస్తారు ● ఇంకా కొంతమందిలో ఫిల్టరింగ్ ఆపరేషన్స్ అనే ట్రాబెక్యులెక్టమీ, క్లియరెక్టమీ అనే శస్త్రచికిత్సలూ చేస్తారు ● డ్రైయినేజ్ ప్రొసీజర్ కోసం షంట్ సర్జరీ / వాల్వ్ సర్జరీ అనేది చేస్తారు ● చికిత్స కోసం పిల్లలను బాగా ఆలస్యంగా తీసుకువచ్చినప్పుడు వాళ్లలో క్రైయో లేదా డయోడ్ లేజర్ అనే ప్రక్రియలతో చికిత్స అందిస్తారు. ఈ చికిత్సలకు తోడు... పిల్లల్లో రెఫ్రాక్టివ్ ఎర్రర్స్ ఉన్నప్పుడు వాళ్లకు కంటి అద్దాలు ఇస్తారు. ● కొందరిలో ఒక కన్ను మూసి, ఒక కన్ను తెరచి ఉంచే ప్యాచింగ్ /ఆంబ్లోపియా చికిత్సలు అందిస్తారు.

జెనెటిక్స్ విభాగంలోని ఇప్పుడు వచ్చిన పురోగతితో ఈ తరహా జెనెటికల్ సమస్యలకు మూడు రకాల జన్యువులు కారణం అని తెలుసుకున్నారు. తల్లిదండ్రుల్లో ఈ జన్యువులు ఉంటే, పుట్టిన పిల్లలను జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి.

ఒకసారి గ్లుకోమా శస్త్రచికిత్స అయ్యాక... ఆ పిల్లలు క్రమం తప్పకుండా జీవితాంతం డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి.

చికిత్సలు...

కంజెనిటల్ గ్లుకోమా నిర్ధారణ అయితే... దానికి శస్త్రచికిత్స చేయడమన్నదే ప్రధానంగా అందించాల్సిన చికిత్స. గ్లుకోమా ఉన్నట్లు తేలగానే డాక్టర్లు ఇచ్చే చుక్కల మందులు కేవలం తాత్కాలిక ఉపశమనం కోసం మాత్రమే. ఇవి కంట్లో పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడమే కాకుండా కార్నియల్ క్లారిటీ కోసం ఉపయోగపడతాయి. ఈ కార్నియల్ క్లారిటీ వల్ల చిన్నారులకు ఏ ఆపరేషన్ ఉపయోగపడుతుందో నిర్ధారణ చేయవచ్చు. ఈ శస్త్రచికిత్సలో... కంట్లో యాక్వియస్ హ్యూమర్ వల్ల పెరుగుతున్న ఒత్తిడంతా తొలగిపోయేలా... ఆ ద్రవాన్నంతా బయటకు పంపుతారు (అంటే డ్రైయిన్ చేస్తారు). అయితే... కంట్లోని ఆ ఒత్తిడి తొలగించడానికి ఒక్కోసారి ఒకటి కంటే ఎక్కువ శస్త్రచికిత్సా విధానాలు (మల్టిపుల్ సర్జికల్ ప్రొసీజర్స్) అవసరం పడవచ్చు.



డాక్టర్
రవికుమార్ రెడ్డి
సీనియర్
కంటి వైద్య నిపుణులు

బిజినెస్ రీల్

జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీకి కొత్త ప్రాజెక్టులు

డీసీఎం శ్రీరామ్, ఇండస్ టవర్స్‌తో ఒప్పందం

న్యూఢిల్లీ: వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ విభాగంలో కొత్తగా పలు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను సొంతం చేసుకున్నట్లు జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ప్రకటించింది. కంపెనీ మొత్తం స్థాపిప సామర్థ్యం 20 గిగావాట్లకు చేరుకోనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం వాణిజ్య, పారిశ్రామిక విభాగంలో 3.1 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ తయారీ సామర్థ్యం ఉందని, ఇందులో 2,654 మెగావాట్ల మేర జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ క్యాప్టివ్ (సొంత అవసరాలు) అవసరాలకు పోను, మరో 445 మెగావాట్ల మేర ఇతర సంస్థలకు అందిస్తున్నట్లు తెలిపింది. డీసీఎం శ్రీరామ్ లిమిటెడ్, ఇండస్ టవర్స్ లిమిటెడ్‌కు పునరుత్పాదక విద్యుత్‌ను సరఫరా చేసేందుకు తాజాగా కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రకటించింది. 20 గిగావాట్ల జెనరేషన్ ప్లాట్‌ఫామ్ మైలురాయిని చేరుకున్నట్లు జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ ఎండీ, సీఈవో శరద్ మహేంద్ర తెలిపారు. 2030 నాటికి 20 గిగావాట్ల తయారీ సామర్థ్యాన్ని, 40 గిగావాట్ హవర్ ఎనర్జీ స్టోరేజీ సామర్థ్యాన్ని సాధించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకోవడం గమనార్హం. ముఖ్యంగా 2025 మార్చి నాటికి 10 గిగావాట్ల నిర్వహణ సామర్థ్యాన్ని చేరుకునే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతానికి థర్మల్, హైడ్రో, పునరుత్పాదక విభాగంలో కలిపి మొత్తం మీద 7.7 గిగావాట్ల సామర్థ్యం సంస్థకు ఉంది.

క్విప్ ద్వారా రికార్డ్ నిధులు

జనవరి–నవంబర్‌లో రూ. 1.21 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ(క్విప్) ద్వారా నిధులను సమీకరించడంలో కంపెనీలు ఈ కేలండర్ ఏడాది(2024)లో కొత్త రికార్డ్‌కు తెరతీశాయి. జనవరి నుంచి నవంబర్‌వరకూ దేశీ కార్పొరేట్లు రూ. 1,21,321 కోట్లు అందుకున్నాయి. దేశీ కార్పొరేట్ చరిత్రలోనే ఇవి అత్యధికంకాగా.. స్టాక్ మార్కెట్లు సరికొత్త గరిష్టాలకు చేరడం, షేర్ల అధిక విలువలు ఇందుకు సహకరిస్తున్నాయి. ప్రైమ్ డేటాబేస్ గణాంకాల ప్రకారం గతేడాది క్విప్ ద్వారా రూ. 52,350 కోట్లు మాత్రమే సమకూర్చుకున్నాయి. వెరసి రెట్టింపునకు మించి పెట్టుబడులను ఆకట్టుకున్నాయి.

క్విప్ అంటే?

లిస్టెడ్ కంపెనీలు సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ ద్వారా వేగంగా నిధులు సమీకరించేందుకు వీలు కల్పించేదే క్విప్. నవంబర్‌వరకూ 82 కంపెనీలు క్విప్‌ను చేపట్టాయి. గతేడాది కేవలం 35 కంపెనీలు రూ. 38,220 కోట్లు సమీకరించాయి. ఈ ఏడాది రికార్డుకు కారణమైన కంపెనీలలో ప్రధానంగా వేదాంతా గ్రూప్, జొమాటో, అదానీ ఎనర్జీ, వరుణ్ బెవరేజెస్ తదితరాలను ప్రస్తావించవచ్చు. వేదాంతా, జొమాటో విడిగా రూ. 8,500 కోట్లు చొప్పున అందుకున్నాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

17-12-2024

విశాఖ	620–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	630–00
విజయవాడ	630–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620–00
వరంగల్	622–00
రిటైల్ ధర	6.80

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,268.00	1.74
INDUSINDBK	998.2	1.17
HDFCLIFE	635.45	0.46
POWERGRID	334.75	0.27
BAJFINANCE	7,200.00	0.24

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,440.00	-1.96
HINDALCO	652.9	-1.39
ADANIPORTS	1,242.50	-1.38
TCS	4,416.00	-1.29
TECHM	1,774.15	-1.24

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,070
ఎన్‌ఎస్‌ఈ	89,196
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,42,974
ఎఫ్ఐఐ	+ 279
డీఐఐ	- 234

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.56	$ 71.29
బ్రెంట్	74.16	$ 74.49

ఐపీవో బాటలో 3 కంపెనీలు

లక్ష్మీ డెంటల్‌కు సెబీ గ్రీన్ సిగ్నల్
- ఎన్లాన్ హెల్త్‌కేర్ ప్రాస్పెక్టస్ వెనక్కి
- 2 కంపెనీలు ప్రాస్పెక్టస్ దాఖలు
- జాబితాలో ఆనంద్ రాఠీ, జీకే ఎనర్జీ



ప్రస్తుత కేలండర్ ఏడాది(2024)లో ప్రైమరీ మార్కెట్లు జోరు చూపుతున్నాయి. గత వారం 4 కంపెనీలు ఐపీవోలు చేపట్టగా.. ఈ వారం మరో 4 కంపెనీల ఇష్యూలు ప్రారంభంకానున్నాయి. ఈ బాటలో తాజాగా లక్ష్మీ డెంటల్‌కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా.. మరో 2 కంపెనీలు లిస్టింగ్‌కు అనుమతించమంటూ ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. మరోపక్క ఎన్లాన్ హెల్త్‌కేర్ అక్టోబర్‌లో దాఖలు చేసిన ప్రాస్పెక్టస్‌ను సెబీ తాజాగా వెనక్కి పంపింది. వివరాలు చూద్దాం..

ఆనంద్ రాఠీ

ఆనంద్ రాఠీ గ్రూప్ బ్రోకరేజీ కంపెనీ.. ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ సెబీకి ప్రాథమిక ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా తాజా ఈక్విటీ జారీ ద్వారా రూ. 745 కోట్లు సమీకరించే ప్రణాళికలు వేసింది. వీటిలో రూ. 550 కోట్లు దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్‌సహా సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. బ్రోకింగ్, మార్జిన్ ట్రేడింగ్, ఫైనాన్షియల్ ప్రొడక్టుల పంపిణీ తదితర విస్తారిత ఫైనాన్షియల్ సర్వీసులను ఆనంద్ రాఠీ బ్రాండుతో కంపెనీ ఆఫర్ చేస్తోంది. సంస్థాగత ఇన్వెస్టర్లతోపాటు రిటైల్, హెచ్‌ఎన్ఐలకు సేవలు సమకూర్చుతోంది. గతేడాది(2023-24) ఆదాయం 46 శాతం జంప్‌చేసి రూ. 682 కోట్లను తాకింది. నికర లాభం మరింత అధికంగా దాదాపు రెట్టింపై రూ. 77 కోట్లను దాటింది. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్–సెప్టెంబర్‌లో రూ. 442 కోట్ల ఆదాయం, రూ. 64 కోట్ల నికర లాభం అందుకుంది.

లక్ష్మీ డెంటల్ రెడీ

సెప్టెంబర్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేసిన లక్ష్మీ డెంటల్ తాజాగా అనుమతి పొందింది. ప్రాస్పెక్టస్ ప్రకారం ఐపీవోలో భాగంగా రూ. 150 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.28 కోట్ల షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ బిజ్‌డెంట్ డివైసెస్‌లో పెట్టుబడులకు, కొత్త మెషీనరీ కొనుగోలుకి, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. ఎండ్‌టుఎండ్ సమీకృత డెంటల్ ప్రొడక్టుల కంపెనీ ఇది. ఎలైనర్ సొల్యూషన్స్, పీడియాట్రిక్ డెంటల్ తదితర పలు ఉత్పత్తులను రూపొందిస్తోంది.

జీకే ఎనర్జీ

సౌర విద్యుత్ ఆధారిత వ్యవసాయ వాటర్ పంప్ సిస్టమ్స్ కంపెనీ.. జీకే ఎనర్జీ సెబీకి ప్రాథమిక ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 84 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 422 కోట్లు దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్‌కు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా సౌర విద్యుత్ వ్యవసాయ వాటర్ పంప్ సిస్టమ్స్‌కు సంబంధించి ఈపీసీ సేవలు అందిస్తోంది. కేంద్ర ప్రభుత్వ పీఎం–కేయూఎస్‌యూఎం పథకంలో భాగంగా సర్వీసులు సమకూర్చుతోంది. జల్‌జీవన్ మిషన్‌కింద నీటి నిల్వ, పంపిణీ వ్యవస్థలను ఏర్పాటు చేస్తోంది. 2024 అక్టోబర్‌కల్లా రూ. 759 కోట్ల ఆర్డర్‌బుక్‌ను సాధించింది. గతేడాది(2023-24) ఆదాయం 44 శాతం ఎగసి రూ. 411 కోట్లను తాకింది. నికర లాభం మరింత అధికంగా రూ. 10 కోట్ల నుంచి రూ. 36 కోట్లకు జంప్‌చేసింది. ఈ బాటలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) ఏప్రిల్–సెప్టెంబర్‌లో రూ. 422 కోట్ల ఆదాయం, రూ. 51 కోట్ల నికర లాభం అందుకుంది.

రికార్డు స్థాయిలో ఆఫీస్ లీజింగ్

- ఈ ఏడాది 14 శాతం వృద్ధి
- 85 మిలియన్ ఎస్ఎఫ్‌టీ
- కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ అంచనా



న్యూఢిల్లీ: కార్యాలయ వసతుల(ఆఫీస్ స్పేస్) మార్కెట్ ఈ ఏడాది మంచి జోరును కొనసాగించింది. గతేడాదితో పోల్చితే సుమారు 14 శాతం అధికంగా 85 మిలియన్ చదరపు అడుగుల మేర (ఎస్ఎఫ్‌టీ) స్థూల లీజింగ్ ఈ ఏడాది ఎనిమిది ప్రధాన నగరాల్లో నమోదవుతుందని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ తన అంచనాలు వెల్లడించింది. 2023లో ఇవే నగరాల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 74.6 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండడం గమనార్హం. ''ఎనిమిది ప్రధాన నగరాల్లో 2022 నుంచి ఆఫీస్ స్పేస్ స్థూల లీజింగ్ ఏటా 70 మిలియన్ ఎస్ఎఫ్‌టీపైనే ఉంటూ వస్తోంది''అని కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వివరించింది. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ వరకు 66.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీ స్థూల లీజింగ్ లావాదేవీలు జరిగినట్టు ప్రకటించింది. స్థూల ఆఫీస్ స్పేస్ లీజింగ్ 2018లో 49.1 మిలియన్ ఎస్ఎఫ్‌టీ, 2019లో 67.7 మిలియన్ ఎస్ఎఫ్‌టీ, 2020లో 46.6 మిలియన్ ఎస్ఎఫ్‌టీ, 2021లో 50.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీ, 2022లో 72 మిలియన్ ఎస్ఎఫ్‌టీ, 2023లో 74.6 మిలియన్ ఎస్ఎఫ్‌టీ చొప్పున నమోదైనట్టు ఈ నివేదిక వెల్లడించింది.

ఈ రంగాల్లో డిమాండ్ అధికం..

ముఖ్యంగా ఐటీ–బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ (ఐటీ–బీపీఎం), బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (బీఎఫ్ఎస్ఐ), ఇంజనీరింగ్, తయారీ రంగాలతోపాటు, ఫ్లెక్స్ ఆపరేటర్ స్పేస్ విభాగాలు ఈ వృద్ధిని నడిపిస్తున్నట్టు కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ నివేదిక వెల్లడించింది. ఈ రంగాలు మెరుగైన పనితీరు చూపిస్తున్నట్టు తెలిపింది. ''2024 భారత ఆఫీస్ రంగానికి రికార్డుగా నిలిచిపోతుంది. స్థూల లీజింగ్ ఈ ఏడాది 85 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరుకోవచ్చు. ఇందులో నికర వినియోగం 45 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉండొచ్చు. భారత వాణిజ్య రియల్ ఎస్టేట్‌లో అత్యధిక గరిష్ట స్థాయి ఇది''అని కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ తెలిపింది. మొత్తం ఆఫీస్ లీజింగ్‌లో గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీ) 30 శాతం వాటా ఆక్రమిస్తాయని పేర్కొంది. డిమాండ్ పెరగంతో ప్రముఖ ప్రాంతాల్లో కార్యాలయ వసతుల అద్దెల పెరుగుదలపై ఒత్తిడి నెలకొన్నట్టు తెలిపింది. ''2025లో అధిక శాతం నూతన వసతుల సరఫరా ప్రముఖ ప్రాంతాల చుట్టూనే ఉండనుంది. స్థిరమైన సరఫరాతో అద్దెల పెరుగుదల మోస్తరు స్థాయిలో ఉండనుంది. దీంతో కిరాయిదారుల అనుకూల సెంటిమెంట్ కొంత కాలం పాటు కొనసాగనుంది''అని వివరించింది.

స్టెరిలైట్ పవర్ నిధుల సమీకరణ

జీఈఐఎఫ్, ఈఐనమ్ నుంచి రూ. 725 కోట్లు

న్యూఢిల్లీ: విద్యుత్ ప్రసార సొల్యూషన్ల కంపెనీ స్టెరిలైట్ పవర్ తాజాగా జీఈఐఎఫ్ క్యాపిటల్ పార్ట్‌నర్స్, ఈఐనమ్ హోల్డింగ్స్ నుంచి రూ. 725 కోట్లు సమీకరించింది. విడదీత ప్రణాళికలో భాగంగా గ్లోబల్ ప్రొడక్ట్స్ అండ్ సొల్యూషన్స్(జీపీఎస్) బిజినెస్‌ను 2024 అక్టోబర్ నుంచి స్వతంత్ర సంస్థగా ఏర్పాటు చేసినట్లు స్టెరిలైట్ పవర్ వెల్లడించింది. అయితే ప్రొడక్టులు, సొల్యూషన్ల బిజినెస్ కోసం తొలిసారి నిధుల సమీకరణ చేపట్టినట్లు తెలియజేసింది. నిధులను ఇప్పటికే చేపట్టిన విస్తరణ, వృద్ధి కార్యక్రమాలకు వెచ్చించనుంది. తద్వారా ఉత్పత్తి సామర్థ్యాల పెంపు, కొత్త ప్రొడక్టుల అభివృద్ధి, కీలక అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశించడంవంటివి చేపట్టనుంది. కాగా.. జీపీఎస్ బిజినెస్ వృద్ధి పథంలో కొనసాగుతున్నట్లు కంపెనీ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో రూ. 2,715 కోట్ల విలువైన ఆర్డర్లు పొందినట్లు తెలియజేసింది. ఈ బాటలో నవంబర్ చివరికల్లా ఓపెన్ ఆర్డర్ బుక్ విలువ రూ. 6,700 కోట్లకు చేరినట్లు వివరించింది.

వేదాంతా డివిడెండ్ రూ. 8.5

- ఈ నెల 24 రికార్డ్ డేట్
- 2024–25లో రూ. 43.5 చెల్లింపు



న్యూఢిల్లీ: మైనింగ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ బోర్డు తాజాగా షేరుకి రూ. 8.5 చొప్పున డివిడెండ్ చెల్లించేందుకు అనుమతించింది. ఇందుకు కంపెనీ రూ. 3,324 కోట్లు వెచ్చించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2024-25) ఇది నాలుగో మధ్యంతర డివిడెండ్‌కాగా.. చెల్లింపునకు ఈ నెల 24 రికార్డ్ డేట్‌గా కంపెనీ ప్రకటించింది. కంపెనీ వాటాదారులకు సెప్టెంబర్‌లో షేరుకి రూ. 20 చొప్పున మూడో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. అంతక్రితం షేరుకి రూ. 11, రూ. 4 చొప్పున రెండు డివిడెండ్లు చెల్లించింది. వెరసి వాటాదారులకు ఈ ఏడాదిలో ఒక్కో షేరుకి మొత్తం రూ. 43.5 డివిడెండును చెల్లించినట్లయ్యింది. ఈ ఏడాది షేరు ర్యాలీ కారణంగా కంపెనీ మార్కెట్ విలువ రూ. 2 లక్షల కోట్లను దాటడం గమనార్హం!

ఈ నేపథ్యంలో వేదాంతా షేరు బీఎస్‌ఈలో 1.2 శాతం నీరసించి రూ. 513 వద్ద ముగిసింది. తొలుత రూ. 527 వద్ద 52 వారాల గరిష్టాన్ని తాకింది.

ఒక్క రోజులో రూ.95,915 కోట్లు

- యూపీఐ చెల్లింపుల్లో నూతన రికార్డు
- డిజిటల్ లావాదేవీల్లో కొత్త పుంతలు
- చేరువలో రూ.1,00,000 కోట్ల మార్కు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రూ.95,915.61 కోట్లు.. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఆధారిత చెల్లింపుల్లో సరికొత్త రికార్డు. డిసెంబర్ 2వ తేదీ ఈ మైలురాయికి వేదికైంది. ఒక రోజులో ఇంత మొత్తంలో నగదు చేతులు మారడం భారత్‌లో ఇదే తొలిసారి. దేశంలో డిజిటల్ చెల్లింపులు కొత్త పుంతలు తొక్కుతున్నాయనడానికి ఈ అంకెలే నిదర్శనం. చేతిలో మొబైల్ ఫోన్ ఉంటే చాలు.. అత్యంత వేగంగా, సులభంగా దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా నగదు చెల్లింపులను సరళతరం చేసిన యూపీఐ వినియోగంలో వేగం చూస్తుంటే ఒక రోజు లావాదేవీల విలువ రూ.1,00,000 కోట్ల మార్కును నేడో రేపో చేరుకోవడం ఖాయంగా ఉంది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) 2016 ఏప్రిల్‌లో యూపీఐ పైలట్ ప్రాజెక్టు ప్రారంభించింది. ఫ్రాన్స్, యూఏఈ, సింగపూర్, భూటాన్, శ్రీలంక, మారిషస్, నేపాల్‌లోనూ యూపీఐ ద్వారా చెల్లింపులు జరుపవచ్చు.

సగటు రూ.82,279 కోట్లు..

2024 నవంబర్‌లో సగటున రోజుకు రూ.71,839.56 కోట్ల విలువైన లావాదేవీలు నమోదైతే, గతేడాది నవంబర్‌లో ఇది రూ.57,991.33 కోట్లుగా ఉంది. ఈ నెల మొదటి 12 రోజుల్లో సగటున రూ.82,279 కోట్ల విలువైన లావాదేవీలు జరిగాయంటే యూపీఐ హవాను అర్థం చేసుకోవచ్చు. నవంబర్‌లో మొత్తం యూపీఐ లావాదేవీలు రూ.21,55,187.41 కోట్లు. డిసెంబర్ 1–12 మధ్య ఇది రూ.9,87,348.93 కోట్లు నమోదైంది. ఈ ఏడాది నవంబర్‌లో సగటు రోజువారీ లావాదేవీల సంఖ్య 51.60 కోట్లు. గతేడాది నవంబర్‌లో ఇది 37.45 కోట్లు మాత్రమే. 2024 డిసెంబర్ 1–12 మధ్య సగటు లావాదేవీల సంఖ్య 55.18 కోట్లకు దూసుకెళ్లింది.

ముందంజలో ఫోన్‌పే..


యూపీఐ లావాదేవీల విలువ, పరిమాణం పరంగా ఫోన్‌పే తన అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. నవంబర్‌లో ఫోన్‌పే వేదికగా ఏకంగా రూ.10,88,635 కోట్ల విలువైన 740 కోట్ల లావాదేవీలు జరిగాయి. రూ.7,64,639 కోట్ల విలువైన 573.9 కోట్ల లావాదేవీలతో గూగుల్ పే రెండవ స్థానంలో నిలిచింది. మూడవ స్థానాన్ని దక్కించుకున్న పేటీఎం రూ.1,18,004 కోట్ల విలువైన 107.5 కోట్ల లావాదేవీలను నమోదు చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో క్రెడ్, ఐసీఐసీఐ బ్యాంక్ యాప్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యాప్స్ ఉన్నాయి. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 631 బ్యాంకులు, ఆర్థిక సంస్థలు యూపీఐ సేవలను అందిస్తున్నాయి.

చిన్న మొత్తాల్లోనే ఎక్కువ..

గత నెలలో రూ.21,55,187 కోట్ల విలువైన 1,548 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. ఇందులో వ్యక్తుల మధ్య రూ.15,56,010 కోట్ల విలువైన 583 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఇక వ్యక్తుల నుంచి వర్తకులకు రూ.5,99,176 కోట్ల విలువైన 964.9 కోట్ల లావాదేవీలు జరిగాయి. లావాదేవీల సంఖ్య పరంగా వ్యక్తుల నుంచి వర్తకుల మధ్య రూ.500 లోపు ఉండే మొత్తాలు 85 శాతం వాటాతో సింహభాగం కైవసం చేసుకున్నాయి. రూ.501–2,000 మధ్య 10 శాతం, రూ.2,001 ఆపైన విలువ చేసేవి 5 శాతం నమోదయ్యాయి. వ్యక్తుల నుంచి వ్యక్తులకు రూ.500 లోపు విలువ చేసే మొత్తాలు 57 శాతం, రూ.501–2,000 మధ్య 21 శాతం, రూ.2,001 ఆపైన విలువ కలిగినవి 22 శాతం జరిగాయి.

నిస్సాన్ టర్న్‌అరౌండ్ ప్రణాళికలు

భారత మార్కెట్ పట్ల సానుకూలం
- సిబ్బంది సంఖ్యను పెంచుకునే వ్యూహం
- సంస్థ భారత ఆపరేషన్స్ హెడ్ ఫ్రాంక్ టొర్రెస్



న్యూఢిల్లీ: భారత కార్యకలాపాలకు సంబంధించి టర్న్ అరౌండ్ ప్రణాళికలతో పనిచేస్తున్నట్లు జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ నిస్సాన్ ప్రకటించింది. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ, భారత్‌లో సిబ్బంది సంఖ్యను పెంచుకోనున్నట్లు నిస్సాన్ ఇండియా ఆపరేషన్స్ ప్రెసిడెంట్ ఫ్రాంక్ టొర్రెస్ ప్రకటించారు. చెన్నై ప్లాంట్‌లో మూడో షిఫ్ట్ కోసం కొత్తగా 600 మందిని తీసుకున్నట్టు, పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయంగా సిబ్బంది, ఉత్పత్తి కోత ప్రణాళికలు భారత కార్యకలాపాలపై ప్రభావం చూపిస్తాయా? అన్న మీడియా ప్రశ్నకు.. భారత మార్కెట్లో పోటీతత్వంతో కొనసాగినంత కాలం ఈ పరిస్థితి ఉండబోదన్నారు. భారత్‌పై భారీ ప్రణాళికలతో ఉన్నామని, కార్యకలాపాలను బలోపేతం చేసుకుంటున్నామని తెలిపారు. వచ్చే 30 నెలల్లో ఐదు కొత్త మోడళ్లను భారత మార్కెట్లో ప్రవేశపెడతామని, వేగంగా వృద్ధి చెందుతున్న భారత కార్ల మార్కెట్లో తమ కార్యకలాపాలను టర్న్ అరౌండ్ (నష్టాల్లోంచి బయటకు రావడం) చేసుకుంటామని నిస్సాన్ ఇండియా ఈ ఏడాది జూలైలో ప్రకటించడం గమనార్హం. దేశీయ, ఎగుమతుల మార్కెట్లో 2026 ఆర్థిక సంవత్సరం నుంచి లక్ష యూనిట్లకు విక్రయాలు పెంచుకోనున్నట్టు పేర్కొంది. అంతర్జాతీయంగా 9వేల మంది ఉద్యోగులు, 20 శాతం మేర ఉత్పత్తిని కుదించడం ద్వారా వ్యయాలను 2.6 బిలియన్ డాలర్ల మేర తగ్గించుకోనున్నట్టు ఈ ఏడాది నవంబర్‌లో నిస్సాన్ ప్రకటించింది. అయినప్పటికీ భారత ప్రణాళికలపై ఎలాంటి ప్రభావం లేదా రిస్క్ ఉండబోదని టొర్రెస్ తాజాగా స్పష్టతనిచ్చారు.

బలమైన వృద్ధి ప్రణాళికలు..



ఉత్పత్తులు, వ్యయాలతో భారత మార్కెట్లో పోటీపడతామని టొర్రెస్ ప్రకటించారు. ''ఈ మార్కెట్‌కు కట్టుబడి ఉండడం వల్లే సిబ్బందిని పెంచుకుంటున్నాం. కొత్త పెట్టుబడులకు అనుగుణంగా 2025లోనూ చెన్నై ప్లాంట్ కోసం సిబ్బందిని పెంచుకుంటాం. తమిళనాడు ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు ఉంది''అని టొర్రెస్ తెలిపారు. కొత్త మోడళ్ల అమ్మకాలు అంచనాల మేరకు ఉంటే 2026 చివరికి చెన్నై ప్లాంట్ సామర్థ్య వినియోగం 80 శాతానికి చేరుకుంటుందన్నారు. రెనో–నిస్సాన్ భాగస్వామ్యం 2,000 మందికి పైగా ఉపాధి కల్పనకు కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. కేవలం తయారీలోనే కాకుండా, ఆర్‌అండ్‌డీలోనూ ఉపాధి కల్పన ఉంటుందన్నారు. ''దేశీయ, ఎగుమతుల విక్రయాలు పెంచుకోవాలన్నది మా ప్రణాళిక. 2022–23 విక్రయాలతో పోల్చితే దేశీయ, ఎగుమతుల అమ్మకాలు మూడు రెట్లకు పెంచుకోవాలన్నది మా లక్ష్యం''అని టొర్రెస్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 74,200కు పైగా యూనిట్లను ఎగుమతి చేస్తామన్నారు. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇవి 42,597 యూనిట్లుగా ఉన్నాయి. ఇక దేశీయ అమ్మకాలు 4 శాతం వృద్ధితో 31,155 యూనిట్లకు చేరుకుంటాయని నిస్సాన్ ఇండియా అంచనా వేస్తోంది.

సమీప కాలంలో నియామకాలు తక్కువే

2025-26 రెండవ అర్ధ భాగంలో వృద్ధి ● ఇక్రా రేటింగ్స్ నివేదిక తాజా అంచనా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: భారతీయ ఐటీ సేవల పరిశ్రమలో 2025–26 రెండవ అర్ధ భాగం నాటికి వృద్ధి ఊపందుకునేంత వరకు నియామకాలు సమీప కాలంలో తక్కువ స్థాయిలోనే ఉంటాయని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. ఇక్రా నివేదిక ప్రకారం.. యుఎస్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయడం వల్ల తక్షణ కాలంలో కొంత విధానపర అనిశ్చితి ఏర్పడవచ్చు. అనిశ్చిత స్థూల ఆర్థిక వాతావరణం మధ్య యూఎస్, యూరప్‌లోని కీలక మార్కెట్లలో కస్టమర్లు సాంకేతికతపై తక్కువ వ్యయం చేయడంతో 6–8 త్రైమాసికాల్లో భారతీయ ఐటీ సేవల కంపెనీలకు డిమాండ్ తగ్గింది. తక్కువ అట్రిషన్, ఉద్యోగుల వినియోగాన్ని పెంచడంపై దృష్టి పెట్టడం వంటి అంశాలు కూడా నియామకాల్లో మందగమనానికి కారణం అయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం క్యూ2లో కొంత రికవరీ ఉన్నప్పటికీ.. 2025–26 అక్టోబర్–మార్చి నాటికి వృద్ధి ఊపందుకుంటున్నంత వరకు సమీప కాలంలో నియామకాలు తక్కువగానే ఉంటాయి.

నైపుణ్యాన్ని పెంచుతున్నాయి..

2021–22, 2022–23 కాలంలో జోడించిన ఉద్యోగుల వినియోగం పెరుగుదల 2023–24 మరియు 2024–25 క్యూ1లో ఐటీ సేవల కంపెనీల నియామకాలపై ఒత్తిడి తెచ్చింది. అట్రిషన్ స్థాయిల పెరుగుదలతో పాటు, ఇక్రా ఎంచుకున్న కంపెనీలకు 2024–25 క్యూ1 వరకు ఏడు త్రైమాసికాల్లో నికర ఉద్యోగుల చేరిక ప్రతికూలతకు దారితీసింది. ఈ జాబితాలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, టెక్ మహీంద్రా, విప్రో లిమిటెడ్ ఉన్నాయి. జనరేటివ్ (జెన్) ఏఐ వేగంగా ప్రవేశిస్తున్నందున ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యాపార అవకాశాలను అన్వేషించడం ద్వారా అన్ని ప్రముఖ ఐటీ సేవల కంపెనీలు తమ ఉద్యోగులకు నైపుణ్యాన్ని పెంచుతున్నాయి. కోవిడ్‌కు ముందు ఉన్న స్థాయిలతో పోలిస్తే ఇది తాజా నియామకంలో మొత్తం నియంత్రణకు దారితీసే అవకాశం ఉందని అంచనా. ఉద్యోగుల ఉత్పాదకతను మెరుగుపరచడం కోసం జనరేటివ్ ఏఐ విస్తృత స్వీకరణ ప్రభావం రాబోయే కొన్ని సంవత్సరాలలో కనిపిస్తుందని ఇక్రా నివేదిక తెలిపింది.

డిమాండ్ నియంత్రణతో..

నివేదిక రూపకల్పనకు ఇక్రా ఎంచుకున్న కంపెనీల్లో ఒక్కో ఉద్యోగికి సగటు ఆదాయం 2019–20 నుంచి 2023–24లో దాదాపు 50,000 డాలర్ల వద్ద స్థిరంగా ఉంది. 12 నెలల అట్రిషన్ రేటు 2021–22 క్యూ4, 2022–23 క్యూ1 సమయంలో దాదాపు 23 శాతానికి చేరుకుంది. నియామకాలు పెద్ద ఎత్తున జరగడం, ఆ తరువాత డిమాండ్–సరఫరా అసమతుల్యత ఇందుకు కారణం. యూఎస్, యూరప్‌లోని కీలక మార్కెట్లలో డిమాండ్ నియంత్రణ కారణంగా ఐటీ సేవల కంపెనీల ద్వారా తక్కువ నియామకాలతో అట్రిషన్ క్రమంగా క్షీణించింది. ఇక్రా నమూనా కంపెనీల అట్రిషన్ రేటు 2023–24 క్యూ3 నుండి దాదాపు 13 శాతం వద్ద స్థిరీకరించడం ప్రారంభించింది. కోవిడ్ ముందస్తు 2019–20 క్యూ1లో ఇది 18 శాతం నమోదైంది అని ఇక్రా వివరించింది.


ఆకాశ్‌దీప్, బుమ్రా, రోహిత్

తెలంగాణ జట్టుకు తొలి పరాజయం

సాక్షి, హైదరాబాద్: సంతోష్ ట్రోఫీ జాతీయ సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య తెలంగాణ జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. డెక్కన్ ఎరీనాలో సోమవారం జరిగిన గ్రూప్ 'ఎ' రెండో లీగ్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 0–3 గోల్స్ తేడాతో మాజీ చాంపియన్ పశ్చిమ బెంగాల్ చేతిలో ఓడిపోయింది. బెంగాల్ తరఫున నరోహరి శ్రేష్ఠ (45+3వ నిమిషంలో; 56వ నిమిషంలో) రెండు గోల్స్ కొట్టగా... రాబీ హన్స్‌దా (39వ నిమిషంలో) ఒక గోల్ అందించాడు. రాజస్తాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌ను 1–1తో 'డ్రా' చేసుకున్న తెలంగాణ రెండో మ్యాచ్‌లో బెంగాల్‌పై ఒక్క గోల్ కూడా కొట్టలేకపోయింది. గ్రూప్ 'ఎ'లోనే ఉన్న డిఫెండింగ్ చాంపియన్ సర్వీసెస్ గెలుపు బోణీ కొట్టింది. జమ్మూ కశ్మీర్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో సర్వీసెస్ 4–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. సర్వీసెస్ తరఫున లెథాలెన్ ఖోంగ్సాయ్ (11వ నిమిషంలో), వీజీ శ్రేయస్ (26వ నిమిషంలో), రాహుల్ రామకృష్ణన్ (53వ నిమిషంలో), థింగామ్ బిద్యాసాగర్ సింగ్ (54వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మరో మ్యాచ్‌లో మణిపూర్ 2–1 గోల్స్ తేడాతో రాజస్తాన్ జట్టును ఓడించింది. గ్రూప్ 'ఎ'లో ప్రస్తుతం బెంగాల్, మణిపూర్ జట్లు 6 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నాయి. సర్వీసెస్ మూడు పాయింట్లతో మూడో స్థానంలో... రాజస్తాన్, తెలంగాణ ఒక్కో పాయింట్‌తో నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్నాయి.


బెంగాల్ ప్లేయర్‌ను నిలువరిస్తున్న తెలంగాణ జట్టు ఆటగాళ్లు

సిరీస్ విజయంపై గురి

- నేడు వెస్టిండీస్‌తో భారత మహిళల రెండో టి20
- రాత్రి 7 గంటల నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



ముంబై: వెస్టిండీస్‌తో తొలి టి20లో భారీ విజయంతో చెలరేగిన భారత మహిళల జట్టు ఇప్పుడు సిరీస్‌ను సొంతం చేసుకునేందుకు సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య నేడు జరిగే రెండో టి20లో గెలిస్తే సిరీస్ హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం ఖాతాలో చేరుతుంది. మరోవైపు గత మ్యాచ్‌లో ఓటమి నుంచి కోలుకొని మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని విండీస్ మహిళలు భావిస్తున్నారు. తొలి టి20లో భారత బ్యాటర్లంతా రాణించడం చెప్పుకోదగ్గ సానుకూలాంశం. స్మృతి మంధాన దూకుడుగా ఆడి అర్ధసెంచరీ సాధించగా... జెమీమా రోడ్రిగ్స్ ఆకాశమే హద్దుగా చెలరేగింది. ముఖ్యంగా ఇటీవల ఆస్ట్రేలియా చేతిలో వన్డేల్లో చిత్తుగా ఓడిన తర్వాత స్వదేశంలో దక్కిన ఈ విజయం జట్టులో ఉత్సాహాన్ని పెంచింది. అయితే ఫీల్డింగ్‌లో టీమ్ కాస్త పేలవ ప్రదర్శన కనబర్చింది. తొలి మ్యాచ్‌లో భారత ఫీల్డర్లు మూడు సునాయాస క్యాచ్‌లు వదిలేశారు. బౌలింగ్‌లో దీప్తి శర్మ చక్కటి బంతులతో ప్రత్యర్థిని కట్టడి చేయగా... టిటాస్ సాధు వికెట్లు పడగొట్టింది. ప్రధాన పేసర్ రేణుకా సింగ్ కూడా సత్తా చాటాల్సి ఉంది. స్వల్ప లోపాలు ఉన్నా... బ్యాటింగ్, బౌలింగ్‌లో సమష్టి ప్రదర్శనతో చెలరేగితే మరో విజయం కష్టం కాబోదు. మరోవైపు వెస్టిండీస్ కూడా బ్యాటింగ్‌లో బలంగానే ఉంది. ముఖ్యంగా డియాండ్రా డాటిన్ గత మ్యాచ్ తరహాలోనే ధాటిగా ఆడగల సమర్థురాలు. ఖియానా జోసెఫ్ కూడా తొలి టి20లో రాణించింది. వీరితో పాటు కెప్టెన్, ఓపెనర్ హేలీ మాథ్యూస్ కూడా తన స్థాయికి తగినట్లు ఆడితే విండీస్ బలం పెరుగుతుంది.

'బౌలింగ్ బృందం సంధి దశలో ఉంది'

ఒకరిని మరొకరు తప్పు పట్టలేం ● జస్‌ప్రీత్ బుమ్రా వ్యాఖ్య

బ్రిస్బేన్: భారత స్టార్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా మరోసారి తన స్థాయిని ప్రదర్శిస్తూ 6 వికెట్లతో చెలరేగాడు. 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' సిరీస్‌లో ఇప్పటికే 18 వికెట్లు తీసిన అతను... ఆస్ట్రేలియా గడ్డపై 50 వికెట్లు తీసిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో చేరాడు. అయితే మూడో టెస్టులో బుమ్రాకు మిగతా బౌలర్ల నుంచి తగిన సహకారం లభించకపోవడంతో ఆసీస్ భారీ స్కోరు సాధించింది. ఈ నేపథ్యంలో ఇతర బౌలర్లపై వచ్చిన విమర్శలను బుమ్రా తిప్పికొట్టాడు. వారిలో చాలా మంది కొత్తవారేనని, ఇంకా నేర్చుకుంటున్నారని మద్దతు పలికాడు. 'జట్టులో ఇతర సభ్యుల వైపు వేలెత్తి చూపించే పని మేం చేయం. నువ్వు ఇది చేయాలి, నువ్వు అది చేయాలి అంటూ శాసించే దృక్పథం కాదు మాది. ఎంతో మంది కొత్త ఆటగాళ్లు వస్తున్నారు. ఆస్ట్రేలియాలాంటి చోట రాణించడం అంత సులువు కాదు. ముఖ్యంగా మా బౌలింగ్‌లో సంధి కాలం నడుస్తోంది. కొన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన అనుభవంతో వారికి నేను అండగా నిలవాలి. వారంతా ఇంకా నేర్చుకోవాల్సి ఉంది. ఈ ప్రయాణంలో ముమ్ముందు మరింత మెరుగవుతారు' అని బుమ్రా వ్యాఖ్యానించాడు. జట్టు బ్యాటింగ్ వైఫల్యంపై కూడా అతను స్పందించాడు. 'బ్యాటర్లు విఫలమయ్యారని, వారి వల్ల మాపై ఒత్తిడి పెరుగుతుందని చెప్పడం సరైంది కాదు. జట్టులో 11 మంది ఉన్నాం. కొందరికి అనుభవం చాలా తక్కువ. వారు నేర్చుకునేందుకు తగినంత అవకాశం ఇవ్వాలి. ఎవరూ పుట్టుకతోనే గొప్ప ఆటగాళ్లు కాలేరు. నేర్చుకునే ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. సవాళ్లు ఎదురైనప్పుడు కొత్త తరహాలో వాటిని పరిష్కరించుకునేందుకు ప్రయత్నం చేస్తాం. ఈ సిరీస్‌లో మూడు టెస్టుల్లో మూడు భిన్నమైన పిచ్‌లు ఎదురయ్యాయి. నేను వాటి కోసం సిద్ధమయ్యాను. గతంలో అంచనాల భారంతో కాస్త ఒత్తిడి ఉండేది. ఇప్పుడు వాటిని పట్టించుకోవడంలేదు. నా అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చేందుకే ప్రయత్నిస్తా. నేను బాగా ఆడని రోజు మిగతా బౌలర్లు వికెట్లు తీయవచ్చు' అని బుమ్రా వివరించాడు.

సిరాజ్‌కు గాయం!

ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో భారీగా పరుగులు సమర్పించుకున్న మరో పేసర్ సిరాజ్‌కు బుమ్రా అండగా నిలిచాడు. అతను స్వల్ప గాయంతో బాధపడుతూనే బరిలోకి దిగాడని, సిరాజ్‌లో పోరాట స్ఫూర్తి చాలా ఉందని మెచ్చుకున్నాడు. 'మైదానంలోకి దిగిన తాను బాగా బౌలింగ్ చేయకపోతే జట్టుపై ఒత్తిడి పెరుగుతుందని సిరాజ్‌కు తెలుసు. అందుకే స్వల్ప గాయంతో ఉన్నా బౌలింగ్‌కు సిద్ధమయ్యాడు. కొన్నిసార్లు బాగా బౌలింగ్ చేసినా వికెట్లు దక్కవని, పోరాడటం ఆపవద్దని అతనికి చెప్పా. ఎందరికో రాని అవకాశం నీకు వచ్చిందంటూ ప్రోత్సహించా. అతనిలో ఎలాంటి ఆందోళన లేదు. ఎంతకైనా పట్టుదలగా పోరాడే అతని స్ఫూర్తి నాకు నచ్చుతుంది. అది జట్టుకూ సానుకూలాంశం' అని బుమ్రా అభిప్రాయపడ్డాడు.

విజేత టీమ్ ఆసియా

ఓస్లో (నార్వే): వాల్డ్‌నర్ కప్ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ (టీటీ) ఇన్విటేషనల్ టోర్నమెంట్‌లో టీమ్ ఆసియా జట్టు విజేతగా నిలిచింది. టీమ్ వరల్డ్ జట్టుతో జరిగిన ఈ మ్యాచ్‌లో టీమ్ ఆసియా జట్టు 14–0తో విజయం సాధించింది. భారత నంబర్‌వన్ మనిక బత్రా, దిగ్గజం మా లాంగ్ (చైనా), ఒలింపిక్ స్వర్ణ పతక విజేత చెన్ మెంగ్ (చైనా), షిన్ యుబిన్ (దక్షిణ కొరియా), కిరిల్ జెరాసిమెంకో (కజకిస్తాన్) టీమ్ ఆసియా జట్టులో సభ్యులుగా ఉన్నారు. టీమ్ వరల్డ్‌లో ట్రుల్స్ మొరెగార్డ్ (స్వీడన్), హుగో కాల్డెరానో (బ్రెజిల్), అడ్రియానా డియాజ్ (ప్యూర్టోరికో), బెర్నాడెట్ జోక్స్ (రొమేనియా) సభ్యులుగా ఉన్నారు. టేబుల్ టెన్నిస్‌కు ప్రపంచ వ్యాప్తంగా మరింత ప్రాచుర్యం లభించేందుకు స్వీడన్ దిగ్గజం జాన్ ఓవ్ వాల్డ్‌నర్ తన పేరిట ఈ ఇన్విటేషనల్ టోర్నీని ప్రతి యేటా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు.


సహచరులతో మనిక బత్రా

'ప్లే ఆఫ్స్'కు దబంగ్ ఢిల్లీ

పుణే: ప్రో కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించిన రెండో జట్టుగా దబంగ్ ఢిల్లీ జట్టు నిలిచింది. బెంగాల్ వారియర్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు 47–25 పాయింట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ గెలుపుతో దబంగ్ ఢిల్లీకి ప్లే ఆఫ్స్ బెర్త్ అధికారికంగా ఖరారైంది. ఇప్పటికే హరియాణా స్టీలర్స్ జట్టు ప్లే ఆఫ్స్‌కు అర్హత పొందింది. 20 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న ఢిల్లీ జట్టు 11 మ్యాచ్‌ల్లో గెలిచింది. 5 మ్యాచ్‌ల్లో ఓడిపోయి, 4 మ్యాచ్‌లను 'టై' చేసుకొని 71 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకింది. మొత్తం 12 జట్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో లీగ్ దశ ముగిశాక టాప్–6లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరుకుంటాయి. మరో నాలుగు ప్లే ఆఫ్స్ బెర్త్‌లు ఖరారు కావాల్సి ఉంది. బెంగాల్‌తో జరిగిన పోరులో ఢిల్లీ తరఫున అశు మలిక్ ఏకంగా 17 పాయింట్లతో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. అతను 18 సార్లు రెయిడింగ్‌కు వెళ్లాడు. ఇందులో తొమ్మిదిసార్లు పాయింట్లతో తిరిగి వచ్చాడు. ఆరుసార్లు పాయింట్ నెగ్గకుండానే తిరిగి వచ్చాడు. మూడుసార్లు విఫలమయ్యాడు. నాలుగు బోనస్ పాయింట్లతోపాటు 12 టచ్ పాయింట్లు సాధించిన అశు ఒక ట్యాకిల్ పాయింట్ కూడా నెగ్గాడు. ఢిల్లీకే చెందిన యోగేశ్ 9 పాయింట్లు, ఆశిష్ 5 పాయింట్లు స్కోరు చేశారు. బెంగాల్ తరఫున విశ్వాస్ అత్యధికంగా ఎనిమిది పాయింట్లు సాధించాడు. నితేశ్ కుమార్ ఐదు పాయింట్లు, కెప్టెన్ ఫజల్ అత్రాచలి నాలుగు పాయింట్లు స్కోరు చేశారు. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 37–32 పాయింట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ పుణేరి పల్టన్ జట్టును ఓడించింది. ఈ గెలుపుతో పట్నా పైరేట్స్ 68 పాయింట్లతో మూడో స్థానానికి చేరుకొని ప్లే ఆఫ్స్‌కు చేరువైంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యూపీ యోధాస్‌తో హరియాణా స్టీలర్స్ (రాత్రి 8 గంటలకు), బెంగళూరు బుల్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ (రాత్రి 9 గంటలకు) తలపడతాయి.


బెంగాల్ వారియర్స్ రెయిడర్‌ను చుట్టుముట్టిన దబంగ్ ఢిల్లీ డిఫెండర్లు



సహజ శుభారంభం

నవీ ముంబై: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల డబ్ల్యూ50 టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి శుభారంభం చేసింది. సోమవారం జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ సహజ 6–1, 6–2తో భారత్‌కే చెందిన జీల్ దేశాయ్‌పై విజయం సాధించింది. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ రెండు ఏస్‌లు సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేసింది. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయిన సహజ ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది.

హుమేరాకు నిరాశ

మరోవైపు తెలంగాణకే చెందిన హుమేరా బహార్మస్, స్మృతి భాసిన్‌లతోపాటు భారత క్రీడాకారిణిలు లక్ష్మి గౌడ, సోహా సాదిక్, అదితి రావత్, పూజా ఇంగాలె మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయారు. క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో హుమేరా 1–6, 1–6తో హానోకా కొబయాషి (జపాన్) చేతిలో, స్మృతి భాసిన్ 0–6, 1–6తో పునిన్ కొవాప్టుటెడ్ (థాయ్‌లాండ్) చేతిలో, లక్ష్మి గౌడ 1–6, 1–6తో జుజానా పొలోస్కోవా (పోలాండ్) చేతిలో, సోహా సాదిక్ 5–7, 7–5, 5–7తో మటోస్ సెక్వైరా (బ్రిటన్) చేతిలో, అదితి 2–6, 7–6 (10/8), 3–6తో కనోకో మొరిసాకి (జపాన్) చేతిలో, పూజా ఇంగాలె 4–6, 5–7తో అరీనా అరిఫులినా (రష్యా) చేతిలో ఓడిపోయారు.

బంగ్లాదేశ్ గెలుపు

కింగ్స్‌టౌన్: వెస్టిండీస్‌తో మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో బంగ్లాదేశ్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 7 పరుగుల స్వల్ప తేడాతో విండీస్‌ను ఓడించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. సౌమ్య సర్కార్ (43; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), షమీమ్ హుస్సేన్ (27; 1 ఫోర్, 3 సిక్స్‌లు), జాకీర్ అలీ (27; 1 ఫోర్, 2 సిక్స్‌లు), మెహదీ హసన్ (26 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం ఛేదనలో విండీస్ 19.5 ఓవర్లలో 140 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ రావ్‌మన్ పావెల్ (35 బంతుల్లో 60; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధ సెంచరీ చేసినా... మిగతా వారంతా విఫలమయ్యారు. చివరి ఓవర్లో విండీస్ విజయానికి 10 పరుగులు అవసరమయ్యాయి. తొలి 4 బంతుల్లో 2 పరుగులే రాగా, మూడో బంతికి పావెల్ అవుట్ కావడం జట్టును దెబ్బ తీసింది. ఐదో బంతికి జోసెఫ్‌ను బౌల్డ్ చేసి హసన్ జట్టును గెలిపించాడు.

ఇంగ్లండ్ లక్ష్యం 658

ప్రస్తుతం 18/2 ● విలియమ్సన్ భారీ సెంచరీ ● రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 453 ఆలౌట్

హామిల్టన్: న్యూజిలాండ్‌తో చివరిదైన మూడో టెస్టులో ఇంగ్లండ్ భారీ పరాజయం దిశగా సాగుతోంది. ఆతిథ్య జట్టు నిర్దేశించిన 658 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్.. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 6 ఓవర్లు ఆడి 18 పరుగులు చేసి 2 వికెట్లు కోల్పోయింది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలవాలంటే మరో 640 పరుగులు సాధించాలి. ఓపెనర్లు జాక్ క్రాలీ (17 బంతుల్లో 5; 1 ఫోర్), బెన్ డకెట్ (4 బంతుల్లో 4; 1 ఫోర్) పెవిలియన్ చేరుకోగా... బెథెల్ (9 బ్యాటింగ్), జో రూట్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 136/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్ జట్టు 101.4 ఓవర్లలో 453 పరుగులకు ఆలౌటై ఓవరాల్‌గా 657 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. స్టార్ బ్యాటర్ కేన్ విలియమ్సన్ (204 బంతుల్లో 156; 20 ఫోర్లు, 1 సిక్స్) టెస్టుల్లో 33వ సెంచరీ నమోదు చేశాడు. రచిన్ రవీంద్ర (90 బంతుల్లో 44; 4 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి విలియమ్సన్ నాలుగో వికెట్‌కు 107 పరుగులు... డరైల్ మిచెల్ (84 బంతుల్లో 60; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో కలిసి ఐదో వికెట్‌కు 92 పరుగులు జోడించాడు. విలియమ్సన్ అవుటయ్యాక టామ్ బ్లండెల్ (55 బంతుల్లో 44; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), సాంట్నర్ (38 బంతుల్లో 49; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) దూకుడుగా ఆడటంతో న్యూజిలాండ్ స్కోరు 450 పరుగులు దాటింది. ఇంగ్లండ్ బౌలర్లలో బెథెల్ 3 వికెట్లు తీయగా... బెన్ స్టోక్స్, షోయబ్ బషీర్ 2 వికెట్ల చొప్పున పడగొట్టారు. పాట్స్, అట్కిన్‌సన్, రూట్‌లకు ఒక్కో వికెట్ దక్కింది.

5 ఒకే మైదానంలో టెస్టుల్లో వరుసగా ఐదు సెంచరీలు చేసిన తొలి క్రికెటర్‌గా విలియమ్సన్ గుర్తింపు పొందాడు. హామిల్టన్‌లోని సెడెన్ పార్క్ మైదానంలో విలియమ్సన్ గత ఐదు టెస్టుల్లో వరుసగా 200 నాటౌట్ (2019లో బంగ్లాదేశ్‌పై), 104 నాటౌట్ (2019లో ఇంగ్లండ్‌పై), 251 (2020లో వెస్టిండీస్‌పై), 133 నాటౌట్ (2024లో దక్షిణాఫ్రికాపై), 156 (2024లో ఇంగ్లండ్‌పై) పరుగులు సాధించాడు.


విలియమ్సన్



డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్నారా...

ఏఐ కెమెరా పట్టేస్తుంది!

మద్యం సేవించి వాహనం నడుపుతున్నారా? 'రోడ్డు మీద పోలీసుల్లేరు కదా, మనం సేఫ్'అనుకోవడానికి ఇకపై వీల్లేదు. ఎందుకంటే తాగి, లేదా డ్రగ్స్ తీసుకుని వాహనం నడిపే వారిని కదలికలను బట్టి పసిగట్టే కృత్రిమ మేధతో కూడిన కెమెరా వచ్చేసింది. ఇకపై పోలీసులు ప్రతి వాహనాన్నీ ఆపి డ్రైవర్‌ను చెక్ చేయాల్సిన పని లేదు. ఈ ఏఐ కెమెరాలు డ్రైవర్ స్థితి ఏమిటన్నది గుర్తించి పోలీసులకు సమాచారమిస్తాయి. వాళ్లు వెంటనే వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను చెక్ చేస్తారు. తాగి నడిపేవారిని పట్టుకోవడానికి ఏఐ సాయంతో తయారు చేసిన ప్రపంచంలోనే తొలి కెమెరా ఇది. అత్యాధునిక హెడ్సప్ పరికరంతో తయారు చేసిన ఈ కెమెరాలను బ్రిటన్ పోలీసులు ప్రయోగాత్మకంగా వాడి చూస్తున్నారు. ఈ కెమెరాలు డ్రైవర్లకు కనిపించవు. వీటిని అక్యూసెన్సస్ అనే సంస్థ తయారు చేసింది. వాహనాలు నడుపుతూ మొబైల్ ఫోన్లు వాడే, సీటు బెల్టు పెట్టుకోని డ్రైవర్లను పట్టుకోవడానికి గతంలో పోలీసులు ఈ సంస్థ కెమెరాలను వాడారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదానికి ఆస్కారం ఆరు రెట్లు ఎక్కువ. అలాంటివారిని ముందే గుర్తించగలిగితే అనేక ప్రాణాలు కాపాడొచ్చనేది అక్యూసెన్సస్ మోటో. కానీ పోలీసులు అంతటా కాపలా కాయలేరు. ''కనుక ఇలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం తప్పనిసరి. ప్రమాదాలను తగ్గించడానికి చేపడుతున్న చర్యల్లో ఇదో భాగం ''అంటున్నారు బ్రిటన్ పోలీసులు.

- సాక్షి, నేషనల్ డెస్క్

గాజాలో మరణాలు 45 వేలు

పాలస్తీనా ఆరోగ్య విభాగం వెల్లడి • అల్ జజీరా జర్నలిస్ట్ సహా తాజాగా 52 మంది మృతి

డెయిర్ అల్–బలాహ్: గాజాలో ఇజ్రాయెల్ ఆర్మీ–హమాస్ సాయుధ శ్రేణుల మధ్య 14 నెలలుగా సాగుతున్న పోరులో మృతి చెందిన పాలస్తీనియన్ల సంఖ్య 45 వేలకు చేరుకుంది. గత 24 గంటల్లో ఇజ్రాయెల్ దాడుల్లో అల్ జజీరా జర్నలిస్ట్ సహా 52 మంది ప్రాణాలు కోల్పోయినట్లు పాలస్తీనా అధికారులు తెలిపారు. మృతుల్లో మహిళలు, చిన్నారులు సగానికి పైగానే ఉంటారన్నారు. వీరిలో హమాస్ సాయుధులు, సాధారణ పౌరుల సంఖ్యను స్పష్టంగా చెప్పలేమని కూడా పేర్కొన్నారు. ఇప్పటి వరకు 17 వేల మంది మిలిటెంట్లను చంపినట్లు చెప్పుకుంటున్న ఇజ్రాయెల్ మిలటరీ ఇందుకు తగ్గ ఆధారాలను మాత్రం చూపడం లేదు. హమాస్, ఇజ్రాయెల్ ఆర్మీ మధ్య జరిగిన పోరులో 45,028 మంది అసువులు బాయగా 1,06,962 మంది క్షతగాత్రులుగా మిగిలారని సోమవారం పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలిపింది. సహాయక సిబ్బంది సైతం చేరుకోలేని స్థితిలో ఇప్పటికీ వందలాదిగా మృతదేహాలు శిథిలాల కిందే ఉన్నాయని, వీటిని కూడా పరిగణనలోకి తీసుకుంటే మరణాలు మరింతగా పెరిగే అవకాశముందని చెప్పింది. యుద్ధానికి ముందు గాజాలో 23 లక్షల మంది పాలస్తీనియన్లలో కనీసం 2 శాతం మంది చనిపోయి ఉంటారని అంచనా వేసింది. అయితే, మిలిటెంట్లే లక్ష్యంగా తాము దాడులు చేపడుతున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ అంటోంది. జనావాసాల మధ్యనే మిలిటెంట్ల స్థావరాలు ఉండటం వల్లే సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారని చెబుతోంది.

మృతుల్లో అల్ జజీరా టీవీ జర్నలిస్ట్

ఖాన్‌యూనిస్ నగరంలోని ఓ నివాసంపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిగిన దాడిలో నలుగురు చనిపోయారని నాసర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీరిలో ఒకరు గాజాకు చెందిన అల్ జజీరా టీవీ ప్రతినిధి అహ్మద్ బకెర్ అల్–లౌహ్(39)కాగా, ముగ్గురు పౌర రక్షణ సిబ్బందివీరిలో ఒకరు అని తెలిపాయి. అంతకుముందు జరిగిన బాంబు దాడిలో గాయపడిన కుటుంబాన్ని రక్షించేందుకు ప్రయత్నిస్తుండగా జరిగిన దాడిలో బకెర్ ప్రాణాలు కోల్పోయారని అల్ జజీరా తెలిపింది. అదేవిధంగా, గాజా నగరంలోని షిజైయా ప్రాంతంలోని ఓ నివాసం భవనంపై ఇజ్రాయెల్ ఆర్మీ జరిపిన దాడిలో ఒకే కుటుంబంలోని నలుగురు సహా 10 మంది మృతి చెందారు. ఖాన్ యూనిస్ నగరంలో శరణార్థులు తలదాచుకుంటున్న పాఠశాల భవనంపై జరిగిన మరో దాడిలో ఆరుగురు చిన్నారులు, ఇద్దరు మహిళలు సహా 13 మంది చనిపోయారని నాసర్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఫర్ జర్నలిస్ట్స్ వెల్లడించిన వివరాల ప్రకారం ..ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులు 105 మంది కాగా, వీరి సగం మంది గాజాలోనే ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇజ్రాయెల్ భూభాగంపై మెరుపు దాడి చేసి వందల సంఖ్యలో పౌరులను హమాస్ శ్రేణులు అపహరించుకుపోవడంతో 2023 అక్టోబర్ 7న యుద్ధం మొదలవడం తెలిసిందే. ఈ పోరులో 55 మంది పాలస్తీనా మీడియా సిబ్బంది సహా మొత్తం 138 మంది చనిపోయినట్లు ఈ సంస్థ పేర్కొంది. అయితే, జర్నలిస్టుల ముసుగులో హమాస్ శ్రేణులు కార్యకలాపాలు సాగిస్తున్నాయని ఇజ్రాయెల్ ఆర్మీ వాదిస్తోంది.



వాషింగ్టన్‌లో జరిగిన కార్యక్రమంలో బైడెన్ దంపతులు, ఉపాధ్యక్షురాలు కమల అభివాదం

దాతలకు బైడెన్, హారిస్ కృతజ్ఞతలు

వాషింగ్టన్: ఎన్నికల ఓటమి తర్వాత అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, ఉపాధ్యక్షురాలు హారిస్ తొలిసారిగా ఒకే చోట కలిసి కనిపించారు. డెమొక్రటిక్ నేషనల్ కమిటీ ఆదివారం నిర్వహించిన హాలిడే పార్టీలో వారిద్దరూ వేదికను పంచుకున్నారు. అధ్యక్ష ఎన్నికల ప్రచార నిమిత్తం 200 కోట్ల డాలర్లకు పైగా విరాళాలిచ్చిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ''డెమొక్రాట్లు విలువల కోసం పోరాటం సాగించాలి. మన స్ఫూర్తి ఓడలేదు. మనం ఓడిపోలేదు. బలంగా ఉన్నాం. దేనికోసం పోరాడుతున్నామో మనకు స్పష్టత ఉంది''అని అతిథులతో బైడెన్, హారిస్ అన్నారు. ''కింద పడితే కచ్చితంగా లేవాల్సిందే.. ఎంత వేగంగా లేస్తారనేదే వ్యక్తికైనా, పార్టీకైనా కొలమానమని మా నాన్న చెప్పేవారు''అని బైడెన్ అన్నారు. నవంబర్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి పోటీ ఇచ్చారని భావించిన హారిస్ చివరికి ఆయన చేతిలో భారీ తేడాతో ఓడటం తెలిసిందే.

హారిస్ భవితవ్యం ఏమిటి?

హారిస్ తన సొంత రాష్ట్రమైన కాలిఫోర్నియా గవర్నర్ పదవికి పోటీ చేయాలని కొందరు డెమొక్రాట్లు కోరుతున్నారు. ఆమె మాత్రం తన భవిష్యత్‌పై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. బైడెన్ జనవరి 20న అధ్యక్ష పదవి నుంచి వైదొలగనుండటం తెలిసిందే. అయినా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉంటూ అమెరికా సమాజంలో నెలకొన్న లోతైన విభేదాలను చక్కదిద్దేందుకు కృషి చేయాలనుకుంటున్నట్లు ఆయన సరదా వ్యాఖ్యలు చేశారు. ''మీకందరికీ బ్యాడ్ న్యూస్ ఏమిటంటే నేనెక్కడికీ వెళ్లడం లేదు. ఇక్కడే ఉండాలనుకుంటున్నా''అని నవ్వుతూ అన్నారు.

రేపు బీజింగ్‌లో భారత్, చైనా ప్రత్యేక ప్రతినిధుల భేటీ

బీజింగ్: సరిహద్దు అంశంపై చర్చించేందుకు భారత్, చైనాల ప్రత్యేక ప్రతినిధులు బుధవారం బీజింగ్ సమావేశమవనున్నారు. తూర్పు లద్దాఖ్‌లోని ఘర్షణాత్మక సరిహద్దు ప్రాంతాల నుంచి సేనలు వైదొలిగేందుకు అక్టోబర్ 21న చేసుకున్న ఒప్పందం నేపథ్యంలో ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించే విషయమై ఈ బృందాలు చర్చించనున్నాయి. 23వ దఫా చర్చలకు చైనా విదేశాంగ వ్యవహారాల సెంట్రల్ కమిషన్ డైరెక్టర్ వాంగ్ యీ, భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ల సారథ్యం వహిస్తారని చైనా విదేశాంగ శాఖ సోమవారం తెలిపింది. ఈ చర్చల్లో రెండు దేశాల సంబంధాలను సాధారణ స్థాయికి తీసుకొచ్చేందుకు మార్గం సుగమమవుతుందని భావిస్తున్నారు. భారత్– చైనాల మధ్య ఉన్న 3,488 కిలోమీటర్ల సరిహద్దు సమస్యను సమగ్రంగా పరిష్కరించే ఉద్దేశంతో 2003లో ఏర్పాటైన ఈ కమిటీ ఇప్పటి వరకు 22 సార్లు సమావేశమైంది. చివరి సారిగా 2019లో చర్చలు జరిపింది.

జార్జియాలోని రిసార్టులో 11 మంది భారతీయుల మృతి

టిబిలిసి: జార్జియాలో పర్వతశ్రేణుల్లో ఒక రిసార్టులో 11 మంది భారతీయులు మృతి చెందారని అక్కడి భారతీయ రాయబార కార్యాలయం సోమవారం వెల్లడించింది. మృతుల శరీరాలపై గాయాలేమీ లేవని, హింస జరిగిన ఆనవాళ్లు కూడా కన్పించలేదని జార్జియా విదేశాంగ శాఖ తెలిపింది. విషవాయువు కార్బన్ మోనాక్సైడ్ కారణంగా 12 మంది మరణించగా.. ఇందులో 11 మంది భారతీయులని తెలిపింది. పర్వత ప్రాంతమైన గడౌరీలో ఈ 11 మంది హవేలీ అనే భారతీయ రెస్టారెంట్‌లో పనిచేస్తున్నారని వివరించింది. మృతుల కుటుంబాలతో సంప్రదింపులు జరుపుతున్నామని, మృతదేహాలను భారత్‌కు పంపేందుకు ప్రయత్నిస్తున్నామని భారత రాయబార కార్యాలయం తెలిపింది. అవసరమైన సహాయసహకారాలను అందిస్తున్నామని పేర్కొంది. మృతికి కారణాలను తెలుసుకునేందుకు జార్జియా ప్రభుత్వం ఒక ఫోరెన్సిక్ విభాగాన్ని ఏర్పాటు చేసింది.

పారిపోవాలని అనుకోలేదు.. రష్యన్లు తరలించారు: అసద్

దమాస్కస్: తాను సిరియాను వదిలి పారిపోవాలనుకోలేదని, తిరుగుబాటుదారులతో పోరాడాలనే నిశ్చయించుకున్నానని.. అయితే డ్రోన్ల దాడుల నుంచి తప్పించడాని కోసం రష్యన్లు తనను వారి దేశానికి తరలించారని పదవీచ్యుతుడైన సిరియా నేత బషర్ అసద్ వెల్లడించారు. సిరియాను వీడిన తర్వాత తొలిసారిగా సోమవారం ఆయన మీడియాకు ఫేస్‌బుక్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. శరణు కోరాలని తాను అసలు అనుకోలేదని, డ్రోన్ల ముమ్మరదాడి నేపథ్యంలో.. రష్యాకు తనను ఆ దేశం తరలించిందని చెప్పారు. ప్రభుత్వం పడిపోయిన డిసెంబరు 8న అప్పటికప్పుడు చోటుచేసుకున్న పరిణామాలు తనను రష్యాకు వెళ్లేలా చేశాయన్నారు. 'సిరియాను వీడి వెళ్లాలని ముందుగా అనుకోలేదు. 8న సాయంత్రం రష్యాకు వచ్చేయాల్సిందిగా ఆ దేశం కోరిందని వివరించారు. తిరుగుబాటుదారులు డమాస్కస్‌లోకి చొరబడ్డాక దేశం వీడి వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నానని అసద్ తెలిపారు. తనను రష్యాలోని లటాకియాకు తరలించారని వెల్లడించారు. ఏ దశలోనూ తాను పారిపోవాలని అనుకోలేదని, రష్యా వినతితో ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించారు.

ఆలయం బావిలో విగ్రహాలు

- 46 ఏళ్లకు తెరుచుకున్న సంభాల్‌లోని భస్మ శంకర్ ఆలయం
- అక్కడే ఉన్న బావిలో యంత్రాంగం తవ్వకాలు

సంభాల్: ఉత్తరప్రదేశ్‌లో సంభాల్‌లో దాదాపు 46 ఏళ్ల తర్వాత గత వారం తెరుచుకున్న ఆలయం సమీపంలోని బావిలో దెబ్బతిన్న మూడు దేవతా విగ్రహాలు లభించాయి. నవంబర్‌లో షాహి జామా మసీదులో కోర్టు ఆదేశాల మేరకు సర్వేకు ప్రయత్నిస్తుండగా హింస చెలరేగి నలుగురు ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. ఆ ప్రాంతానికి కిలోమీటర్ దూరంలోని ఖగ్గూ సరాయ్‌లోనే శ్రీ కార్తీక్ మహదేవ్(భస్మా శంకర్)ఆలయం ఉంది. అధికారులు ఆక్రమణలను తొలగిస్తున్న సమయంలో అక్కడే 1978 నుంచి మూతబడి ఉన్న ఆలయం విషయం బయటపడింది. ఆలయంలో హనుమాన్ విగ్రహం, శివలింగం ఉండగా, పక్కనే ఉన్న బావి శిథిలావస్థకు చేరుకుంది. ఈ బావిలో సోమవారం అధికారులు పూడిక తీత మొదలుపెట్టారు. సుమారు 15 అడుగుల లోతులో దెబ్బతిన్న స్థితిలో ఉన్న పార్వతి, గణేశ్, లక్ష్మీ దేవతా విగ్రహాలు లభించాయని అధికారులు చెప్పారు. ఆలయం ప్రాచీనతను కాపాడే లక్ష్యంతో పనులు చేపట్టామని చెప్పారు. ఈ విగ్రహాలను ఎవరు, ఎందుకు ధ్వంసం చేసి ఉంటారనే విషయంపై వివరాలను సేకరిస్తున్నామని అక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తున్న సంభాల్ జిల్లా మేజిస్ట్రేట్ రాజేందర్ పెన్సియా చెప్పారు. ఆలయం చుట్టూ ఆక్రమణల తొలగింపు కూడా జరుగుతోందన్నారు. కార్బన్ డేటింగ్ పరీక్షతో ఆలయంతోపాటు బావి ప్రాచీనతను నిర్ధారించాలని కోరుతూ పురావస్తు శాఖకు లేఖ రాసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆలయం వద్దకు పెద్ద సంఖ్యలో జనం వచ్చి పూజలు చేస్తున్నారు. అధికారులు అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



అతి పెద్ద ఐస్‌బర్గ్...

మళ్లీ కదిలింది!

ఏ23ఏ ఐస్‌బర్గ్ అంతిమయాత్ర?
- వెచ్చని సముద్రజలాల వైపు పయనం
- త్వరలో పూర్తిగా కరిగి కనుమరుగు

ఏ23ఏ. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఐస్‌బర్గ్. తాజా కొలతల ప్రకారం దాని విస్తీర్ణం 3,672 చదరపు కిలోమీటర్లు! చూపు తిప్పుకోనివ్వని ఆర్చిలు, అందమైన గుహలతో పర్యాటకులకు ఎంతగానో ఆకర్షిస్తూ ఉంటుంది. ఇది 1986లో ఫిల్క్నర్ రోన్ మంచుఫలకం నుంచి విడివడింది. కొన్నాళ్లపాటు కాస్త దూరం కదిలాక అంటార్కిటికాలోని వెడెల్ సముద్ర ఉపరితలంపై సెటిలైపోయింది. 30 ఏళ్లపాటు అక్కడే స్తబ్ధుగా ఉండిపోయింది. అందులోని అందమైన గుహలను, దాని పొడవునా ఏర్పడే రకరకాల ఆకృతుల మంచు ఆర్చిలను చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచీ ఏటా పర్యాటకులు పోటెత్తుతుంటారు. అలాంటి ఏ23ఏ 2020లో స్వల్పంగా కరిగిపోవడంతో మళ్లీ కదలడం మొదలు పెట్టింది. అంటార్కిటికాలోని టైలర్ కాలమ్‌లో ఉపరితలానికి తాకడంతో కొద్ది నెలలుగా అక్కడే నిలిచిపోయింది. మంచు కరుగుతుండటంతో కొద్ది రోజులుగా అది మళ్లీ కదలడం మొదలుపెట్టినట్టు బ్రిటిష్ అంటార్కిటిక్ సర్వే (బీఏఎస్) బృందం వెల్లడించింది. ''ఏ23ఏ ఐస్‌బర్గ్ సముద్ర ప్రవాహాల తాకిడికి క్రమంగా వెచ్చని జలాలవైపు సాగుతోంది. సౌత్ జార్జియాలోని మారుమూల దీవుల గుండా వెళ్తూ క్రమక్రమంగా కరిగి కొన్నాళ్లలో పూర్తిగా కనుమరుగవుతుంది''అని ప్రకటించింది. దాంతో సైంటిస్టులందరి దృష్టీ దానిమీదే కేంద్రీకృతమైందిప్పుడు. ఏ23ఏను సైంటిస్టులు 1986లో తొలిసారిగా గమనించారు. అప్పట్లో అది 3,900 చ.కి.మీ. పై చిలుకు విస్తీర్ణంతో ఉండేది. నాటినుంచీ చాలాకాలం పాటు ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఐస్‌బర్గ్‌గా నిలుస్తూ వచ్చింది. మధ్యలో దానికంటే పెద్ద పరిమాణంలో ఏ68 (2017లో), ఏ76 (2021లో) వంటివి పుట్టుకొచ్చినా అవన్నీ చూస్తుండగానే కరిగి చిన్నవైపోయాయి. ఏ23ఏ దర్జా మాత్రం అలాగే కొనసాగుతూ వచ్చింది. తాజా కదలికల పుణ్యమా అని అది ఇక మూణ్నాళ్ల ముచ్చటేనంటున్నారు సైంటిస్టులు. అయితే అది కరగడం వల్ల సముద్రమట్టం పెరగడం వంటి ముప్పు ఉండకపోవచ్చని వాళ్లు చెబుతున్నారు. ఏ23ఏ కరుగుదలకు గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులే కారణమని వాపోతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నీటి కాలుష్యమే పొట్టన పెట్టుకుంది...

వీడిన 350 ఏనుగుల మృతి మిస్టరీ

బోట్స్‌వానాలో 2020లో ఏనుగుల మూకుమ్మడి మరణం సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఒకేసారి ఏకంగా 350 ఏనుగులు అనుమానాస్పద స్థితిలో మరణించడంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ ఉదంతంపై లండన్‌లోని కింగ్స్ కాలేజీ పరిశోధనలు జరిపింది. ఆ ఏనుగుల మరణాల వెనుక మిస్టరీ నాలుగేళ్లకు వీడింది. అడవిలోని నీటి గుంతలు కలుషితమవడమే ఏనుగుల మృతికి కారణమని అధ్యయన బృందం తెలిపింది. ''సైనో బ్యాక్టీరియా విడుదల చేసిన సైనో టాక్సిన్లు నీటిపై విషపూరిత నురగకు కారణమయ్యాయి. అదే ఏనుగుల మరణానికి దారి తీసింది'' అని వెల్లడించింది.

వర్షాధారిత గుంతల వల్లే.

ఒకవాంగో డెల్టాలోని 6 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో 20 నీటి గుంతలు కలుషితమైనట్టు అధ్యయనంలో తేలింది. ఆ నీటిని తాగాక 88 గంటల్లోనే ఏనుగులు చనిపోయినట్టు అంచనా వేసింది. అవి శాశ్వత నీటి వనరులు కావు. కేవలం వర్షాధారిత గుంతలు. వాటివల్లే ప్రమాదం జరిగిందని అధ్యయన సారథి శాస్త్రవేత్త డేవిడే లోమియో చెప్పారు. చనిపోయిన ఏనుగులు వేర్వేరు వయసులవి. పైగా వాటి దంతాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. కనుక వాటిని వేటాడారన్న వాదన సరికాదు'' అని తెలిపారు.

ఆల్గే పెరుగుదలకు కారణం?

సైనో బాక్టీరియాగా పిలిచే నీలం–ఆకుపచ్చ ఆల్గేలో అన్నిరకాలూ విషపూరితం కావు. కొన్నిరకాల సైనోబాక్టీరియా నిలకడగా ఉన్న నీటిలో ఒక రకమైన ప్రాణాంతక ఆల్గల్ బ్లూమ్స్ (హెచ్ఏబీ)ను ఉత్పత్తి చేస్తుంది. బోట్స్‌వానాలో 2019లో అస్సలు వానల్లేవు. 2020లోనేమో విపరీతంగా వానలు పడ్డాయి. ''అధిక వర్షపాతంతో భూమి నుంచి భారీ అవక్షేపాలతో పాటు పోషకాల పునరుత్పత్తి విపరీతంగా జరిగింది. అదే ఆల్గల్ పెరుగుదలకు కారణమైంది'' అని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల భవిష్యత్తులో ఇలాంటివి తరచూ జరగవచ్చని హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పుల వల్ల అతివృష్టి, అనావృష్టితో ఆఫ్రికా దక్షిణ భాగం వైరుధ్య వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటోందని వారంటున్నారు. ''ఇదే నీటిపై ప్రభావం చూపుతోంది. దాంతో జంతువులు విపత్కర పరిణామాలను ఎదుర్కొంటున్నాయి'' అని తెలిపారు. అడవులు, పార్కుల్లోని నీటి వనరుల నాణ్యతను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం చాలా అవసరమన్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



విశ్వాస పరీక్షలో షోల్జ్ ఓటమి

ఫిబ్రవరిలో జర్మనీ పార్లమెంట్ ఎన్నికలు

బెర్లిన్: జర్మనీ చాన్సెలర్ ఒలాఫ్ షోల్జ్ సోమవారం పార్లమెంట్‌లో విశ్వాస పరీక్షలో ఓటమి పాలయ్యారు. యూరప్‌లోనే అత్యధిక జనాభా, అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన జర్మనీలో ఫిబ్రవరిలోనే ముందస్తు ఎన్నికలకు ఈ పరిణామం దారి తీయనుంది. మూడు పార్టీల సంకీర్ణ ప్రభుత్వం నవంబర్ 6న కుప్పకూలింది. రాజ్యాంగం ప్రకారం సభలో విశ్వాస పరీక్ష చేపట్టాల్సి ఉంటుంది. మొత్తం 733 మంది సభ్యులుండే దిగువ సభ బుండెస్టాగ్‌లో సోమవారం షోల్జ్‌కు అనుకూలంగా 207 మంది ఓటేశారు. దీంతో, ఆయన సభ విశ్వాసం పొందలేకపోయినట్లు ప్రకటించారు. విశ్వాసంలో గెలవాలంటే మరో 367 ఓట్లు అవసరముంది. ఫిబ్రవరి 23వ తేదీన ఎన్నికలు జరపాలని ప్రధాన పార్టీలన్నీ ఇప్పటికే ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఉక్రెయిన్‌కు ఆయుధ, ఆర్థిక సాయమందించేందుకు సిద్ధమని ప్రకటిస్తున్న షోల్జ్ 'సోషల్ డెమోక్రాట్'పార్టీకి వచ్చే ఎన్నికల్లో విజయావకాశాలు తక్కువని విశ్లేషకులు అంటున్నారు. ప్రధాన ప్రతిపక్షం యూనియన్ బ్లాక్ ముందంజలో ఉందంటున్నారు.

ఆ అవార్డు గ్రహీతగా టీఎం కృష్ణ చెప్పకోరాదు: సుప్రీం

న్యూఢిల్లీ: దిగ్గజ కళాకారిణి ఎంఎస్ సుబ్బులక్ష్మి అవార్డు గ్రహీతగా ప్రకటించుకోరాదని కర్ణాటక సంగీత గాయకుడు టీఎం కృష్ణను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఎస్ సుబ్బులక్ష్మిని గతంలో టీఎం కృష్ణ తీవ్ర పదజాలంతో అవమానించి అప్రతిష్ట పాల్జేశారంటూ ఆమె మనవడు వి.శ్రీనివాసన్ వేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. టీఎం కృష్ణ ఇప్పటికే ఈ అవార్డును స్వీకరించిన విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ఈ మేరకు తీర్పు వెలువరించినట్లు తెలిపింది. ఈ విషయమై నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని మద్రాస్ మ్యూజిక్ అకాడెమీ, ది హిందూ గ్రూప్‌లను ఆదేశించింది. మద్రాస్ మ్యూజిక్ అకాడెమీ ఏటా ఎంఎస్ సుబ్బులక్ష్మి అవార్డును అందజేస్తుంటుంది.

కారు, ట్రక్కు ఢీ: ఏడుగురు మృతి

బలోద్(ఛత్తీస్‌గఢ్): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బలోడ్ జిల్లాలో చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు చనిపోగా, ఆరుగురు గాయపడ్డారు. దౌండి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి ఘటన జరిగింది. జిల్లాలోని గుండెర్‌దెహి ప్రాంతానికి చెందిన బాధితులంతా ఓ వేడుకకు హాజరై తిరిగి వస్తున్నారు. వీరి వాహనం ముందున్న ట్రక్కును వేగంగా ఢీకొట్టింది. ఆ తీవ్రతకు అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అనంతరం ఆస్పత్రిలో మరొకరు తుదిశ్వాస విడిచారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక చిన్నారి ఉన్నారు. క్షతగాత్రులను రాజ్‌నంద్‌గావ్ జిల్లా ఆస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

ఇళయరాజాకు చేదు అనుభవం

శ్రీవిల్లిపుత్తూరు గర్భాలయంలోకి ప్రవేశాన్ని అడ్డుకున్న పూజారులు

చెన్నై: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజాకు చేదు అనుభవం ఎదురైంది. తమిళనాడులో విరుదునగర్ జిల్లాలోని శ్రీవిల్లిపుత్తూరు ఆండాళ్ ఆలయ గర్భగుడిలోకి ఆయన ప్రవేశాన్ని పూజారులు అడ్డుకున్నారు. ఇళయరాజా తాను రచించిన 'దివ్య పాశురం' విడుదల సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆయన ఆలయానికి వెళ్లారు. శ్రీవిల్లిపుత్తూరులోని శ్రీ ఆండాళ్ జీయర్ మఠానికి చెందిన సదగోప రామానుజ అయ్యర్, సదగోప రామానుజ జీయర్ కలిసి ఆలయం లోనికి వెళ్లారు. 'దివ్య పాశురం' ప్రతిని మూలమూర్తి వద్ద ఉంచేందుకు గర్భగుళ్లోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దివ్య పాశురాన్ని లోనికి తీసుకెళ్లిన పూజారులు ఇళయరాజాను మాత్రం గర్భగుళ్లోకి అనుమతించలేదు. ప్రవేశ ద్వారం వద్ద ఆపి బయటికి వెళ్లాల్సిందిగా కోరారు.

ట్రంప్‌కు నెతన్యాహూ ఫోన్

బందీల విడుదల, సిరియాపై చర్చ

జెరుసలేం: అమెరికా కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఫోన్‌లో మాట్లాడారు. హమాస్‌పై యుద్ధంలో విజయం సాధించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. సిరియా పరిస్థితులపై తన వైఖరిని ట్రంప్‌తో పంచుకున్నారు. సంభాషణలోని కీలకాంశాలను వివరిస్తూ నెతన్యాహూ ఓ వీడియో ప్రకటన షేర్ చేశారు. ''శనివారం సాయంత్రం జరిగిన సంభాషణలో ఇరువురం పలు అంశాలపై చర్చించాం. సంభాషణ చాలా స్నేహపూర్వకంగా సాగింది. ఇజ్రాయెల్ విజయాన్ని పూర్తి చేయాల్సిన ఆవశ్యకత గురించి మాట్లాడుకున్నాం. బందీల విడుదలకు మేం చేస్తున్న ప్రయత్నాల గురించి సుదీర్ఘంగా చర్చించాం. బందీలతో పాటు మృతులను స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఇజ్రాయెల్ అహర్నిశలు కృషి చేస్తుంది'' అని చెప్పారు.

సిరియాతో ఘర్షణ ఇప్పట్లో లేదు

సిరియాలో అధ్యక్షుడు బషర్ అల్ అసద్ ప్రభుత్వాన్ని తిరుగుబాటు దళాలు కూలదోశాక అక్కడి పరిస్థితిని నెతన్యాహూ ప్రస్తావించారు. ''సిరియాతో ఘర్షణపై మా దేశానికి ఏ ఆసక్తి లేదు. పరిస్థితులను బట్టి స్పందిస్తాం'' అన్నారు. హెజ్‌బొల్లాకు సిరియా గుండా ఆయుధాల రవాణాకు అనుమతించడాన్ని ఖండించారు.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

సాక్షి ప్లస్
మంగళవారం । 17-12-2024

అధికార భాషా సంఘం ఏర్పాటైన సంవత్సరం?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. కట్టె మనది.. కలప మనది.. అడవి మనది... భూమి మనది! అనే నినాదంతో గోండులు, కోయలు, చెంచులను సంఘటితం చేసి పోరుబాటలో నడిపించింది ఎవరు?
   1) గాంగంటం దొర
   2) అల్లూరి సీతారామరాజు
   3) కొమరం భీమ్
   4) అగ్గిరాజు
2. వితంతు పునర్వివాహ సంఘాన్ని మద్రాసులో ఎప్పుడు ఏర్పాటు చేశారు?
   1) 1871 2) 1872
   3) 1873 4) 1874
3. మహారాష్ట్రులు, నిజాం మధ్య 1738లో జరిగిన యుద్ధం ఏది?
   1) బొబ్బిలి యుద్ధం
   2) ఔరంగాబాద్ యుద్ధం
   3) భోపాల్ యుద్ధం
   4) రెండో కర్ణాటక యుద్ధం
4. 1948 ఏప్రిల్‌లో ఏర్పాటైన లాయర్ల నిరసన సమితి అధ్యక్షుడు?
   1) వినాయకరావు విద్యాలంకార్
   2) జమలాపురం కేశవరావు
   3) వి.పి.మీనన్
   4) బొమ్మకంటి సత్యనారాయణ
5. స్వామి రామానందతీర్థ వ్యక్తిగత సత్యాగ్రహాన్ని ఎప్పుడు ప్రారంభించారు?
   1) 1941 2) 1940
   3) 1939 4) 1938
6. వందేమాతర ఉద్యమ కాలంలో జి.సుబ్రమణ్య అయ్యర్ సంపాదకత్వంలో వెలువడిన పత్రిక?
   1) దేశమాత 2) స్వదేశీ మిత్రన్
   3) ఆంధ్రపత్రిక 4) స్వరాజ్య
7. గోల్కొండ రాజ్యాన్ని మొగలు సామ్రాజ్యంలో ఔరంగజేబు ఎప్పుడు విలీనం చేశాడు?
   1) 1687 2) 1677
   3) 1697 4) 1667
8. 'యథాపూర్వస్థితి ఒడంబడిక' మీద నిజాం సంతకం చేసిన తర్వాత ఏ ప్రాంతం నుంచి భారత సైన్యాలు ఉపసంహరించుకున్నాయి?
   1) సికింద్రాబాద్ 2) బొల్లారం
   3) తిరుమలగిరి 4) పైవన్నీ
9. పోలీసు చర్య తర్వాత 1948లో నిజాం పాలన ముగిసింది. 'అఖిలాంధ్ర మహాసభ'ను 1949లో ఎవరు నెలకొల్పారు?
   1) అయ్యదేవర కాళేశ్వరరావు
   2) కట్టమంచి రామలింగారెడ్డి
   3) దేవులపల్లి రామానుజరావు
   4) బూర్గుల రామకృష్ణారావు
10. 'ముల్కీ' ఉద్యమం అంటే?
   1) ఆంగ్లేయులకు వ్యతిరేకత
   2) ఉర్దూ అభివృద్ధి
   3) ఉద్యోగాల్లో స్థానికులకే ప్రాధాన్యత
   4) రెవెన్యూ సంస్కరణలు
11. 'ఇండియన్ ముసల్మాన్స్' గ్రంథాన్ని రచించిన ఆంగ్లేయుడెవరు?
   1) హంటర్ 2) కర్జన్
   3) లిట్టన్ 4) రిప్పన్
12. 1911లో ఏర్పాటు చేసిన 'మన సంఘం' లక్ష్యం?
   1) దళితుల పిల్లల్లో విద్యావ్యాప్తి
   2) బాల్య వివాహాలను వ్యతిరేకించడం
   3) జోగిని, మురళి, బసివి వ్యవస్థల నిర్మూలన
   4) పైవన్నీ
13. అధికార భాషా సంఘం ఏర్పాటైన సంవత్సరం?
   1) 1965 జనవరి 27
   2) 1966 ఫిబ్రవరి 13
   3) 1966 మార్చి 27
   4) 1967 ఏప్రిల్ 25
14. 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఎవరి నివేదికను ఆమోదించింది?
   1) అశోక్ మెహతా కమిటీ
   2) రాకేష్ మోహన్ కమిటీ
   3) బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ
   4) స్వరణ్‌సింగ్ కమిటీ
15. శాతవాహనుల కాలంలో బుద్ధుడి జన్మకు సంకేతం?
   1) పద్మం 2) ధర్మచక్రం
   3) స్తూపం 4) బోధివృక్షం
16. ఏ ప్రాంతీయ సంఘాల ఆవిర్భావంతో 1885లో జాతీయ కాంగ్రెస్ ఏర్పాటైంది?
   1) మద్రాసు మహాజనసభ
   2) ఇండియన్ అసోసియేషన్
   3) బాంబే అసోసియేషన్
   4) పైవన్నీ
17. విద్వాన్ విశ్వం, తరిమెళ్ల నాగిరెడ్డి రాసిన ఏ గ్రంథం సామ్యవాద ప్రచారానికి తోడ్పడింది?
   1) నవ్య సాహిత్యమాల
   2) సాహిత్య దర్శనం
   3) ఆంధ్ర సాహిత్య విమర్శ
   4) సాహిత్యంలో దృక్పథాలు
18. 'కుమార సంభవం' రచయిత?
   1) కొక్కిలి
   2) పావులూరి మల్లన్న
   3) అయ్యన మహాదేవి
   4) నన్నెచోడుడు
19. కాకతీయుల కాలంలో తీర్థులంటే?
   1) సేనానులు 2) మంత్రులు
   3) సైనికులు 4) దూతలు
20. భారతదేశంలో మొదటిగా భూమిని దానం చేసిన రాజవంశం ఏది?
   1) కళింగులు 2) పల్లవులు
   3) శాతవాహనులు 4) శకులు
21. 1950 ఫిబ్రవరిలో విశాలాంధ్ర మహాసభ ప్రథమ సమావేశం ఎక్కడ జరిగింది?
   1) కడప 2) వరంగల్
   3) హైదరాబాద్ 4) గుంటూరు
22. మీర్ ఉస్మాన్ అలీఖాన్ ఆస్థానంలోని హిందూ దివాన్ పేరు?
   1) సర్ కిషన్ ప్రసాద్
   2) పింగళి వెంకట్రామిరెడ్డి
   3) సర్ భగవంత్ ప్రసాద్
   4) పండిత్ రామదాస్
23. 1938లో ఉస్మానియా యూనివర్సిటీలో హిందూ విద్యార్థులు ప్రారంభించిన రాజకీయ ఉద్యమం ఏ పేరుతో ప్రసిద్ధి చెందింది?
   1) జాయిన్ ఇండియా మూవ్‌మెంట్
   2) స్టేట్ కాంగ్రెస్ సత్యాగ్రహం
   3) వందేమాతర ఉద్యమం
   4) ముల్కీ ఉద్యమం
24. తెలంగాణ పరిరక్షణ దినాన్ని ఎప్పుడు పాటించారు?
   1) 1968 జూలై 10
   2) 1969 జూన్ 10
   3) 1966 ఆగస్టు 20
   4) 1969 సెప్టెంబర్ 13
25. అస్పృశ్యుల గురించి రాసిన మొదటి నవల 'మాలపల్లి....' 1921 వెలువడింది. దీని రచయిత ఎవరు?
   1) ఉన్నవ లక్ష్మీనారాయణ
   2) దాశరథి
   3) ఆదిరాజు వీరభద్రరావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
26. గ్రంథాలయ ఉద్యమ నాయకుడు?
   1) కొమర్రాజు లక్ష్మణరావు
   2) అయ్యంకి వెంకట రమణయ్య
   3) నారాయణరావు
   4) సురవరం ప్రతాపరెడ్డి
27. కింది వాటిలో సరైంది?
   1) బాదామి చాళుక్యులు మహారాష్ట్ర ప్రాంతాన్ని పాలించారు
   2) వేములవాడ చాళుక్యులు కరీంనగర్ ప్రాంతాన్ని పాలించారు
   3) ముదిగొండ చాళుక్యులు మధిర, మానుకోట, వరంగల్ ప్రాంతాల్ని పాలించారు
   4) పైవన్నీ
28. మీర్ ఖమ్రుద్దీన్ ఖాన్‌కు 'అసఫ్ జా' బిరుదును ప్రదానం చేసిన మొగల్ చక్రవర్తి?
   1) బహదూర్ షా
   2) ఔరంగజేబు
   3) మహమ్మద్ షా
   4) షాజహాన్
29. ఆనందభైరవి రాగాన్ని తొలుత ఉపయోగించిన వాగ్గేయకారుడెవరు?
   1) త్యాగరాజు 2) క్షేత్రయ్య
   3) సారంగపాణి 4) రామదాసు
30. తూర్పు దేశాల్లో వర్తకం చేసేందుకు ఆంగ్లేయ వర్తకులకు అనుమతి ఇచ్చిన ఇంగ్లండ్ రాణి?
   1) ఎలిజబెత్-2 2) ఎలిజబెత్-1
   3) విక్టోరియా-1 4) విక్టోరియా-2
31. హరిజనుల సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను ప్రజల, ప్రభుత్వ దృష్టికి తేవడానికి భాగ్యరెడ్డి వర్మ నడిపిన వారపత్రిక?
   1) మిర్రర్ 2) హైదరాబాద్
   3) విశాఖ 4) కృష్ణ పత్రిక
32. నాగార్జునుడు ఎవరి సమకాలీనుడు?
   1) యజ్ఞశ్రీ శాతకర్ణి
   2) గౌతమీపుత్ర శాతకర్ణి
   3) రెండో శాతకర్ణి 4) హాలుడు
33. శాతవాహనుల కాలంలో 'కోలికలనే వారు?
   1) వ్యవసాయదారులు
   2) నూనె తీసేవారు
   3) నేతపనివారు
   4) ధాన్య వర్తకులు
34. 'ఘటిక' అనేది?
   1) దేవాలయం 2) బౌద్ధారామం
   3) విద్యాకేంద్రం 4) నాట్య కళాశాల
35. దంఢోళి అంటే?
   1) ఒక రకమైన కత్తి
   2) ఒక రకమైన బాణం
   3) శత్రువులపై రాళ్లు రువ్వే ఫిరంగి
   4) అశ్విక దళం
36. లుంబినీ వనంలో శిలాశాసనాన్ని ప్రతిష్ఠించినవారు?
   1) ఆచార్య నాగార్జునుడు
   2) అశోకుడు
   3) ఆమ్రపాలి
   4) ఆర్యదేవుడు
37. 'లెంకలు' అంటే?
   1) శత్రురాజులు 2) అంగరక్షకులు
   3) నేతపనివారు 4) విదేశీయులు
38. 1857 తిరుగుబాటులో బ్రిటిష్ వారికి సహాయం చేసి 'స్టార్ ఆఫ్ ఇండియా' బిరుదు పొందిన నిజాం నవాబు?
   1) నిజాం ఉల్‌ముల్క్
   2) నసీరుద్దౌలా
   3) మహబూబ్ అలీఖాన్
   4) అఫ్జలుద్దౌలా
39. బోలు శబ్దం వచ్చే ద్వారబంధం ఎక్కడ ఉంది?
   1) వేయి స్తంభాల గుడి
   2) రామప్ప దేవాలయం
   3) లేపాక్షి దేవాలయం
   4) భీమేశ్వరాలయం
40. 'అనల్ మాలిక్' అంటే?
   1) నేనే దేవుణ్ని 2) నేనే రాజును
   3) అల్లాయే ప్రభువు
   4) ప్రభువే అల్లా
41. నన్నయ భట్టుకు ఆంధ్ర మహాభారత రచనల్లో తోడ్పడ్డ కవి?
   1) పాల్కుర్కి సోమనాథుడు
   2) నారాయణ భట్టు
   3) పండితారాధ్యుల మల్లికార్జునుడు
   4) రావిపాటి త్రిపురాంతక కవి
42. అశోకుని శాసన భాగం బయల్పడిన ప్రాంతం?
   1) శాలిహుండం 2) ధరణికోట
   3) కొట్లాం 4) రాజుల మందగిరి
43. తెలంగాణలో ముల్కీ నిబంధనలు ఎప్పుడు ప్రవేశపెట్టారు?
   1) 1888 2) 1890
   3) 1895 4) 1885
44. జాగిర్దారీ విధానంలో భూములు ఎవరి స్వాధీనంలో ఉండేవి?
   1) ముక్తేదారులు 2) ఇనాందారులు
   3) ఇజారీదారులు 4) పైవారందరూ
45. మిలిటరీ సామాగ్రిని నిజాం ప్రభుత్వం ఏ సంస్థ నుంచి కొనుగోలు చేసింది?
   1) టాటా కంపెనీ
   2) అట్లాస్ ట్రేడింగ్ సంస్థ
   3) మహీంద్ర అండ్ మొహమ్మద్
   4) 2, 3

సమాధానాలు

1) 3; 2) 4; 3) 3; 4) 4;
5) 2; 6) 2; 7) 1; 8) 3;
9) 1; 10) 3; 11) 1; 12) 4;
13) 3; 14) 3; 15) 1; 16) 4;
17) 1; 18) 4; 19) 2; 20) 3;
21) 2; 22) 1; 23) 3; 24) 1;
25) 1; 26) 1; 27) 4; 28) 2;
29) 4; 30) 3; 31) 2; 32) 1;
33) 3; 34) 3; 35) 3; 36) 2;
37) 2; 38) 4; 39) 2; 40) 1;
41) 2; 42) 4; 43) 1; 44) 4;
45) 4;

ప్రాచీన కాలంలో కరిక్యులం దేనికి పరిమితమైంది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

విజ్ఞాన శాస్త్ర పాఠ్య ప్రణాళిక

1. కరీర్ అనే లాటిన్ పదానికి అర్థం?
   1) పందెపు బాట
   2) పరుగెత్తే గుర్రం
   3) నేర్చుకునే విధానం
   4) ప్రణాళిక
2. ఉపాధ్యాయుడు పాఠశాలలో నిర్వహించే కృత్యాల కార్యక్రమమే పాఠ్య ప్రణాళిక అని తెలిపినవారు?
   1) స్పియర్స్ 2) కన్నింగ్ హోమ్
   3) హిరస్ట్, పీటర్స్ 4) బ్లూమ్స్
3. పాఠశాల అనే స్టూడియోలో తన అభిరుచికి అనుగుణంగా మెటీరియల్‌ను మలచడానికి కళాకారుడు ఉపయోగించే సాధనం కరిక్యులం అని తెలిపినవారు?
   1) హిరస్ట్, పీటర్స్ 2) బ్లూమ్స్
   3) స్పియర్స్ 4) కన్నింగ్ హోమ్
4. ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో విద్యార్థులు నిర్వహించే కృత్యాల సముదాయమే విద్యా ప్రణాళిక అని తెలిపినవారు?
   1) హెర్బర్ట్ 2) బ్లూమ్స్
   3) స్పియర్స్ 4) పీటర్స్
5. ప్రాచీన కాలంలో కరిక్యులం దేనికి పరిమితమైంది?
   1) విషయ విజ్ఞానం, పాఠ్యేతర కార్యక్రమాలు
   2) విషయజ్ఞానానికి
   3) సహపాఠ్య కార్యక్రమాలకు
   4) క్షేత్ర పర్యటనలకు
6. విషయజ్ఞానంతోపాటు, సహ పాఠ్య ప్రణాళికా కార్యక్రమాలు కూడా ఇమిడి ఉండేది?
   1) సిలబస్
   2) కరిక్యులం
   3) బోధన పద్ధతి
   4) మూల్యాంకనం
7. పాఠ్యప్రణాళిక రూపొందించేటప్పుడు అభ్యాసకుడి స్వభావం, విషయ స్వభావం, సమాజ స్వభావం అనే మూడు అంశాలను పరిగణించాలని సూచించినవారు?
   1) డబ్ల్యూజే జాకబ్‌సన్
   2) కన్నింగ్ హోమ్
   3) రిచర్డ్‌సన్
   4) స్పియర్స్
8. పాఠ్యప్రణాళిక రచనలో కిందివాటిలో పరిగణనలోకి తీసుకోని అంశం?
   1) సమాజ అవసరాలు
   2) కోర్సు స్వభావ లక్ష్యాలు
   3) సహ సంబంధం
   4) ఏవీకావు
9. జాతీయ విద్యావిధానం(1986) పాఠ్య ప్రణాళికలో పొందుపర్చాల్సిన పది మౌలిక అంశాల్లో కిందివాటిలో ఏది జీవ శాస్త్రానికి సంబంధించింది?
   1) రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, బాధ్యతలు
   2) సమానత్వం, ప్రజాస్వామ్యం, సామ్యవాదం
   3) భారతీయ సంస్కృతి
   4) చిన్నకుటుంబ భావన
10. ప్రాథమిక భావాల అవగాహనకు కనీస సామర్థ్యాన్ని అభివృద్ధి చేసేందుకు తప్పనిసరిగా అభ్యసించాల్సిన విషయాలను ఏమంటారు?
   1) పాఠ్యప్రణాళిక
   2) మూల పాఠ్యప్రణాళిక
   3) లోపభూయిష్ట పాఠ్యప్రణాళిక
   4) ఉత్తమ పాఠ్యప్రణాళిక
11. ప్రజాస్వామ్య సమాజంలో సమర్థంగా జీవించడానికి కొన్ని ప్రవర్తనా సామర్థ్యాలు అత్యావశ్యకం. ఈ ప్రవర్తనా సామర్థ్యాలను వృద్ధిచేసే అనుభవాల సమూహమే?
   1) సిలబస్
   2) పాఠ్యప్రణాళిక
   3) మూల పాఠ్యప్రణాళిక
   4) సహ పాఠ్యపథకం
12. కింది వాటిలో ఏది ప్రస్తుత పాఠ్య ప్రణాళికలోని లోపం?
   1) ఎక్కువ సంఖ్యలో పాఠ్యాంశాల వల్ల లోతు తగ్గుతుంది
   2) వైయక్తిక భేదాలను అనుసరించి ఉంది
   3) పాఠ్యాంశాల చుట్టూ కేంద్రితమై లేదు
   4) నిజ జీవితానికి దగ్గరగా ఉంది
13. పాఠ్య ప్రణాళికలో సాంకేతిక, వృత్తి విద్యా సంబంధ విషయాలు లేవు అనే లోపాన్ని సూచించింది?
   1) జాతీయ విద్యా కమిషన్
   2) ప్రాథమిక విద్యా కమిషన్
   3) కొఠారి కమిషన్
   4) మాధ్యమిక విద్యా కమిషన్
14. పాఠ్యప్రణాళిక జ్ఞాన విస్ఫోటానికి అనుగుణంగా సరిదిద్దకపోవడం అనేది ఎవరు సూచించిన లోపం?
   1) మాధ్యమిక విద్యా కమిషన్
   2) కొఠారి కమిషన్
   3) మొదలియార్ కమిషన్
   4) ఏదీకాదు
15. దేశమంతా ఒకే మౌలిక ప్రణాళిక ఉండాలని.. 80% ఒకేలా, 20% స్థానిక అవసరాలకు అనుగుణంగా ఉండాలని సూచించింది?
   1) మాధ్యమిక కమిషన్
   2) కొఠారి కమిషన్
   3) నూతన జాతీయ విద్యావిధానం
   4) రాధాకృష్ణన్ కమిషన్
16. 'భవిష్యత్తులో సమర్థమైన జీవనానికి, తగిన వృత్తిని ఎంచుకోవడానికి తగిన పునాది పాఠ్య ప్రణాళికలో ఇమిడి ఉండాలి' దీన్ని తెలిపే పాఠ్య ప్రణాళిక నిర్మాణ సూత్రం?
   1) సృజనాత్మక సూత్రం
   2) సమాజ కేంద్రీకృత సూత్రం
   3) సమైక్యతా సూత్రం
   4) దూరదృష్టి సూత్రం
17. 'పాఠ్యప్రణాళికలో విద్యార్థులను ఇముడ్చడం కాకుండా, విద్యార్థుల కోసం పాఠ్యప్రణాళిక అభివృద్ధి చెందాలి' అని తెలిపినవారు?
   1) బ్లూమ్స్ 2) బ్రూబేకర్
   3) మొదలియార్ 4) కొఠారి
18. ఒకే శీర్షికకు సంబంధించిన విషయాన్ని అంచెలంచెలుగా పాఠ్యప్రణాళికలో అభివృద్ధి చెందించే పద్ధతి?
   1) ఏక కేంద్రక పద్ధతి
   2) అంశాల పద్ధతి
   3) ప్రక్రియ పద్ధతి
   4) శాఖాంతర పద్ధతి
19. విజ్ఞాన శాస్త్ర విషయాలను శాఖలుగా విభజించకుండా, అంశాలుగా విభజించడం వల్ల అన్ని శాఖల విజ్ఞానం పొందుపర్చే పద్ధతి?
   1) ఏకకేంద్రక పద్ధతి
   2) అంశాల పద్ధతి లేదా శీర్షిక విధానం
   3) ప్రక్రియ పద్ధతి
   4) భావన పద్ధతి
20. పాఠ్యప్రణాళికలో కాంతి అధ్యయనం, వాతావరణం అనే అంశాలు ఏ కోవకు చెందినవి?
   1) పరిసర కేంద్రిత అంశాలు
   2) జీవన కేంద్రిత అంశాలు
   3) పరిసర, జీవన కేంద్రిత అంశాలు
   4) పైవేవీకావు
21. ప్రక్రియ పద్ధతిలో ఉత్పత్తి కంటే ప్రక్రియకు ప్రాధాన్యత ఉంది. దీనికి ఉదాహరణగా అమెరికాలో 1962-68లో దేన్ని అమలు చేశారు?
   1) SAPA 2) NASA
   3) COPES 4) SUPW
22. అమెరికాలో ప్రవేశపెట్టిన COPES **(Conceptually Oriented Program in Science)** ఆధారంగా అభివృద్ధి చెందిన పద్ధతి?
   1) ఏకకేంద్రక పద్ధతి
   2) శీర్షిక విధానం
   3) ప్రక్రియ పద్ధతి
   4) భావన పద్ధతి
23. వస్తువులు మండేటప్పుడు ఏం జరుగుతుంది? అనే అంశం చుట్టూ ఆక్సిడేషన్ అనే రసాయన శాస్త్ర విషయం, శ్వాసక్రియ అనే జీవశాస్త్ర విషయం, ఉష్ణం అనే భౌతిక శాస్త్ర విషయాలను చెప్పడం?
   1) శీర్షిక విధానం
   2) ప్రక్రియ పద్ధతి
   3) సమైక్య, శాఖాంతర పద్ధతి
   4) భావన పద్ధతి
24. కిరణజన్య సంయోగక్రియ గురించిన విషయాల కోసం హిల్ గురించి అధ్యయనం చేయడం ఏ పద్ధతిని సూచిస్తుంది?
   1) ప్రక్రియ పద్ధతి
   2) చారిత్రక పద్ధతి
   3) భావన పద్ధతి
   4) సమైక్య పద్ధతి
25. పాఠ్యపుస్తకం అనేది ముద్రిత రూపంలో ఉండి తరగతి గదిలో ఉపయోగించే మౌలిక బోధనోపకరణం అని తెలిపిన వారు?
   1) జాకబ్‌సన్ 2) సింప్సన్
   3) పియర్స్ 4) బ్లూమ్స్
26. 'తరగతి స్థాయికి తగినట్లుగా అక్షరాలు ముద్రించాలి' ఇది పాఠ్యపుస్తకం ఏ లక్షణం?
   1) గ్రంథ రచయిత
   2) భాషాశైలి
   3) భౌతిక లక్షణాలు
   4) అంతర్గత లక్షణం
27. వోగెల్ స్పాట్‌చెక్ ఇవాల్యుయేషన్ స్కేల్ దేని మూల్యాంకనానికి ఉపయోగపడుతుంది?
   1) బోధన పద్ధతి
   2) లక్ష్యాలు
   3) బోధనోపకరణాలు
   4) పాఠ్యపుస్తకం
28. పాఠ్య ప్రణాళిక నిర్మాణ సూత్రాల్లో పరిరక్షణ సూత్రం దేనికి సంబంధించింది?
   1) సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ
   2) సిద్ధాంతాల పరిరక్షణ
   3) బోధన పద్ధతుల పరిరక్షణ
   4) బోధనాపరికరాల పరిరక్షణ
29. 'మనం తినే ఆహారం' అనే పాఠ్యాంశం ఏ విభాగానికి చెందిన అంశం?
   1) పరిసర కేంద్రిత
   2) జీవన కేంద్రిత
   3) పరిసర - జీవన కేంద్రిత
   4) ఉపాధ్యాయ కేంద్రిత
30. వివిధ పాఠ్యప్రణాళికలో కృత్యాల వికాసాన్ని దృష్టిలో ఉంచుకొని విభజించిన యూనిట్‌లను ఏమంటారు?
   1) పాఠ్యవిషయ యూనిట్
   2) బోధన యూనిట్
   3) అనుభవ యూనిట్
   4) మూలాధార యూనిట్
31. లోలకం ఊగడం భూకేంద్రక ఆకర్షణకు లోబడి ఉంటుంది. ఇది జీవశాస్త్రంలోని ఏ అంశానికి సంబంధం కలిగి ఉంది?
   1) కిరణజన్య సంయోగక్రియ
   2) జంతువుల పెరుగుదల
   3) మొక్కల పెరుగుదల దశలు
   4) అయస్కాంతత్వం
32. జాతీయ విద్యావిధానం (1986) పాఠ్య ప్రణాళికలో పొందుపర్చాలని ప్రతిపాదించిన 10 మౌలిక అంశాల్లో జీవశాస్త్ర సంబంధిత అంశాల సంఖ్య?
   1) 6 2) 3
   3) 4 4) 8
33. 'ప్రతి ఒక్కరికి అన్ని శాస్త్రాల్లో కనీస పరిజ్ఞానం అవసరం' అనే విషయంపై ఆధారపడి నిర్మించింది?
   1) మూల పాఠ్య ప్రణాళిక
   2) సహ పాఠ్య ప్రణాళిక
   3) పాఠ్యేతర పాఠ్య ప్రణాళిక
   4) విషయ ప్రణాళిక
34. కన్నింగ్ హోమ్ నిర్వచనంలో కళాకారుడు?
   1) విద్యార్థి 2) విద్యార్థి తండ్రి
   3) ఉపాధ్యాయుడు 4) విద్యాశాఖాధికారి
35. తరగతి గదిలో, ప్రయోగశాలలో, ఆటస్థలంలో, వర్క్‌షాప్‌లో అనేక కృత్యాల అనుభవాల సమస్తం?
   1) విషయ ప్రణాళిక
   2) పాఠ్యపుస్తకం
   3) ప్రయోగాలు
   4) పాఠ్యప్రణాళిక
36. గణిత పరిభాషలో చెప్పాలంటే ఏది పాఠ్య ప్రణాళికకు ఉప సమితి?
   1) టైం టేబుల్
   2) పాఠ్యపుస్తకం
   3) సిలబస్ 4) తరగతి గది
37. ఏ శాస్త్రవేత్త పాఠ్య ప్రణాళిక రూపొందించేటప్పుడు అభ్యాసకుడి స్వభావం, విషయ స్వభావం, సహజ స్వభావాన్ని పరిగణించాలి అని తెలిపారు?
   1) జాకబ్‌సన్ 2) బీఎస్ బ్లూమ్స్
   3) హిరస్ట్, పీటర్స్ 4) స్పియర్స్
38. జీవశాస్త్ర పాఠ్యప్రణాళిక రచనకు కావాల్సిన అంశాల గురించి వివరిస్తూ ఎడ్వర్డ్ విక్టర్ తెలిపిన అంశాల్లో లేనిది?
   1) మూల్యాంకనం
   2) సమతూకం
   3) బోధన సామగ్రి
   4) ఉపాధ్యాయుడి సామర్థ్యం
39. పాఠ్య ప్రణాళికలోని అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటే కింది వాటిలో సరికాని ప్రవచనం?
   1) పాఠ్యప్రణాళిక సహజ అభివృద్ధికి తోడ్పడేదిగా ఉండాలి
   2) పాఠ్యప్రణాళిక సమస్యా పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి
   3) పాఠ్యప్రణాళిక ఇతర సబ్జెక్టుల్లో సహ సంబంధాన్ని నెలకొల్పేదిగా ఉండాలి
   4) పాఠ్యప్రణాళిక విద్యార్థుల తల్లిదండ్రుల అభిరుచులకు తగినట్లుగా ఉండాలి
40. పాఠ్యప్రణాళికకు సంబంధించిన అంశాలలో 'సహ సంబంధం' అంటే వేటి మధ్య సహ సంబంధం?
   1) విద్యార్థికి, ఉపాధ్యాయుడికి మధ్య
   2) సబ్జెక్టుల మధ్య
   3) తరగతి గది - ప్రయోగశాల మధ్య
   4) విద్యార్థి- విద్యార్థికి మధ్య
41. పాఠ్యప్రణాళికలోని కృత్యాలు ఏ విధంగా ఉండాలి?
   1) విద్యార్థులందరికీ ఒకేలా ఉండాలి
   2) విద్యార్థులకు కష్టంగా ఉండాలి
   3) ఉపాధ్యాయుడి అభిరుచులకు అనుగుణంగా ఉండాలి
   4) విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా ఉండాలి
42. విద్యా ప్రణాళికలో జాతీయ విద్యావిధానం (1986) ఎన్ని మౌలిక అంశాలను పొందుపర్చాలని సూచించింది?
   1) 12 2) 15
   3) 10 4) 6
43. జాతీయ విద్యావిధానం (1986) పాఠ్య ప్రణాళికలో పొందుపర్చాలని సూచించిన 10 అంశాల్లో జీవశాస్త్రానికి సంబంధించింది?
   1) జాతీయ భావన వికాసం
   2) స్త్రీ, పురుష సమానత్వం
   3) చిన్న కుటుంబ భావన
   4) సాంఘిక సమానత్వం

సమాధానాలు

1) 1; 2) 3; 3) 4; 4) 3;
5) 2; 6) 2; 7) 1; 8) 4;
9) 4; 10) 2; 11) 3; 12) 1;
13) 4; 14) 2; 15) 3; 16) 4;
17) 2; 18) 1; 19) 2; 20) 1;
21) 3; 22) 3; 23) 3; 24) 2;
25) 2; 26) 3; 27) 4; 28) 1;
29) 2; 30) 3; 31) 3; 32) 2;
33) 1; 34) 3; 35) 4; 36) 3;
37) 1; 38) 4; 39) 4; 40) 2;
41) 3; 42) 3; 43) 3.

ఎడారీకరణ సమస్యను ఎదుర్కొంటోన్న ప్రాంతాలు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

భూగోళశాస్త్రం



ఒక ప్రాంతంలోని సగటు వాతావరణ పరిస్థితులనే శీతోష్ణస్థితిగా వ్యవహరిస్తారు. భారతదేశం శీతోష్ణస్థితి ఎంతో వైవిధ్యభరితంగా ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారత్‌లో ఆరు రుతువులను గుర్తించవచ్చు. అంటే.. ప్రతి రెండు నెలలకు వాతావరణ మార్పులు సంభవిస్తాయి. భారతదేశ శీతోష్ణస్థితిని 'రుతుపవన శీతోష్ణస్థితి' అంటారు. శాస్త్రీయంగా పరిశీలిస్తే భారతదేశం 'ఉష్ణో-ఆర్ద్ర శీతోష్ణస్థితి మండలం' కిందకు వస్తుంది. కానీ సువిశాల భారతదేశంలో వాతావరణ పరిస్థితులు ఒక్కో ప్రాంతంలో, ఒక్కో సమయంలో ఒక్కోలా ఉంటాయి. సువిశాల విస్తీర్ణం, నైసర్గిక స్వరూపం, రుతుపవనాలు, భౌగోళిక ఉనికి లాంటి అంశాలు వాతావరణ పరిస్థితులను ప్రభావితం చేస్తాయి. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో అత్యధిక(ఉదా.చిరపుంజి,మాసిన్‌రామ్), మరికొన్ని ప్రాంతాల్లో అత్యల్ప వర్షపాతం నమోదవుతుంది (ఉదా: థార్ ఎడారి). వేసవిలో దక్కన్ పీఠభూమి, పశ్చిమ రాజస్థాన్ ప్రాంతాలు 45° సెంటీగ్రేడ్‌కు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీనికి భిన్నంగా అదే సమయంలో ఉత్తరాన హిమాలయ పర్వత సానువుల్లో వాతావరణం చల్లగా ఉంటుంది.

వాతావరణ శాస్త్రజ్ఞులు భారత శీతోష్ణస్థితిని 4 భాగాలుగా విభజించారు. 1. రుతు పవన పూర్వకాలం(మార్చి15-జూన్ 15) 2. నైరుతి రుతు పవన కాలం (జూన్ 15 -సెప్టెంబర్ 15) 3. ఈశాన్య రుతు పవన కాలం (సెప్టెంబర్ 15 -డిసెంబర్ 15) 4. రుతుపవన అనంతర కాలం (డిసెంబర్ 15-మార్చి 15).

రుతుపవన పూర్వ కాలం

రుతుపవన పూర్వ కాలం (మార్చి 15 -జూన్15)లో దేశమంతటా ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా ఉంటాయి. ఇది మండు వేసవి. ఈ సమయంలో సంవహన గాలులు వీస్తాయి. ఈ పవనాలను ఆంధీ, లూ, కాల్‌బైశాఖీ, మామిడి జల్లులు లాంటి స్థానిక పేర్లతో పిలుస్తారు. ఈ వేడిగాలులకు అప్పుడప్పుడూ చిరుజల్లులు, గాలిదుమ్ము కూడా తోడవుతాయి. ఈ కాలంలో ద్వీపకల్ప పీఠభూములు, వాయవ్య భారతదేశం బాగా వేడెక్కడంతో అల్పపీడనం ఏర్పడుతుంది. ఈ అల్పపీడనం నైరుతి రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశించటానికి ఉపకరిస్తుంది.

నైరుతి రుతుపవన కాలం

నైరుతి రుతుపవన కాలం(జూన్15- సెప్టెంబర్15)లో అరేబియా సముద్రం, హిందూమహా సముద్రాల నుంచి నైరుతి రుతు పవనాలు భారత్‌లోకి ప్రవేశిస్తాయి. వీటి ప్రభావం వల్ల ఉష్ణోగ్రతలు కాస్త తగ్గి, దేశమంతా విస్తారంగా వర్షాలు కురుస్తాయి. వార్షిక వర్షపాతంలో సుమారు 2/3 వంతు ఈ మూడు నెలల కాలంలోనే సంభవిస్తుంది. భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతుపవనాలు మొదటగా జూన్ మొదటి వారంలో మలబార్ తీరాన్ని తాకుతాయి. క్రమంగా ఇవి జూలై 15 కల్లా దేశమంతా వ్యాపిస్తాయి. నైరుతి రుతుపవనాలు రెండు శాఖలుగా(అరేబియా సముద్రం, బంగాళాఖాతం) దేశంలోకి ప్రవేశిస్తాయి. నైరుతి రుతు పవనాలు ఎత్తయిన పర్వతాలు, పీఠభూములను దాటే సమయంలో పవనాభిముఖదిశలో ఉండే ప్రాంతాల్లో అధిక వర్షపాతం ఉంటుంది. కానీ అదే సమయంలో పవనపరాన్ముఖదిశలో ఉండే ప్రాంతాల్లో అత్యల్ప వర్షపాతం ఉండటంతో అవి పాక్షిక శుష్కమండలాలుగా రూపొందాయి. ఉదాహరణకు అరేబియా సముద్రం నుంచి ప్రవేశించే నైరుతి రుతుపవనాలను పశ్చిమ కనుమలు అడ్డుకుంటాయి. దీనివల్ల మలబార్, కొంకణ్ తీరాల్లో విస్తారంగా వర్షం కురుస్తుంది. ఇవి అతి ఆర్ద్ర మండలాలు. కానీ సహ్యాద్రి కొండలకు వెనుక ఉన్న దక్కన్ పీఠభూమికి చెందిన ఉత్తర కర్ణాటక, పశ్చిమ తెలంగాణ, రాయలసీమ, మరాట్వాడా, విదర్భ ప్రాంతాల్లో వర్షపాతం చాలా తక్కువ. అందువల్ల ఇవి పాక్షిక శుష్కమండలాలుగా రూపొందాయి. ఈ ప్రాంతాలు ఎడారీకరణ సమస్యను ఎదుర్కొంటున్నాయి. మహబూబ్‌నగర్, అనంతపురం జిల్లాలు ఈ మండలం కిందకు వస్తాయి. ఈ మండలంలో వర్షపాత పరిమాణంలో అనిశ్చితి కూడా అధికంగా ఉంది. ఈ మండలం తరచూ తీవ్ర దుర్భిక్షాన్ని ఎదుర్కొంటోంది.

విస్తారంగా వర్షాలు

బంగాళాఖాతం నుంచి ప్రవేశించే నైరుతి రుతుపవనాలు తూర్పు, ఈశాన్య భారతదేశం, గంగా మైదానాల్లో వర్షాన్నిస్తాయి. ఈ పవనాలను పూర్వంచల్ కొండలు, శివాలిక్ పర్వతాలు అడ్డుకుంటున్నాయి. దాంతో పవనాభిముఖదిశలోని తెరాయి మండలం, మేఘాలయలోని షిల్లాంగ్ పీఠభూమి, నాగాలాండ్ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. గారో, ఖాసీ కొండల పవనాభిముఖదిశలో ఉన్న మాసిన్‌రామ్, చిరపుంజి ప్రాంతాల్లో ప్రపంచంలోనే అత్యధిక వర్షపాతం నమోదవుతోంది. రాజస్థాన్‌లోని ఆరావళి పర్వతాలు నైరుతి రుతు పవనాలకు సమాంతరంగా ఉండటంతో ఇవి నైరుతి రుతు పవనాలను అడ్డగించలేవు. అదే సమయంలో పశ్చిమ రాజస్థాన్ ప్రాంత ఊర్ధ్వ ట్రోపో ఆవరణంలో ఉన్న చల్లని స్థిర వాయురాశి నైరుతి రుతు పవనాలను పైకి లేవనీయకుండా అదిమిపెడతాయి. ఈ కారణాల వల్ల పశ్చిమ రాజస్థాన్‌లో వర్షపాతం అత్యల్పంగా ఉండి, శుష్క మండలం ఏర్పడింది. థార్ ఎడారి ఏర్పడటానికి ప్రధాన కారణం.

దక్షిణార్ధగోళంలోకి సూర్యుడు

సెప్టెంబర్ మధ్య నుంచి సూర్యుడు దక్షిణార్ధగోళంలోకి ప్రవేశిస్తాడు. దీంతో భారత్‌లో క్రమంగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడతాయి. భారత భూభాగంపై విస్తరించి ఉన్న అల్ప పీడనం క్రమంగా క్షీణించి, ఆ స్థానంలో అధిక పీడనం బలపడుతుంది. ఈ రకంగా నైరుతి రుతు పవనాల తిరోగమనం ప్రారంభమవుతుంది. తిరోగమించే రుతుపవనాలు శుష్కంగా ఉంటాయి. అయితే ఇవి బంగాళాఖాతంలోకి ప్రవేశించినప్పుడు అక్కడి తేమను పీల్చుకొని, ఆర్ద్రగా మారుతాయి. ఇదే సమయంలో బంగాళాఖాతంలో వీస్తున్న ఈశాన్య వ్యాపారపవనాలు.. తిరోగమన రుతు పవనాలను ఈశాన్య రుతు పవనాలుగా రూపాంతరం చెందిస్తాయి. ఈశాన్య రుతుపవనాల వల్ల తమిళనాడు, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్‌ల్లో వర్షం కురుస్తుంది. ఈ సందర్భంగా గమనించాల్సిందేమిటంటే.. తమిళనాడు ప్రాంతంలోకి నైరుతి రుతుపవనాలు రాకుండా.. నీలగిరి, అన్నామలై, ఏలకుల కొండలు అడ్డగిస్తాయి. అందువల్ల నైరుతి రుతుపవన కాలంలో తమిళనాడులో వర్షం అంతగా కురవదు.

ఈశాన్య రుతుపవనాలతో ఈ ప్రాంతం విస్తారంగా వర్షాన్ని పొందుతుంది. డిసెంబర్ 15కల్లా దేశమంతటా శీతాకాలం ప్రారంభమవుతుంది. సైబీరియా నుంచి వచ్చే అతిశీతల పవనాలు.. గంగా-సింధూ మైదానంలోకి రాకుండా హిమాలయ పర్వతాలు అడ్డుకుంటాయి. లేకపోతే వీటి ప్రభావం వల్ల గంగా- సింధూ మైదానంలో ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు చేరుకొని, నదులు గడ్డకట్టి రబీ సాగు సాధ్యమయ్యేది కాదు. డిసెంబర్, జనవరిల్లో హిమాలయాల నుంచి వీచే శీతల పవనాల వల్ల గంగా-సింధూ మైదానంలో ఎముకలు కొరికే చలి ఉంటుంది. డిసెంబర్-ఫిబ్రవరి కాలం సాధారణంగా దేశమంతా శుష్కంగా ఉంటుంది. కానీ ఎర్ర సముద్రం, మధ్యధరా సముద్రం నుంచి వాయవ్య భారతదేశంలోకి కవోష్ణ చక్రవాతాలు ప్రవేశిస్తాయి. వీటిని పశ్చిమ అలజడులుగా పిలుస్తారు. వీటి ప్రభావం వల్ల దేశ వాయవ్య ప్రాంతంలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయి. ఈ వర్షాలు రబీలో సాగయ్యే గోధుమ దిగుబడి పెరగటానికి దోహదపడతాయి.

బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడన ద్రోణులు కొన్ని బలపడి ఆయనరేఖా చక్రవాతాలుగా మారి తూర్పు తీరాన్ని తాకుతాయి. వీటి ప్రభావం వల్ల తూర్పు తీరంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయి.

గోదావరి నది జన్మస్థానం?



భారత్ వ్యవసాయ ప్రధాన దేశం. వ్యవసాయానికి మూలాధారం సాగునీరు. ఈ నీటిని అందించడంలో నదులది కీలక పాత్ర. ప్రధాన నదులైన గంగ, సింధూ, గోదావరి, కృష్ణా లాంటి నదుల జన్మస్థానాలు, ప్రవాహ గతికి సంబంధించిన సమాచారం గ్రూప్స్ పరీక్షల్లో అత్యంత కీలకం!!

సింధూ లేదా ఇండస్

దీని జన్మస్థానం టిబెట్‌లోని కైలాస పర్వతాల్లో ఉన్న 'చాండుయాంగ్' హిమానీనదం. ఈ నది డామ్‌ఛోక్ వద్ద దేశంలోకి ప్రవేశించి షిగార్, గిల్గిత్, ద్రాస్ తదితర ఉపనదులను కలుపుకొని పాకిస్తాన్‌లోకి ప్రవహిస్తుంది. సట్లెజ్, రావి, బియాస్, జీలం, చీనాబ్ నదులు సింధూ ముఖ్య ఉపనదులు. సట్లెజ్ నది కూడా కైలాస పర్వతాల్లోని 'రాకాస్ తాల్'గా పిలిచే హిమానీనద సరస్సు నుంచి ఉద్భవిస్తుంది. ఈ నదిని ప్రాచీన కాలంలో 'సుతుద్రి' అని పిలిచేవారు. సట్లెజ్ నది హిమాచల్ ప్రదేశ్‌లోని 'షిప్కిలా' కనుమ ద్వారా భారత్‌లోకి ప్రవేశిస్తుంది.

సట్లెజ్‌పై భాక్రా నంగల్

సట్లెజ్ నదిపై హిమాచల్‌ప్రదేశ్‌లోని భాక్రా, పంజాబ్‌లోని నంగల్ వద్ద భారీ ఆనకట్టలు నిర్మించారు. భాక్రా నంగల్ భారత్‌లో అతి పెద్ద బహుళార్థక సాధక ప్రాజెక్టుల్లో ఒకటి. భాక్రా నంగల్ రిజర్వాయర్‌ను 'గోవింద సాగర్'గా పిలుస్తారు. జీలం నది కశ్మీర్‌లోని వెరినాగ్ కొండల్లో ఆవిర్భవిస్తుంది. చంద్ర-భాగా నదుల కలయికతో చీనాబ్ నది ఏర్పడింది. ఇవి హిమాచల్ ప్రదేశ్‌లోని రోహతాంగ్ కనుమ వద్ద ఆవిర్భవిస్తాయి.

కాలాబాగ్

రావి నది కులూ కొండల్లో, బియాస్ నది బియాస్‌కుండ్ వద్ద ఆవిర్భవించాయి. సింధూ నదీ వ్యవస్థలో రావి-బియాస్‌ల సంగమం మాత్రమే భారతదేశంలో ఉంది. మిగిలిన నదులన్నీ పాకిస్తాన్ భూభాగంలో ఒక దానితో మరొకటి కలుస్తాయి. ఈ నదులన్నీ పాకిస్తాన్‌లోని 'కాలాబాగ్' వద్ద కలిసి, ఒకే ప్రవాహంగా సింధ్ రాష్ట్రం ద్వారా ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తాయి. రావి-బియాస్ నదులు పంజాబ్ (భారత్)లోని హరికే వద్ద కలుస్తాయి. ఇందిరాగాంధీ కాలువ హరికే వద్ద నిర్మించిన ఆనకట్ట నుంచి ప్రారంభమవుతుంది.

గోదావరి -త్ర్యయంబకం

ద్వీపకల్ప నదీ వ్యవస్థలన్నింటి కంటే గోదావరి పెద్దది. ఇది సహ్యాద్రి పర్వతాల్లో నాసిక్ సమీపంలోని 'త్ర్యయంబకం' వద్ద ఆవిర్భవించింది. ఈ నది మహారాష్ట్రకు చెందిన వార్ధా, పేన్‌గంగ, ప్రాణహిత, ఇంద్రావతి, కోయనా, మధ్యప్రదేశ్‌కు చెందిన వైన్‌గంగను కలుపుకొని తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. మానేరు, శబరి, మంజీరా నదులు గోదావరి ముఖ్య ఉపనదులు.

మంజీరాపై నిజాంసాగర్

మంజీరా నది మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ పర్వత్రశ్రేణుల్లో ఆవిర్భవించింది. ఈ నది తెలంగాణలోని నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో ప్రవహించి గోదావరిలో కలుస్తుంది. మంజీరాపై నిజాంసాగర్, సింగూరు ఆనకట్టలు నిర్మించారు. ఛత్తీస్‌గఢ్‌లో ఉద్భవించిన శబరి నది, ఖమ్మం జిల్లాలోని కూనవరం వద్ద గోదావరిలో కలుస్తుంది. గోదావరిపై నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడు వద్ద శ్రీరాంసాగర్ ఆనకట్ట నిర్మించారు. గోదావరి రాజమండ్రికి దిగువన గౌతమీ గోదావరి, వశిష్ఠ గోదావరి, వైనతేయి గోదావరి అనే మూడు పాయలుగా చీలిపోతుంది. అనంతరం అంతర్వేది, యానాం, కొమరగిరి పట్నాల వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది.

కృష్ణానది

సహ్యాద్రి కొండల్లోని మహాబలేశ్వర్ వద్ద కృష్ణానది ఆవిర్భవించింది.
ఇది కర్ణాటక ద్వారా ప్రవహిస్తూ మహబూబ్‌నగర్ జిల్లాలో మక్తల్ వద్ద తెలంగాణలోకి ప్రవేశిస్తుంది. ఘటప్రభ, మల్లప్రభ, భీమా, తుంగభద్ర, దిండి, మూసీ నదులు కృష్ణా నదికి ముఖ్య ఉపనదులు. తుంగభద్ర కర్ణాటకలోని వరాహ పర్వతాల్లో ఆవిర్భవించి.. కర్నూలులోని సంగమేశ్వర్ వద్ద కృష్ణలో కలుస్తోంది. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డకు దిగువన కృష్ణానది పాయలుగా చీలి హంసలదీవి వద్ద బంగాళాఖాతాన్ని చేరుతుంది.

Non-Banking Financial Company (NBFC)

A Non-Banking Financial Company (NBFC) is a company

a) Registered under the Companies Act. 1956,

b) Its principal business is lending, investments in various types of shares/-stocks/bonds /debentures/ securities, leasing, hire-purchase, insurance business, chit business

c) Its principal business is receiving deposits under any scheme or arrangement in one lump sum or in installments.

However, a Non-Banking Financial Company does not include any institution whose principal business is agricultural activity, industrial activity, trading activity or sale/purchase/construction of immovable property. (Section 45 I (c) of the RBI Act, 1934) .

One key aspect to be kept in view is that the financial activity of loans/advances as stated in 45 I (c), should be for activity other than its own. In the absence of this provision, all companies would have been NBFCs.

NBFCs whose asset size is of Rs.100 cr or more as per last audited balance sheet are considered as systemically important NBFCs.

The rationale for such classification is that the activities of such NBFCs will have a bearing on the financial stability in our country.

The Reserve Bank of India regulates and supervises Non-Banking Financial Companies which are into the business of (i) lending (ii) acquisition of shares, stocks, bonds, etc., or (iii) financial leasing or hire purchase.

The Reserve Bank has been given the powers under the RBI Act 1934 to register, lay down policy, issue directions, inspect, regulate, supervise and exercise surveillance over NBFCs that meet the 50-50 criteria of principal business.

The Reserve Bank can penalize NBFCs for violating the provisions of the RBI Act or the directions or orders issued by RBI under RBI Act. The penal action can also result in RBI cancelling the Certificate of Registration issued to the NBFC, or prohibiting them from accepting deposits and alienating their assets or filing a winding up petition.

RBI tightened Tier 1 capital requirements and said NBFCs would need to hold capital levels of at least of Rs 1 crore ($162,668) by the end of March 2016 and Rs 2 crore by March-end 2017 to avoid losing their right to operate.

The country's apex bank also said only certain investment-grade NBFCs would be allowed to take deposits, saying the firms would have until the end-March 2016 to acquire a credit rating. RBI capped deposit-taking at 1.5 times the size of a firm's minimum capital - down from four times previously.

NBFCs lend and make investments and hence their activities are akin to that of banks; however there are a few differences as given below:

i. NBFC cannot accept demand deposits;

ii. NBFCs do not form part of the payment and settlement system and cannot issue cheques drawn on itself;

iii. deposit insurance facility of Deposit Insurance and Credit Guarantee Corporation is not available to depositors of NBFCs, unlike in case of banks.

What does CAMPA Stand for?

BANK EXAMS
Banking Awareness

1. The Union Finance Ministry launched India Aspiration Fund (IAF) to boost start-ups in India. Who will be the partner and co-investor in the IAF?
a) LIC b) SIDBI
c) NABARD d) RBI e) SEBI

2. State Bank of India on 18 August 2015 launched a mobile wallet app, SBI Buddy, in collaboration with Accenture and ?
a) Visa b) Paytm
c) Paypal d) Mastercard
e) Maestro

3. In context with banking, a Certificate of Deposit is ____
a) Money Market Instrument
b) Negotiable Instrument
c) Transferable instrument
d) All of above e) None

4. The maturity of Treasury Bills in India is always less than ____
a) 91 Days b) 182 Days
c) 365 Days d) 730 Days
e) 425 Days

5. Which of the following is/are salient features of Treasury Bills?
a) They have zero default risk
b) They are highly liquid
c) No tax is deducted at source
d) All of above e) None of these

6. Who has been appointed as CMD of India Trade Promotion Organisation (ITPO)?
a) R J Mishra b) L K Jha
c) L C Goyal d) Anil Goswami
e) None of these

7. Which one of the following is an example for Long Term Investment Option?
a) Fixed deposit b) Money market
c) Public provident fund
d) Saving accounts e) None of these

8. Which of the following is not the quantitative tool of the Reserve Bank of India (RBI)?
a) OMO b) Reserve ratios
c) Rationing of credit
d) Statutory Pre-emption
e) None of these

9. In which year, Insurance Regulatory and Development Authority (IRDA) was constituted?
a) 1999 b) 1998 c) 1997
d) 1996 e) 1992

10. Which Insurance policy gives holder the benefits of both Insurance and Investment?
a) Term Insurance Policies
b) Money-back Policies
c) Unit-linked Investment Policies
d) Pension Policies e) None of these

11. Which of the following banks has been declared by Reserve Bank of India (RBI) as Domestic Systemically Important Banks (D- SIBs)?
a) HDFC and ICICI b) ICICI and SBI
c) SBI and HDFC d) PNB and SBI
e) HDFC and SBI

12. Recently, the Government of India (GoI) launched e-payment module to deposit compensatory levies into CAMPA Funds. What does CAMPA Stand for?
a) Compensatory Affordable Fund Management and Planning Authority
b) Compensatory Affectable Fund Management and Planning Authority
c) Compensatory Affectation Fund Management and Planning Authority
d) Compensatory Afforestation Fund Management and Planning Authority
e) None of these

13. Which of the following banks launched "Smart Vault" digital locker facility?
a) SBI b) HDFC c) PNB
d) NABARD e) ICICI

14. Union Government has recently notified the merger of commodities market regulator Forward Markets Commission (FMC) with?
a) SEBI b) IDBI c) NABARD
d) All of the above e) None of the above

15. Which of the following is used by RBI for sterilization of the Capital Inflows?
a) Base Rate System
b) CRAR Obligations
c) Open Market Operations
d) Credit Authorization Scheme
e) None of these

16. In India, Infrastructure Debt Fund can be established as a Trust or a company. Which of the following regulated the Infrastructure Debt Fund set up as a trust?
a) SEBI b) RBI c) IRDA
d) Ministry of Corporate Affairs
e) IFCI

17. How do we label the risk of collapse of an entire financial system or entire market?
a) Seismic Risk b) Systemic Risk
c) Systematic Risk
d) Market Risk e) None of these

18. How many parties primarily involved in a Promissory Note?
a) Two b) Three c) Four
d) Five e) six

19. Which Union Ministry launched the Smart National Common Mobility Card (NCMC)?
a) Ministry of Railways
b) Ministry of Home Affairs
c) Ministry of Foreign Affairs
d) Ministry of Urban Development
e) None of these

20. Which of the following banks launched the "IndPay" mobile app service ?
a) Indian Bank b) Dena Bank
c) Punjab National Bank
d) Karnataka Bank e) Axis Bank

21. What is the minimum net owned fund (NOF) mandatory for a Infrastructure Finance Company (IFC) in India?
a) Rs. 200 Crore b) Rs. 300 Crore
c) Rs. 500 Crore d) Rs. 100 Crore
e) Rs. 400 Crore

22. When two or more distinct insurance policies combined into a single contract, it is known as
a) CMO b) Package Policy
c) Mortgage Insurance
d) Micro Insurance e) None of these

23. When a promissory note or bill of exchange has been dishonoured by non-acceptance or non-payment, the holder may, within a reasonable time, cause such dishonour to be noted and certified by ___
a) Notary b) Magistrate
c) Collector of that region
d) All true e) None of these

24. For what purpose, a web-based Portal "Vidya Lakshmi" has been launched by Union Government?
a) Direct subsidy for farmers
b) Women Empowerment
c) Home loans d) Educational Loans
e) None o f these

25. The National Payments Corporation of India (NPCI) has announced the nationwide e-payment literacy workshop. Who among the following is the present chairman of the NPCI?
a) Jyotsna Suri
b) umit Mazumder
c) M Balachandran
d) All of the above
e) None of these

26. What is sold and purchased during Open Market Operations by RBI?
a) Government Securities
b) Commercial Papers
c) Certificates of Deposits
d) Global Depository Receipts
e) None of these

27. Which of the following is not a type of mutual fund?
a) Open-ended scheme
b) Closed-ended scheme
c) Long forward scheme
d) Exchange-traded funds
e) None of these

28. Headquarters of State Bank of Mysore is located at?
a) Hyderabad b) New Delhi
c) Mumbai d) Bangalore
e) Karnataka

29. RBI takes "Prompt Corrective Action" when a bank is faced to?
a) Market Risk b) Credit Risk
c) Liquidity Risk
d) Low Capital Adequacy
e) None of these

30. Which of the following bank's head office is not located in New Delhi?
a) Punjab National bank
b) Punjab and Sind bank
c) Bank of India
d) Bharatiya Mahila Bank
e) None of these

KEY

1) a;	2) d;	3) d;	4) c;	5) d;
6) c;	7) c;	8) c;	9) a;	10) c;
11) b;	12) d;	13) e;	14) a;	15) c;
16) a;	17) b;	18) a;	19) d;	20) a;
21) b;	22) b;	23) a;	24) d;	25) c;
26) a;	27) c;	28) d;	29) d;	30) c.